UNIVERSAL LIBRARY
OU_204285
UNIVERSAL LIBRARY

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. Accession No.

Author

Title

This book should be returned on or before the date last marked below.

# ప్రథమ భాగము

నిజాము రాష్ట్రమందుండు ఆంధ్రసోదరుల సౌకర్యార్థము [illegible] హైద్రాబాదు నెం. 641/666 రు గృహమందు నాంపల్లి గౌరీశంకరశర్మ అండతో, ఆంధ్ర బుక్కుడిపోవారిని మా ప్రతినిధులుగా ఏర్పఱచినాము. కావున నిజాము రాష్ట్రవాసులు కావలసిన పుస్తకములను వారికి వ్రాసి తెప్పించుకొనవచ్చును.

# పీఠిక

'రైనాల్డ్సు' నామధేయుఁడగు ప్రసిద్ధాంగ్ల నవలాకారుఁ డాంధ్రలోకమున కపరిచితుఁడు కాఁడు. బహు గ్రంథరచనాధురంధరుండగు నీ ప్రతిభాశాలి కాంగ్లసారస్వతమున నేకారణముననో స్థానము లేదు.

రైనాల్డ్సుయొక్క "Loves of the Harem" అను గ్రంథమున కియ్యది అనువాదము.

తురుష్క రాజధానియగు 'కాన్‌స్టాంటు' నగరము ఘోరతర నిగూఢ నరమారణమున కాలవాలమాయెను. ముప్పది సంవత్సరములు మీఱని సుందరపురుషులు జాతి మత విచక్షణలేక, ఆకస్మికముగ, నకారణముగ విగతజీవు లగుచుండిరి. శవములు బాస్ఫరసు జలములపైఁ దేలుచుండెను. వానిని బరిశీలింప, వారందఱును మెడవెనుక గొంచెము క్రిందుగఁ బొడిచిన కత్తిపోటుచేఁ దెగటారిరని వ్యక్తమగుచుండెను. హంతకుఁ డెవ్వఁడో తెలియకుండెను. భయంకర దుర్మరణముల సంఖ్య అధికతరమగుచుండ నగరమునందు సహజముగ హాహాకారములు చెలరేగెను.

మన కథాప్రారంభావసరమున రాజధానిస్థితి యిట్లుండెను. 'ఖలీలు' నామధేయుఁడగు కథానాయకుఁడు నితరజనాసాధ్య కార్యభారము వహించి, అత్యాశ్చర్యకార్యము లాచరించి, కృతకృత్యుఁడై, తుదకు సార్వభౌముఁ డాయెను.

కథాకల్పనయందును, ప్రధానకథను పోషించుటకై యుపకథలను సముచితముగఁ గల్పించుటయందును, పాత్రప్రదర్శనమునందును, పాత్రపోషణమునందును, శబ్దౌచిత్యమునందును రైనాల్డ్సు నిక్కముగ నద్వితీయుఁడు. ఈతని మించిన పాశ్చాత్యు లనేకు లున్నను, కొందఱు పాఠకుల కీతఁడే అత్యంతప్రియుఁడై యున్నవాఁడు.

సంఘ భాషా దేశాభ్యుదయములకు భాషాంతరీకరణములుగూడ నావశ్యకములు. స్వతంత్రగ్రంథము లెంత యవసరమో, అన్యగ్రం

థానువాదములును అంత యవసరము. ఈ సువ్యక్తవిషయము అల్పజ్ఞులకు మాత్ర మవ్యక్తము.

భాషాంతరీకరణము సులభసాధ్యము కాదు.—కవిత్వమువలె నిదియు నొకకళయని చెప్పఁదగును.—కావుననే, ఆంధ్రీకరణము లంతగా రుచింపఁజాలకున్నవి. అందు, దేశభాషాగ్రంథములకంటె, నాంగ్లగ్రంథములు మఱియుఁ గష్టసాధ్యములు. దేశభాషలకు సంస్కృతము మాతృకమగుటయు, నాంగ్లము మనకుఁ గేవలము విరుద్ధమగుటయే యందులకుఁ గారణము. అల్పజ్ఞున కిదియు దుర్గ్రాహ్యమై, సర్వము సామాన్యముగఁ దోఁచుట సహజము. కావుననే విద్యార్థి విద్యాధిక, విద్యాశాఖాధికారుల మన్ననఁ గాంచిన 'బక్సారుయుద్ధము'ను తదితర గ్రంథములను రచించియు, నాంగ్ల గ్రంథానువాద మొనరించుటకు గమకింకించితిని. నేఁ దెనిఁగించిన 'మొగలాయీ దర్బారు' సంపుటములు చదివిన నామిత్రు లవ్యాజగౌరవాభిమాన పూరితచిత్తములతో నన్నుఁ బ్రోత్సహించుటచే, నీ గ్రంథానువాదమునకుఁ గూడఁ బూనుకొంటిని. రసగ్రహణపారీణులగు పండితులు తప్పులను మన్నింతురుగాక.

రైనాల్డ్సు గ్రంథములలోనెల్ల నిదియే మిగుల రసవంతమైనదనియు, తొలుదొల్త దీనినే తెనిఁగింపవలయుననియు, హిత మొనరించిన అబ్దుల్ ఎస్. వాహాబుసాహెబునకును, శ్రమయనక వ్రాతప్రతిఁ జూచిన నా మిత్రులు పురిపండా అప్పలస్వామిగారికిని, ప్రసిద్ధ సరస్వతీగ్రంథమాలాధ్యక్షులగు శ్రీయుత అద్దేపల్లి లక్ష్మణస్వామినాయుఁడుగారికిని నేను కృతజ్ఞుఁడను.

విశాఖపట్టణము
1—2—28

మొసలికంటి సంజీవరావు

# అంకితము

ప్రసిద్ధ 'పిఠాపుర' రాజ్యమున వంశపరంపరగ వజీరులై వెలసిన 'వైజర్సు' గృహమున జానకమ్మ సీతారామరాయల గర్భమున నుదయించి, నిజజనకునకు నయనానందకరముగఁ బ్రవర్తిల్లి; బహు భాషాకోవిదుఁడై, అనంతవిజ్ఞానము గడించి, ప్రసంగచూడామణియై తనరి, సుధాకరునివలె నిరంతర మందహాసవిరాజమాన ప్రసన్నాననుఁడై దీపించి; నిజసోదరీమణుల కమితోపకార మొనరించి, విశేషధన సంపాదన మొనరించి, విశేషవ్యయ మొనరించి, విశేషధనము వీడి, ఏఁబదినాల్గవ సంవత్సరమున దివికేగిన నా మేనమామ అప్పారావుపంతులుకు ఈ 'యంతఃపురము' నవల ప్రథమ భాగ మంకిత మొనరించువాఁడను.

మన కథాప్రారంభసమయమున, * మూడవసలీము సుల్తాను ప్రసిద్ధ తురుష్కసామ్రాజ్యమును శాసించుచుండెను. ఆసియా యూరపు ఆఫ్రికా ఈ మూడు ఖండములయందును వ్యాప్తిఁ గాంచిన యీ సామ్రాజ్యమును సాధారణముగా 'ఒట్టోమను' సామ్రాజ్యమనియు నందురు.

ఈప్రభుత్వ రాజకీయపరిస్థితు లా సమయమునఁ గడు సంకుచితముగ నుండెను. రాజ్యాంగమున నే క్షణమున నెట్టి మార్పు లుప్పతిల్లునో తెలియక జనులు సంక్షుభితమనస్కులై యుండిరి. జనుల యవస్థయే యిట్లుండ, రాజ్యతంత్రము నిర్వహించు నధికారుల గుఱించి వేఱుగఁ జెప్పవలయునా ?

అట్టి సమయమున మఱియొక భయంకర వైపరీత్యము సంభవించెను. జనులను దారుణభయవిస్మయసాగరమున ముంచివైచెను; ఝంఝామారుతావసర గభీరజలరాశివలె, ప్రజాహృదయము మిక్కిలి కలంగుచుండెను. అనాది సిద్ధమై ప్రసిద్ధ చరిత్ర రశ్మిభాసమానమై, పాశ్చాత్యానేక రాజ్యములకుఁ గారణమై, యద్వితీయవైభవయుతమై యొప్పు రాజధాని దుస్సహాగ్నిసాంభరము మేఘావృతమాయెను. 'కాన్స్టాంటి' నగరమునందంతట దిరుగాడు జనులు నా భయంకర వ్యాపారముం గలచియే కొండలమందుచుండిరి. ఎక్కడను నదియే గుసగుసలు. గృహములందును, వీధులందును, భోజనాగారములందును, కాఫీమందిరములందును, క్షౌరమందిరములందును, తదితరస్థలములం

1807

లందును గూడ నియ్యదే సామాన్యప్రసంగమాయెను. భయాతిరేకమునఁ దమతమ వ్యాపారముల మఱచి, సర్వజనభక్షకియగు కరాళ మహామారి నగరమున విజృంభించి స్వైరవిహార మొనరించుచుండెనో యన, భయవిహ్వలులై సగము చచ్చిరి.

అంతటి యుపద్రవమేమి? రాజు నిరంకుశుఁడై, జనులను బాధించుచుండెనా? కాదు, కాదు. తొల్లిఁటి సుల్తానులవలె గాక ఈ సలీము ప్రజాస్వాతంత్ర్య గౌరవసంపదలను రక్షింపఁగడంగెను. అట్టులైన, ప్రజావళి తీవ్రకలవరము కేవలము రజ్జుసర్పభ్రాంతియా? కాదు. దుర్భరమగు ఘోరమగు విపత్తు సంభవించుటచేతనే హృదయము ప్రయ్యలాయెను. ఇఁకఁ గాలయాపన మొనరింపక, కుతూహల ప్రకంపితపాఠకునకుఁ దత్కారణ మెఱింగించెదము.

సుమారు రెండు సంవత్సరములక్రిందట నొకవింత వదంతి బయల్వెడలెను. రాజధాని కంటియున్న 'బాస్పొరస్సు' నదిలోఁ బలుశవములు కొట్టుకొని పోవుచుండెనట. ఆయువుమూడిన స్త్రీపురుషుల మృతకళేబరములు ఒరుఁబడి, ప్రవాహము ననుసరించి పోవుచు నాగరికులకెల్ల సాధారణవిషయమై యుండెను. వ్యభిచారపంకకళంకితలగు భార్యలను తాము దెగనఱికియో, తదితర తెఱంగులనో, నదీజలంబులఁ బడద్రోయుచుండిరి. పాడిదొఱంగి ప్రవర్తించు పరిచారికలు బందీలు సహితమట్టి దుర్మరణమునకే పాల్పడుచుండిరి. కాన, నట్టి మృతకళేబర ప్రదర్శన మొకవింతకాదు. భయకారణమేమన, నట్టి శవములసంఖ్య రెండుసంవత్సరములనుండి క్రమముగా మీఱుచుండెను. ఇటీవలకు హత్యాకాండ మధికతమమాయెను: దురంత నరవధ సర్వసాధారణమాయెను: ప్రజల యావస్థ మఱియు దుస్సహమాయెను. ఇందు మఱియొక వైపరీత్యము. నదీతోయములఁ దేలుచుండినవి స్త్రీ శవములుకావు. పురుషుల కళేబరము లగుటచే, జనుల

భయము శతాధికమై, వర్ణనాతీతమాయెను. తద్వ్యయంకరవ్యాపార మునకు సంబంధించినవిషయములు కొన్ని క్రమముగావ్యక్తమాయెను.

భర్తలపై, ఉపభార్యలపై దాసీజనంబులపైఁ గినియు పురుషులా యా కాంతలను గట్టముగఁగొనెనంచులోఁ బెట్టి, వానిమూతులు బిగియుగట్టి నదీప్రవాహమునఁ బడవేయుచుండిరి. అదియే నాఁటి యాచారము. మహాసామ్రాజ్య భారధురంధరులగు సుల్తానువారి దుర్మార్గ దురాగ్రహమునకు గుఱియగు దురదృష్టవంతు లంతిపుర మునకే, మాతృణమునే భయంకర కాలపాశముంబోలు ధనుర్జ్యా ప్రపీడితకంఠులై దారుణముగ హింసింపఁబడుచుండిరి వారు. బాస్ఫరసనదీ తోయములనే తేలుచుండిరి. కనుబ్బి, నల్లనై, వికృతమై, వింటి నారితో జుట్టియున్న కంఠములను గాంచునంతనే, తద్విషయము విశదమగుచుండెను. అట్టి మరణములకుఁ అట్టి దృశ్యములకును పుర జనులలవాటు పడియే యుండిరి. కాని, ప్రజాహృదయమును విచ్ఛిన్న మొనరింపఁజాలు హత్యలట్టివి కావు. అట్లు చచ్చినవారుస్త్రీలు కారని ముందే చెప్పియుంటిమి గదా. సంచులయందు బంధింపఁబడుట లేదు. కంఠములు పాశబద్ధము లగుట లేదు. ఆ శవములను బరికించినంతనే, కత్తిపోటుచే మరణించి యుండవలయునని తెలియుచుండెను. మఱియు అగాయము మెడవెనుకనో, కొంచెము క్రిందుగనో కానవచ్చుచుం డెను. ఒకింత విచారింప, నా మందభాగ్యు లేమఱియున్న సమయ మున, నెవ్వఁడో పాపాత్ముఁడు మృత్యువువలె వెనువెంటఁ బొంచి యుండి, వాని నొక్క పోటునఁ బొలియించుచుండెనని తెలియఁ గలదు.

ఈ భయానక హత్యలయందు నింకొక వింత లక్షణము పొడ చూపుచుండెను. ఇట్టి యాకస్మిక దుర్మరణమునకుఁ బాలైన భాగ్య హీను లందఱును యువకులు, సుందరాంగులు; ప్రాయము పదునెని

మిది ముప్పది సంవత్సరములకు నడుమ నుండును. బాలురు, ముప్పది యేండ్లు గడచినవారలును అట్లు మరణించుటలేదు. తరుణవయస్కులే యీ తెలియంగను ఘోరముగఁ జావనేల? మఱియొక యద్భుతము మిద్ది యున్న, నట్టి యమానుషకృత్యములు నొనరించు హంతకులు ధనమున కాసించినవారు కారు. ఆయా పురుషులు ధరించిన యాభరణములు, చెంతనుండు ధనమును అట్టులే యుండెను. హంతకులు ధనాశా ప్రేరితులైనచో, జచ్చినవారి సొత్తు హరింపకుందురా? కాన, నిది యొక విపరీతము. మరణించుచుండిన యౌవనపురుషు లొక్క జాతి వారు కారు. తురుష్కులు, ఆర్మీనియనులు, గ్రీకులు, పరాసులు లోనగుగాఁ గలవారు—తురుష్క సామ్రాజ్యనగరమున నుండు నానా జాతులవారును విచక్షణలేక వధ్యులగుచుండిరి. నదీజలము పైఁ దేలు శవముల దుస్తులను బరికింప, లెక్కకు మీఱిన సువర్ణనాణెములో, వెండినాణెములో, అఫీనుము గలడబ్బులో—ఏవియో తప్పక కాన వచ్చుచుండెను. కావున, ధనాపహరణము దోపిడియు నిట్టి దారుణ వ్యాపారమునకుఁ గారణము కాదని స్పష్టమగును. సౌందర్యయౌవన విభాసితులగు పురుషులే మరణించుటయు, మరణము తీరు సదా యట్లులే యుండుటయు, మొదలగు విషయములను బరికింప, నిహత్యల కెల్ల నొక్కటియే కారణ ముండవలయునని స్ఫురింపకమానదు.

ఈ రెండు సంవత్సరములలో మరణించిన యౌవనసుందరాంగుల సంఖ్య నూటికి మీఱియుండును. కాదు, కాదు. విశాల బాస్ఫరసనదీ తోయముల గోచరించిన మృతకళేబరముల సంఖ్య వేయి మించి యుండును. కొన్ని కళేబరములు పురజనాసికనయనపథముఁ దొలఁగి సముద్రముఁ జేరియుండును. నిగూఢముగ నెందఱు కడతేరిరో యెఱుంగరాదు. ఇంతకు, లెక్కతోఁ బనియేమి? బహుకోశవిస్తీర్ణ ముగల యీ మహానగరమునందలి యనేక కుటుంబములు—పసికులు

ధనరహితులు, అధికారులు అధికారరహితులు, కులీనులు సామాన్యులు మొదలగు తారతమ్యములు లేక—గృహాధికారి, భర్త, సోదరుడు, కుమారుడు మొదలగు నత్యంత ప్రియతముల నాతెఱంగునఁ గోల్పోయి యనంతదుఃఖసాగర నిమగ్నులై యుండెను. తుదకు నగరము విపరీత సాంద్రదుఃఖభయానక మేఘాచ్ఛాదిత మాయెను. పురజనుల దురవస్థ వర్ణింపనేము యుంటిమి.

కారణము తెలియకున్నను, కారణము నరయఁబూనుట మనుష్య స్వభావముగదా. భయవిహ్వలులైన జనులు తీవ్రవేదనాజనిత మహాశోకవశముచే నీహత్యాకాండమునకు రాజకీయ కారణమును నిరూపించిరి. కాని, భయావేశ మొకింత యడంగినంతనే, యాకారణ మసమంజసమని వారు గుర్తించిరి. ప్రభుత్వము గమనింప నవసరములేని పడుచువారలే వధ్యులగుచుండుటచే, నట్టి యనుమానమున కవకాశము లేదు. యూదులు క్రోధోన్మత్తులై, క్రైస్తవ తురుష్కజాతులపైఁ బగతీర్చుకొన నుద్దేశించి, యిట్టి భయంకర వ్యాపారమునకుఁ గడంగి యుందురని జను లనుమానించిరి. కాని, అదియు నసంబద్ధమే. ఏమన, మరణించుచుండిన యువకులలో నుత్తమవంశజులగు యూదులు కూడ నుండిరి. కావున, నొక జాతిపై నిందారోపణ మొనరింపుట యసాధ్యము. జాతిమతవిభేదములు లేక, యెల్లరు దమతమ ప్రియతమ బంధుజనులను గోల్పోయి, గోలుగోలున నేడ్చుచుండిరి.

మఱియు, ప్రతిహింసాతత్పరతయే యీఘాతుక కృత్యములకుఁ గారణమగునేని, హత్యలన్నియు నేకవిధముననే జరుగనేల? యువకులు ఒక్కవిధముననే వధింపఁబడి, ఒక్కవిధమగు నాయుధముచేతనే, ఒక్కమర్మస్థానముననే ఒక్కహంతకుని చేతనే వధింపఁబడుచుండినట్లు కాన్పింపనేల?

రింపవలయునని సహజముగా నాసించిరి. సలీముపాదుషా యట్టిఅత్యాచారముల కెంతమాత్రము బాధ్యుఁడు గాఁడని జను లెంచియుండిరి. కాని జగద్రక్షకుఁడగు పాదుషాయే సమస్త రక్షింపనియెడల, ఇఁక దిక్కెవ్వరు? "పాదుషావారు సర్వాధికార సమన్వితులట, సర్వశక్తియుతులట, సర్వగుణగ్రహణ పారీణులటకదా! ఇంతటి మహానీయులు రెండు సంవత్సరముల నుండి యీ యత్యాచారముల నడుపఁజాలరిచో, మన కీతనివలని ప్రయోజనమేమి?" అని జనులు తమలోఁదాము ప్రశ్నించికొనఁ దొడంగిరి. ఈ దుర్భర నరమేధము నడంచుట సుల్తానుయొక్క కర్తవ్యమని వారు నిశ్చయించిరి.

జనసామాన్యమే కాదు, పెద్దవారలు సహితము యిట్లే భావించిరి. వివిధతరగతుల పురజను లేకాభిప్రాయులగుటచే, నాస్థానసభ్యులీ విషయమును సుల్తానున కెఱింగింపఁ బూనినవారైరి. సుల్తాను ప్రజాక్షేమము నరయువాఁడు. తన యుద్యోగు లాచరించుచుండిన ప్రయత్నము విఫలమైనందులకు వగచి, యధికతర తీవ్రప్రయత్నము లొనరించి యెట్లయినను జనులను రక్షింపవలయునని కృతనిశ్చయుఁడాయెను. అట్టోమను సామ్రాట్టులలో సలీము కడు వివేకవంతుఁడు దయార్ద్రచిత్తుఁడునైనను, ఆపరిస్థితుల ననుసరించి కడు నిరంకుశముగనే మెలంగెను.

సలీము సుల్తాను నిండుదివాణమున సింహాసనాసీనుఁ డాయెను. మంత్రులందఱు నాతనిఁ బరివేష్టించి యుండిరి. నగరము నందలి ప్రధానాధికారు లెల్లరు నరుదెంచి తమ తమ స్థలంబుల నాసీనులై యుండిరి. ప్రధాన న్యాయాధిపతి యనుజ్ఞాతుఁడై సభాభవనమునకే తెంచెను. ఈతఁడు మన కాలపు న్యాయప్రదాతలవలెగాక, సైనిక 'దివానీ' శాఖలకు సర్వాధికారియై యుండెను. ఈతఁడు 'హాసేను ఎఫండీ' యను నామము ధరించెను. ఈతఁడరువదేండ్లు గడచిన ముదుకఁడు.

తన యధికారవు దుస్తులఁ దాల్చిన హాసేను కొల్వుకూటముఁ బ్రవేశించి, వెండితీగలవలెఁ దళతళ మెఱయు గడ్డము నేలపై బొరలాడునట్లుగ సుల్తాను వారి సముఖమున సవినయముగ సాష్టాంగమాచరించి, భయకంపితహృదయుఁడై దీనవదనుఁడై యుల్లనఁబాదుషా వారిని దిలకించెను. న్యాయాధిపతి యట్లు కలవరమంద నేల? సుల్తాను నేఁడు సహజసుందర మందహాసము దొఱంగి కఠినవదనుఁడై యుండెను. న్యాయాధిపతినిఁ గాంచి యాతఁ డిట్లు గర్జించెను—

"ఓయీ! ఈ యరాజకమునకు, అత్యాచారములకుఁ గారణమేమి? నగరరక్షణభారము నీవు వహించియుంటివి. అధికారమంతయు నీ హస్తగతమైయున్నది. రెండు దీర్ఘసంవత్సరములు గడచెను, ఈ హత్యలింకను అంతరించుటలేదు. నగరమునందలి పెక్కు కుటుంబములు పుత్రాదులను గోల్పోయి ఘోషింపుచున్నవే! ఏమందువు?"

"మహనీయ సార్వభౌమా! ఈ భయంకరరహస్యభేదన వ్యాపారమున నే నణుమాత్ర ముపేక్షింపలేదని మనవి చేయుచున్నాఁడను. చేయఁగల ప్రయత్న మొనరించుచుంటిని. నా దురదృష్టవశమున నింతవఱకును జయముఁ గాంచఁజాలనైతిని."

"ఓరీ! నా జనులు సహింపఁజాలక, ఒక్క తెఱంగున ఘోషింపుచున్నారు. వారా తెఱంగున వెఱగందుటకుఁ దగు కారణము లేకపోలేదు. ప్రజాసంరక్షణ మొనరింపమేని, అల్లావారి దుర్వారాగ్రహమునకుఁ బాత్రులగుదుము. బాధ దుర్భరమగునేని, జనులు తిరుగఁబడెదరు; విప్లవము చెలరేగును; ఇతరదేశపు నృపాలురకు మేము హాస్యాస్పదులగుదుము. హాసేన్! చూడుము! ఎనిమిది దినములు గడువొసంగితిని. ఈ లోపున నీ ఘోరవధ లాచరించు హంతకుని జాడఁ గనిపట్టవలయు. లేదేని, మిగిలిన న్యాయాధిపతులు నీ వలెఁ గాక కడు సప్రమత్తులై ప్రభుత్వకార్య నిర్వాహణమునకుఁ గడంగునట్లుఁ

తొమ్మిదవనాఁటి యుదయమున నీ శిరము ఖండించి సింహద్వారమున బ్రదర్శింతుము."

ఆ తెలుంగున సలీము సుల్తాను కఠినముగఁ బలికి, నిజాధికారపురస్సరముగాఁ జేయి విదకించెను. ఆ భావము గ్రహించి, న్యాయాధీశుఁడు హసేను మాఱుమాటాడుటకు సాహసము చాలక, సగము చచ్చి, దర్బారు మర్యాదచొప్పున మూఁడు ప్రణామము లొనరించి యావలకుఁ బోయెను.

సుల్తాను క్రూరుఁడు గాఁడు, కఠినుఁడును గాఁడు. పరిస్థితులు శ్రుతిమించుటచే నితికర్తవ్యతామూఢుఁడై, యంతట కాఠిన్యము నాతఁడు వహించెను. సభామధ్యమున సింహాసనాసీనుఁడై యాతఁడు గాంభీర్యధుర్యుఁడై భయంకరపు టాజ్ఞ నట్లు ప్రకటించెనేగాని, లోలోననాతఁడు కడుపరితపించెను.

సభయంతటితో ముగిసెను. సకరుణుఁడగు సలీము విచారాక్రాంతచిత్తుఁడై యంతిపురంబుఁ జేరి, 'ముస్తఫా,' 'మహమ్మదు' అను తనప్రియపుత్రులంజేరి, నాఁటి సమాచారము వారికిఁ దెలియఁ బలికెను. "తండ్రీ! విచారింపవలసిన యవసరములేదు. శరదిందు విమలచంద్రికతోఁ దులతూఁగు నీసౌజన్యమింత మాత్రమునఁ గళంకితము కానేరదు. రాజ్యభార ధురంధరుండ వగుటచే, నీవిధ్యుక్త ధర్మమును మాత్రమొనరింపఁ గడంగితివి." అట్టినిజపుత్రసమంజస సమయోచితానునయాలాపముల నాలించిన సుల్తాను హృదయభారము తొలంగెను.

ఈసందర్భముననే రాజకుమారుల గుఱించి యొకింత తెలుపవలయును. వారిస్వాతంత్ర్యము నరికట్టి బందాలవలె బంధించియుంచుట తదాస్థాన సాంప్రదాయ సిద్ధమైయుండెను. వారి సౌఖ్యముల కేమాత్రము నంతరాయము లేదు. వారికై మందిరములు ప్రత్యే

కింపఁబడెను. వాని కంటియుందు నారామములయందు వారు విహరింపవచ్చును. కాని, బాహ్యప్రపంచముతోడి రాకపోకలుగాని, ఉత్తరప్రత్యుత్తరములు గాని లేవు. అంతమాత్రమున వారజ్ఞానంధకారమున మునింగియుండిరని తలంపరాదు. ఆవల జరుగు సమస్తవిషయములను ఎప్పటికప్పుడు వారికిఁ దెలియఁజేయుచుండిరి. ఆ కారణమున, రాజధానియందలి భయానకహత్యాపరంపర గుఱించి వారును ఎఱింగియే యుండిరి. రాజధానికి దాపరించిన మహోపద్రవమును గుఱించియుండుటచేతనే, రాజకుమారులు తమ జనకుని ప్రవర్తనమును నిండు సంతసముతో నామోదించిరి.

దురదృష్టవంతుఁడగు హసేను దుర్భర విషాద భరకంపిత హృదయుఁడై, తీవ్రాలోచనాతప్తచిత్తుఁడై, నిజమందిరాఁభిముఖుఁడాయెను. శీలవతియగు నాతని భార్యయు, సుందరాంగియగు పుత్రికయు నాతని రాకకై నిరీక్షించుచుండిరి. న్యాయాధిపతియగు హసేను అంతలో నరుదెంచి, సుల్తాను క్రూరశాసనము వారి కెఱింగించెను. పాపము వారు మువ్వురుఁ గలసి తమకు సంభవించిన ఘోరవిపత్తుఁదలంచి పనవి వనవి యేడ్వనారంభించిరి. ఆతఁడప్పుడే మరణింపనుండినట్లు లాయుబలయు నుస్నిగ్ధభానుగవదనమండలములు సుందరసంధ్యారుణరాగము నందము వహింప, బాష్పవారి విమల ముత్యంపుసరుల వలెఁ దోరంబై ప్రవహింప నవ్యక్త కలస్వనంబున విలపించిరి. కొంతతడవైన పిమ్మట హసేను పెద్ద నిట్టూర్పువిడిచి, విషాదానల ప్రభావముచేఁ దడియూరిన గొంతు సవరించి, యాలోచనపూర్వకముగా నిట్లు పరితపించెను.—

"ఏమి చేయుదు? దిక్కెయ్యది? రెండు సంవత్సరములలో సాధ్యము కాని కార్యము ఎనిమిది దివసములలో సాధ్యమగునా? ఎట్లు కాఁగలదు? అత్యద్భుత హత్యాన్వేషణా నైపుణ్యముగల రక్షకభటులే యరయఁ

తొమ్మిదవనాఁటి యుదయమున నీ శిరము ఖండించి సింహద్వారమున బ్రదర్శింతుము."

ఆ తెలుంగున సలీము సుల్తాను కఠినముగఁ బలికి, నిజాధికారపురస్సరముగాఁ జేయి విదకించెను. ఆ భావము గ్రహించి, న్యాయాధీశుఁడు హసేను మాఱుమాటాడుటకు సాహసము చాలక, నగము వచ్చి, దర్బారు మర్యాదచొప్పున మూఁడు ప్రణామము లొనరించి యావలకుఁ బోయెను.

సుల్తాను క్రూరుఁడు గాఁడు, కఠినుఁడును గాఁడు. పరిస్థితులు ప్రతిమించుటచే నిశిక ర్తవ్యతాశిమూఢుఁడై, యుంకొట కాఠిన్యము నాతఁడు వహించెను. సభామధ్యమున సింహాసనాసీనుఁడై యాతఁడు గాంభీర్యధుర్యుఁడై భయంకరవు టాజ్ఞ నట్లు ప్రకటించెనేగాని, లోలోననాతఁడు కడుపరితపించెను.

సభయంతటితో ముగిసెను. సకరుణుఁడగు సలీము విచారాక్రాంతచిత్తుఁడై యంతిపురంబుఁజేరి, 'ముస్తఫా,' 'మహమ్మదు' అను తనప్రియ పుత్రులంజేరి, నాఁటి సమాచారము వారికిఁ దెలియఁబఱచెను. "తండ్రీ! విచారింపవలసిన యవసరములేదు. శరదిందువిమలచంద్రికతోఁ దులతూగు నీసౌజన్యమింత మాత్రమునఁ గళంకితము కానేరదు. రాజ్యభార ధురంధరుండవగుటచే, నీవిధ్యుక్తధర్మమును మాత్రిమొనరింపఁ గడంగితివి." అట్టినిజపుత్రసముంజససమయోచితానునయాలాపముల నాలించిన సుల్తాను వ్యాకయుభారము తొలంగెను.

ఈసందర్భముననే రాజకుమారుల గుఱించి యొకింత తెలుపవలయును. వారిస్వాతంత్ర్యము నరికట్టి బందాలవలె బంధించియుంచుట తదాస్థాన సాంప్రదాయ సిద్ధమైయుండెను. వారి సౌఖ్యముల కేమాత్రము నంతరాయము లేదు. వారికై మందిరములు ప్రత్యే

కింపఁబడెను. వాని కంటియందు నారామములయందు వారు విహరింపవచ్చును. కాని, బాహ్యప్రపంచముతోడి రాకపోకలుగాని, ఉత్తరప్రత్యుత్తరములు గాని లేవు. అంతమాత్రమున వారజ్ఞానాంధ కారమున మునిఁగియుండిరని తలంపరాదు. ఆవల జరుగు సమస్తవిష యములను ఎప్పటికప్పుడు వారికిఁ దెలియఁజేయుచుండిరి. ఆ కారణ మున, రాజధానియందలి భయానకహత్యాపరంపర గుఱించి వారును ఎఱింగియే యుండిరి. రాజధానికి దాపరించిన మహోపద్రవమును గుఱించియుండుటచేతనే, రాజకుమారులు తమ జనకుని ప్రవర్తన మును నిండు సంతసముతో నామోదించిరి.

దురదృష్టవంతుఁడగు హాసేను దుర్భర విషాద భరకంపిత హృద యుఁడై, తీవ్రాలోచనాశ ప్రచిత్తుఁడై, నిజమందిరాభిముఖుఁ డాయెను. శీలవతియగు నాతని భార్యయు, సుందరాంగియగు పుత్రి కయు నాతని రాకకై నిరీక్షించుచుండిరి. న్యాయాధిపతియగు హాసేను అంతలో నరుదెంచి, సుల్తాను క్రూరశాసనము వారి కెఱింగించెను. పాపము వారు మువ్వురుం గలసి తమకు సంభవించిన ఘోరవిపత్తుఁ దలంచి పనవి వనవి యేడ్వనారంభించిరి. అతఁడప్పుడే మరణింపనుండి నట్లు లా యబలలు సుస్నిగ్ధభానురవదనమండలములు సుందరసంధ్యా రుణరాగము సంగము వహింప, బాష్పవారి విమల ముత్యంపుసరుల వలెఁ దొరంగి ప్రవహింప నవ్యక్త కలస్వనంబున విలపించిరి. కొంత తడవైన పిమ్మట హాసేను పెద్ద నిట్టూర్పువిడిచి, విషాదానల ప్రభా వముచేఁ దడియారిన గొంతు సవరించి, యాలోచనపూర్వకముగా నిట్లు పరితపించెను.—

"ఏమి చేయుదు? దిక్కెయ్యది? రెండు సంవత్సరములలో సాధ్యము కాని కార్యము ఎనిమిది దివసములలో సాధ్యమగునా? ఎట్లు కాఁగలదు? అత్యద్భుత హాస్యాన్వేషణా నైపుణ్యముగల రసికభటులే యరయఁ

జాలని ఘోరతర రహస్యము నేనెట్లు లరయఁజాలుదు ? ఇది యంతయు నాప్రాణము కబళించుట కుత్పన్నమైన యపూర్వభేద్యవిచిత్ర సంఘటనము...

న్యాయాధీశుని పుత్రికయగు జులేఖా మృదుల మధురస్వరంబున నిట్టులనెను.—

"జనకా! ఈ మహాప్రశ్నము తొలఁగు నుపాయము లేదా ? పాదుషావారి భయంకర రాగ్రహమును జల్లార్చి వారి కఠినశాసనము నుపసంహరింపఁజేయు మిత్రుఁడు నీకు లేఁడా ?"

నిబిడాంధకార బంధుర వాతావరణమున మెఱయు తటిల్లతవలెఁ దోచిన యాశాలేశముచే నొక్కింత యూరటఁగాంచి? జులేఖా జనయిత్రి తత్తరపాటున నిట్టులనెను —

"ఔను, నా సోదరుఁడు 'పాషా' తనకుఁగల పలుకుబడిని ప్రవర్తించి, మనలఁ దప్పక రక్షించును."

హతాశుఁడగు హసేను తలవంకించి దైన్యముగ నిట్టులనెను.—

"ప్రేయసీ! ఎక్కడి యాస? మేటి నగరరక్షణ భారధురంధరుఁడనగు నేనే పాదుషావారి క్రూరశాసనము వాతబడియుండ, ఏ యధికారి, ఏపాషా నన్ను రక్షింపఁగలఁడు? ఇట్టి కఠినప్రవర్తనము క్షమవిధ్యుక్తధర్మముని మన పాలకులు విశ్వసించి యున్నారు. ప్రయత్నమువలనఁ బ్రయోజనము లేదు."

మఱల ముగ్గురు విచారభారమున క్రుంగిపోయి, మాటాడనేరక మిన్నకుండిరి. అంతలో నా కాంతామణి చటుక్కున మోమెత్తి, ముకుళిత వదనసరోజ మొకింత వికసింప, నాకస్మికసంజనితోద్విగ్న చిత్తయై, నిజమనో కాంతునిడాసి, యాతని వీనుల నిట్లు గుసగుసలాడెను.—"నాథా! మనల నుద్ధరించు వాఁడొక్కఁడుగలఁడు. నాఁడు మీ రొనరించిన యమితోపకారమునకుఁ బ్రత్యుపకారం—

"హా! మఱచితి—" తన భార్యపలుకుల నాలించినంతనే, హాసేను నావరించిన సాంద్రశోక నిరాశా మేఘములు పటాపంచలాయెను. పెన్నిధిఁ గన్న పేదపగిది యమందానంద కందళిత హృదయుఁడై యాతఁడు సస్వరముగ నిట్టులనెను.—

"హా! మఱచితి. నేను సహాయము నపేక్షింపఁజాలు వాఁడొక్కఁడు గలఁడు. అంతులేని యీ విపదంబుధినుండి తరింపఁజేసిన, నాతఁడే చేయవలయు. కాని, ఒక్కక్షణమైన నాలసింపరాదు. సుల్తాను రయంబున బ్రిసన్నుఁడగు వాఁడు కాఁడు కృతనిశ్చయుఁడై యున్న యాతని చిత్త విశ్చలతను సడలించుటకు గొన్ని దినములగును.

"నాథా! ఇఁక నాఁ స్యమేల? కలమిదిగో! ఇది కాగితము. ఏమి వ్రాయుదురో—"

ఆ వాక్యము పూర్తి కాకుండగనే, హాసేనిట్టులనెను.—

"ఔను. లేఖ లిఖింతును. మన ప్రియపుత్రికయే దౌత్యము నొన రింపవలయు. ఆతఁడు మానసీయుఁడు. కాన, నాతని సముఖమున జులేఖా నిర్భయముగా మేలిముసుగుఁ దీయవచ్చును. అశ్రుజలపూరిత నయనయై తన జనకునకై యర్థించు సుందరబాలికా రత్నముం గాంచునంతనే యాతని మెత్తని చిత్తము కరఁగక మానదు."

భయంకర మృత్యువదన గహ్వరముఁజొరనుండిన జనకుని రక్షింపఁ బ్రయత్నించుట కేపుత్రిక సమ్మతింపకుండును? హాసేను పలుకులు పూర్తిగ నాలింపకముందే యాతని యనుంగు పుత్రిక సమ్మతించెను. తా నొనరింపవలసిన దౌత్యమెట్టిదో యా బాలిక చింతింపలేదు. అంతలో హాసేన జాబు లిఖించెను. జులేఖా యా జాబునందికొని, జనకు నుపదేశము గ్రహించి, యనుజ్ఞాతయై రయమున నిర్గమించెను.

అపూర్వ సౌందర్యవతి యగు జులేఖా మేలి ముసుఁగు దట్టముగఁ దాల్చి, రాజధాని యందలి వీధులవెంబడి వడివడిపోయి, ప్రసిద్ధ

దుర్గరాజము సమీపించెను. ఆమె వెంటనరుదెంచిన పరిచారిక లిద్దరు సింహద్వారము చెంత నిలువ, నా కాంత యందు, ప్రవేశించెను. కావలియుండు భటానీక శ్రవణమున నెద్దియో పలుకుచు నామె కక్ష్యాంతరంబులు కడచి, సుళువుగా నంతిపురంబుఁ జొచ్చెను. అందలి ద్వారములఁగూడ నట్టులే యతిక్రమించి, చాల దవ్వరిగిన యనంతరము ఘోరభయంకరాకారుఁడు, కాలమేఘముంబోలిన వాఁడొకఁడు గోచరించెను.

ఈ కృష్ణాంగుఁడు కొజ్జాలకందఱకు నొడయుఁడు. తదధికారము ననుసరించి వానిని 'కిసలర్ ఆగా' యని పిలుతురు. మర్యాదగౌరవము లందాతఁడు పాషాలతో సమానుఁడై యుండెను. పాదుషావారి యంతిపురశాఖకుఁ జెందిన యధికారియగుటచే, నాతఁడు కడుగౌరవనీయుఁడై యుండెను. తదనుగుణముగా నాతఁడు సువర్ణాలంకార విరాజమానమగు డాబుసరి దుస్తులఁదాల్చి మూర్తీభవించిన యధికారమువలె నుండెను. ఆ యాగా ప్రసన్నుఁడైన గాని, జులేఖా కృతకృత్యకా నేరదు. కాన నాతనిఁ గాంచినంతనే, యాముద్దియ సవినయముగా మోకరించి దైన్యముగఁ బ్రార్థించెను. ఆతఁడు మొదట నిరాకరించెను; యనంతరము సంశయించెను; అవనతవదనయై రమణీయ ముక్తాఫలోపమాన బాష్పబిందు సందోహ విరాజిత నయనయై దీనతరకలస్వనంబున ప్రార్థించు నాకలకంఠిపై తుదకు జాలివహించి, 'కిస్లరాగా' యామె నా చెంతనున్న మందిరమునకుఁ గొంపోయెను. కాని, పాఠకులనందీ సమయమునఁ బ్రవేశపెట్టఁజాలము.

అందేమాయెనోగాని, మన జులేఖా యొక్క గంటలోపుననే, రాజనగరునుండి యరుదెంచెను. ఆ కన్నెమిన్న యాశాసంతోష దీపిత సుందరాననము, లఘుతరగమనము గమనింతుమేని, యామె సందేశము భగ్నము కాలేదని స్ఫురింపక మానదు. తన పరిచారికలు

వెంటనరుదేర, జులేఖా శీఘ్రముగ నిల్లుజేరెను.

తమ పుత్రిక రాకకై తలిదండ్రులు కడు నాతురముతో నిరీక్షించు చుండిరి. గృహముఁజొచ్చినంతనే ఆకుమారితొలుదొల్త నతిరయమున జనకునాలింగన మొనరించి, యనంతరము తన తల్లిని గాఢతరముగఁ గౌఁగలించెను. ఉత్సాహతమకమున నా పుత్రిక మాటాడ నేరకున్నను, దూతకృత్యము సఫలీకృతమాయెనని యా దంపతులు గ్రహింపఁ జాలియుండుటచే, సమందానందకంపితహృదయులైరి. జులేఖా యెటు లుండెను ? ఆ ఏణాక్షి విశాలతరళనయనముల నుండి వెలువడు నానందభాష్పబిందువులు ధవళమౌక్తికముల వలె రాజిల్లుచు నుస్నిగ్ధ భాసురకపోలముల వెంబడి కుచకుంభములపై బ్రాల, సుందరకుసుమ సంభరితమగు లతికవలె మోము వాల్చియున్న యాబాలికారత్నము వర్ణనాతీతయై యుండెను.

తదానందరసోద్రేకము చల్లారినంతనే, పాదుషావారి యంతిపురంబు నందలి యుదంతము జులేఖా సవిస్తరముగ నెఱింగించెను. ఆ పలుకుల నెడు నిర్మలసలిలమును పిపాసాపీడితులగు పాంథులవలె నా దంపతులు గ్రోలి సంతోషపారవశ్యమున దమ ముద్దులపట్టిని గ్రుచ్చి కౌఁగలించికొనిరి. హసెనిట్లులనెను.—

"తల్లీ ! నీయభిమానము, కార్యరచనానైపుణ్యము ననమానములు. ఈ సాయంకాలము నీ మాతులగృహంబున కేగుము. నాపైఁ బాదుషావారు ప్రయోగించిన భయంకరశాసనము నాలించి వా రెల్లరుఁ గడు దల్లడిలుచుందురు. వారి భయముడిపి నీ మామయొక్క పుత్రికల సహవాససౌఖ్యము ననుభవించి యరుదెమ్ము.

జులేఖా యిట్లు బదులాడెను.

"తండ్రీ ! అట్టి యవకాశము లేదు. నాదౌత్యము గుఱించి మీరిరువురు దప్ప నన్యులెవ్వరును నెఱుంగరాదని యామహనీయుఁడు

ఖచితముగాఁ బలికెను. కాన, ఈ సమాచారము వారలకు నివేదింపఁ జాలను."

"షట్! యట్టులేయగుఁగాక. ఈ దారుణ రహస్య భేదనకార్య పరతంత్రుఁడనై, నిద్రాహారములం దలంపక, రేయింబవళ్లని గణుతింపక సర్వవిధములఁ బ్రయత్నింతుననియు, సాధింతునను నమ్మకము కలదనియు, దురదృష్ట వశమున నొకవేళ సాధింపఁ జాలనిచో, నిక్కముంగ మహమ్మదీయునివలె విధివిధాన మవిలంఘనీయమని గుర్తించి ధైర్యోత్సాహములతో తొమ్మిదవ దినమున మరణముఁ గాంతుననియు దెల్పుము.

## ౨

### మువ్వురు యువకులు

పై సంగతులు జరిగిననాఁటి సాయంకాలము సూర్యాస్తమనసమయమున సుందరాంగుఁడగు నొక తురుష్కయువకుఁడు సముచితవస్త్రధారుఁడై, కాన్స్టాంటు నగరవీథులందు మందగామియై విహరించుచుండెను. వాని సౌందర్యము వర్ణనాతీతము. పౌరుషమయసౌందర్యమున నంతకు నతిశయించు పరిపూర్ణవిగ్రహము తలంపునకు రాజాలదు. ప్రాయము ఇరువదిరెండు వత్సరములు మీఱియుండదు. శరీరము సుపుష్టవ్యాయామసదృశమై, నిడుపును బలుచనయున్నై శలాకవలె నుండెను. నిండు చంద్రాకారముగల వాని వదనము నిర్వికాసముగ నుండెను. అంతకంటె నెక్కుడు ప్రాయముగల యనుభవజ్ఞునివలె నాతని వదన మాలోచనాధీనమై యుండెను. శిరోజములు సుందరసాంద్రతరనీలంపుఁ గాంతులీనుచుం

డెను. నయనములు విశాలనీలోత్పలదళ సన్నిభములై సుందరనారీజన నయనములవలె మనోహరములై ప్రేక్షణీయములై యుండెను. ఆ నయనములు సహజముగఁ గాంతివిస్ఫురితములయ్యు నాతఁడు యోచనాపరుఁడగు సమయమున మాత్రము కొలఁదివడి, మానస ముద్రేకించునపుడు గొబ్బునఁ బ్రజ్వలితములగుచుండెను. నల్లనై, మసృణమై, మనోహరముగ వంకలు తిరిగిన సన్ననిమీసము సముచితముగ నమరియున్న యోష్ఠము నాచ్ఛాదించి, ధవళదంతదీప్తులను మఱియు నతిశయింపఁజేయుచుండెను.

ఈ యువకుఁ డాలోచనాపరుఁడై, పరధ్యానముగ మెల్లగ నడచుచుండెను. వాని వైఖరి గమనింప, నెవ్వనినో యరయఁగోరినటులు, ఎద్దియో కాంచుటకై యిటువెడలి పచారుచేయుచున్నటులుండెను. క్రమముగా నాతఁడు గ్రీసుదేశస్థులు నివసించు పేటలోనికిఁబోయి దేదీప్యమానముగా రాజిల్లునొక భవనముఁగాంచి, యందుఁబ్రవేశించెను. అదియొక కాఫీమందిరము. అందు సుఖాసీనుఁడై యాతఁడు సామాన్యాల్పాహారముఁ గోరెను. సర్వజన విధేయుఁడగు సేవకుఁడు పథికజనాపేక్షణీయములగు షర్బతు వాలుక్యాలను గూడ సగౌరవముగఁ గొనితెచ్చెను.

ఆసమయమునఁ దదశనామందిరమున మఱి యిరువురతిథులు మాత్రమే యుండిరి. మనోహర వసనాలంకృతులగు నాయిరువురం గాంచినంతనే వారు గ్రీకులు కావలయునని స్ఫురించును. వారును మన తురుష్కుని ప్రాయము వారలే. వారి వస్త్రధారణము గూడ సరసముగనే యుండెను. రూపసంపదయును దత్సమానముగ నుండెననియే కాన్పించును. ఆగ్రీకుల యెదుటనున్నది పానకము కాదు, నిర్మల సలిలముగాదు; మేజాపై మధురసపూరితమగు నొక కూజాయు, నాలుగు గ్లాసులును ఉండెను. వారెద్దియో విషయము గుఱించి దీర్ఘ

ముగఁ జర్చించుచు, మధ్యమధ్య మధురసాస్వాదనా సౌఖ్యముఁ జూరఁ గొను చుండిరి. తత్ప్రసంగమున నిమగ్నులయ్యు, నూతనాగతుఁ డరు దెంచినంతనే ప్రబోధితులై, పరస్పర సంభాషణంబులు నిలిపి, తమ నేత్రములతో నాతనిఁ బరిశీలింపఁ దొడంగిరి.

అట్టి పరిశీలమునకుఁ గారణమేమి? ఆలోచన పూర్వకముగా వారా తురుష్కునరయుచుండిరా? లేక వారు కేవలము యథాలావముగా నూరక వీక్షించుచుండిరా? కొంత తడవైన పిమ్మట నా గ్రీకులు తమ వీక్షణ పరంపరల మఱలించి, భావగర్భితముగ నొకరి నొకరు తిలకించి, యెద్దియో గుస గుస లాడిరి. వారు మగుడ నా తురుష్క వంశజునిపై దృష్టి నిలిపి, తోడనే మఱల గుస గుస లాడఁ దొడంగిరి. నాలుగైదు నిముసములట్లు గడచెను. వారెద్దియో ముఖ్యతర విషయము గుఱించి దీర్ఘముగ చర్చించి, తలపోసి, తుదకొక నిశ్చితాభిప్రాయము నకు వచ్చినటులుండెను. తోడనే వారా యువకునడాసి సవినయముగ, సగౌరవముగ, సదుచితముగఁ బలుకరించిరి. వారి యభిప్రాయము వ్యక్తమాయెను.

ఆ గ్రీకులు తనతో సరసముగ సంభాషింపఁ గోరిరని యాతఁడు గ్రహించెను. విశాలహృదయుఁ డగు నా యువకుఁడు తదనుగుణముగ మెలంగెను. గ్రీకులు సంతుష్టాంతరంగులై, వికసిత వదనులై, యా చెంతనున్న యాసనముల నలంకరించిరి. లోకసామాన్య విషయముల గుఱించి వారు మువ్వురు గొంతకాలము ప్రసంగించిరి. ఆక్రొత్తవ్యక్తు లిర్వురు సోదరులు కారనియు, మిత్రులనియు, వారి నామధేయములు, 'లూకాసు' 'జూలియను' అనియు మన తురుష్క యువకుఁడు గ్రహించెను.

ఆ యిరువురలో లూకాసు అనువాఁడు ప్రాయమున నొక సంవత్సరమధికుఁడై యుండును. ఆతఁడు విచిత్రవర్ణ సమంచితములగు

దుస్తులను దాల్చియుండెను. ఆడంబరమగు నాతని దట్టి కంటె మణిమయ విరాజితంబులగు బాకులు రెండు వ్రేలాడుచుండెను. కృష్ణసర్పసన్నిభములై, కుటిలములై, గుజ్జగు బెరిగిన యాతని శిరోజములపైఁ జక్కని టోపీయొకటి అమరియుండెను.

రెండవ క్రైస్తవ యువకుని వస్త్రధారణముగ ఒకింత యధికతర నాగరకము సూచించుచుండెను. వారిరువురు గ్రీకులే యైనను, తమ తమ స్థానిక సాంప్రదాయముల ననుసరించి వస్త్రధారణ మొనరించి యుండవలయును. వాని శిరోజములు కూడ గాఢతర నీలంపురాసి సుందరములై నలరారుచుండెను, కొంచెము హ్రస్వతరమై, పలుచనై సొగసుగ నిగనిగ లాడుచుమాత్రముండెను. తురుష్కయువకునకు వలె వారికిని గడ్డములు లేక తుమ్మెద రెక్కలఁబోలు చక్కని మీసము మాత్రము దిద్దినటులమరి యుండెను. లూకాసు మీసమొకింత దట్టముగ, నిండుగ, గంభీరముగ నుండెను.

జూలియను లూకాసు లిర్వురు బాల్యము నుండియు స్నేహితులు, సహాధ్యాయులు, ఉత్తమ వంశసంజాతులు; తలిదండ్రుల యనుజ్ఞవడసి దేశయాత్రాపరులై తొలుదొల్త రాజధాని కరుదెంచి, దర్శనీయములగు నా మహానగరమునందలి వివిధవింత ప్రదేశంబులం గాంచుచు, సమందానందజలధి తరంగముల నోలలాడుచు హాయిగ నందు విడిసియుండిరి. పారావారముఁ బోలిన యా నగరవతంసము వారు ప్రవేశించి పదునైదు దినములాయెను. ప్రసంగవశమున నీ సంగతులు తురుష్కునకుఁ దెలియవచ్చెను.

తురుష్కయువకుఁడు గ్రహించిన రహస్య మొకటికలదు. తనతో నా క్రైస్తవులు ధారాళముగ సంభాషింపఁదలచియుండిరని యాతఁడు కనిపెట్టెను. ఆ కారణమునఁ బ్రసంగవశమున నా మహమ్మదీయ యువకుఁడిట్టులనెను.—

అయ్యలారా! నాకీనగరము కేవల మపరిచితము. మీరరుదెంచి పదునైదు దినములైన నాయెంగాని, నేనీ యుదయమే యిందుఁ బ్రవేశించితిని. మిగిలిన నా యుదంతము మీ యుదంతమునే పోలియుండును. నేనును సద్వంశజుఁడను. ఈ ప్రసిద్ధనగరసందర్శనమే, నా రాకకుఁగూడఁ గారణము. ఆర్యులారా! మీ నామధేయములు 'లూకాను' 'జూలియను' లని మీమీ ప్రసంగములవలన గ్రహింపఁ గలిగితి. నన్ను "ఖలీలు" అని పిలుతురు.

గ్రీకులు మిక్కిలి సంతసించిరి. తురుష్క యువకుఁడు సరళస్వభావుఁడనియు, విశాలహృదయుఁడనియు, తప్పక స్నేహపాత్రుఁడనియు వారు గుర్తించి, తమ సంతసము సముచితముగ వెలిబుచ్చి, తమ మధురసముం గొనివచ్చి యాతని చెంత నాసీనులైరి. అంత ఖలీలు ఇట్లు ప్రశ్నించెను.—

"మిత్రులారా! మీరీ నగరమున కేతెంచి యిన్ని దినములాయెగదా. ఈ ప్రదేశమున కేల రావలయునని విచారింపలేదా? విచారింపవలసిన యవసరము లేకపోయెనా? నా హృదయ మెఱింగించెద, గమనింపుఁడు. ఈ రెండుజాములలో నాకుఁ దెలియవచ్చిన సమాచారము నింతకుముందే వినియుంటినేని, ఈ పాడునగరమునఁ గాలిడి యుండను."

లూకాను ఇట్లు పలికెను—"మిత్రమా! నీ యభిప్రాయము గ్రహించితిమి. ఇంతమాత్రమున ధైర్యముఁ దొఱంగువారము కాము. చలింపకుండుటయేగాక, అవకాశ మేమాత్రము చిక్కినను, ఈ భయంకర హత్యారహస్యము నరయవలయునని కృతనిశ్చయులమై యున్నవారము. నిరంతరభోగాసక్తపనిర్మగ్నున్న నొనరింపఁజాలు ప్రభుత్వ ప్రకటితబహుమానము గుఱించి వినియుందువా!"

"కొంచెమాలించితి. కాని, దయామయుఁడగు నల్లా కరుణాతిశయ

ముచే నా యాహారవిహారములకు లోటులేని సంపదకలదు. ఈ భయంకరనరవధ గుఱించి యందురా? ఈ నగరమునఁ దాండవమాడు మృత్యుదేవత దీర్ఘకరాళదంష్ట్రికలకుఁ జిక్కకుండ నెట్లు సంచరింపనగునాయని మాత్రము చింతించువాఁడగాని, వేఱు విచారము లేదు.

ఒక్క నిముస మెల్లరు నూరకుండిరి. అంత లూకాసు ఇట్టులనెను.—

"మేమీ పట్టణమున కేతెంచిన ప్రథమదివసముననే యొక వింత సంగతి సంభవమాయెను. ఈ భయంకరహత్యావ్యాపారకలాపము గుఱించి యప్పుడు తెలిసెనేని, నే నంతటి సాహసమునకు దొరకొని యుండువాఁడఁగాను. పిడుగువంటి దుర్వార్త యా మఱునాఁడు మాకుఁ దెలియవచ్చెను.

అంత జూలియను నిజహృదయాభిప్రాయసూచకముగా వింతగ మందహాస మొనరించి యిట్టులనెను.—

"సాహస మొనరించితిని, ప్రమాదము మాత్రము సంభవింపలేదు: ప్రమాదరహితముగుటయే గాక, కేవలము మఱియొక విధముగాఁ బరిణమించెను.

ఖలీలుఁ డుత్సాహపరుఁడాయెను.—

"సాహసమా! మీ రొనరించిన సాహసకృత్యమెద్ది? మీ సంభాషణసరణి గమనించిచూడ, చాల కథయున్నదని స్పష్టమగుచున్నది. మీ యీ పలుకులు కేవల ముపోద్ఘాతపూర్వకమనియు, అసలు విషయము నెఱుకపఱచి నాపైగల పూర్ణవిశ్వాసముఁ బ్రకటింతురనియు విశ్వసింతును."

లూకాసు తోడనే యిట్టులనెను.—

"మిత్రమా! అభ్యంతరమేమి? గమనింపుము. మేమిరువుర మీ

నగరమున కేతెంచి పదునైదు దినములాయెనని తెలిసెంగదా. మేము సాయంకాలము నగరప్రవేశ మొనరించితిమి. అశ్వారూఢులమై ప్రయాణ మొనరించుచుండఁ మార్గమధ్యమున నా మిత్రుఁడు జూలియను ప్రమాదవశమున నేలఁబడెను. నా మిత్రుఁడా కారణమున బసదొఱకినంతనే తన మందిరముఁ బ్రవేశించి విశ్రమింపఁగోరెను. నేనన్ననో, యధిక కుతూహలాధీన చిత్తుఁడనై, సంధ్యాసమయమున నీ మహానగర మెటులుండెనో చూడవలయునని యెంచి యిలువెడలితిని. నేనొక వీథిఁబడిపోవుచుండ, నొక వృద్ధురాలు పలకరించెను. తా నెచటికో పోవలయుననియు, దారి యెఱింగింప వలయుననియు నామె కోరెను. వెంటనే నా యసమర్థత తెలియఁజఱచితిని. అంతటితో నా కాంత నన్నువీడక, ఏమేమియో తెలిపి తెలిపి, నడుమ నడుమ నాకుశల మరయుచు, నన్నెంతయు మెచ్చి మెచ్చి, తుదకాకస్మికముగ నిట్టులనెను—"ఆహా! నీ వంటి సరసవచన రచనాధురంధరుండగు నవయౌవన ప్రతిభావిభాసితునిఁ గాంచినచో, మా దొరసాని యెంత సంతసించును! ఆనందపరవశయగుఁ గదా!" నేనంత దరహాసితాననుఁడనై "ఓబోటీ! నీ యేలికసాని యెవ్వరు?" అని ప్రశ్నించితి. ఖలీలు మిత్రమా! నిజము చెప్పవలయు గదా, సరస కథాక్రమమున కియ్యది అనుక్రమణిక కావలయునని గ్రహించితి: మఱియు నట్టి వ్యాపారమునఁ జొరుటకు నాకే మాత్రమభ్యంతరము లేకపోయెను. కాని, ఈనగర రంగస్థల ప్రదర్శిత భయానక హాస్యాపరంపర గుఱించి యా సమయమున నెఱింగి యుండినచో, నప్రమత్తుఁడనై యన్యథా ప్రవర్తించి యుండెడివాఁడ సుమా."

తోడనే, ఖలీలుఁడిట్లు పలికెను.—

"కాని, నీవు చెప్పబోవు సాహసిక వ్యాపారమునకు ఈపట్టణపు హాస్యాలకును పరస్పర సంబంధముండదని భావింతును. ఉండెనేని, నీవు

సజీవముగా మిగిడి యిట్లుకూర్చుండి యుండవు గదా!

"ఎటులుండునో? లేదనియే గ్రహింపవలయు. కాని, హృదయ విదారణ మొనరించు నా భయంకర హాస్యాలందలంచుట కిది యదను గాదు. ఏమన, నా కథ నిరవధిక సంతోషప్రదము. గమనింపుము. నీ యజమానురా లెవ్వతెయని ఆ వృద్ధవనితను ప్రశ్నించితి. కాని, సహజముగ బహుభాషిణియగు నాజరఠాంగన బదులాడక, కుటిలముగ నవ్వి, ముక్కున వ్రేలిడి, అంత కుతూహలము అనుచిత మనియు, నన్నుంక విశ్వసించుట ప్రమాదజనక మనియుఁ బలికెను. నా కుతూహలము శతాధికమాయెనని వేఱుగఁ జెప్పవలయునా? నేఁ గడు వినయ విధేయుఁడనై యుందునని యు, ఆవంతయు జలింపక కడు నిశ్చలముగ నుందుననియు, బహుజాగరూకతతో నడచికొందుననియు నచ్చజెప్పి, సౌందర్యరాసియగు తన దొరసాని సాన్నిధ్యమునకుఁ గొంపో వలయునని బ్రతిమాలితిని. ప్రసంగవశమున నాముదుసలి జారవిడిచిన మాటలఁబట్టి, యూవనితా రత్న మెవ్వతె యైనను, అసాధారణ సౌందర్యవతి కావలయునని యెంచి, తదానన విలోకి నాతురుఁడనైతి. మొదట నా వృద్ధురా లనుమానించినటులుండెను. కాని, నాస్థితి గతుల నరసి, నే నీ నగరమునకు రాఁగఁబడితి, తుదకియ్యకొనెను. ఒకింత దవ్వుననుండి తనను వెంబడింప వలయునని యామె పలుక, నేనట్టులే వెడలితిని. పయత్తలము మేఘరహితమై నిర్మలముగ నుండు టచే, నేను సుఖముగాఁ బోఁజాలితి. విశాలమగు వీధులఁ బోరక, సన్నని సందుగొందులఁబడి సాగి సాగి, నదీతీరముఁ జేరితిమి. అచట నొక చిన్న దోనెయు, నందు ఇరువురు నల్లని బానిసలునుండిరి. అందు మే మాసీనులమైనంతనే నావ వడివడిఁ బోసాగెను. పశ్చిమతీరమున నున్న సుందరారామములఁ గాంచుచు జలవిహార మొనరించుచుండ, నా ప్రవర్తనమపుడు స్మృతి పథమునకు వచ్చెను.

"నీవెందుకు కొంచెము సందేహభయాక్రాంతమై యుంటివి? ఏమందువా, ఈనగర భయంకర హత్యను గురించి వినియుండక పోయినను, శుద్ధాంతమునఁ గాలుమెట్టి సాహసించితివి గదా. పరపురుషులు ప్రవేశింపరాని చారుశీల కాంతా నివాసమందిరమే నీగమ్యస్థానమని గ్రహించియుందువు. అంతకంటె సాహసకృత్యమేముండును?

ఖలీలుఁడట్లు పలుక, లూకాసు మగుడ నిట్లు పలికెను.

"నిజముగ నొకింత భయభ్రాంతియుతుఁడ నైతిని సుమా. ఇట్టి సాహసిక వ్యాపారమున నేల తగుల్కొంటినని నాయుని ఖేదమొందితి. కాని, అంత యొనరించి వెన్కు మగుడనగునా? కాన, విచారము వీడి ప్రయాణ మొనరించితిని. వృద్ధురాలి ప్రవర్తనము పూర్తిగఁ దెల్లమాయెను. గృహాన్వేషణము కేవలము మృషయని గ్రహించితి. నాదృష్టి నాకర్షించి నట్టి ప్రసంగమునకు దింపుటయే యామె యభిప్రాయము కావలయునని నాకపుడు స్ఫురించెను. కాని, మిత్రమా! స్త్రీజాతి నంతయు నగౌరవపఱచుచుంటినని తలంపవలదు సుమా,—క్రైస్తవ సుందర నారీజన బృందమువలెనే, తురుష్క వంశ సంజనిత మోహనాంగులు సహితము అనంగ శరదళిత హృదయలై తరుచుగ సంచరించుచుందురు; ప్రపంచము కన్నెఱుంగక నేకాంతమునఁ బొరలాడు మచ్చెకంటులకీ వృద్ధురాలివంటి తారుపుగత్తెలున్నగాని రహస్యవ్యాపారము సాగదనియుఁ గూడ గుర్తించితిని. ఏమైనను, సాహసమునకు కార్యమునందుఁ జొచ్చితిని. పరిణామము సానుకూలముగనే యుండెనని ముందే చెప్పియుంటిగదా.

అంత రెండవ గ్రీసు దేశస్థుఁడగు జూలియను తన మిత్రుని వారించి యిట్లనెను—

"మిత్రమా! కథ పెంపుచేయక, ప్రధాన విషయమునకు రమ్ము

ఉల్లసిత మానసుఁడగు లూకాసు మందహాస విరాజితవదనుఁడై, వల్లెయని పలికి, ఇట్లు చెప్ప దొడంగెను—

“ఇఁక శీఘ్రముగ ముగింతును. గాఢతరనీలంపు భాస్వర నదీజలములపై నొకయరగంట శీఘ్రప్రయాణము సలిపి, ఇరువైపుల దట్టముగు వృక్షములచేఁగప్పఁబడి జనసామాన్యమునకు దృగ్గోచరముకాని యొక్క సన్ననిక్రయ్య బ్రవేశించితిమి. నాలుగైదు నిముసములలో మా నావ చాందినీవలె నమరియున్న జొంపముల నడుమఁ బోయి పోయి యొక సోపానపరంపరమ్రోల నిలిచెను. తోడనే వృద్ధవనిత నేలకు డిగ్గెను. అనుజ్ఞవడసి నేనును దిగి యామె వెంటఁబడితిని ఆ కాంత హెచ్చరింప, నాకుల చప్పుడు కాకుండ మెల్లమెల్లగ నడిచితిని. మే మొక విశాలారామముఁ బ్రవేశించితిమి. అవ్వనాంతమున సమున్నత వృక్షావృతమై యొకమందిరము గోచరించెను. దట్టంపుఁ బర్ణశాల నతిక్రమించి సుందరమగు పచ్చికబయలు ప్రవేశించినంతనే, యొకద్వారము కానవచ్చెను. కాని, మేము ప్రవేశింపవలసిన ద్వారమది కాదు. ఒకింత చుట్టు తిరిగి పాశి ద్వారము చేరితిమి. ఆ తాళపుఁజెవి తనవద్ద నుండుటచే, నా వృద్ధురాలు రయమునఁదలుపు తెఱచెను. మే మందుఁ బ్రవేశించి, తివాసితోఁ గప్పఁబడియున్న మెట్లు వరుస నారోహించితిమి. అట్లు చాల దవ్వరగితిమి. అంత నొకదాని కెదురుగా నింకొకటి యమరియున్న రెండు ద్వారములు కాన్పించెను. అచట వ్రేలాడుచుండిన మనోహర రజతదీపముచే నా ప్రదేశము కాంతియుతమై యుండెను. ఆ కాంత రయమున నొకద్వారము దాయఁబోయి, ఏలకో యాకస్మికముగ నిలచిపోయెను. నిలుచుటయేగాదు, భయంకర విషధరమునుగాంచు పాంథునివలె, నాయింతి యమిత భయాక్రాంత చిత్తయై వడంకుచు వెనుదిరిగెను. అంతటి వెఱపు కొలుపునది సర్పమేకావలయునని యెంచి యడుగువైచి, కంపితహృదయుఁ

దనయ్యా, కృపాణముపైఁ జేయిడి పరికింప, నొక చక్కని పాదరక్షల జత ప్రత్యక్షమాయెను!"

ఖలీలు మందహాసమొనరించియిట్లులనెను—

"గ్రహించితి. మహమ్మదీయుఁడనగుటచే దదర్థము నాకు గ్రాహ్యమైనది. కాంతుఁడు నిజప్రియాంగన శయ్యామందిరము ప్రవేశించునపుడు, పాదరక్షలు ద్వారముచెంత నిడును. పిలిచినఁ గాని, యందెవ్వరు జొరరాదని అయ్యది సూచించును."

లూకాను మగుడనిటులు చెప్పఁ దొడంగెను—

"కాని, ఆసాంకేతికము నాకానమయమునఁ దెలియదుగదా. ఏపామో మార్గమునిరోధించి యుండునని భావించిన నాకంటికి ప్రాణము లేని చెప్పులు గోచరమగుటచేఁ బట్టఁ జాలక పకపక నవ్వఁబోతిని. ఆవృద్ధురాలి ప్రవర్తన మంత హాస్యాస్పదముగ, నంతవిపరీతముగ నుండెను. కాని, ఆముహూర్తముననే యూతలువుపిడి చలించెను. తోడనే, పరిచారిక యమితభయ విహ్వలయై తడబడు తనహస్తముతో నాచేయి గట్టిగఁబట్టి, రెండవద్వారము కడు నిశ్శబ్దముగాఁ దెఱచిఁ యందు నన్నుఁద్రోసివైచెను. అంతయు నొకక్షణమాత్రకాలమున సంభవించెను. అమిత భయకారణ మెద్దియో యుండునని నేనపుడు గ్రహించితి. పిదవిచారింపక ఆమె యేమొనరించినను ఊరకుంటిని. ఆప్రదేశ మంధకార బంధురమై యుండెను. ద్వారము వెంటనే బంధింపఁబడెను."

లూకాను రెండు నిముసములు మిన్నకుండెను. ఖలీలుఁ డిట్లు ప్రశ్నించెను.—

"ఆ పరిచారిక నిన్ను వెంబడించెనా?"

"లేదు; ఆ తమోసాగరమున నే నొక్కఁడనే యుంటిని. ఆగభీర నిశ్శబ్దప్రదేశమున నేకాకినై యుంటి. నిమిషములు కడచుచుండెను;

నేనట్టులే సమాధిఁ జెంది యుంటిని. క్రమముగా ననిర్వాచ్యభయా తురుఁడనైతి—"

"ఆహా! నీ కా సమయమున భయంకరనాగరిక హత్యల గుఱించి తెలిసియుండ నేని—"

"ఎఱుంగను, ఎఱుంగను! ఎఱింగియుండినచో, నెంతకైనఁ దెగఁ బడి యెంతటి సాహసమైన నొనరించి, యా ప్రదేశమునుండి తప్పించి కొనుటకై ప్రయత్న మొనరించి యుందును. నిముసములు కడచెను. అంధకారమున బొరలాడుచుంటిని. ఏమియుఁ దోపకుండెను. నే నెం దుంటినో, నాకు సంభవించిన యుపద్రవ మెద్దియో, నేనే మొనరింప వలయునో, ఏమియుఁ దెలియదాయెను. అట్టి విపరీతపుదురవస్థకుఁ బాల్పడి దుఃఖితాత్ముఁడనై యుండ, నా పాదరక్షలుండిన ద్వారము సార్భాటముగాఁ దెఱువఁబడెను. ఆ శబ్దముతోఁ బాటు నీ పలుకులు స్పష్టముగఁ, ఖండితముగ, బిగ్గఱగ వెలువడెను—"అమీనా!అమీనా! ఏమీ వైపరీత్యము! ఆ స్త్రీ యేమాయె? నా యాజ్ఞ యగునంతనే ఫలాహారములఁ గొని రాదేమి? ఇంకను రాదే!—" ఆహా! నాయవస్థ యపు డెటులుండెను? వర్ణింపఁజాల. ఆ యధికారపూరితవాగ్జాలముల నాలించినంతనే, యాతఁడు గృహాధిపతి కావలయునని గ్రహించితిని. భయాతిరేకమున నా యొడలంతయు నొక్కసారి కంపించెను. నే నొనరించిన మహాపచారము నా కపుడు వ్యక్తమాయెను. యజమాని ఒకవేళ నే నుండిన మందిరము ప్రవేశించిన, నేమిచేయవలయు? నా గతి యేమికావలయు? దురంతభయానల తప్తుఁడనై కాళ్లేతులాడక గిజగిజలాడుచుండిన యానమయమున, నా మందిరపు టంతర్ద్వారము తెరువఁబడెను; కాంతిసముజ్జ్వలమగు దీపము మెఱుపువలె మెఱసెను; దీపమేగాదు, అపూర్వసౌందర్యవిభాసితవదనయగు జవ్వని యొక్క తె గాఢనీలమేఘపటలమునుండి వెలువడు పూర్ణసుధాకరబింబమువలె,

నయనపర్వముగ నుదయించెను. మేలుముసుగు దొఱంగియున్న యా సర్వాంగసుందరి, ఆ విద్యుల్లతాంగి, నాకమునుండి దిగివచ్చిన దివ్యాంగనవలె, నుండెను. ఆ దివ్యసుందరవిగ్రహముఁగాంచి మంత్రబద్ధమగు సర్పమువలె పారవశ్యుఁడనై, చైతన్యవిహీనుఁడనై, యనిమిషనయనుఁడనై యట్టె నిలిచిపోతిని. ఆ నవమోహనాంగియు నన్నుఁ గాంచి విస్మయవిస్ఫారితవదనయై విభ్రాంతచిత్తయై యట్టె నిలిచిపోయెను. నే నెటు లేతెంచితినో, దానేమి కావింపవలయునో, ఆ తరళనయన యా క్షణమున నిర్ణయింపనేరకపోయెను. తుదకామె నన్ను డాసి—"హా! నీ వెవ్వఁడవు? ఈ శుద్ధాంతము నెట్లు ప్రవేశించితివి? ఏమి చేయుచుంటివి?—" అని వడివడిఁ బ్రశ్నింపఁదొడంగెను. ఆ ప్రశ్నావళి నాలించి, యా చెంతనున్న మందిరముననున్న మఱియొక దివ్యసుందరవిగ్రహము బిఱబిఱ నరుదెంచి సాక్షాత్కరించెను. ఆహా! ఆ యెలనాగ సోయగము సహిత మద్వితీయమై, యగణితమై నిష్కళంకమై యుండెను. ఆ యిందుముఖుల నిర్వుర నొక్కసారి కాంచినంతనే, వార లేకగర్భసంజాతలు కావలయునని గ్రహించితిని. నేనాపైఁ గాలహరణ మొనరింపక నా యుదంతమంతయు రయమున సంగ్రహముగ నెఱుకపఱచితిని. అంత నా సుందరులొకరినొకరు తిలకించిరి. వారి పరస్పరవిలోకనములు విస్మయాశ్చర్యసమ్మిళితములై యుండెను. ఆ యబలారత్నములు మార్దవలజ్జాపరలై నాపైఁ బ్రేక్షణమాలికలను బుంఖానుపుంఖములుగఁ బఱపిరి. అంతలో నెద్దియో ఆకస్మికముగా స్మరణకు వచ్చుటచే జ్యేష్ఠసోదరి దిగ్గున లేచి, నే బ్రవేశించిన ద్వారమునకు బీగమువైచెను. తమమందిరమున కరుదేఱవలయునని ఆ యన్నుమిన్న నన్నంతట నాహ్వానించెను. ఉత్సాహపూరితహృదయుఁడనై రయంబున వారితో నరిగితిని. వివిధవస్తుసమృద్ధమగు నొక విశాలమందిరము ప్రవేశించితిమి.

అందొక మూల కమనీయ చంద్రకాంత శిలానిర్మితజలస్తంభము విమల పరిమళ సలిలము మనోహరముగా నెగురఁజిమ్ముచుండెను. మిత్రమా! ఆ కోమలాంగులు పదునేడు పందొమ్మిది వర్షముల ప్రాయఁపువారై యుందురు. ఆ కళంక రహితేందు ముఖులు తమ మేలుముసుగుల ధరింపలేదు. ఒక్కసారి ప్రదర్శితమాయె, నిఁక ముఖాచ్ఛాదనా ప్రయత్నమేల, యని వారు సహజముగా భావించియుందురు. ఎట్లు భావించిన నాకేమి! నేను ధన్యుఁడనైతిని. ఒక మొగములు సోఫాపై వారలాసీనలై నన్ను వారి నడుమ గూర్చుండఁబెట్టిరి. నే నేతెంచిన కథాక్రమము మఱల నివేదింపవలయునని యా సుందరాంగులు కోరుటచే, నా యుదంతము సవిస్తరముగా నెఱింగించితి. ఆ హేమగాత్రలు మగుడ నాశ్చర్యపరవశలై నాభిప్రాయముగా నొండొరులఁ దిలకించిరి. నా కపుడు యథార్థము నెఱింగించిరి. తమ జనకుని భార్య తన యుపయోగార్థము నన్నా తెఱంగున రప్పించెననియు, పరిచారిక యగు అమీనా భయవిహ్వలయై, చేయునదిలేక, నన్నుఁ దమ మందిరశ్రేణియందుఁ బ్రవేశపెట్టెననియు, నా కలకంఠులు తెలియపఱచిరి. ఇంకను ఒక సంశయము నన్ను బాధించుచుండెను. 'జనకుని భార్య' యని చెప్పనేల? జనకుని భార్య జనని కాకుండునా? నే నా విషయము ప్రశ్నించి, సంశయనివారణ మొనరించుకొంటిని. వారి జనయిత్రి మరణించెను. తోడనే యాతఁడు మఱియొక కాంతను వివాహమాడెను. 'ఇస్మెలడా' యను పేరుగల ఆ సతీమణియే నన్ను రావించెను. తద్రహస్యము తెలిసినంతనే, నా యవస్థగుఱించి చింతించితిని. నా రహస్యవ్యాపారము బయల్పడునేని, ఎంతయేని యుపద్రవము సంభవించును. నేనే గాక, ఆ కాంతారత్నము ఆ పరిచారికయుంగూడ మహాపదం బొరయుదురు. కాన, ద్రోహ మొనరింపరాదని యా సోదరీద్వయమును వేడికొంటిని. అంత నా యగ్రజ శంకా

సంతోషమయ వీక్షణజాలముల నాపైఁ బఱపి, మాయామర్మముల నెఱుఁగని ముగ్ధయయ్యు, ప్రౌఢముగ నిట్లు పలికెను.—“ద్రోహమా! ఎంతమాట! ఆర్యా! భీతిఁదక్కి యుండుము. మఱియు, రహస్యభంగ మొనరింతుమేని, నీ దర్శనభాగ్యము మఱల లభింపదుగదా.” మిత్రమా! నా యానందమునకు మేఱలేదు. అంత వారి నామధేయముల నడుగ, నగ్రజపేరు ‘గుల్నేరు’ రెండవ యిందుముఖిపేరు ‘తైరజా’ యని తెలిపెను. వృద్ధపరిచారిక యగు నమీనాను ఆగ్రహోయత్తుఁడై కఠినముగఁ జీకిన యాతఁడే వారి జనకుఁడగు ‘దాల్టబను పాషా.’ అమీనా గుఱించి యే మాలోచించిరో, నేనా మందిరము మగుడఁ బ్రవేశించి వారి సుందరవదనసందర్శనభాగ్యము నెట్లు పడయఁగలనో యెఱుఁగఁగోరితిని. కాని, అమీనా యొనరించిన ప్రయత్న మన్యథా పరిణమించుటచే, నామె పూర్తిగ వారిచేఁ జిక్కియున్నది. ఇఁక నా వృద్ధురాలు వారిమాట కెదురాడఁ జాలదు. ఒక వేళ నా రాకపోకల గుఱించి ఇస్మిల్డాసతి యెఱుఁగవచ్చినన, మమ్మాపద వారయింపనేరదనియే విశ్వసింతుమని గుల్నేరు సంమజసముగాఁ బలుక, నా హృదయభార మడంగెను.”

“ఆకాంతల సముచితకల్పనా ప్రావీణ్యము ప్రశంసనీయమే.” అని ఖలీలుఁ డొకింత విరసముగా బలుక, లూకాసు రయమున నిట్లుబదులాడెను—

“వారి ప్రవర్తనము గుఱించి దురభిప్రాయపడుట యసంగతము. నిష్కపట నిర్మల నిశ్చలస్వభావలగుటచేతనే, యాముహూర్తమున వారట్లు మెలంగిరి. నా నుడులు విపరీతముగఁ గాన్పించుఁ గాక, అయ్యదే నిశ్చయము. సహవాసము నెఱుఁగక పొగులు పడఁతులు సంతసప్రదమగు సహచర్యము నపేక్షించుట సహజముగదా. అంతియేగాని, పరిస్ఫుట దర్పణ సదృశనిర్మల హృదయలగునా మానినీ

మణులు దురూహాలఁ దలంపఁ జాలరు."

"అసంభవము! తలంపఁ జాలరు" అని రెండవ గ్రీకు యువకుఁడు గంభీరముగాఁ బలికెను. ఖలీలిట్టులనెను.—

"ఓహో! తెలిసినది. సౌందర్యనిలయమగు నాస్వర్గలోకమునకు నీవుగూడఁ బ్రయాణ మొనరించి యుంటివి కాఁబోలు."

"ఔను. ఆ విషయము గూడ మనమిత్రుఁడు లూకానే చెప్పఁగలఁడు." ఆ కథకుఁ డిట్లు మగుడ నుడువఁ దొడఁగెను.—

"జ్యేష్ఠసోదరియగు గుల్నేరే నాహృదయము నాకర్షించియున్నను, ఆ యిరువురతో సముచితముగా సంభాషణ మొనరించి, యనంతరము, నే నొక మిత్రునితో నీ నగరమున కరుదెంచితిననియు, ఈ సారి ఆతనిఁగూడఁ బ్రవేశపెట్టుదుననియుఁ దెలుప, నాసుదతీరత్నములు సంతోషితస్వాంతలై యామోదించిరి. మిత్రమా! అమీనా సాహాయ్యముచే నా రేడుసారులా శుద్ధాంతసదనమునఁ జొరఁ జాలితిమి: ఆ దివిజనారీశిరోరత్నముల సందర్శించి ముచ్చటించు భాగ్యము గాంచితిమి. పలుమాటలేల? మదీయహృదయ మెఱింగించెద. నా చిత్తము గుల్నేరు కాంతాధీనమై యున్నది. అన్యకాంతను వివాహ మాడనొల్లను."

తత్సమానోత్సాహముతో జూలియను ఇట్టులనెను.—

"రెండవ సోదరియగు జైరజాయే మదీయ ప్రణయాధిదేవత. నేనా మనోహరకుసుమ కోమలినే పరిణయ మాడెదను."

ఖలీలుఁడు కొంత తడవు గాఢాలోచనా నిమగ్నుఁడయి యిట్టులనెను.—

మిత్రులారా! ఇట్టి రహస్యము నా కెఱిఁగించుట కెద్దియో భద్రకారణముండవలయును. మీ మానసమున నెద్దియో యుద్దేశము లేకున్న, నింతటి యవివేక మొనరింపఁజాలరు. అవివేకమే గాదు.

మానసీయుఁడగు దాల్టబనుపాషా యంతిపురరహస్యవ్యాపారములను ఒక యపరిచితున కెఱింగించుట యగౌరవప్రదము హైన్యమునుగదా."

లూకాను ధారాళముగ నిట్లు పలికెను.

"ఉద్దేశము నిక్కముగఁ గలదు. నే నిదె వ్యక్తపఱచెద గమనింపుము. మొన్నటిసాయంకాలమే మేమా ముద్దుగుమ్మలఁగాంచియుంటిమి. నేఁడు మఱుఁడఁ బోవలయు. కాని, వారి బందుగురాలగు నొకజవరాలు వారి యాతిథ్యముఁ గాంచనున్నది. బాంధవ్యమునకు మైత్రి దోహదమగుటచే, వారి నెయ్యము గాఢతమమై యున్నది. అమితమగు చనవు బలిమిచే నా కన్నియ ఆ సోదరీద్వయమును వీడక తోడునీడవలె నిరంతరము వారి సంటియుండును, కాన, నా సుందరి కంటఁబడకుండ రాకపోకలు సాగించుట దుస్సాధ్యము. మా రహస్యము నా వధూటి కెఱింగించుటకు తైరజా గుల్నేరులు సంకోచించిరి. ఆ కన్నియకూడ రహస్యభంగ మొనరింపఁజాలని పరిస్థితులం జిక్కువడిన గాని క్షేమకరము కాదు. ఆ కన్నియ యనన్యసామాన్యసౌందర్యవతియుట. తన చిత్తమింకను అన్యాక్రాంత మొనరింపలేద—"

ఖాలీలు దరహసితవదనుఁడై యిట్టులనెను.—

"నీ యభిప్రాయము తెల్లమాయెను. మీ వంటి ప్రియుఁడు మఱియొకఁడు కావలయు. ఆ పైనిఁక నానందలహరి యవిచ్ఛిన్నముగ, అమందముగ, నిర్వక్రముగ, ప్రవహింపఁగలదు."

"ప్రియుఁడు కాకున్న, ఆ నవమోహనాంగి 'జులేఖా'ను సరస ప్రసంగమునకు మఱలింపఁజాలు రసజ్ఞుఁడైనను జాలు."

అట్లు జూలియను పలుక, ఖలీలుఁ డిట్టు లనెను—

"జులేఖా! ఆముద్దియ యభిధేయము జులేఖా! ఈ నామధేయము కడు మధురము. ఈ లేమ సార్థకనామధేయ కావలయు. పేరు సర్వ

సాధారణముగా స్వభావానుగుణముగ నుండును. కాని, ఈ జులేఖా యెవ్వరు ? ఈమెయు పాషాయొక్క పుత్రికయగునా? ఏలందురా, ఈ వ్యాపార మతి భయావహము. ఘనాధికారసంపన్నులగు మహనీయుల శుద్ధాంతకాంతాజనంబులతో సరసము లాడఁ గడంగుట కడు ప్రమాదభూయిష్ఠము గదా."

"మిత్రమా ! ఆ కన్య నామము జులేఖా యనియు, నామె యమితరూపవైభవసముజ్జ్వలయనియు మాత్ర మెఱుంగుదుము, కాని అన్యము తెలియదు. నీ వీ మందిరము చొచ్చినంతనే, నీ దివ్యాకృతి గాంచినంతనే, జులేఖా తోడి పరిచయమునకు నీవే తగుదువని మే మిరువురము గ్రహించితిమి."

ఆ తెఱంగున లూకాసు తమ విచిత్రోదంతము నెఱుకపఱచుటయే గాక, తమ హృదయాభిప్రాయము గూడ వ్యక్తపఱచెను. ఖలీలు మగుడ నాలోచనాపరుఁడై, యనంతర మిట్టులనెను.—

"ఆర్యులారా ! నేఁడు మిమ్ముఁ గాంచుట విధిప్రేరితము కావలయు. కాన, నా కభ్యంతరము లేదు. ఆ మనోహరప్రణయమందిరమున కెపుడు పోవలయునో, ఎటులేగవలయునో మీరే యానతిండు."

లూకాసు అమందానందకందళితహృదయుఁడై నిజాననమునఁ జిరునగవు తొంగాడ, సగర్వముగ నిట్లు బదులాడెను.

"సమయమా! ఇయ్యెడె. అచిరకాలమునఁ బ్రయాణోన్ముఖులము కావలయు."

అంత వారు మువ్వురు మధురరసపాన మొనరించి, తద్గృహాధిపతికిఁ జెల్లింపవలసిన పైకము చెల్లించి యావలకుఁ బోయిరి.

## 3

### అంతఃపురము

యువకులు ముప్వురుఁగలసి లెక్కకుమీఱిన సందు గొందుల వెంబడి పోసాగిరి. తలవెంట్రుకల చిక్కువంటి యామార్గము లూకా మునకు బాగుగఁ తెలిసినట్లుండెను. ఆతఁడు మార్గదర్శకుఁడై ముందు నడవ, ఖలీలు జాలియును లనుగమన మొనరించు చుండిరి. మార్గమధ్యమున రక్షకభటు లనేకులు వారి కంటఁబడిరి. హత్యా రహస్య విచ్ఛేదన క్రియాపరతంత్రులగు నధికారులు ప్రచ్ఛన్న రూప మున నెల్లెడల సంచరించుచుండిరి. వారా యువకులఁగాంచి, "యువకు లారా! భద్రము, విడిపోవునప్పుడు మాత్రము భద్రము!" అని హెచ్చరించుచుండిరి. మిత్రసహితముగా విహరించుటయే క్షేమకర మని వారి యభిప్రాయము.

క్రమముగా వారు నదీతీరము సమీపించిరి. అచట నొక చిన్ననావ సిద్ధముగానుండెను. చీఁకటివంటి బానిసలిర్వురు తెడ్డులఁ బూని యుండిరి. వారందఱుఁ బ్రవేశించినంతనే, యాడోనె విహంగము వలె జివ్వునఁ బాఱెను. కళాపూర్ణుఁడు నిర్మలగగన తలమున మహా వైభవముతో రాజిల్లుచుండెను. ఆకసమునుండి వెలువడు ధళధళాయ మాన సముజ్జ్వల రజతకాంతి ప్రవాహప్రభావముచే నగరమునందలి దివ్యభవనములు విమల భాస్వర నదీతోయములందు సుందరతరం బుగఁ బ్రతిబింబించుచుండెను.

ఒక గడియలో వారు లూకానువర్ణించిన క్రయ్యఁబ్రవేశించి, సాంద్రలతానికుంజములఁగడచి, క్రమముగా సోపానపరంపర నారో హించిరి. అమీనా వారికొఱకు వేచియుండెను. ఖలీలునిఁగాంచి

నంతనే యామె వెఱగంది, "ముప్వురా!" యని ప్రశ్నింప, లూకాను సమయోచితముగా నిట్టులనెను—

"ఈతఁడు మామిత్రుఁడు. వెఱగందకుము. మేమిట్లు సంకేతించియే యుంటిమి. ఇదిగో! ఇయ్యది గ్రహించి ప్రతివచనము లాడక నడువుము."

ఒక బంగారు నాణెము ఖంగుమని చేతఁ బడినంతనే యా వృద్ధురాలి వదనము సిబ్బివలె విస్తరిల్లెను. జూలియనుకూడ నామె చేయిఁ దడిపెను. ఖలీలు మాత్రమూరకుండునా? ఆతురుష్కుఁడారు కాసులఁ దీసి యా కాంతకొసంగెను. ప్రథమ ప్రవేశమగుటచే ఘనమైన బహుమానము నొసంగి ఆ పరిచారికనుఁ బ్రసన్నురాలు నొనరించికొనవలయునని ఖలీలు భావించెఁగాఁబోలు! ఏమైనను, ఆ పరిచారిక పరవశాత్మయాయెను. అయ్యది యథార్థమో మిథ్యయో మాత్రము చెప్పఁజాలము. అమీనా చేతులు జోడించి, నిజమానసోల్లాసముమందస్వరము నిట్లు వెలిబుచ్చెను—"ఆహా! ఏమి రూపము! ఏమి సౌందర్యము! మహామ్మదుతోడు, మీకుఁదగిన మిత్రుఁడు!"

వికసిత నారంగ సౌరభ్య సంవాసిత మందానిలములు హాయి గొలుప, వారు క్రమముగా రహస్యద్వారము సమీపించిరి. తాళము తీసి యమీనా తలుపు తెఱచెను. మిత్రులు ముప్వురు తివాసీ పఱచిన మెట్లు వరుస నారోహించిరి. పాదరక్షలెక్కడ ప్రత్యక్షమగునో యని తొంగి తొంగి చూచెడు నమీనాను గాంచి, ఖలీలు నవ్వికొనెను. కాని అట్టి విఘాతమెద్దియు సంభవింపలేదు. పాషాపుత్రికల మందిరద్వారమును అమీనా కడునిశ్శబ్దముగాఁదెఱచెను. తోడనే మిత్రత్రయ మందుఁ బ్రవేశించెను.

ఆ ద్వారముతోఁబాటు నంతర్ద్వార మొకటి వివృతమాయెను. తలుపు వీడినంతనే, లూకాను వర్ణించిన సుందరాంగు లుదయిమొగ

ములు కొక్కియంబులపై నామెయుఁగుఁ జోడి సుధాకర ప్రభాభాసుర వదనయై ఒయ్యారముగా వ్రాలియుండ, ఖలీలుఁ డాహేమగాత్రి చరణ ధర్మకంజాతముల మ్రోల ప్రణయ వినయ గర్వస్ఫూర్తి దీపింపఁ మోఁకరించియుండెను. ఆకురంగనయన ప్రబోధితయై యుంటచే, గ్రీకుయువకులఁ గాంచినంతనే, బాలికా సహజ లజ్జాభర మ్మున నల్లన మోము వాల్చినను, వెఱగందలేదు. ఆ కుసుమగాత్రి కోమల పల్లవంబును దన హస్తమునఁ గేలించి, శ్రవణపుటమున ఖలీలు ధైర్యము కలిపెను.

ఖలీలుఁ డంతట, దన మిత్రులగు లూకాసు జూలియనులను బరిచయ మొనరించెను. ఘనలజ్జావనతాననయై, చారుతరమరాళమువలె మనోహరముగ మోము వాల్చి, వారి ప్రణామములఁ బరిగ్రహించి, మధురమంజుల స్వనమున నాకన్నియ సుస్వాగత మొసంగెను.

అంత నాసెలంత కొంకింత ధైర్యము కదుర, సహజ సుందరవదనము సంధ్యారుణరాగభాసురమై యలరార, సిందూరసన్నిభములగు పెదవులపై భావగర్భితమగు చిరునగవు చెంగలింప, తైరజా గుల్నేరులఁ గాంచి యిట్టులనెను.—“సోదరీమణులారా! ఆకస్మికముగా నన్నిట్లు విస్మయ విభ్రమముల పాల్సేయుట పాడిగాదు సుడీ.”

పాపా పుత్రికలు లజ్జితులై యానందాతిరేకమున నవ్వుచు నుచితాసనముల నలంకరింపఁ దొడఁగిరి. ఒక్కొకఁడు నిజప్రియాంగనా సహితముగా నొక్కొక సోఫాపైఁ గూర్చుండి, మన మలర గుసగుస లాడికొనిరి. ఈసమయముననే యువతీత్రయమును విపులతరముగా వర్ణించెదము.

ఆమందిరము లూకాసు వర్ణించినట్లు నానావస్తు సమృద్ధముగ నుండెను. అం దమరియున్న తల్పములు, మంచములు, సోఫాలు, ఆసనములు, దిండులు, మేజాలు, జాలరులు మొదలగునవి అసామాన్య

ములై, అమూల్యములై యుండెను. విలువగల యలంకారములు లెక్కకు మీరి యచ్చటచట నుచితముగ నుండెను. పలువిధము లగు రుచికర ఫలాహారము లొక్క చక్కని మేజాపై నమరి యుండెను. వెండి కలశమునం దునిచిన మేలు రకంపు గులాబీయత్తరుచే నామందిర మమిత సుగంధబంధురమై యొప్పారెను. నిర్మల సలిల పూరమగు నంబుయంత్ర మొక చక్కని బలపపుకుండియందు నృత్యము సలుపుచుండుటచే నావాతావరణము నిరంతర పరిశుద్ధశీతలానిల సమృద్ధంబై యుండెను.

పాషాజ్యేష్ఠపుత్రికయగు గుల్నేరు అసాధారణ సౌందర్యవతి. ఆ కళావతి వదనమండలము ఆరోగ్య రంజితమై, అనూనకాంతి సముజ్జ్వలమై, అనధిక కుంతల నికరాచ్ఛాదితమై చారుతరంబై యుండెను. విగ్రహము సమున్నతము. ఆకారమంగపరిపూర్ణతా సమృద్ధంబయ్యు సముచితముగ నమరియుండిన కారణమున నమందశోభాయుతమై, వర్ణనీయమై, దర్శనీయమై యొప్పారెను. ఆమె సోదరియగు జైరజా సమున్నతాసనముపైఁ గపిలవర్ణ విరాజిత శిరోజములు చక్కఁగఁ బాటితములై, సహజనిగనిగ ప్రభాభాసురములై యలరారుచుండెను. ఆజవ్వని వదనము గుల్నేరు నెమ్మోమువలె దుర్నిరీక్ష తేజోవిభాసితంబుగాక, శీతలామృత కిరణముల వెదజల్లు సుందర సుధాకర బింబము నందము వహించియుండెను. అద్దములఁబోలు నును జెక్కులు సంధ్యారుణరాగ దీపితంబులుగాక, లేతగులాబీ రుచులకు నిలయములైయుండెను. ఇంకను సంపూర్ణ యౌవనము ప్రాదుర్భవింపని కారణమున నామె యాకృతి నిజసోదరికంటె లఘుతరముగనుండెను. అయున్నుమిన్న వక్షోజముల పొంకము గమనింప బాల్యావస్థ యంతరించి మనోహర యౌవనావస్థగఁ బరిణమించుచుండెనని తెలియఁగలదు. ఆ సుందరుల నయనములు నీలవర్ణ విరాజితములై యుండెను.

అందుఁ దైరజానయనములోకింత గాఢతరముగ దీపించుచుండెను. ఆయింతుల దంతములు విమల ముక్తాఫలంబులవలెఁ జూడ మనోహరముగ నుండెను. ఆకంజాక్షుల చుబుకములు హ్రస్వములై, నునుపులై సముచితాల్పకూపదీపితములై దర్శనీయములై యలరారుచుండెను. జ్యేష్ఠసోదరియగు గుల్నేరు వక్త్ర మొకింతపూర్ణతరంబై, యొకింత గాఢసిందూరవర్ణరంజితమై యొప్పారెను. ఆ హేమగాత్రుల కరచరణములు, అధికవర్ణనమునకుఁ గడంగక, పరిపూర్ణశోభాయమానముగ నుండెనని చెప్పనొప్పును.

అపూర్వ సౌందర్యవతియగు జులేఖా రూపురేఖలు వేఱు విధంబుగ నుండెను. కాటుకవలె నల్లనై నిగనిగ మెఱయు నాకన్నియ నెఱికురులు విరళముగ, సాంద్రతరంబుగ, భుజములపై, నెన్నడుముపై జీరాడుచుండెను. బాదలములబోలు నాయింతి కనుంగవ ఆకర్ణాంత విశాలములై, అంగాంగసుందర వికాసభాసురములై, మృదుల వ్యామోహదీపితములై ప్రసిద్ధ హరిణనయనములవిడంబించుచుండెను. భాసుర వదనదర్పణమునఁ దీర్చిన విండ్లవలె నమరు నాకోమలి కనుబొమలు కడుమనోహరముగ నుండెను. తత్పక్ష్మల సమాశ్రిత కేసరము లపూర్వ దీర్ఘములై, హృదయాదర్శములనఁ దగు దన్మనోహర నేత్రములకు నల్లని తెరలై, తత్కారణమునఁ దద్భావాలోచన లన్యజనదృగ్గోచరము కాకుండ మాయాజాలసాధనములై, యొప్పారెను. ఆమోహనాంగి వక్త్రము మన్మథుని ధనువువలెను, అధరోష్ఠములు అభినవార్ద్రప్రవాళసన్నిభముగను అపూర్వ సౌందర్యముతో నలరారుచుండెను. అపురూపమరాళ కంధరమువలె దీర్ఘమై, నునుపై, వైభవముగ వంగియమంద సౌందర్యముతో నలరారు నాసుధాకరానన కంఠము దర్శనీయము. తదంతమున విరాజిల్లు శిరము చారుతర లతాంతశోభాయమానముగ దీపించుచుండెను. అత్యధికముగాక, సముచితవైభవముగఁ

కొఱఁబొందిన యాకన్నెమిన్న పేరుటురము చక్కఁగ వర్తులమై, నిరర్థక మాయాపరికల్పితావలంబముల సాహాయ్యములేకనే పొంకముగ నిగిడి మనోహర హరిదంతగోళములవలె నేర్పడి యుండెను. జులేఖా దేహము సహజముగఁ బాండువర్ణ సమోపేతమైనను, జీవరహితమై వర్ణ్యము నంటక, చారుతర చంద్రకాంతశిలాసదృశభాసుర వికాసమై గనిగ్యములతో నలరారుచుండెను. ఆమందయాన సాధారణ దీర్ఘశరీరయయ్యు, సుందర పయోధరముల నతిశయింపఁజేయు మనోహరమగు సన్నని కౌనుచేతను, సృష్టికారుని శిల్పచాతుర్యముం జాటు భుజముల వైభవముచేతను, ఊరుద్వయాది నిమ్నోన్నతయవయవ దీర్ఘతచేతను సమున్నత మూర్తిగనే దోఁచుచుండెను. అంగసౌష్ఠవము, అంగపరిపూర్ణత, అంగవిన్యాసము, అంగస్ఫూర్తిఁ జెడనోర్వన్యమనోహర సమాశ్రయము చేతను నా జవరాలు అసదృశరూప వైభవముతో నలరారుచుండెను. మధుర మంజుల వీణారవంబువలె, మనోహర కలకలనినాద సంకలిత విపుల రజత ప్రవాహమువలె నొప్పు నాకలకంఠి కలస్వనము మధుర తరంబై, శ్రవణపేయమై వర్ణనాతీతమై యుండెను.

ఆ యానందమందిరమున గూడిన యా స్త్రీపురుషులు పరస్పర ముఖవిలోకనమొనరించుచు, సరస సంభాషణముల మునింగి, వేఱు విచార మెఱుంగక హాయిగనుండిరి. శుద్ధాంతమున బ్రవేశించుట యపాయకరమని వారాసమయమునఁ దలంపఁజాలరైరి. ప్రణయ సౌఖ్యార్ణవ నిమగ్నులైన యామత్తకాశినులును దా మొనరించిన మహాపరాధము గుఱించి తలంపరైరి. మహమ్మదీయాంతఃపుర ప్రవేశము కంటె ఘోరతరనేర మింకొకటి యుండదు. తన జనానాయందుఁ బరపురుషుఁడు గోచరించునేని, మహామానియగు మహమ్మదీయ కులీనుఁడు ఆఁకొన్న హర్యక్షమువలెఁ గ్రోధోన్మత్తుడై, భయంకర కరవాలము రయమునఁదీసి, చొరఁబడిన యాకాముకునే

గాక ఆకాంతను గూడ నిర్దయుఁడై తెగనఱకును. మహమ్మదీయ ధర్మశాస్త్రమిట్టి యుద్బోధన మొనరింపకున్నను, అట్టి తీవ్రాచరణము సాంప్రదాయసిద్ధమైయుండెను. కాని ప్రణయానిలోద్ధూతహృదయులగు నాయువజనులు కాసమయమున వివేకమెట్లులుండును ?

తద్గృహాధిపతియగు దాల్బను పాషా గుఱించి కూడ నొకింత యచటనే యరయదగును. అతని ప్రాయ మేఁబదియైదేండ్లు. కాని, దీర్ఘమగు గడ్డము నెరిసి రజతవర్ణము సమీపించియుండుటచే, నాపాషా యధికతరప్రాయునివలె గోచరించుచుండెను. కాయమతిస్థూలము. వదనమునఁ గాఠిన్యగాంభీర్యములు తోఁచుచుండెను. చాల కాలము రణరంగములందు విహరించిన కారణమున, మోమొకింత వివేకరహితమై కూడ నుండెను. ఆతనికిఁగల జ్ఞానసంపద కడుమితము. సమర ప్రశంస తప్ప నితర లౌకికవ్యవహార జ్ఞాన మాతనికి శూన్యమనియే చెప్ప నొప్పును. రణవ్యాపారమున మాత్ర మాతని యనుభవ మపారము: ఒక్క ప్రత్యేకసైన్యమున కధినాథుఁడై, ప్రశంసనీయధైర్యస్థైర్యగుణవిరాజితనాయకుఁడని పేరు గాంచెను. మతివిషయములం దాతఁడు కడు ఛాందసుఁడు, కఠినుఁడు. ఐనను, ఒక్క లోపము మాత్రము కలదు. మధురమగు మధువుపై నాతనికి మక్కువ మిక్కుటము. 'చాంపేన్,' 'బర్గండీ' మొదలగు ప్రసిద్ధ మధురసము లాతని మందిరమున నెల్లపుడు సిద్ధముగ నుండును.

పాషాయొక్క భవనము రాజధానియందుండెను. అయ్యది మహావైభవసమన్వితమై, యసంఖ్యాయుతదాసదాసీజన సమృద్ధమై, నయనపర్వముగ రాజిల్లుచుండెను. ఇంతవఱకు నుదహరించిన మందిరము వేసవికాలమున విడిసియుండఁదగిన యారామమందిరము. ఇందుండు సేవకుల సంఖ్య యత్యల్పము. ఆ బానిసలు సంధాన కర్త్రి యగు సమీనాకు లోఁబడియుందురు. ఆవనిత స్వభావము మనకు విదితమే గదా.

కావుననే, పాపాపుత్రికల మందిరమున లూకాను, జూలియును ఖలీలులు ప్రవేశించుట కవకాశము చిక్కెను. బహుజన సంకీర్ణమగు నగరమందిరమున నట్టి కృత్యము దుస్సాధ్యము, అసాధ్యము.

తురుష్కయువకుఁడగు ఖలీలు జులేఖా హృదయము ప్రవేశించుచుండెగదా. ఆ కలభాషిణి మితభాషిణియై, సంతోషలజ్జావిభ్రమాధీనయై తనప్రేమోల మోఁకరించి నిజవాక్సుధారసధారల నవిరళముగ గురిపింపు సుందర తురుష్కయువకుని నొయ్యారముగఁ దిలకించుచుండెను. ఆ హేమగాత్రి కెంబెదవుల నుండి మాటలు వెలువడకున్నను, ఇందీవరదళసన్నిభనయనము లాసుందరి విజృంభిత హృదయమునఁ జెలరేగు వివిధవికారములను జాటుచుండెను. ప్రణయోదయ సూచకమగు నివారిత పారవశ్యము మార్దవముగ మంజులముగ సుందరవదన మండలమునఁ దాండవించుచుండెను. ఆకన్యామణి సంతోషపరవశయయ్యు, మహమ్మదీయ కాంతాజనోచితమగుటచేతనో తన ప్రియుఁ డత్యున్నతవంశసంజాతుఁడని వాగ్ధోరణిఁ బట్టి గ్రహించుటచేతనో, గాని, యొక విధమగు గౌరవము జూపుచుండెను.

ఒక గంటకాలమామిధునములు కాలగమన మెఱుంగక, తా మొనరించిన యనుచితకార్యమువలన నెట్టి యుపద్రవము సంభవించునో యని విచారింపక, సరససంభాషణమున, బూర్తిగ నిమగ్నులై యుండిరి. అట్టిసమయమున, నిశ్చల వినిర్మలాకసమునుండి భూరిమేఘ ధ్వానములు హఠాత్తుగ వెలువడునట్లు, అవ్వలి ద్వారము తీవ్రముష్టి ఘాతముల కాకస్మికముగా గుటియై తత్ప్రదేశమంతయు మాఱు మ్రోఁగఁ దొడంగెను. ఎంత ప్రమాదము ! ఎట్టి విఘాతము !

తెరజాగుల్నేరులు అత్యంతభయ విహ్వలశరీరలై, వదనములు కళావిహీనములై వెల్లవాఱ, సుందరకరయుగ్మములు ముకుళించి యతిదైన్యస్వరమున "జనకుఁడు ! జనకుఁడు !" అని యఱచిరి.

గుళ్నేరు జనకునిపైఁ గత్తి దూయఁజాలను."

తటిల్లతసన్నిభమగు పాషా దీర్ఘకరవాలము మెల్లగ దిగిపోయెను. ఆ వీరపుంగవునకు ధైర్యము కడు ప్రేమాస్పదమై యుండెను. పరమ శత్రువైనను ధైర్యము ప్రదర్శించునేని, పాషాతప్పక కొనియాడును. కావున, నాతఁడింకను గఠినాగ్రహపూరిత వీక్షణుండయ్యు, దన కెట్టెదుట నున్న ధీరస్వాంతుని వదనముపైఁ గొన్ని నిమిసములు దృష్టి నిల్పెను. అంత నాకస్మికముగఁ గృతనిశ్చయుఁడై "పట్టి బంధింపుఁడు!" అని యాతఁడు గొబ్బున నాజ్ఞాపించెను.

ఆ క్షణముననే, యానల్గని యార్గురు బానిసలును గ్రీకుయువకునిఁ జుట్టిరి. లూకాసు వారింపఁ బ్రయత్నింప కూరకుండెను. పాషా కను సన్నఁ గాంచి, యా సేవకు లా యువకుఁడు ధరించిన రత్నంపుబాకు లను దీసికొని యాతని ముందునకు నడిపించిరి. దాల్తబను పాషా ఖడ్గపాణియై యా రెండవమందిరము ప్రవేశించెను.

జనకునిఁ గాంచినంతనే, తెరజాగుళ్నేరు లక్ష్యంత భయాతురమున నాతని చరణములపై రయమునవ్రాలి, విషణ్ణహృదయలై, దురంత దుఃఖితస్వాంతలై, రక్షింపుమని యతిదైన్యముగఁ బ్రార్థించిరి. ఖలీలు భుజదండమున గంటియున్న మనోహర హిమవల్లరి జులే ఖాయును అత్యంత కుపితస్వాంతుఁడగు మామను వినయ వినమి తోత్తమాంగయై మానముద్రాభిముద్రితయై చారుతరనయనేందీవర దళవినిర్గళిత వీక్షణజాలముచే నర్థించెను.

ఆప్రణయినీ ప్రణయుల నొక్కసారి కలయఁజూచి, "వీరిని నిరా యుధుల నొనరింపుఁడు" అని పాషా జలధరగంభీరధ్వానమున దన సేవకుల నాజ్ఞాపించెను.

ఖలీలుఁ డంత వినయగౌరవము లుట్టిపడ నిట్టులనెను—

"ప్రభుశేఖరా! అట్టి యవసరము లేదు. ఈ సమయమున నీ

యాజ్ఞ యమోఘము; నిరోధింపఁ గడంగువారము కాము, అన్యథా ప్రవర్తింపనేరము."

ఖలీలు విరమించినంతనే, జూలియనిట్లు లనెను.—

ప్రభువరా! అపరాధ మొనరించితిమి. తత్ఫల మనుభవింప మరణింప సంసిద్ధులమై యున్నవారము. మేమే నేరస్థులము!—"

ఆతఁ డట్లు పలుకుచుఁ దన ఖడ్గాది యస్త్రములం దీసి యాసేవకుల కొసంగెను. తురుష్క యువకుఁడు గూడ నట్లులే యొనరించెను. ఆతెఱంగున జూలియను పలుకుచుండఁగనే, పాషా పుత్రిక లేక కంఠమున, "మరణమా? వలదు, వలదు!" అని దుర్భరవిషాదానలతప్త చిత్తలై, భయాకులిత విస్ఫారితనయనలై; ప్రస్వేదకణముక్తాఫల విరాజితవదనలై యఱచి, దైన్యముడిగి, దిగ్గునలేచి, తమ తండ్రిని బ్రియులను వడివడి వీక్షింప గడంగిరి. జులేఖాయును లేచి తన ప్రియునిపై వినయ లజ్జాకాతర వీక్షణములఁ బఱపెను. అంత లూకాసు ఇట్టులనెను—

"ప్రభువరా! సావధానచిత్తుఁడవై నాకొకింత యవకాశ మొసంగెదేని, నీ యీ పుత్రికలు దోషరహితలనియు, మేమే యపరాధుల మనియు, మేమే శిక్షార్హులమనియు విశదీకరింపఁగలను."

రోషభీషణాకారుఁ డగు పాషా కఠినస్వరమున వల్లె యని పలుక, లూకాసు సహజనిశ్చలకంఠమున నిట్లు వాక్రుచ్చెను.

"ఆర్యవర్యా! మేము మువ్వురము సంపన్నగృహస్థుల పుత్రులము. యాత్రాపరులమై మొన్న మొన్ననే యీనగరరాజము ప్రవేశించితిమి. నగరసందర్శనాభిలాషచే నిందందు సంచరించి, యనంతరము జలవిహార మొనరింపవలయు ననెడు కుతూహల ముదయింప, నదీతీరమున కేగి, నౌకారోహణ మొనరించి, యీసుందరారామము గాంచితిమి. ద్వారము తెఱచి యుండుటచే—"

"ఏద్వారము?"

"తోఁటపునకు వెనుక నెచటనో యున్నది." అని లూకాను తెలిసియుఁ దెలియనట్లు యథాలాపముగా, నిశ్చలముగ బదులాడి యును జ్ఞాతుండై మగుడ నిట్లు చెప్పఁదొడఁగెను.—

"ఆరామ మతిమనోహరముగా నుండినట్లు చూచినంతనే గాన్పించెను. కావున, స్వతంత్రించి ప్రవేశించితిమి. వివృతద్వారము దృగ్గోచరమైనంతనే, ప్రస్తుత మీవనవాటిక విజనంబని భావించి; కౌతుకోత్సాహాక్రాంతమున నిటునటు సంచరించితిమి. వివిధవృక్షములును, అందము చందము తిలకించి, ప్రభువర్యా! నీయుద్యానవని నంతయు గొనియాడితిమి. కొంతకాలమునకు అలసి దాహార్తులమై, సలిల మెట్లు లభించునా, అంతఃపురద్వార మెట్లు వచ్చునగునో యని చింతింపుచుండ, దెఱచియున్న మందిరద్వార మొకటి నయనపథమునం బడెను."

"ఏద్వారము?" అని కఠిన నిరాదరణస్వరమున పాషా ప్రశ్నింప, నిట్లు లూకాను బదులాడెను.

"ప్రభువరా! ఈదీర్ఘమందిరశ్రేణి వెనుక నుండు ద్వారము"

"కానిమ్ము!" అని కఠిన నిష్ఠురస్వరమున పాషా పలికెను. లూకాను ఇట్లు చెప్పఁదొడంగెను.

"యదార్థ మెఱింగింపవలయు, మా మిత్రుడగు నీ తురుష్కయువకుఁడు అనాహూయమానముగ మందిరప్రవేశ మొనరింప రాదని సమంజసముగా హెచ్చరించెను. అట్టి హితవచనము పెడచెవినిఁబెట్టి, సాహస మొనరించినవాఁడను నేనే. ఈయారామగృహము చొచ్చి దాహబాధానివారణార్థము నీరమడిగి, నాలుగు నిముసము లిందు విశ్రమించిన నేమిప్రమాదమని యోచించి, కృతనిశ్చయుఁడనై, నేనును నాయకత్వము వహింప, నామిత్రులు వైమనస్య

లయ్యె నన్ననుగమించిరి. ఈ నగర జనచిత్తసంక్షోభ మొనరించు భయంకరహత్యావ్యాపారపరంపర నాలించియుండుటచే, నొంటొరుల నెడబాయరాదని మేము మువ్వురము నేర్పఱచికొని యుంటిమి. కావున, నా మిత్రులు నన్ను వీడిపోఁజాలరైరి.”

ఆ నుడు లాలించినంతనే, ఆ యువతీమణుల శరీరము లొక్కసారి కంపించెను. అందు ముఖ్యముగా, జులేఖా గాఢతరప్రకంపితగాత్రయై, నిలువఁజాలక, అవలంబము నాచ్ఛాదించు మనోహరపుష్పవల్లరివలె, మగుడ ఖలీలు భుజము నాశ్రయించెను. కాని, నితాంతకుపితస్వాంతుఁడై యున్న పాషా నిజహస్తచాలనమున నాజ్ఞాపింప, నా కుసుమకోమలిని నిరావలంబ కావలసివచ్చెను. అనంతరసమాచారము నివేదింపవలయునని పాషా కోరెను: లూకానుమగుడ నిట్లుపలికెను—

“ఇఁక నెంతయో లేదు. ఈభవనము ప్రవేశించితిమి: సోపానపరంపర నారోహించితిమి: మాకంటికి గోచరమైన మొదటి ద్వారమున బిలిచితిమి: ఎవ్వరుఁ బలుకలేదు: మేమంతట తెగువచేసి—నేనే యని నాయభిప్రాయము—యాతలుపు తెఱచుకొని మందిరప్రవేశ మొనరించితిని. నామిత్రులు నావెంట నరుదెంచిరి. అందు సుఖాసీనులైయున్న యీ మానవతులు మమ్ము నాకస్మికముగాఁ గాంచి భీతచేతస్కలై కెవ్వున నఱచి, మానవతీసహజధైర్యమూని, తోడనే యావలకుఁ బోవలయునని మమ్ముల నాజ్ఞాపించిరి. కాని, ప్రభువర్యా! యపూర్వరూపవైభవమున నలరారు ఈజవరాండ్రం గాంచి, బద్ధేంద్రియులమై, వివేకరహితులమై, వెడలఁజాలక అట్టె నిలిచిపోతిమి. మాప్రవర్తన మసమంజసము, సాహసికము, దౌర్జన్యపూరితమనియు నేను దప్పక యంగీకరింతును. సాధ్వసాగ్రహములు రెండును నిరర్థకము లగుటచే, మామధురోపలాలితవాక్యప్రతివాక్యబద్ధలై, యీ సుందరాంగు లియ్యకొనిరి. మే మెల్లరము ప్రణయ

ముగ్ధులమైతిమి. మాహృదయముల నీరమణీమణుల కర్పించివైచితిమి. పూజ్యులగువారి జనకుల నర్థించి యనుజ్ఞవడసి పాణిగ్రహణ మొనరింప నాసించియున్నవారము. మేము పరస్పర సంభాషణంబుల మునింగియుండ, నీ వరుదెంచితివి. ప్రభువర్యా! ఇయ్యదె మా సమాచారము."

పాషా గాఢతీవ్రాలోచనాపరుఁడాయెను. ఆతని నిశ్చలగంభీర వదనముఁగాంచి యాతని హృదయ మరయుట కష్టసాధ్యము. ఐనను, చక్కఁగఁ బరిశీలింతుమేని, గ్రీకు యువకుఁడు లూకాను తెలిపిన కథ యందలి సత్యాసత్యముల విమర్శించుచుండినట్లు స్ఫురింపఁగలదు. వధూమణులు దుర్భరడోలాయమానమానసలై యుండిరి. అందు తైరజాగుల్నేరుల యవస్థ మఱియు దుస్సహముగ నుండెను. అట్టి విషమావస్థం జిక్కియు, నాజవ్వనులు లూకాను హృదయయౌదార్య మును లోలోన నుగ్గడించిరి. ఆహా! ఆ గ్రీకు యువకుని ప్రవర్తన మెంత శ్లాఘనీయముగ నుండెను! పాషాపుత్రికలకును, దన మిత్రులకును, ఎట్టి యపాయము వొరయకుండ, నేరము నంతయుఁ దన మీఁదనే వైచికొనెను! తాను సమిత్రముగా నొనరించిన యసంగత కృత్యమునకుఁ దానొక్కఁడే బాధ్యత వహించెను! దుర్వారమగు పాషాభయంకరాగ్రహదావానలమునఁ బడి మ్రగ్గుటకైనను, ఆ ధైర్య శాలి, ఆ స్థిర చిత్తుఁడు, ఆ స్వార్థత్యాగి, అ య్యసాధారణోదారస్వభావుఁడు సంసిద్ధుఁడాయెను! ఖలీలు జూలియను లాతని నచ్ఛలముఁ గాంచి విస్మయ విభ్రమ పరవశులైరి.

నిబిడకుటిలకుంతలనికరవిరాజితాననుఁడగు లూకానుపై దృష్టి నిల్పి "ఓయీ! నీవెవ్వఁడవు!" అని కఠినముగ పాషాప్రశ్నించెను.

"ప్రభువరా! నన్ను 'లూకాను వాశిలో' యని పిలుతురు. లోకైక సార్వభౌములగు సుల్తానువారి ప్రజాళిలో నే నొక్కఁడను. నాజనకుఁడు

ఆర్మీనియా రాష్ట్రమునందలి తన భూవసతి ననుభవించు సంపన్న గృహస్థుడు."

అంతట నా పాషా రెండవ గ్రీకు యువకునిఁగాంచి, నీవెవ్వఁడవని ప్రశ్నింప, నాతఁడిట్లు విన్నవించెను.—

"నా నామధేయము 'జూలియను మెలీడా'. మా నివాసస్థానము 'లెమ్నాసు' అనుద్వీపము. అచ్చటి వర్తకులలో నాజనకుఁడు మిక్కిలి ధనవంతుఁడు. నేనును లోకైక సార్వభౌములగు మూడవ సలీము పాదుషావారి ప్రజాకోటిలోనివాఁడను."

దానిబను పాషా యంతట తురుష్క యువకునిఁగాంచి ప్రశ్నింప. నాతఁడిట్టులనెను.—

"నాయభిధేయము ఖలీలు ఉస్మాను నాతండ్రి 'కార్మేనియా' రాష్ట్రమునందలి యమితాధికారయుత సంపన్నులగు సరదారులలో నొకఁడు. ఆ పుణ్యాత్ముఁడు పుణ్యలోకమున కేగుటచే, నాభాగ్యము నాయధీనమాయెను. దేశాటన మొనరించుచు నీనగరము కేతెంచితి. మదీయవంశ గౌరవ ధనసంపద లహీనములగుటచే, మనోహరాకార యగు భవదీయసోదరి పుత్రిక జులేఖాను, జెట్టఁబట్ట నాసించి యున్న వాఁడను. నామిత్రులవలె నేనును లోకపాలకులగు సలీము పాదుషా వారి ప్రజాకోటిలోని వాఁడనేయని వేఱుగఁ జెప్పనవసరములేదు గదా."

తురుష్క యువకుని వచనరచనాధురంధరత్వము నిశ్చలాత్మవిశ్వాసపూరితమై యుండెను. జులేఖా సంతసనంభ్రమలజ్జారసరంజితానన యై, యీ పలుకుల నాలించెను. పాషా మగుడఁ గొంత తడ వాలోచనానిమగ్నుఁ డాయెను. ఆతఁ డొక్కసారి ప్రకంపితుఁ డాయెను. కాని, అన్యులు కనిపట్టరాని యట్టులు సహజగాంభీర్యము వహించి, యాతఁడు తన ప్రథమపుత్రికయగు గుల్నేరుంగాంచి సన్న

యొనరించినంతనే, యిరువురు బానిసలా కోమలాంగిని అల్లనబట్టిరి. అయ్యబలామణి భయవిభ్రమేక్షణయై, యనదవిధమున “తండ్రీ! ఏమి చేయింతువు?” అని దైన్యముగ బ్రశ్నించెను. ఆ హరిణేక్షణ భయ చంచలవీక్షణములు జనకుని వీడి తన ప్రియునిపై నిలిచెను.

“ప్రభువరా! కరములు ముకుళించి మ్రొక్కెద. పిడుగువంటి నీ యాగ్రహము నన్నే దాకుఁగాక!” అని లూకాను ప్రార్థించెను.

“ఓ తండ్రీ! క్షమింపుము—నా యక్కను క్షమింపుము! రక్షింపుము!” అని తెరజా దురంతభయాక్రాంతచిత్తయై యఱచెను.

“మామా! శాంతింపుము. క్రోధోన్మత్తుఁడవై యిట్టి దారుణ మొనరింతువేని, నీ చిత్తమున కిఁక శాంతి చిక్కదు.” అని పిసీలా యతనేత్రయగు జులేఖా దైన్యవిస్పష్టస్వరమున హితము కఱపెను.

జూలియను గూడ దదుచితగతిఁ బలికెను. ఖలీలుఁ సహితము భాషింపఁబోయెను. కాని, అంతలో దాల్తబన్ను పాషా యహంకార పూరితుఁడై, మాటాడవలదని చేయి విదళించి, కఠినస్వరమున గంభీరముగ నిట్టులనెను—

“గమనింపుఁడు. శాంతి వహించి మీ పలుకుల నెల్ల నాలించితి. మీ రిఁక సావధానమనస్కులై మదీయవచనములు వినుఁడు. పవిత్రవంతమగు నా యంతిపురంబు కాని తెఱంగునఁ బ్రవేశించి, నా కెంతయో యవమానము ఘటిల్లఁజేసిరి. ఉపేక్షింపరాని మహాపరాధము మీ రొనరించిరి. మీ ప్రవర్తనము తప్పక దండనార్హము. ఓయీ లూకాసూ! నీవే ప్రధాన నేరస్థుఁడవని నీవే యంగీకరించి యుంటివి. నీ పలుకులు నిక్కములగునేని—నిక్కమనియే నేను విశ్వసింపవలయును—నీ ప్రోత్సాహముచేతనే నీ మిత్రులు నీ వెంట నరుదెంచిరి. కావున, నా యాగ్రహభారము నీవే భరింపవలయు.”

“ప్రభువరా! సంతోషపూర్వకముగా భరియింతును. ఈ తక్షం

గల వారి నందఱను క్షమియింతువేని, ఎంతటి కఠినశిక్షకైనఁ బాల గుదును." అని లూకాసు నిబ్బరముగఁ బలికెను. దుర్భరబాధితాత్మయై, దాసజనమధ్యస్థయై యున్న భాగ్యహీనురాలు గుల్నేరు నునుజెక్కుల బాష్పవారి ప్రవహింప, "తండ్రీ! తండ్రీ!" యని విలపించెను. పాషా యిట్లు లనెను.—

"మిగిలిన వారి నందఱిని క్షమియింతును. కాని, ఓసీ! దుష్టాత్మ నిన్నుఁ బూర్తిగ విడిచివేయరాదు. మువ్వురలోఁ బెద్దదానవు, పిన్నవయస్కులగు నీ సోదరికిని, తత్సామ్యయగు టాత్మీయురాలకును బుద్ధి కఱపవలసిన దానవు, నీ వెంత గర్వితముగ సంచరించితివి! ఈ యాగంతకులఁ గాంచినంతనే, మన సేవకులను నీవ చీరవలయును. జనానా పవిత్రతకు భంగ మాపాదించిన యీ చెనటులను బంధించి యుంచుభారము నీయది. కాని, నీ నే మొనరించితివి? పురుషుల నిందుండ నిచ్చితివి! వారిటఁ దడయునట్లు ప్రోత్సాహపఱచియు నుంటివి! అన్యథా యెట్లు భావింపనగును? ఆఁ! నే నేతెంచినపుడు మీవదనములనాచ్ఛాదితములై యుండెగదా? అన్యపురుషుల దుష్టవీక్షణపాతము కాకుండ, వనితాజనంబుల వదనములు మేలుముసుంగుల మఱుంగున నుండవలయునని యుద్ఘోషించు పవిత్రమహమ్మదీయసూత్రములను మంటఁగలిపితివే! గుల్నేర్! నీ ప్రవర్తన మత్యంతదోషభూయిష్ఠము, దండనీయము. ఈ గ్రీకు యువకుఁడు తన మిత్రుల నేరము సహితము తానే ధరించి, యాత్మసమర్పణ మొనరింప సంసిద్ధుఁ డాయెను. అట్టులే, నీవును నీ యపరాధమునకే గాక, ఈ బాలికల వంతుగూడ పరిహార మనుభవింపవలయును."

లూకాసు ఉద్విగ్నహృదయుఁడై, స్వరముకంపింప, నిట్టులనెను—

"ప్రభువరా! అందఱిని క్షమింతునని బాసచేసియుంటివే! ఇపుడు—"

"విరుద్ధముగా నాచరింపను. నాపుత్రికను సంహరింతునని తలంపకుము. తానొనరించిన యవివేకమునకు ఫలమనుభవింపవలయు: ఇంక నెన్నఁడిట్టి ప్రవర్తనమునకుఁ గడంగరాదు. కావున, నీ మరణము నీ కాంత వీక్షింపవలయు."

ములుకులవంటి యాపలుకులు వినఁబడినంతనే, యా నిర్భాగ్యురాలు గాఢతమోంధకార నిర్మగ్నయై, హృదయము విహ్వలింప, దురంతభయాతిరేకమున, కెవ్వున నఱచెను. పరిచారకు లామెను గట్టిగఁబట్టియుండిరి, లేనియెడల, నిజజనకుని పాదములపై నామె వ్రాలవలసినదే. తనసోదరి విపరీతదురవస్థఁగాంచి, జైరజా నిజహృదయపరితాపము భరింపఁజాలక తాఁగూర్చుండిన సోఫాపై వ్రాలెను. జులేఖా విస్మయభయాతురయయ్యు, ధైర్యమువీడక, తురుష్కయువకుఁడు ఖలీలు రక్షింప సమర్థుఁడని విశ్వసించి కాఁబోలు, తదభిప్రాయసూచకముగా నాతనిఁ దిలకించెను. ఖలీలు తోడనే ఒక యడుగు ముందువైచి, వినయ గాంభీర్యము లుట్టిపడ నిట్టులనెను:—

"ప్రభువర్యా! నామిత్రుఁడు విగతజీవుఁడు కావలయుననియే నీవు కృతనిశ్చయుఁడవై యుంటివేని, నామనవి చెల్లింపుము. మంద, భాగ్యుఁడగు నామిత్రు నొక్కసారి యాలింగన మొనరించి యొకింత ధైర్యము కలుగుట కనుజ్ఞ దయచేయుము."

"నిరాకరింపఁజాలను. కాని, ఆలసింపరాదు; ఈరంగ మింతటితో ముగియవలయు."

దార్తబను పాషా యట్లు పలికి కను సన్నచేయ బానిసలు లూకాసును వీడి కొంత దవ్వునకుఁ బోయిరి. అంత ఖలీలు పాషా భయంకర దురాగ్రహమునకు గుఱియైన తన మిత్రుని డాసెను. సమీపించు నపుడే రయమునఁ దన వ్రేలినుండి తీసిన యంగుళీయము జేతఁబూని, మిత్రుని కంఠము నాలింగన మొనరించి యిట్లు

గుసగుసలాడెను:—

"మిత్రమా! భయము వలదు! పాషా చర్య నాకు మిథ్యగాఁ దోఁచెడిని. నిన్ను భయవిహ్వలు నొనరించి యనంతరము క్షమించు ననియే భావింతును. ఒకవేళ పాషా కృతనిశ్చయుఁడై యుండునేని, ప్రాణాపహరణమే యాతని నిరూఢాభిప్రాయమగునేని, ఇఁక గత్యం తరము లేకుండునేని—భద్రము! అట్టి యవస్థ కలుగునపుడు గాని వలదు సుమా!—ఈ యుంగరము ప్రదర్శింపుము; నే నొసంగితినని వచింపుము; తత్ప్రభావము విశ్వసింతుము."

నిజ మిత్రబంధు జనబృందంబుల వీడి, యన్యలోక ప్రయాణో న్ముఖుఁడై, దుర్భరవిషాదానలతప్తచిత్తుఁడై యున్న లూకాసును ఖలీలుఁడు ధైర్యధుర్యు నొనరింపఁ గడంగుచుండెననియే యెల్లరు సహజముగ భావించిరి. జులేఖా మాత్ర మట్టి విభ్రమమునకు లోఁబ డక, తన ప్రియుని చర్య యనిమిషనేత్రయై యరయుచుండెను. ఖలీలు తన ముద్దుటుంగరమును నిగూఢముగఁ దీయుటయు, తన మిత్రు నాలింగన మొనరించు నెపంబున నాతని కరమున కందించు టయు నాసూక్ష్మగ్రాహిణి కనిపట్టెను. కావున, ఆగ్రీకు యువకుఁడు విముక్తుఁడు కావచ్చునని ఆకన్నియ సహజముగ భావించియుండును.

రెండవ గ్రీకుయువకుఁడు జూలియను కూడ పాషా యనుజ్ఞవడసి దుర్భర విషాదవిచ్ఛిన్నహృదయుఁడై తనమిత్రు నాలింగన మొనరిం చెను. అయ్యదే కడసారి స్పర్శనమని భావించి జూలియను బెగడు వడియుండ, లూకాసు మెల్లగ నిట్టులనెను—

"మిత్రమా! మనోవికారములమఱుగుపఱచి నిశ్చలవదనుఁడవు కమ్ము!—ఆశారహితుఁడఁగాను! మఱలఁ గలసికొందుమని విశ్వ సింపుము."

"పరమాత్మునకు వందనములు! మిత్రమా! నీ యౌదార్యము

నీ త్యాగశీలము కేవలము నిరుపమానములు!—" అని తన మిత్రుని వీఁపుల వడివడిఁ బలుకుచు సముందానందాతిశయమున నాతని జూలియను గాఢాలింగన మొనరించెను. ఇఁక మృత్యువువాతఁ బడనుండిన మిత్రు నాతెఱంగున నాలింగన మొనరించుట మానవ స్వభావమని పాషా భావించి, "వీనినిఁకఁ గొనిపొండు!" అని తన సేవకుల నాజ్ఞాపించి, యంతకంటె నెక్కుడు కరుణాసమానములఁ జూపఁజాల ననుభావము ప్రకటితము కావలయునో యన నొక్కసారి యా నేరస్థులఁ గలయఁజూచి వెనుదిరిగెను.

మన కథాసూత్రము ద్రెంపి, ఇట్టి భయానక విచిత్రసంఘట్టనమునకుఁ గారణభూతముగు సమీనాను గమనింపవలయును. ఆ తారువు గత్తెయవస్థ కడు దుర్భరముగనుండెను. తన వినయము బయల్పడునేమో, దానఁ దన కెట్టి యపాయము సంభవించునో యని కడు గలవరమంది, యా జరఠాంగన మొదటిమందిరమునఁ బొంచుండి, రెండవగదియందలి కథాక్రమము తత్తరపాటుతో గమనించుచుండెను. గుణవంతుఁడగు లూకాను కల్పించినకథ నాలించినంతనే, యమ్మగువ హృదయభార మడంగెను. అందుఁ దన ప్రశంసయే లేకుండుటచే, పోయినప్రాణ మామెకు మఱల నలవడెను. ఇంకను ఆలసించినచో నేమి ప్రమాదము వాటిల్లునో, ఏ క్షణమున పాషా యరుదెంచునోయని వెఱచి, ఆ పరిచారిక రయమునఁ బాఱి, తన యేలికసానియగు ఇస్మలిడా మందిరము చొచ్చెను.

పాషాయొక్క నల్లనిబానిసలు లూకాను గుల్నేరులను ఆవలకు నడిపించికొనిపోయిరి. ఖాలీలు జూలియనులు తనవెంట నరుదేర, పాషా వారిని వెంబడించెను. ఆగ్రహధురీణుఁడగు నా పాషా వారి నంటియేయున్నను, అట్టులే సందుచేసికొని, ఖలీలుఁడు నిజమునో హారిణియగు జులేఖా వీనుల నేమియోపలికి, మధురప్రణయపూరిత

పితృణము నా యన్నమిన్నపైఁ బలికెను. జూలియను కూడ నిజ ప్రియాంగన సౌక్యసారి ప్రణయముగ్ధుఁడై తిలకించెను. వారందఱు నావలి కేగినంతనే, యా ద్వారము గడియపడెను. జులేఖా తోడనే తైరజాను ఆలింగన మొనరించి, “సోదరీ! భయాతురవై విలపింపకుము. నీ సోదరికిఁ బ్రమాదము వాటిల్లనేరదు! నా వచనముల విశ్వసింపుము!” అని పలికెను.

“విశ్వాసమా! జులేఖా! ఏమంటివి? నా సోదరి జీవించియుండు గదా!” యని తైరజా యాకస్మికసంజనితానందపరవశయై ప్రఫుల్ల వదనయై, సంశయబాధితాత్మయునై వడివడి నఱచెను. ఇందీవరాక్షి జులేఖా యిట్లు బదులాడెను—

“మన సోదరి గుల్నేరు నిజమనోకాంతుని సుస్మరణము కాంచు దురవస్థకుఁ బాలుకాదని యెఱుంగుము. లూకాను మరణింపఁడు.”

“ఎంతటి యదృష్టము! కాని, ఎట్లు—”

ఆ తెఱంగునఁ జెంతత్తరమునఁ బ్రశ్నించు జులేఖాను వారించి తైరజా యిట్లనెను—

“సఖీ! నా పలుకులు విశ్వసించి వెఱపుడిగియుండుము. ఖలీలు లూకానున కొక యుంగర మొసంగెను. సర్వభయనివారిణియగు నా రక్షప్రభావముచే లూకానున కెట్టియాపదయైనను పొరయనేరదు!”

## ౫

### రక్ష

దాట్లబను పాషా సపరివారముగా సోపానపరంపరావరోహణ మొనరించెను. ప్రాంగణము ప్రవేశించినంతనే జూలియను ఖలీలులఁ గాంచి “ఇటు రండ”ని యాతఁడు పలికెను.

పాషా యంతఁ దన చెంతనున్న తాళము తీసి యొక యంతర్ద్వారము తెఱచెను. యువజనమధ్యస్థుఁడై యాతఁ డందుఁ బ్రవేశించి యిట్లు లనెను—

"నేఁ దిరిగి యరుదెంచువఱకు, మీ రిం దుండవలయు. గభీరజాన్వర నదిలో యమున మీ సహచరవిద్రోహి మరణించిన సమాచార మెఱుకపఱచి, ప్రాణములపైఁ దీపు కలదేని మీరు మఱి యెన్నఁడీ శుద్ధాంతసదనమునఁ జొరఁబడు దురాచార మొనరింపకుందునట్లు కొంచెము హితము కఱపి, మిమ్ముఁ బోనిత్తును. మదీయపరిచారకులు విచ్చుకత్తులఁ బూని కావలియుందురు. కావున, ఈ లోనఁ దప్పించుకొని పలాయన మొనరించుటకుఁ బ్రయత్నింపకుఁడు."

పాషా కఠినగాంభీర్యధుర్యుఁడై యట్లు పలికి యా తలుపునకు బీగమువైచి తన దారిఁ బోయెను. ఆతఁడు వెడలినంతనే, తన మిత్రునితో జూలియను ఇట్లు లనెను—

"ఖలీలు మిత్రమా! నీ యభిప్రాయమేమి? ఈ పాషా ద్రోహబుద్ధియై మనల నిందు బంధించి యుండునా?"

"నే నట్లు భావింపను."

"లూకాను నీ కర్ణమున నేమైనఁ జెప్పెనా? తాను జీవించియుండు నవకాశ మున్నదని పలికెనా?"

"మిత్రమా! నేనే అట్టి యాశ కల్పించితిని."

జూలియను సహజముగా విస్మయపరవశుఁ డాయెను—"నీవా! ఖలీల్! నావలె నీవును బంధితుఁడవు. ఇందుండి—"

తన మిత్రుని వారించి వినయనిశ్చల గంభీరస్వరమున ఖలీ లిట్లు లనెను—

"మిత్రమా! హృదయావేగముఁ దక్కి యుండుము. మన యనుచరుఁ డెంత శ్లాఘనీయముగ మెలంగెను! అట్టి స్వార్థత్యాగిని, అట్టి

పరిశుద్ధయశోభాసురుని రక్షింప సమర్థుఁడనై యుండ—"

జూలియను విస్మయాతురపరుఁడై పట్టఁజాలక "నీకుఁ గల సామర్థ్యమెద్ది ?" యని రయమునఁ బ్రశ్నించెను. ఖలీ లిట్లు పలికెను—

"అట్టి సామర్థ్య మొక యుంగరమునఁ గలదు. అద్దానిని మీరెవ్వరుఁ గాంచకుండ మన మిత్రుని కొసంగితిని. తన్ముద్రికాధరుఁడు నిశ్చయముగా సురక్షితముగా నుండునని విశ్వసింపుము, చాలును."

ఆ మిత్రద్వయ మట్లు పరస్పరసంభాషణానిమగ్నులై యుండ, పాషా తన సేవకులను గలసికొనెను. అన్యోన్యప్రేమానుబద్ధులగు లూకాసు గుల్నేరుల రెక్కల విఱిచి కట్టవలయునని పాషా కఠినముగ నాజ్ఞాపించుటచే, నాతని దాసులగు కొజ్జాలు వెంటనే యటు లొనరించిరి. ఇరువురు కొజ్జాలు వారి వెనువెంట నుండిరి. మిగిలిన నలుగురును తళతళ మెఱయు కరవాలములఁ బూని జూలియను ఖలీలులు బంధితులై యుండిన గదిముంగట నప్రమత్తతోఁ గావుండిరి. దాల్టబను పాషా విచ్చుకత్తి చేఁబూని, లూకాసు గుల్నేరులు పరస్పరసంభాషణ మొనరింపకుండ వారి నడుమ నుండెను. గ్రీకు యువకు నొక భటుఁడు గట్టిగఁ బట్టియుండెను. రెండవవాఁడు గుల్నేరు సమీపముననే నడుచుచుండెను. ఆ యబల యవస్థ కడుంగడు దుస్సహముగ నుండెను. పాప మామందభాగ్యురాలు లూకాసు ఖలీలుల పరస్పరాలింగనావసర రహస్యసంభాషణము నెఱుంగదు. తద్రహస్య మెఱింగించి నిజమనోకాంతచిత్తదావానలముఁ జల్లార్ప జాలుట కా యువకున కింకను అవకాశము చిక్కదాయెను. కాన నా ముద్దియ మానసము వర్ణింపరాని తెఱంగున దహించికొని పోవుచుండెను.

వా రట్టులా యారామసీమ నతిక్రమించి సోపానపరంపర డిగ్గి, నా కారాశ్రయస్థానము చేరిరి. అంతదనుక నా భాగ్యహీనురాలు గుల్నేరు నిరావలంబయై యెట్టులెట్టులో నడవఁజాలెను. విపరీత

భయాతిరేకమున నాకాంత బద్ధేంద్రియయై, తనకుఁ బ్రాపించిన మహాసంకటము తలంపనేరక, కీలుబొమ్మవలె నడచుచుండెను. కాదేని, యాజవ్వని విచ్ఛిన్నహృదయయై, నిజమనోనాథుని రక్షింప వలయునని గోలుగోలున విలపించియుండును. తా నొక యతిభయంకర స్వప్నమునఁ బ్రయాణ మొనరించుచుండినటు లుండెను. కాని, సాంద్రతర వృక్షచ్ఛాయనుండి వెలువడి, సోపానముల సమీపించి, నీటి కలకలధ్వని వీనుల సోకినంతనే, యాభ్రాంతియంతయుఁ దొలంగెను. అనతిదూరమున నున్న గభీరభాస్వరనదీ జలగర్భమున నిజ మనోకాంతుఁడు తనకు వెలియై చిరావాస మొనరింప నుండిన దారుణవిషయమామె స్మృతిపథమున మెఱుపు మెఱసిన చందమున గోచరించెను. గుల్నేరుతోడనే చైతన్యవిహీనయై పట్టు వీడిన రంభాస్తంభమువలె నేలఁ గూలఁబోయెను. ఆ చెంత నున్న భటుఁడు తత్ప్రమాదము వాటిల్లకుండ నారమణీరత్నమును నిజ దీర్ఘబాహుయుగ్మమునఁ బట్టెను.

గుల్నేరు సంస్మృతయై కనువిచ్చి పరికించు సరికి, మేఘరహితమై వినిర్మలమై, నక్షత్రప్రభా భాసితంబై యొప్పు గగనమండలము దృగ్గోచరమాయెను. తోడనే తన దుస్సహ దురవస్థ పెను భూతమువలెఁ దలంపునకు వచ్చెను. ఆమె పడవయం దాసీనయైయుండెను. ఆ కుసుమగాత్రి కోమల కరపల్లవము లింకను పాశబద్ధములై యుండెను. ప్రాణప్రియుఁ డామె ప్రక్కనే కఠినపాశబద్ధుఁడై యుండెను. భటులు నౌకాదండములు చేఁబూని యానకార్య పరతంత్రులై యుండిరి.

దాల్బను పాషా ధవళరజతకాంతి సముజ్జ్వలిత కరవాలము చేఁబూని నడిమధ్యస్థాణువువలె నాసీనుఁడై యుండెను. నావ విశాల నదీజల మధ్యమున నుండెను.

తదవసర ప్రకృతి సౌందర్యము అసామాన్య వైభవోపేతమై

యుండెను. భాసురహిశాలనదీ దర్పణమున బ్రతిబింబించు వప్రసౌధ దేవళాద్యనేక నగరభాగ నికలములు వర్ణనాతీతముగ భాసిల్లుచుండెను. కాని ప్రాణాధికప్రియతమ ఘోరదుర్మరణావసరమున భీకర నిరాశాబాధితయగు కామినీమణికిఁ బ్రకృతి సౌందర్యవైభవముతోఁ బనియేమి ?

కఠిన పాషాణహృదయమునైనఁ గరగింపజాలు తెఱంగున నామె దీనాతిదీనావనతాననయై, వివర్ణవదనయై, యశ్రుజలార్ద్రనయనయై, దుర్భరవిషాదావరుద్ధకంఠయై, "జనకా! హా! జనకా! రక్షింపుము! ఆయువకుని విడుము. భరింపఁజాల! చూచి యెట్లు సహించుదాన ? నా ప్రాణముతోడనే యంతరించును. తండ్రీ! సలిచియున్నను, ఉన్మాదినినై పోదు—" నని విలపించెను.

"పాపాత్మురాలా ! నోరు మూయుము ! నీ ప్రియుని పని సరి, మరణింపక తీఱదు ! "

విభీతహరిణశాబకముఁ గాంచి గర్జించెడు వ్యాఘ్రమువలె భయానకస్వనమున బలుకు నా పాషాతో లూకా సిట్టు లనెను.—

"ప్రభువరా! నా ప్రాణమునకై యర్థించువాఁడఁగాను: నీ పుత్రిక కొఱకైన ననుకంప వహింపవలయునని ప్రార్థించెద. పవిత్రమహమ్మదీయ సాంప్రదాయమునకు మదవివేకప్రవర్తనముచే భంగముఁ కలిగించితిననియు, నా కారణమున నా తనువు నీక్రోధాగ్నికింధనము కానోవుననియు నెఱుంగుదు. ఐనను, కరుణాసర్వరసప్రధానము, అఖిలమానవ గుణోత్కృష్టము. వధ్యుఁడగువానిని క్షమించితినని నీవే మున్ముందు అనిర్వాచ్యానంద మనుభవింపగలవు. ఆర్యా ! దయామయుఁడవై ప్రాణదాన మొనరింపుము, ఈ నగరమున కెన్నఁడు నరుదెఱక అతదూరదేశమున నుందునని ప్రమాణ మాచరింతును."

పాషా యిట్లుబదులాడెను.—

*

"నీ నను లాలించితివి, కాని నీమనవి చెల్లింపనేరను. కొన్ని యవసరములందు కరుణాగుణము గొప్పదోషమగును. ఈ యవసరమట్టిది. చావు తప్పదు. నీజీవితమింక నాలుగైదు నిముసములతో సరి. కాలయాపన మొనరింపక, నీమతానుసరముగా దైవమున కంత్య ప్రార్థనము సమర్పించుకొనుము."

అట్లు పరుషముగఁ బలికిన దాల్భను పాషా క్రోధఘూర్ణిత వదనుఁడై కనుసన్న చేయు, నొక ఖొజ్జా తన చేతనున్న తెల్లసటుంచి వంగి యొక గోనెసంచి తీసెను. అసంచిం గాంచినంతనే, గుల్నేరు శరీర మొక్కసారి జల్లుమనెను. భయాతిరేకమున నామెహృదయము తటతట కొట్టుకొనెను. ఆ భటుఁడు సంచినుడత విప్పుచుండగనే, యా కోమలిప్రాణము లెగిరిపోయెను. కెవ్వన నఱచి, పట్టుతప్పిన కుందనపు విగ్రహమువలె నేలఁ గూలఁబోయిన యక్కాంత శ్రవణ పుటమున లూకాసు రయమున నిట్లు పలికెను—"ప్రేయసీ! భయముడుగుము. నాకుఁ బ్రాణభయములేదు!"

అట్టి వాక్యామృతము కురియుటచే, పోయినప్రాణము గుల్నేరునకుఁ దిరిగివచ్చెను. అంతదనుక దుస్సహనిరాశాభయానకసాగరమున మునిఁగి యుండిన యా పడఁతి యమితానందపరవశత్వము నూయెను. కాని, తనప్రియుని కనుసన్న గాంచి యామె తదుద్రేకము నడంచి కొనెను. అంతట, లూకాను మఱియొకసారి పాషాను ప్రార్థించెను—"ప్రభువరా! ఇయ్యది నా కడసారిప్రార్థన, కృపాంబువులు కురిపింపుము!" కాని, ఆ పాషా రూక్షవీక్షణములఁ జఱచుఱ చూచి జలధరమువలె నిట్లు గర్జించెను—"నీవు మరణింపక తప్పదు! తప్పదు!"

"ప్రభువర్యా! తీవ్రపడకుము. కార్యముముంచినయనంతరము—"

"ఓయీ! వృథాయాసము వలదు. సంసిద్ధుఁడవుగమ్ము! ఇక మాటాడకుము!"

దాల్లబనుపాషా సూలేమానుగారి నట్టి ప్రేమతో నిజప్రాణావ హరణ మొనరింపఁ గృతనిశ్చయుఁడై యుండుటఁ గాంచి, లూకాను మరల నిట్టులనెను—

"ప్రభువర్యా! మఱియొక్క మాట. ఈ యుంగరము నొక్కసారి పరికింప వేడెదను."

ఆగ్రహానలతప్తుఁడై యున్న పాషా యా పలుకులకు విసుగు జెంది, కనలి "అదియేమి?" యని ప్రశ్నించెను.

"ఆర్యా! ఏమైనను, ఇఁకఁ జావనున్నవాని ఈ యంత్యప్రార్థన చెల్లింపవలదా?"

పాషా యంతట మిక్కిలి చీకాకుపడియు సమ్మతించి, గ్రీకు యువకుఁడు ధరించిన యుంగరము చూడఁబోయెను. లూకాను బాహువులు వెనుకకు విఱిచి కట్టఁబడియుండెగదా. కావున, పాషా వంగి చూడవలసినవాఁడాయెను. ఒకచేయి నడిమివ్రేలున నొక వజ్రపుటుంగరముండెను. రెండవచేతి నడిమివ్రేలున నుండినది యొక లాముద్రిక. అందొక బిందువు చక్కఁగఁ జెక్కఁబడియుండెను. ఆ బిందువుచుట్టు నెవ్వియో గుఱుతులుండెను. అట్టి రెండవయుంగ రము దృగ్గోచరమైనంతనే, పాషా యమిత విస్మయసంభ్రమాకులుఁడై, యదరి "అ!!" యని యఱచెను. ఆ యల్పవస్తుప్రభావ మవ్వాడు లూకానునకు వ్యక్తమాయెను. తన మిత్రుఁడగు ఖలీలు యొక్క యపారాభిమానసామర్థ్యముల కాతఁ డెంతయు సంతసించెను. ఒక సామాన్యపుటుంగరమునందంతటి ప్రభావముండుటయు, తనప్రాణ ప్రియుఁడు కరాళమృత్యుదాంష్ట్రలనుండి వెలువడు శుభసూచన గోచ రించుటయు గాంచి యా ప్రణయిని ప్రమోదవిస్మయసంభ్రమాకుల చిత్తయాయెను.

దాల్లబనుపాషా మరియొకసారి యా ముద్రికపై దృష్టినిల్పి,

రెవ్వారిని కడు సూక్ష్మముగాఁ బరిశీలించెను. [illegible] పాష మాత్రము విభ్రాంతచిత్తుఁడై, ఏమి భావింపవలయునో నిర్ణయింప నేరక, యిట్లు ప్రశ్నించెను—

“యువకుఁడా! నీ కీ ముద్రిక యెట్లు లభించెను?”

పాషాయొక్క తొంటి కాఠిన్యగాంభీర్యము లంతరించెను. లూకాను నిశ్చలస్వాంతుఁడై యిట్టులనెను—

“నామిత్రుఁడగు నా తురుష్క యువకుఁడు ఖలీలు ఉస్మాను నాకొసంగెను.”

పాషా విభ్రమనిశ్చేష్టితుఁడై, కొంతవడి యాలోచనాధీనుఁడై మగుడ నిట్టులనెను—

“యువకుఁడా! నిక్కము పలుకుము. ఈ ఖలీలుఁ డెవ్వఁడు? నీ వెందు కలిసికొంటివి? మీకు పరస్పరస్నేహ మెట్లు ఏర్పడెను? తెలుపను సమాచార మేమైన నున్నచో, మఱుగుపఱుపక సత్యము తెలుపుము.”

“ఆర్యా! ఏమియు నెఱుఁగను. నాలుగు గంటల క్రిందట నేనును నామిత్రుఁడు జూలియను గలసి యొకానొక కాఫీగృహమున నుండ, ఈతురుష్క యువకుఁడు ప్రవేశించెను. తోడనే పరస్పర సంభాషణాపరతంత్రులమై దృఢతమ స్నేహపాశబద్ధులమైతిమి. మాసమాచార మింతియ.”

పాషా మగుడ నాలోచనాధీనమనస్కుఁడై తుదకుఁ దన భటునిఁ గాంచి సన్న యొనరింప, వాఁ డాభావము నెఱింగి లూకానును పాశవిముక్తు నొనరించెను. స్వాతంత్ర్య మలవడినంతనే, ఆయువకుఁడు తన ప్రాణకాంతయగు గుల్నేరునకుఁ గూడ బంధవిమోచనము కల్గించెను. తీవ్రాలోచనా నిమగ్నుఁడైయున్న పాషా లూకాను చెయ్దము గమనించినట్లు కానరాదు. అతఁడు మగుడ నిట్లు

లికెను.

“ఓయీ! అనృతమాడి యాత్మద్రోహపాతకము నొడిగట్టికొనకుము. ఈఖలీలు గుఱించి మఱియేమియు నెఱుంగవా?”

ఆయుంగరము కారణమున దాల్చబడు పాపా యంతవిభ్రమచిత్తుడగుటఁ గాంచి లూకాసు సహిత మాశ్చర్యపరుఁ డాయెను. కాని నిజముగ నాతఁ డన్యమెఱుంగఁడు గదా. తోడనే పాపా ద్విగుణీకృతాందోళితమానసుఁ డాయెను. తన చెంత నొరులున్న సంగతి యెఱుంగక, ఆతఁ డీపగిది మందస్వరంబునఁ జింతించెను.—

“ఎంత విపరీతము! నేఁడు పరిస్థితులెంత వింత పరిణామము నొందెను! ఈ ఖలీలు డెవ్వఁడు? ఈ యుంగర మెట్లు సంపాదించె?—”

ఆ తెఱంగునఁ జింతాభరితాంతరంగుఁడై యున్న పాపాను వారించి లూకాసు ఇట్లు లనెను.—

“ఏమైనను, ప్రభువరా! నీ యాగ్రహము చల్లారెనని భావింతును. మదీయ ఘోరమరణ ప్రదర్శనముం గాంచు దురంత దౌర్భాగ్యము నీ పుత్రికారత్నమునకు—”

“తండ్రీ! ఎట్టి ప్రోద్బలముచేనైననేమి, నా ప్రాణము కంటెఁ బ్రియతర పదార్థమును రక్షించితివి. నీకిదె వందన సహస్రము.” అని యమితానందావరుద్ధకంఠయై పలుకుచు గుల్నేరు నిజ జనకుని పాదయుగళముపై వ్రాలెను.

పాపా ప్రయత్నము విఫలమాయెను. ఆరత్న—ఖలీలుఁ డొసంగిన యుంగరము—ప్రభావమెట్టిదో గాని యాతఁడు లూకానును వధింపనేరనివాఁ డాయెను. ఐనను, తాను సహజముగా క్షమాగుణమండితుండని ప్రకటింప నుద్దేశించి, గంభీరవదనుఁడై యాతఁ డిట్లు లనెను.

“మిమ్మిరువురను భయవిహ్వలుల నొనరించితిని. ఇఁక నెన్నఁ

డిట్టి దుర్వ్యవసాయముల నొకటిగాని విశ్వసింపను. కాని, ఖలీలు ఏమగునో, వాని యుక్తంతియెట్టిదో యరయవలయును—"

పాషా మఱిమాటాడక, తనభటులఁ గాంచి సన్నచేయ, వారు నౌకాదండముల రయమున ధరించి తమ భుజబలముకొలఁది నావను వడివడి వెనుకకుఁ బోనిచ్చిరి. పాషా మగుడగాథాలోచనానిమగ్నుఁ డాయెను. లూకాను గుల్నేరులు ఆశ్చానందోత్సాతిరేకమునఁ బరస్పర విలోకనాయత్తచిత్తులైరి. నావ క్రియ్యచొచ్చి సాంద్రతరవృక్షచ్ఛాయాచ్ఛాదిత మైనంతనే, ఆయువతీయువకుల పరస్పరకరములు చుంబించెను. కరములేగాదు, పరస్పరహృదయములును, పరస్పర మధురాధరములును నిశ్శబ్దముగాఁ జుంబించెను. అట్టి సమయమున నామిథున మానందపరవశులగుట సహజముగదా. వారి నింతకాలము విడదీసియుంచిన భయంకర మృత్యునిష్ఠురకరము మాయె మాయెగదా. ఇఁకముం దేమగునో, కఠినహృదయుఁడగు పాషా యేముహూర్తమున వారిని విడదీయునో యెఱుంగనేరకున్నను, వారు, విశ్వాసపూరితహృదయులై యెట్టి విచారము తెలియక, అనంతసౌఖ్యార్ణవ తరంగముల నోలలాడుచుండిరి.

పాషా మొదలగువా రటులుండ, ఖలీలు జూలియను లెటులుండిరో గమనింపవలయును. వారి నొకగదియందు బంధించి, సాయుధులగు దౌవారికుల గావలియుంచియు నాతసింపక, దాని తాళపుచెవిని పాషా భద్రముగ దాళము వైచెను. కారణ మేమన, తాను దవ్వుననుండు సమయమున జులేఖా తైరజాలు బంధితులను విడిచిపుత్తురని పాషా యనుమానించెను. కాని, ఆబీగమునకుఁ బ్రతియొకటికలదు. అయ్యసాధారణముగా నెవ్వరి యధీనముననున్నను, ప్రస్తుతము అమీనా హస్తగత మాయెను.

ఆయువకు లామందిరముననుండి నాలుగైదు నిముసము లాయెన

ఇంతలోఁ దాళము త్రిప్పినట్లు రెండవ ద్వారముచెంత సవ్వడి యాయెను. వారు వెలిగంది యటుబరికింప, నాతలుపులు మెల్లగఁ దెఱువఁబడెను : సంధానకార్యప్రవీణయగు నమీనా సాక్షాత్కరించెను. ఆ స్త్రీభటులు కావలియున్న గవాక్షమువంక వ్రేలు చూపి నోరువిచ్చి మాటాడుట ప్రమాదకరమని సూచించి, ఖలీలువంక చూచి తనవెంట రావలయునని కోరెను. తురుష్కయువకుఁడు మందస్వరమున నిట్లు పలికెను—

“ఏల రావలయు ? నన్నీ కారనుండి తప్పించుటయె నీ యభిప్రాయమగునేని, నామిత్రుని విడిచి రాఁజాలను. నీకు శక్తి కలదేని మా యిరువురను రక్షింపుము ; లేదేని, నేనును ఇందే యుందును.”

“అసంభవము ! కాని, నీమిత్రున కపాయము వొరయనేరదు. లూకాను నొక్కనినే పొలియింతునని పాషా పలికెగదా.”

“అట్లయిన, ఇంతలో నేను తీవ్రపడి నా సహచరు నిందుంచి దొంగచందమున నేల తప్పించికొనఁ బ్రయత్నింపవలయును ?”

“అయ్యా ! ప్రశ్నింపకుము. నామాట పాటింతువేని, లాభప్రదముగ నుండును.”

“మిత్రమా ! అపాయము లేదు. పొమ్ము.” అని జూలియను తన స్నేహితుని ప్రోత్సహించుటచే, నాతఁడు క్షణమాత్ర మాలోచించి, అమీనాను వెంబడించెను.

ఆ గదినుండి వారిరువురు వెలువడినంతనే, ఆవృద్ధురాలు మగుడ భద్రముగ బీగము వైచెను. తన ప్రాణకాంత సుందరవదనసందర్శన భాగ్యము లభించునని భావించి ఖలీలు సంతుష్టాంతరంగుఁ డాయెను. కాని, సోపానపరంపర నారోహించినంతనే, పాషా శయ్యామందిర ద్వారము గోచరించెను. అద్దాని కెదురుగా పాషా పుత్రికల మందిర శ్రేణియు దృగ్గోచర మాయెను. అమీనా యావంకఁ జూడక, పాషా

మందిరాభిముఖయై, ఖలీలు కాంచునట్లు ముష్కనుఁ గరమూని, యాతలుపు మెల్లఁగఁ దెఱచెను. తురుష్కుఁడు విస్మయపరవశుఁడయ్యు, సంశయము వీడి, ఈచోద్యమెద్దియో యెట్టిదైనను అరయవలయునని కృతనిశ్చయుఁడై, యామె వెంబడి నందుఁ బ్రవేశించెను.

వారు ప్రవేశించినది యొక చిన్నగది. చిన్నదయ్యు, నయ్యది సర్వవస్తుసమృద్ధంబై, బహుదీపికావిరాజమానమై యుండెను. అమీనా నవ్వాడియొనరింపక, మెత్తని రత్నకంబళముపై వడివడి ముందుగఁ బోయి యొక యంతర్ద్వారము తెఱచి, యందుఁ బ్రవేశింపవలయునని ఖలీలుం గాంచి సన్నయొనరించెను. ఆ పరిచారిక యొక ప్రక్కను నిలిచిపోయెను. తురుష్కుఁడు సహజనిశ్చలగమనమున దన్మందిరాంతర్గతుఁడాయెను. ఆతఁడు ద్వారము దాటినంతనే, యమీనా తలుపు బంధించెను. ఏకాకియైన ఖలీలుఁ డేమికాంచెను ? ఆ మందిరమునంకలి యవ్వలికొనయందమరియున్న సమున్నతాసనముపైఁ బఱచిన రమణీయ విశాలతల్పమున నొయ్యారముగ వ్రాలియున్న రమణీమణి నయన పర్వ మొనరించెను.

ఆ మందిర మతివిశాలము. పాషా పుత్రికల మందిరముకంటె నమిత వైభవతరంబుగ నొప్పారెను. అందు సుఖాసీనయై యున్న సుదతీ రత్నము ప్రాయము ముప్పది సంవత్సరము లుండును. కాని, ముఖ వికాసము విమలమై, సౌందర్యనిలయమై, నిరంతర యౌవనప్రభావిభాసితంబై యుండుటచే, నామె వయస్సు మూఁడు నాలుగుసంవత్సరములు కొఱఁతవడినటు లుండెను. శరీరము స్థూలముగాక, తాదృశ పరిపూర్ణ శోభాయమానముగ నుండెను. నిగనిగ ప్రభాదీపితంబులగు ముగమలు దిండులపైఁ గడు నొయ్యారముగ వ్రాలియున్న యాకులుకులాడి విషయలాలసము వర్ణనాతీతమై సువ్యక్తముగ నుండెను. ఆ మిటార కుచయుగ్మము కుంభసమానమై పొంకయు కలిగి

యుండెను. కరచరణాద్యవయవము లన్నియుఁ గోమలములై, కాంతివంతములై, వర్ణనీయములై సముచితముగ నమరియుండెను. ఆ మోహానాంగి రూపురేఖలసదృశవైభవ సముద్దీపితంబులై, నిష్కళంకములై వర్ణనాతీతములై యుండెను.

సౌందర్యరాశియగు నా తరుణి కపోలములు పూర్ణములై సుందర సంధ్యారుణరాగభాసురములై యుండెను. నయనము లాకర్ణాంత విశాలములై, వినీలవిభ్రమనిలయములై, నృదులకామవికారాకరములై రాజిల్లుచుండెను. సువర్ణదీపితములగు నీలశిరోజములు కుటిలములై గజేంద్రదంతిధవళ సన్నిభకంఠము నాచ్ఛాదించి పూర్ణకుచకుంభములపై మనోహరముగఁ జిందులాడుచు నా కామినీమణి ప్రాలియున్న మొగములు దిండులపై భంగప్రాతమువలె నమరియుండెను. ఆ సొగసులాడి వదనమండలము బింబమువలెఁ బూర్ణవలయాకృతి నలరారుచు, బరిపూర్ణసౌందర్యమునకుఁ గొలఁత కల్గించుచున్నను అసమాన సౌందర్యవైభవోపేతమై యుండెను. రమణీయముగ నమరియున్న నాసిక యొకింత నిబ్బరముగాఁ దోచుచుండెను. మనోహర బింబారుణ విరాజితాధరములు బహుళములై హిమార్ద్రములగు గులాబులవలె నుండెను. తదధరోష్ఠము లొకింత విడియుండుటచే, తదంతర సుందర దంతములు దంతస్ఫూర్తి దీపించుచుండెను. అమంద శోభాయమానముగ నమరిన చుబుకము దత్కమనీయవదనాకృతియు గమనింతుమేని, ఆసుందరి విమలయులాలసయగు కామినియని తెలియును. ఆ మత్తకాశిని తా నప్రయత్నముగనే ధీరయువజన హృదయాపహరణ మొనరింపఁ జాలుదు నను నాత్మవిశ్వాస మమితముగఁ గలదగుటచే, స్వైరిణీజనసహజ ప్రణయవికారాస్త్రములఁ దాల్పక తదుచిత నిర్లక్ష్యగంభీర సౌందర్య వైభవసముజ్జ్వలయై రాజిల్లుచుండెను.

ఆ మదవతి వస్త్రధారణము గూడఁదదనుకూల వైభవసమన్వితమై

యుండెను. ఆమె ధరించిన నీలిల వసనము దేహకాంతి నతిశయింపఁ జేయుచుండెను. తదంతర కంచుకము మనోహరగళసీమ దిగువనుండి ఉదరపర్యంతము పీడి, ఘనవక్షోజవైభవస్ఫూర్తి నెక్కుడుగ వ్యక్త పఱచుచుండెను. మనోహరకుందనమువలె, ప్రసిద్ధహాటిదంతమువలె, నమూల్యచంద్రకాంతశిలవలె భాసిల్లు నామేల్బంతి బలితంబు భుజముల నలంకరించిన యనర్ఘమణిమయాభరణములు శతసౌందర్యము నధిక తర వైభవం బొనరించుచుండెను. ఆమిటారి తాల్చిన మరాయిసుంద రాంఘ్రిద్వయమున కొక్కింత మీఁదుగఁ జాఱి, తదంగ సౌందర్య సౌష్ఠవములఁ జాటుచుండెను. అధికవర్ణనమేల! ఖలీలుఁ డన్యకన్యా సమర్పితహృదయుఁడు కాకుండినచో, ప్రభురాణి యనూన సౌందర్య వైభవమాధీనస్వాంతునిం దప్పక అధీనహృదయు నొనరింపఁజాలి యుండెనని చెప్పవలయును.

ఖలీలుఁ డరుదెంచినను, ఆ నవమోహనాంగి ఇంచుకేనియుఁ జలింపక, ప్రదర్శితనిజాంగాంగవిరాజితయై, అట్టె యొయ్యారముగ నాశీనయైయుండెను. తన తనూవైభవముచే నాసుందరాంగుని హృద యము నాలెఱుంగున నాకర్షింపఁగడంగి, యా తరళనయన అవనత వీక్షణములచేతనే యాతని మనోహరాకారము పరిశీలించెను. ఆ యువకుఁ డా దివ్యసుందరవిగ్రహమును రయమున డాయక, అట్టె నిలిచిపోయెను. కాన, నా మెయే తనచెంత కరుదెంచి, తన శయ్యా తలంబున నాసీనుఁడు గావలయునని సన్న చేసెను. ఖలీలుఁ డట్టు లుపవిష్టుఁడై, ఆతొయ్యలి యేమనునో యని నిరీక్షించెను. అంత నా మధురవాణి మంజులమురళీస్వనంబున నిట్లు ప్రశ్నించెను—

"సొగసుకాఁడా! నీ వెవ్వరిసమక్షమున కరుదెంచితివో యెఱుం గుదువా!"

"మహనీయుఁడగు దాల్తబనపాషా ప్రియభార్యయగు ఇస్మిల్డా

సతీమణినమక్షమున నున్నా(డనని భావింతును."

ఖలీలు అట్లు సగౌరవముగ బదులాడ, నావడంతి యాకస్మికో ద్విగ్న స్వరంబున నిట్టులనెను—

"ప్రియభార్యయా! ఎంత విపరీతము! నీవంటి దివ్యపురుషుని ప్రేమ( జూర(గొన నాశించియున్న నన్ను ఆ మూర్ఖుడా, ఆ రక్కసుడా ప్రేమించుట?"

"నన్ను రక్షించుట కిదియా కారణము!"

"మఱి యే కారణము!"—మోహాంధువీక్షణజాలముల( బర్వ( జేసి, యా మత్తకాశిని యానందకందళితహృదయయై మఱల నిట్టులనెను—"మఱి యేకారణమున నింతటి ప్రమాదమునకు( గడంగి నిన్ను రక్షింతును?"

మోహవిభ్రాంతచిత్తయై యింకను నేమియో వాకొననుండిన యా మందయానను వారించి ఖలీలు( డిట్టులనెను—

"వనితామణీ! నేను ప్రేమాస్పదుడనంటివి. అయ్యది మహాభాగ్యము. కాని, అన్యథాతలంపక మూర్ఖకృతఘ్నతాపూరితచిత్తుడనని నిరసింపక నాపలుకుల గమనింపుము. నా హృదయము పరాధీనమై యున్నది!"

"క్రూరాత్మా! వయసుకాని కింతటి క్రౌర్యము తగునా!—యువకుడా! అసామాన్యసౌందర్యసముజ్జ్వలుండవు; నిన్ను( బ్రేమించు కాంత నిట్టి కఠిననిష్ఠురోక్తుల( గారించుట పాడియే!"

పాషాభార్య యట్టు లుద్విగ్నచిత్తయై పలుక, తురుష్కయువకుడు సహజనిశ్చలస్వరంబున నిట్టులనెను—

వనితామణీ! కఠిననిష్ఠురప్రవర్తనము నే నెఱుంగను. నీహృదయ మెఱింగితి: మదీయకృతజ్ఞత వెలిబుచ్చితి: అనంతరము నా హృదయావస్థను బురుషోచితముగ( దెలియ(బఱచితి."

"యువకుఁడా ! భవదీయ హృదయాపహారిణి యెవ్వతెయో వచింపుము ! ఆహా ! వేఱుగ నడుగనేల ? ఆ జులేఖాను వలచిగదా, యిటు విచ్చేసితివి ! కాని, యువకుఁడా ! చూచునంతమాత్రమున హృదయ సమర్పణ మొనరించుకొనుటయా ! అసంబద్ధము ! కేవలము బాల్య చాపల్యము కావలయు. భ్రమ !—

"వనితామణీ ! జులేఖాను గాంచినంతనే మోహపరవశుఁడనైతి నని విస్మయము చెందెదవా ! కాని, మదీయ ప్రవర్తన మసంబద్ధమగు గాక; నన్నుఁ గాంచిన రెండు నిమిషములకే, కాను వికారాక్రాంత చిత్తవైతివే ! ఇంతకంటె నసంబద్ధమా !"

"ఆహా! నీ సౌందర్య వైభవమును అమీనా యఖండపదజాలముల నభివర్ణించెను. ఆ ముహూర్తముననే, మోహపరవశనైతి, నేఁడు నీ మనోహరాకారము కన్నులారగాంచి, మదీయపరిచారిక వర్ణన మతి శయోక్తి కాదని గ్రహించితి. గమనించితివా! మఱియొక్క విషయము గమనింపుము. కాంత ప్రేమ నవనీత కోమల సదృశము: క్రోధపూరి తయగునా—అనివార్యము, భయంకరము !"

తోడనే సర్వాంగసుందరుండగు నా యువకుఁడు గంభీరముగ లేచిఁ విస్పష్టముగఁ నిట్టులనెను—

"వనితామణీ ! తియ్యని మాటలకు లోఁబడనివాఁడను, నీ బెద రింపుల కదరి నీకు వశంవదుఁడ నగుదునని భావింతువా ? అంతటి భ్రాంతివలదు. వనితామణీ ! కాలయాపన మొనరింపక, దయామయ చిత్తవై నన్నుఁ బోనిమ్ము. పాషా సత్వర మరుదేరఁ గలఁడు. నన్ను బంధించిన కారయందు నేను గానరానిచో, మన యిరువురకును అపాయము వాటిల్లును."

కాని, యా కామిని యా పలుకుల నాలించినట్టులు కానరాదు. సంధ్యాసమయమున ప్రాలియుండు చారుతరకుసుమరాజమువలె నా

పడఁతి శిరము నిజ సమున్నతవక్షోజములపై వ్రాలియుండెను. ఆ మోహనాంగి యాలోచనాధీనయై యుండ, హిమసన్నిభమై పూర్ణ సువర్ణ కుంభసాదృశశోభాయమానమై పెల్లుబుకు నామదవతి వక్షోజములు వీడిన కంచుకమునుండి తొంగిచూచుచుండెను. మొగములు దిండులచే దీపించు తల్పముపై వ్రాలియున్న ఆ కులుకులాడి యాకృతి మనోహరమై, మోహజనకమై వర్ణనాతీతమై యుండెను. అట్టి నవ మోహనాంగిని ఒంటిపాటునఁ గాంచు తరుణ వయస్కుఁడు విగత ధైర్యుఁడై పాదాక్రాంతుఁడు కాకుండుట దుర్లభము. నిజహృదయా పహరణ మొనరించు నెపంబుననే యాకులుకులాడి నిజాంగ సౌంద ర్యాతిశయమును యథాలాపముగాఁ బ్రదర్శించెనని ఖలీలుఁడు గ్రహించెను. ఒక జారిణి తళుకు బెళుకులను గాంచి నిజమనో కాంతను మఱచు స్వభావ మాతనిది కాదు. జులేఖాపై నాతఁడు బద్ధానురాగుఁడై యుండెను. ఆతని ప్రేమ నిశ్చలము, అనంతము, అపారము.

కొంతకాలము ఇస్మిల్లాసతి యటు లుండెను, గభీరాలోచనా నిమ గ్నయైనటు లుండెను. ఆవిపరీత సమావేశ మెన్నఁడు తుదముట్టునో యని ఖలీలు విసువున నిరీక్షించుచుండెను. అంత నాకోకిలవాణి నిజ సుందరాననము మగుడఁబైకెత్తి, విశాల విసిల నయననిర్గళిత గాఢ కామ వికారాంచిత వీక్షణజాలముల నాయువకునిపై నిలిపి యల్లన నిట్టులనెను.—

"సుందరాంగా ! నా మోహము నింకను దిరస్కరింతువా ? మత్స మర్పితహృదయారాధనము నింకను గాలఁ దన్నెదవా ?"

"వసితామణీ! నీక్షేమము, నాక్షేమము గమనింపుము. బ్రతిమా లెద,—ఏల బ్రతిమాలవలయు! నన్ను బోనిమ్ము!"

ఆగంభీరాలాపములు ఖలీలు నోటనుండి వెలువడినంతనే, గూఢ

చారిణియగు నమీనా యున్మాదినివలె శరవేగమున నరుదెంచి, విపరీతభయాతురయై యిట్టు లఱచెను.—"అరుదెంచెను! మహనీయుడు పాషా యరుదెంచెను! ఉద్యానవనమున నడుగుల చప్పుడు విని పరుగు పరుగున వచ్చితిని!"

ఇస్మిల్లానతి ప్రకంపితహృదయయై, నిజతనూలత యొకసారి వడంక, దిగ్గున నాసీనయై యిట్టులనెను.

"మనోహరాకారా! పొమ్ము. ఆశారహితనై, యుక్తాయుక్తముల నెఱుంగక, నిన్ను వెఱపింపఁ గడంగితి, క్షమింపుము. నన్ను మఱువవలదు. పునర్దర్శనము కాఁగలదు, పొమ్ము!"

అమితభయవ్యాకులచిత్తయై యున్న యమీనా ఖలీలునకు సన్న యొనరించి వడివడి నడువసాగెను. తురుష్కుఁ డామెను వెంబడించి, రయంబున, క్రమముగాఁ దన కారఁ జేరెను. ఖలీలు అందుఁ బ్రవేశించుటయు, అమీనా తహతహలాడుచుఁ దాళము వైచుటయు, అవ్వలి ద్వారము తెఱచి దాల్బనుపాషా యన్యజన పరివేష్టితుఁడై యరుదెంచుటయు నొక్కముహూర్తమున సంభవించెను.

బంధితులిరువురు—ఖలీలు జూలియనులు—ఆ మందిరమున భద్రముగ నుంచుటచే సంతసించి, వారినుద్దేశించి తన వెంట రావలయునని పాషా పలికెను.

పాషాప్రవర్తనము వింతగనుండెను. తొంటి గాంభీర్యము తొలంగెను. క్రోధఘూర్ణమానమానసుఁడై, దయారహితుఁడై వెడలిన జెట్టి వినమ్రుఁడై, విపరీత విస్మయాక్రాంతచిత్తుఁడై, విభ్రాంతవదనుఁడై యరుదెంచెను. రణవ్యాపార పారంగతుండగు నావీరుఁడు ఆలోచనాధీనుఁడై మందునిచందంబున వెఱఁగుఁ జూడ్కుల నిట్టట్టు పరికింపఁ దొడంగెను. సహజాతికార పూరితస్వరమున "నావెంటరండు!" అని పెళుసుగఁ బలికెనేగాని, తాను మున్నెఱుంగని మర్యాద నాతఁడు

వ్యక్తపఱచుచుండెను.

జూలియను ఖలీలులు పాషావెంటఁ బోయిరి. వారుసోపానముల నారోహించి పాషాపుత్రికల మందిరశ్రేణి ప్రవేశించిరి. మనోహర జలస్తంభ మమరి యుండిన సుందిరమున లూకాసుగుల్నేరులు అమందానందము ననుభవించుచు సుఖాసీనులై యుండిరి అమిత సౌందర్య విరాజితాననలగు తైరజా జులేఖాలు సహితమమితానంద వికస్వర వదనసరోజలై, నిర్విచారముగ నుండిరి.

ఖలీలునిఁ గాంచినంతనే, లూకాసు నిజప్రియాంగనను విడి, పరుగున బోయి, తనమిత్రు నాలింగన మొనరించి, సంతసకృతజ్ఞతో ద్రేకిత స్వరమున నిట్టులనెను.—

"ప్రాణమిత్రమా! నాప్రాణము రక్షించితివి! నేనెంతయుఁ గృతజ్ఞుఁడనుఁ."

"మిత్రమా! సంజీవివంటి ఆయుంగరము ప్రభావము నే నెఱుంగుదు."

చిరమిత్రులగు జూలియనలూకాసులంత బరస్పరకరచుంబన మొనరించిరి. వారియానందమునకు మేఱలేదు. ఆయెదుటనుండిన తైరజాగుల్నేరులు విస్మయకృతజ్ఞతాపూరిత వీక్షణముల ఖలీలుపైఁ బరగఁజేసిరి. జులేఖాయన్ననో, వారివలె విస్మయాక్రాంతచిత్తకాక, సంతోషప్రణయ పూరితనయనయై యుండెను.

తన కృతజ్ఞత నా తెఱంగున నముచితముగా వెలిబుచ్చినంతనే, లూకాసు మగుడఁ దన ప్రేయసిచెంత నాసీనుఁ డాయెను. దాల్తబనుపాషా వీక్షణమాత్రమున నైన వారింపకుండుటచే, జూలియను ధైర్యధుర్యుఁడై తన ప్రాణకాంతయగు తైరజాప్రక్క నాసీనుఁడాయెను. జులేఖాప్రక్క ఖలీలుఁడు సుఖోపవిష్టుఁ డాయెను.

దాల్తబనుపాషా మందిరమునడుమ నిలుచుండి, యనన్యసామాన్య

ముద్రిక పరిశీలనాకార్యనిమగ్నుఁడై, యితరవిషయముల మఱచి యుండెను. దేదీప్యమానముగ రాజిల్లు దీపరాజముల సాహాయ్యముచే, నాతఁ డాయుంగరమును మఱింతపరిశీలనగాఁ బరికింప నవకాశమాయెను. ఆతని చూపులింకను అమితభ్రాంతియుతములై యుండెను. ఎంత పరికించినను, ఆతని కేలఁకో సంతసమలవడకుండెను. జడునివలె, వివేకరహితునిచందమున నా మహనీయుఁ డా జీవరహిత పదార్థము నదే ప్రకారము డిల్లవడి మైమఱచి పరికించుచుండెను. తుద కాతఁడు తెలివొంది, ఖలీలుని దాసి, సగౌరవముగా నిట్లు ప్రశ్నించెను—"ఈ యుంగరము ధరించు మహనీయుఁ డెవ్వడని గ్రహింపవలయు?"

"ప్రభువరా! ముందుగనే తెల్పియుంటిగదా. నా యుదంత మంతియ."

ఖలీలుఁ డట్లు నిశ్చలముగాఁ బలుక, పాషా వెఱఁగుఁ జూడ్కుల నిగిడించుచు నిట్లు ప్రశ్నించెను—

"నీ కీముద్రిక యెట్లు లభించెను?"

"ప్రభువరా! అది నా రహస్యము."

గంభీరసమున్నతాకారుఁడగు నాతురుష్క యువకుని గంభీర విసిశ్చల విస్పష్ట గర్వితాలాపముల కెంతయుఁ జకితుఁడై, ఆయపూర్వ వైభవ సముజ్జ్వలవదనము పరికించి, పరికించి, శతాధికవిస్మయ వికట భ్రుకుటియై పాషా యనంతరము సుందరాంగియగు జులేఖాను వీక్షించెను. స్థిరచిత్తుఁడగు నావీరుని విపరీతభావచేష్టల గమనింతుమేని ఆతఁడు గాఢానుమాన బాధితుఁడై, డోలాయమానమానసుఁడై కుందుచుండెనని వ్యక్తమగును. చెప్పరాని సందేహమాతని చిత్తము నావరించెను. ఎద్దియో ఆలోచన యాతనిడెందమున నుదయించి, విజృంభించి యాధీరస్వాంతుని తబ్బిబ్బొనరింపఁ దొడంగెను. తన

యనుమానము నిజముగునా, లేక, కేవలము మిథ్యయగునా యని యాతఁడెంత చింతించినను నిశ్చయింపనేరక, అందఱునాలించు చంద మున నిట్లనుకొనెను.—"అత్యద్భుతము! నేఁటి సాయంసమయ సమాచారములు కడువిస్మయజనకములు! అదంతయు నరేబియా దేశపు వినోదకథవలె నున్నది, కాని, సామాన్యముగ లేదు. కేవలము చిత్తవిభ్రమను ముదపించుచున్నది!"—

ఖలీలుఁడంత నిట్లు పలికెను.—

"ఆర్యా! మానవజీవిత విషయము లౌకికపు చిత్రకథల కంటెను, చిత్రతరంబులై యుండు."

"నిజము నిజము! ఈ యపూర్వ సంఘటనమే నిదర్శనము. కాదేని నేఁదలంచునట్లు—" పాషా యిక మాటాడక విస్మయ విభ్రమచకితుఁడై ఖలీలుపై దృష్టినిల్పి, "అసంభవము ఎట్లగును!" అని బిగ్గఱగ నని కొని, రయమున నిట్లనెను—"ఆర్యులారా! మీరిఁక మీమీనివాస ములకుఁ బోవలయు!"

ఖలీలుఁడంత నొకింత యుపాలంభ పూర్వకముగా నిట్లనెను—

"ప్రభువరా! మదీయాస్వర్గ భవనమున మగుడఁ బ్రవేశపెట్టియు, వెంటనే వెడలఁగొట్టుట పాడియే?"

"అందులకుఁగల కారణమియ్యది. భవదీయ ముద్రికా కథాశ్రవణ కుతూహలోద్విగ్న హృదయుఁడనై నీసమక్షమున కరుదెంచితి. నాతో బాటు నీ మిత్రులును అమందానంద పరవశులగుదురని యూహించి నిన్నభినందించు భాగ్యమలవడునని భ్రమించి యేతెంచితి. కాని, విషయ మన్యథా పరిణమించెను. స్వప్నగతవృత్తాంతము౦ బోలిన యీ విచిత్రోదంతము నే భావించినట్లు అద్భుతముగ లేకపోయెను."

"ప్రభువరా! అట్టి యద్భుతగాథలు నీకుఁ బరిచితములై యుండ నోపు. సెల వొసంగెదేని, మన ప్రసిద్ధమగు 'అట్టోమను' సామ్రాజ్య

చారిత్రప్రాథమికయుగమునకు సంబంధించినట్టియు, భవదీయకుతూహలస్వభావమున కనువై యమితానందము నొడఁగూర్చునట్టియు విచిత్రకథ నెఱింగింపఁగలను.”

పాషా సహజముగఁ గథాశ్రవణాతురుఁ డగుటయేగాక, ఖలీలుఁ డమిత విస్మయాశ్చర్యకారణుఁ డాయెను. కాన, నాతఁడు తోడనే ఇయ్యకొని, సోఫాపై నాసీనుఁ డాయెను. గుల్నేరు రయమున లేచి హుక్కాగొట్టము నందిచ్చి చిల్లమును రగులఁజేసి, నిజప్రాణకాంతుని చెంతకుఁ బోవ, నా మహనీయుఁ డానందవిశాలవదనుఁడై, గుడగుడ ధ్వాన మొనరించుచు, ప్రియతర ధూమపానకార్యపరతంత్రుఁ డాయెను. ప్రణయస్వరూపిణులగు నా జవ్వనులు మువ్వురును దమ ప్రియసందర్శన భాగ్యము దీర్ఘతరము కావలయుననియే ఖలీలుఁడు కథాకల్పనకార్యమునకు దొరఁకొనెనని భావించి, యమితానందాయత నయనలై, నిజనయనకంజాత సంజాత తరళేక్షణములం దమకృతజ్ఞత వ్యక్తపఱచిరి. జులేఖా మాత్రము కొండొక భద్రకారణ ముండుననియు భావించి యుండును. ఖలీలుఁ డంత నిజమధుర గంభీరవిస్పష్టకంఠమునఁ గథాకథన మొనరించెను.

## ౬

### ఖలీలుకథ

నా కథ 1287 వ సంవత్సరమునాఁటిది. ఆ కాలమున, ‘చిన్నాసియా’ సెల్జూకు రాజవంశాధీనమై యుండెను. అందలి యొకానొక రాష్ట్రమునకు రాజధాని యగు ‘కిస్కారు’ నగరము ద్రాక్షతోఁటలకును, స్నానవాటికలకును, మనోహరారామములకును, మహాపురుషుల

సమాధులకును నాకరమై, చరిత్ర ప్రసిద్ధమై యొప్పారెను. ఆ పట్టణమునకు 'సౌడాజీ' యను యువకుఁడు ప్రభువై యుండెను.

ఆ పట్టణమున కనతిదూరమున 'బిలేడీ' యను గ్రామ ముండెను. అయ్యది కిస్కారుసనగరమునకు సమీపముగ నుండినను, గ్రీసు రాజ్యాంతర్భాగమై యుండెను. ఆ గ్రామమునందు సాధుశీలుఁ డగు నొక 'షేకు' పుత్రికాసమేతుఁడై నివసించుచుండెను. ఆ మహనీయుఁడై హికవిషయముల మఱచి పరమాత్మునిపై మనను నిల్పి, సకల భూతదయాపరతంత్రుఁడై, పరోపకారపరాయణుఁడై, యఖిలజన సంసేవ్యుఁడై కీర్తిసాంద్రుఁ డాయెను. ఆతని మహమ్మదీయమతాభిమాన మపారము. ఆ పరమపురుషుని ప్రోద్బలముచే నాప్రాంతస్థులందఱు దమతమ మూఢమతములఁ బరిత్యజించి, పవిత్ర మహమ్మదీయమతావలంబన మొనరింపఁ దొడంగిరి. అచిరకాలమున సమున్నతిమగు మసీదు తలయెత్తెను. దినమున కైదు పర్యాయములు భక్తుల గంభీరదీనాలాపములచే నా ప్రదేశము ఘూర్ణిల్లఁ జొచ్చెను.

'మల్లాటను' అను నాషేకు పుత్రిక దినదిన ప్రవర్ధమానయై, సంప్రాప్తయౌవనయై అనన్యసామాన్య సౌందర్య విరాజితయై యఖిల పురుషహృదయాపహరణ కారణమాయెను. పదునాలుగేండ్ల ప్రాయముగల యాజవ్వని యనదృశరూపురేఖా వైభవంబుల కెఱిఁ, యారాజ్యమునందలి వీరులు, సరదారులు, ప్రభువులు, సామంతులు లోనుగాఁగల వారందఱు మోహపరవశులై, యా సౌందర్యరాసిం దమ కొసంగవలయునని యాముసలి షేకును నిరంతరమర్థింపఁ దొడంగిరి. అందు కిస్కారు పుర ప్రభువగు సౌడాజీ ప్రధానుఁడు. వృద్ధుని నిర్బంధించియైనను, ఆ లోకైక సుందరి కరగ్రహణ మొనరింపవలయునని యాతఁడు దృఢముగ నిశ్చయించెను. కాని యాషేకు, సౌడాజీ ధైర్యముఁ దలంచి సంతసింపక, భాగ్యముఁ

గాంచి భ్రమింపక, ధూర్తాలాపముల నాలించి చలింపక, నిశ్చల స్వాంతుఁడై తన పుత్రిక తన మనస్సునకు నచ్చు పురుషుని వరించునని తెల్పుచుండెను. ఆ కాంతామణియన్ననో, వృద్ధ జనకుని వీడఁజాలక, ఆమహానీయుఁడు జీవించియుండునంత కాలము వివాహము గురించి తలంపరాదని కృతనిశ్చయయై యుండెను.

ఒకానొక రమణీయ సంధ్యాసమయమున నాతండ్రియు నాతని ముద్దులపట్టియును దమ పేదకుటీరము ముందఱ హాయిగఁ గూర్చుండిరి. ఆపెకు తన దేశచారిత్రమును గథారూపమునఁ దెల్పుచుండెను. సుందర సంధ్యారుణరాగదీపిత ప్రపంచము శతాధికశోభాయమానముగనుండెను. తదవసరశీతలానిలము లానందదాయకములై యుండెను. జనకుని కథా నిర్వచనమత్యంతసంతసప్రదమై యుండెను. అట్టి యమిత సంతోష సమయమున నాయనాథ పుత్రికా జనకుల గుండెలు వ్రయ్యలగునట్లు, హయరింఖాసినాదము లాకస్మికముగా వినవచ్చెను. కిస్కారు పురపాలకుఁడగు సౌదాజీ యోధజన పరివృతుఁడై కట్టెదుట గోచరించెను. సౌదాజీ రయమున నేలకుదిగ్గి యా వృద్ధుని జేరి కఠినముగ నిట్లనెను.—

"అయ్యా! నిన్నర్థించుట కియ్యది కడసారి. చిరకాలమునుండియు నీపుత్రికఁ గాంచి మోహపరవశుఁడనై, వినిర్మలప్రేమపూరిత హృదయుఁడనైయుంటి. సగౌరవముగా, సవినయముగాఁ బెక్కుసారులు మన్మనోభిప్రాయము వెల్లడించితి. కాని, ఇంతకాలము నా మాటలఁ బెడచెవినిఁ బెట్టుచుంటివి. వృద్ధుఁడా! మంచి చెడ్డ లరయుము. ఈ జీర్ణకుటీరమున ధనసాహాయ్య విరహితుఁడవై, నీవంటి గతిలేని యనాగరికుల దానధర్మములపై నాధారపడి, యెంతకాలము జీవింపఁగలవు? అల్లదె, చూడుము—ఆకసము నంటు నాభవనము! దిగంతముల పర్యంతము వ్యాపించిన యానుక్షేత్రములు! లెక్కింపరాని గోగ

ణము ! నీవిక నాయర్థాంగివై, మదీయహృదయ సామ్రాజ్య లక్ష్మివై, యనన్యకాంతా జనదుస్సాధ్యములగు ననూన భోగభాగ్యముల నోలలాడఁ గలదు. నీవన్ననో ! ఈ పాడుజీవనము తొలఁగి, యభిరామ వైభవాన్వితుఁడవై, దాస దాసీజన పరివేష్టితుఁడవై, హాయిగ నుండఁగలవు. మఱియొక మాట గమనింపుము ! మూర్ఖుడవై యింకను జలము వహింతువేని, తత్ఫల మనుభవింతువు !"

ఆషేకు సహజనిశ్చల దైన్యస్వరమున నిట్టులనెను.—

"పరమాత్ముఁ డొక్కఁడే ! వారి ప్రవక్త మహమ్మదు ! పరమాత్ముని ఆజ్ఞ యమోఘము. మానవుఁ డసహాయుఁడు: ప్రతిఘటింప నేరఁడు. అయ్యా! గమనింపుము. నాపట్టిని వారింపను, ప్రోత్సహింపను. సౌదాజీ! ఈ కాంతకు నీ యందనురాగములేదు. కాన, నీకీ యాశ వలదు."

అంత నాప్రభువు కుపితుఁడై, యావృద్ధునిదూరి, తనయనుచరులఁగాంచి యిట్టు లాజ్ఞాపించెను—"చూచెద రేమి? రయమున నీయిరువురను మన నగరమునకుఁ గొంపొండు !"

ఆజ్ఞానువర్తులగు నాభటులు తోడులేని యా దీనజనులపై భయంకరశ్వానములవలెఁ బాఱిరి. తత్క్షణము వారింబట్టి యశ్వములపైనిడి తమ పట్టణమును వాయు వేగమునఁ జేరుటయే వారి యభిప్రాయము! బలవంతులగు నా మోటకులను వారించు వారెవ్వరు? నిస్సంగుఁడగు షేకునకు దిక్కెవ్వరు? పితృసేవా పరతంత్రయగుమానినీమణి యవస్థ ఏమి కావలయు? అట్టి మహాసంకట సమయమున నాకసమునుండి వ్రాలినట్టు లేఁ బ్రాయంపు వీరుఁడొకఁడు ఆకస్మికముగ నరుదెంచి, వీక్షణమాత్రమున విషయమును గుర్తించి, కిస్కారు ప్రభువుంగాంచి విస్మయము నొందియుఁ జలింపక, నిజకృపాణధారి యాయెను. సౌదాజీయును విస్మయచకితుఁడై యిట్టు లనెను—

"మిత్రమా! నీవా! ఈ యత్నమేల? గర్వాతిరేకమున నీ మోహా నాంగి నన్ను నిరాకరించెను. కిస్కారు ప్రభువు సహింపఁజాలఁడు. మన గాఢచిరమైత్రిందలంచి, నీవు వారింపవని విశ్వసింతును."

"కిస్కారుప్రభువు భంగపడిన, భంగపడుఁగాక. ఈ పరమభాగ వతోత్తముని, ఈ యబలను బాధింపరాదు. మూర్ఖత వహించి ఈ యధమకార్యము విడనాడవేని, మన మైత్రి యంతరించెనని యెఱుంగుము, మన మిఁక బద్ధవైరులము."

"అట్టులే యగుఁగాక!" అని పలుకుచు నిజదీర్ఘకరవాలము సారించి, నూతనాగతునిపై సౌడాజీ దూకెను. క్రొత్తవీరుఁడు కడు నిపుణముగఁ దప్పించుకొని యుద్ధమునకుఁ దలపడెను. పోరాటము తీవ్రతరమాయెను సౌడాజీ కామాంధుఁడై హేయముగఁ బ్రవర్తించి నను, వీరుఁడగుటచేఁ దన యనుచరులను మువ్వురను దవ్వున నిలిపెను. తమ ప్రభు వేమగునో యని యా భటులును, తమ్ము రక్షింప నరుదెంచిన పురుషపుంగవుఁ డేమగునో యని తండ్రి కుమార్తెలును తెప్పవాల్పక తత్తరపాటున నిరీక్షించుచుండిరి. బలసినవృష భముల భాతి నా యోధులిర్వురు సమాన బలదర్పలాఘవములతోఁ బోరాడిరి. తుదకు దుష్ప్రవర్తకుఁడగు సౌడాజీ, తీవ్రఖడ్గప్రహారణమున బలము సెడి, నేలకూలెను. వాని యనుచరు లిఁక సహింపనేరక దురంతక్రోధఘూర్ణితవ్యాఘ్రముల వలె నొక్క యుదుటున నా విజ యుని దాఁకిరి. యుద్ధనిపుణుఁడగు నా వీరుఁడు సముచితముగ నొక గోడచెంతకు నరిగి, నిజకరలాఘవము వెల్లడి యగునట్లు నిశితకర వాలమును వడివడి తళతళ మెఱపించుచు వైరుల వారింపఁ గడం గెను. అందొకఁడు ఒక్కపోటున నేలఁబడి దురంతమరణవేదన ననుభవించుచుండెను. తోడనే మిగిలిన యిరువురు ద్విగుణీకృతక్రోధ వ్యథోద్దీపితులై, భయంకరవైరిమస్తకవిదారణకార్యైక తత్పరులై,

యున్మాదముల చందమున హుంకరించి, యా వీరవరునిపై లంఘించిరి. ఆతని యవస్థ కడు నపాయకరముగ నుండెను. కరాళమృత్యు దంష్ట్రి వలె నొక క్రూరకృపాణ మాతని కంఠముపై మెఱయుచుండెను. మన వీరుఁడు భీమపరాక్రముండైనను, కడు డస్సి యుండెను. ఒక్క క్షణమున నాతని యుత్తమాంగము భూమి నలంకరింప నుండెను. అట్టి మహాకష్టసమయమున షేకుపుత్రికయగు 'మఖ్లాటను' క్రోధో ద్దీపితయై, అమేయబలపరాక్రమసమన్వితయై సౌడాజీ ఖడ్గము రయమునఁ దాల్చి, చేయి యెత్తిన యా భటుని ప్రక్క నొక్కపోటు పొడిచెను. అంత మూడవభటుఁడు సుళువుగా విగతాస్త్రుఁడాయెను. గర్వితకాంతాపహరణావసరసంగరమా తెఱంగున నంతరించెను.

మన వీరుఁడు విజయుఁడైనను, ఆతని వామభుజమున గట్టి గాయము తగిలెను. గ్రామస్థు లరుదెంచి తక్కుంగల క్షతగాత్రుల కుపచారములు నల్పుచుండ, షేకు విజయుని, దన కుటీరములోనికిఁ గొంపోయెను. సుందరాంగియగు మఖ్లాటను నిజమానరక్షకసేవావర తంత్రయై రక్తపూరితమగు నాతని భుజమును భద్రముగఁ గట్టెను. ఆ బింబాధరసమున్నతాకారము, సముజ్వలరూపవైభవము, వికసిత తారుణ్యలావణ్యములం దిలకించి, దిశాంతముల పర్యంతము వ్యాప్తి గాంచిన యా సొగసులాడి సౌందర్యప్రశంస యతిశయోక్తి కాదని విజయుఁడు గ్రహించెను. ఆ సమయమున నా దివ్యసుందరవిగ్రహ మష్టాదశవర్షప్రాయయై, పరిపూర్ణయౌవనవిరాజితయై మన్మథుని బాణమోయన దీపించుచుండెను. విజయుఁడు విగతధైర్యుఁడై మోహ విభ్రాంతుఁ డాయెనని వేఱుగఁ జెప్పవలయునా ?

గాయము కట్టువడినంతనే, విజయుఁడు సేద దేఱెను. మఖ్లాటను అతిథిపూజాతత్పరయై, భోజ్యపదార్థములను బల్లపై నాయత్తపఱచు చుండెను. షేకు సముచితసంభాషణంబుల విజయుని ధైర్యపరాక్ర

మౌదార్యముల నుగ్గడించి, తన కృతజ్ఞత వెలిబుచ్చెను. వినయగుణ విరాజితుఁడగు నా యువకుఁడు తనకు సపర్యలొనరించునాతరళనయన స్త్రీజన సహజదౌర్బల్యము నతిక్రమించి, శక్తిస్వరూపిణియై, విజృంభించుటచేతనే విజయ మలవడెనని మందహాస మొనరించుచుఁ బలికెను. తోడనే యా రమణీమణి భాసురవదనము సంధ్యారుణరాగ రంజితంబాయెను. నాఁటి మర్యాదననుసరించి యా మెఱుఁగుఁబోఁడి యా చెంగట నిలుచుండి వడ్డనచేయ, వా రిరువురు నుల్లాసముగ భోజన మారగించిరి. అంత నా వృద్ధుఁ డిట్టులనెను—

“వీరాగ్రేసరా! నీ గాయముమాని, పూర్ణారోగ్య మలవడు వఱకు, నిందుండఁగోరెద. ప్రత్యేకముగ నమరియున్న యొక చిన్న గది నీ యధీనముననుండును. కారణాంతరములచే నీ విచ్చగింపవేని ఈ రేయియైన నిందు విశ్రమింపుము.”

“మానవోత్తమా! నే నీ ప్రాంతమునఁ బ్రచ్ఛన్నరూపమునఁ జరించువాఁడ. అట్టివాఁడు నీ యతిథిగా నుండుట కిచ్చగింతునేని—”

“ఆర్యా! నీవు మా రక్షకుఁడవు; కాన మా కెంతయు నాదరణీయుఁడవు. నీయాజ్ఞ శిరమున ధరింతుము. మహనీయా! ఆ మందిరము నీకై యమరియున్నది. ఒక్క మాట గమనింపుము. నిన్నును నన్నును బాలించురాజు మున్నొక్కనాఁడు సాయంకాల మరుదెంచి, మత్కృతసత్కారంబులు వడసి ఇందు శయనించెను. పరమాత్ముని ‘మాట’ యగు ‘ఖొరాను’ పవిత్రగ్రంథము నాతనిశయ్యపై నుంచితి. ఆతఁడు నిద్రమఱచి, జాగరముండి, బహుజాగరూకతతో నాయుత్తమ గ్రంథము పూర్తిగఁ బఠించెను. వేకువయైనంతనే యాతఁడు నిద్రాపరుఁడై, యపూర్వస్వప్నము గాంచెను. ఆతనికి దేవదూత ప్రత్యక్షమై యిట్టులనెను—

“కుమారా! నీవు దివ్యగ్రంథమును భక్తిమెయి పఠించితివి.

కావున, నీవును, నీ బిడ్డలును, బిడ్డలబిడ్డలును మాననీయులై వర్థిల్లఁ గలరు." అతఁడు తోడనే మహమ్మదీయుఁడాయెను. అతనిపుత్రులు ముగ్గురు—ఉస్మాను మొదలగువారు—కూడ సత్యమతము నవలంబించిరి.

మన విజయుఁ డాకథ కడుశ్రద్ధతో నాలించి, యా మందిరమున శయనించెను. ఉదయ మగునంతనే యాతఁడు కాల్యకరణీయముల నొనరించి, భోజనమున కరుదెంచెను. అతఁ డట కూర్చుండియుండెనే గాని, ధ్యానము కేవలము వేఱుగ నుండెను. వృద్ధునితోఁ బ్రసంగింప కుండుటయేగాక, ఏమి తినుచుండెనో యెఱుంగకుండుటయేగాక, తన కట్టెదుటనున్న యా జగన్మోహినినైనను దిలకింపఁడాయెను. వృద్ధుఁ డావిషయము ప్రశ్నింప, విజయుఁ డిట్టులనెను—

"మహనీయా! నే నొక యద్భుతస్వప్నము గాంచితి. తద్భావ మరయుటకు నాకు సాహసము చాలకున్నది. పావనచరిత్రుండవు, తదర్థ మెఱింగింప నీవ సమర్థుండవు. మహాత్మా! గమనింపుము. కడు బడలియుండిన కారణమున శయ్యాగతుండ నైనంతనే నిద్ర పోతిని. నీయం దొక చంద్రబింబ ముదయించి, ప్రవర్థిల్లి, భవదీయ వక్షస్థలమునుండి వెలువడి, నాయందు లీనమాయెను. తోడనే నా గర్భమునుండి యొక వృక్ష ముద్భవించెను. తరుశాఖలు చూచు చుండగనే దీర్ఘతరములై, అనంతములై, సమస్త సముద్రములను, సమస్త దేశముల నతిక్రమించి, మూడుఖండములనిండ వ్యాపించెను. దట్టముగఁ బెఱిగిన కొమ్మలక్రింద, 'కాకసస్,' 'అట్లస్,' 'టారస్,' 'హీమస్,' అను మహాపర్వతములు తోఁచెను. వృక్షపాదమునుండి 'టైగ్రిస్,' 'యూఫ్రటీస్,' 'నైల్,' 'డాన్యూబ్'—ఈనాలుగు మహా నదులును ప్రభవించి, కోటి నౌకలకు విహారస్థలమై, గభీరానంత మహాసాగరమువలెఁ గాన్పించెను. కొండలు, లోయలు, వనములు,

ఆరామములు, మహానగరములు లెక్కకు మీఱియుండెను. ఎటు చూచినను అర్ధేందుపతాకము సగర్వముగ నెగురుచుండెను. జనానీకములు కిటకిటలాడుచు అల్లాను ఎలుగెత్తి ప్రార్థించుచుండెను. వారితోఁబాటు వివిధవిహంగతతులు మనోహర కలకలారవంబు లొనరించుచుండెను. అంతలోఁ దిరుపత్రములు నిపుణులై కత్తులవలె గోచరించెను. అంతలోఁ బెనుగాలి చయ్యన వీవ, కొమ్మలన్నియు సల్లిబిల్లిగ నల్లికొని పోయెను; కత్తులను బోలిన యాకులు ప్రపంచము నందలి ముఖ్యనగరములపంకఁ దిరిగెను. అందుముఖ్యముగా కాన్స్టాంటునోపిలు గుఱి యాయెను. రెండు సముద్రములు, రెండు ఖండములును గలియు స్థలమున నున్న యీ నగరరాజము, రెండు నీలముల నడుమ, రెండు పచ్చలనడుమ రాజిల్లు వజ్రమువలె నుండి, అఖిలజలధి వలయవలయిత మహీమండలంబను నంగుళీయమునకు భూషణప్రాయమగు మహారత్నమును బోలియున్నది. అట్టి యుంగరము ధరింప నుఱికి. అంతలో మేల్కాంచితి!”

ఇది యొక యపూర్వస్వప్నము. విజయుఁడు విభ్రాంతచిత్తుఁడై షేకు ఏమనునోయని తెప్పవాల్పక నిరీక్షింప, నాతఁ డిట్టులనెను—

“కుమారా! ఈ స్వప్నమత్యుత్కృష్టము, అమితశుభప్రదము. కాని, ఈ సమయమున వివరములను దెలుపఁజాలను. రణరంగముల స్వైరవిహార మొనరించి మహావీరుండవు కాఁగలవు అచిరకాలమున మనము మఱలఁ గలసికొందుము. అప్పు డీస్వప్నభావము పూర్తిగ నెఱింగించెద.”

విజయుఁడు హర్షపులకాంకిత శరీరుఁడై, నిజప్రేమైక నిధానమగు మఖ్లాటను కాంతామణిని వీడియుండుట కష్టసాధ్యమైనను, అందుఁ దడయఁజాలక, పూజ్యుఁడగు షేకు నాశీర్వాదము వడసి ప్రయాణ మొనరించెను.

ఒక సంవత్సరము గడచినను, విజయుఁడు రాకుండెను. పద్మబాంధవు నెడబాసిన పద్మినివలె నాపద్మినిమణి మల్లాటను ముకుళితవదనయై దుర్భరవియోగానల తప్తయై, కృశించుచుండెను. జనకుఁడు తదవస్థ గుఱించి ధైర్యము గఱపఁబోయెను, కాని, భగ్నమనోరథుఁడాయెను.

షేకు నివసించుచుండిన బిలేడీ గ్రామము గ్రీసు రాజ్యాంతర్భాగమై యుండెనని చెప్పియుంటి గదా. ఆసమయమున కాన్స్టాంటినోపిలు కూడ గ్రీకుల యధీనముననే యుండెను. గ్రీకుల రాజ్యము విచ్ఛిన్నమగుచుండినను, ఇంకను నిలిచియుండెను. ఈ షేకుయొక్క మతబోధలచే, చాలమంది మహమ్మదీయులగుచుండిరి. మహమ్మదీయుల సంఖ్య క్రమముగా నధికతరముగు చుండెను. తుదకు బిలేడీ పరిపాలకుఁడగు గ్రీకు ప్రభువు ఇంకను ఉపేక్షించుట యపాయకరమని యెంచి, షేకును శిక్షించినచో నుపద్రవము తొలంగునని భావించి, ఆతని శిక్షించు నెపమున నాతఁ డింట లేని సమయమున నాతని పుత్రికను రయమునఁ దన దుర్గమునకుఁ గొంపోయెను. ఆ ప్రభువు చర్యకు గారణాంతరము గూడఁ గలదు. మల్లాటను నిరుపమాన సౌందర్యము గుఱించి వినియుండెను. కావున, మహమ్మదీయ మతప్రచారకుని శిక్షించుటయే గాక, ఆసుందరి పొందు కూడ లభించునని యెంచి యాతఁ డట్టి దురాచారమునకుఁ గడంగెను. షేకు తన మతప్రచారము విరమించుట కంగీకరించునేని, యాతని బిడ్డ నాతని కొసంగవచ్చునని యా ప్రభువు భావించెను.

శూన్యగృహము గాంచినంతనే షేకు హృదయము చెక్కలాయెను. తోడనే యాతఁడు తన దేశాధిపతియగు 'ఎర్టోగ్రుఘులు' చెంతకుఁ బోయి, తన దురవస్థ విన్నవించి, తన పుత్రికనుఁ దన వశమొనరింపవలయునని ప్రార్థించెను. నృపాలుఁడభయ మొసంగెను:

వృద్ధుఁడు ముదమంది, నిజనివాసమునకుఁ బోయెను.

రాజు సహస్రమాసములు నిండినవాఁడు. ఆతని జ్యేష్ఠ కుమారుఁడగు 'ఊస్మాను' రాజకార్యములను జక్కఁబెట్టుచుండెను. ఆతఁడు సత్పరిపాలకుఁ డగుటయే గాక, కడువివేకవంతుఁడనియు, మహావీరుఁడనియుఁ బేరుకాంచెను. ఆతఁ డాపేకు సమాచారము నాలించినంతనేఁ తానే పోయి గ్రీకు ప్రభువు మదమడంచి యాకాంతను నిజ జనకున కప్పగింతునని వృద్ధ రాజుతోఁ బలికెను. రాజు సమ్మతించెను.

రాజ కుమారుఁడగు ఊస్మాను అనంతరము తన ప్రియమిత్రుఁడగు 'కేజా'ను జీరి యిట్టులనెను—

"ప్రియమిత్రమా! ఈగ్రీకుప్రభువు నుపాయముచే సులభముగా భంగపఱుపవలయు. విలువగల ఉపాయనముల నాతనికి సమర్పించి, రాఁగల శీతకాలమువఱకు మఱియొక దుర్గమున నుందుమని తెలియఁజేసి, మన ధనకనకవస్తువాహన నివహంబులఁ దన దుర్గమున దాచి యుంచవలయునని కోరుము. ఇయ్యది మన యాచారమగుటచే, నా ప్రభువు తప్పక సమ్మతించును. అనంతర కథ నడిపింప నీవ సమర్థుండవు."

మిత్రుఁడగు కేజా కడు నిపుణుఁడు. సమరవిశారదులగు నలువది పురుషుల నాయత్తపఱచి, వారికి స్త్రీ వేషములు వైచి, వారితోఁ దన రాజు సామగ్రిని గ్రీకు ప్రభువు దుర్గమునకుఁ దరలించెను. ఆ ప్రభువా మోసము నెఱుంగక, సమ్మతించెను. సమ్మతించుటయే గాక, దురాశాపరుఁడై, కేజానుఁ బిలిచి, రహస్యముగా నిట్టులనెను.-

"ఆర్యా! నీవు మహనీయుఁడవు. నీ యమూల్య సాహాయ్యమున నొక్క కార్యము కావలయు. మీ రాజ్యము నావశము కావలయు. మంత్రివై, సర్వాధికార సమన్వితుఁడవై, రాజ్య తంత్రము నీవు

త్రిప్పవచ్చును. పేరునకు నేను రాజుఁ గాని, తదధికారమంతయు నీ హ స్తగతమై యుండును. మిత్రమా! నావిన్నపము మన్నించి "మన పరస్పరక్షేమము గు ర్తించి కార్యమునకుఁ గడంగుము."

కేజా ఇట్లు బదులాడెను——

"ప్రభువరా! నీ యాశయము కడు శ్లాఘనీయము. చేయఁగల సాహాయ్య మొనరించి కృతార్థుఁడ నాయెద. మన భాగ్యవశమునఁ దగు సమయము కూడఁ జిక్కినది. ఉస్మాను అచిరకాలమునఁ బ్రయాణ మొనరించుగదా. మార్గమధ్యమున నన్ను కొండప్రక్క నీవు యోధజనసహితముగా కాచియుండుము. ఉస్మాను అరుదెంచు నంతనే పిడుగువలెఁ బడి, యాతనిఁ గడ తేర్చి, రాజ్యలక్ష్మి గ్రహింపఁ గలవు. పోయి వచ్చెద, సెలవిమ్ము."

కేజా రాజద్రోహి కాఁడు, విశ్వాసఘాతుకుఁడును గాఁడు కాని, ద్రోహిని ద్రోహముచేతనే బరిమార్పవలయునని యెంచి, యట్టు లొనరించి, ఆ విషయమును రాజకుమారుఁడగు ఉస్మానునకు నివే దించెను. రాజకుమారుఁడు సంతుష్టాంతరంగుఁడై తన మిత్రు నెంతయు నభినందించెను.

ఆమఱునాఁడు వృద్ధరాజు తన జ్యేష్ఠకుమారుఁడగు నూస్మానును జేరఁబిలిచి యిట్టు లనెను——

"తనుజా! నా కాలము సమీపించినది. ఇఁక జీవింపఁజాలను. నా యంత్యోపదేశము గమనింపుము. చిన్ననాఁటినుండియు ధర్మము నతిక్రమింపక మెలంగితి. నా జన్మభూమినుండి నాలుగువందల కుటుం బములను వెంటఁ బెట్టికొని, పెక్కు పోరాటము లొనరించి, ఈ యాసియా దేశమున కరుదెంచితి. ధర్మము సాధారణముగ బలహీనుల యందే యుండును. ఏ కలహమునం దైనను, నే నెల్లపుడు బలహీనులకే తోడ్పడుచుంటిని. కుమారా! నీవును అట్టులే యాచరింపుము. రణ

మొనరించునపుడు సమానవైరినరయుము. దుర్బలులు, దౌర్భాగ్యులు నగు గ్రామస్థులను దోపిడిచేయుకుము. అయ్యది కేవలము కాలయాపనమే కాని, శ్రేయస్కరము కాదు. నీ వైరులను మూలచ్ఛేద మొనరించి, నేను స్థాపించిన రాజ్యమునుఁ బెంపుచేసి యశోవంతుఁడవు కమ్ము!"

వృద్ధరాజు శీఘ్రముగ మరణించెను: ఊస్మాను ఆసియాదేశమునకు రాజాయెను. అంతలోఁ బ్రయాణసమయ మరుదెంచుటచే, సముచిత ప్రయత్నము లొనరించి, సైన్యసమేతుఁడై యాత్రకు బయలుదేరెను. ఊస్మానుపై నాకస్మికముగాఁ బడవలయునని గ్రీకు ప్రభువు స్వల్ప సైన్యముతో మార్గమధ్యమునఁ బొంచియుండెగదా. ఊస్మాను ఆ రహస్యము నెఱింగియే యుండెను. ఆ పరమరహస్య మెఱుంగని గ్రీకులు, ఎన్నఁడు వైరులపైఁ బడి చించి చెండాడెదమా యని తత్తరపాటుతో నిరీక్షించుచుండిరి. అంతలో నుఱుముని పిడుగులవలె నూస్మాను సైనికులు నలుదెసలనుండి రయంబున నరుదెంచి, సింహనాద మొనరించి, గ్రీకుల నందఱనుఁ దెగనఱకిరి. అందు గ్రీకు ప్రభువు సహితము తెగటారెను. ఈ లోన, స్త్రీరూపమున గ్రీకు దుర్గము ప్రవేశించిన ఊస్మాను భటులు గ్రీకు ప్రభువు వెడలినంతనే తమ వేషములఁ బోఁ ద్రోసి, ఖడ్గములఁ బూని, కావలియున్న గ్రీకు భటులను సంహరించి దుర్గము నాక్రమించిరి.

సంధ్యాసమయ మాయెను. దుర్నిరీక్షుఁడై వెలింగిన సూర్యుఁడు శాంతము వహించెనో యన జల్లదనము వహించి మనోహరాకారుఁ డాయెను. పక్షులు కలకలస్వనంబు లొనరించుచు దమతమ గూండ్లకుఁ బోవుచుండెను. వృద్ధుఁడగు షేకు పరమాత్మునకుఁ బ్రణామము లాచరించి, పట్టెడోగిరము కుడిచి, గుమ్మమునఁ గూర్చుండి, అలికిడి యగునంతనే తన పుత్రికయే యరుదెంచుచుండెనని ప్రకంపితశరీరుఁ

డై యిట్టట్టు పరికించుచుండెను. పాప మాతని కనుదిన మదియే పని. నాఁడును అట్టులే యాతఁడు నిరీక్షించుచుండ, గుఱ్ఱముల చప్పుడు వడివడి వినవచ్చెను. వృద్ధుఁడుద్విగ్నహృదయుఁడై పరికింప, అశ్వికులు పెక్కండ్రు తనుత్రాణాది యుద్ధపరికరములఁ దాల్చి యరుదెంచుట కాన్పించెను. వృద్ధుని హృదయావేగము దశాధిక మాయెను. షేకు ఱెప్ప వాల్చునంతలో నొక యోధుఁడును, వాని ప్రక్క నొక్క యబలయుఁ గాన్పించిరి. వీరుఁ డెవ్వఁడు? వీరు డెవ్వఁడైన నేమి, ఆ కాంత యెవ్వతె? షేకు పుత్రికయగు మల్షాటనే యగునా? వృద్ధున కేమియుఁ దోఁపకుండెను. అతని చిత్తము వర్ణనాతీతముగ నుండెను. విపరీతాశానమాన మారుతములచే నాతని హృదయము మిక్కిలి కలగుండువడెను. కాని, అనుమాన మంతరించెను, ఆశ సఫలమాయెను, షేకున కత్యంత ప్రియతమమగు తన బిడ్డయే కంటఁ బడెను. అప్రక్క నున్న వీరుఁడే తొల్లిఁటి విజయుఁడు. షేకు ఆనందపరవశుఁడై యిట్టులనెను—

“కుమారా! దుర్జనుఁడగు సౌదాజీ బారినుండి నాఁడు తప్పించిన వాఁడవు నీవు. నేఁడును నా పుత్రికను నా కొసంగి యమితోపకార మొనరించితివి. ఆర్యా! ఇప్పుడైన నీ నామధేయ మెఱింగింప వేఁడెద.”

అంత నునుజెక్కులు సిగ్గున నెఱ్ఱవాఱ, మోమునఁ జిరునగవు తూగాడ, నాతని పుత్రిక యిట్టులనెను—

“తండ్రీ! భూపాలునకు సత్వరము ప్రణామ మాచరింపుము. ఈ మహావీరుఁడే ప్రసిద్ధిగాంచిన ఉస్తాను మహారాజు!”

షేకు విస్మయానంద పరవశుఁడై వినయ వినమితగాత్రుఁడాయెను. అతని వారించి, ఉస్తాను ఇట్టులనెను—

“మహానీయా! విజయుఁడు కోరు ప్రత్యుపకారమియ్యది. ఈ కలహాంసనుఁ గాంచినంతనే దృఢతరానురాగబద్ధుఁడనైతి. నాఁటఁగోలెనీ

దివ్యసుందరవిగ్రహము మదీయ హృదయఫలకమున నాటియుండెను. ఈ సుందరి నిరుపమాన సౌందర్యవతియని విని కన్నులార గాంచవలయునని ప్రచ్ఛన్నరూపమున నరుదెంచి ధన్యుఁడనైతి. ఈ కన్నియను నా కొసంగుటయే నీవు చేయఁగల ప్రత్యుపకారము. మహనీయా! ఈ జగన్మోహిని సౌందర్యమునకు వశంవదుడనై, చిరకాలమిందుండ వలసినవాఁడనే. కాని, నాఁటిస్వప్నము తలంచి, యఖండ వైభవోపేతుఁడు కావలసినవాఁడు, జడుఁడై నిలువరాదని యెంచి వెడలితిని."

తోడనే షేకు ఇట్లులనెను.—

"కుమారా! స్వప్నఫల మప్పుడే ప్రారంభమాయెను. నా పుత్రిక మల్లాటను కరగ్రహణ మొనరించితివి. నా దేహమునుండి వెలువడి నిన్నాశ్రయించిన చంద్రబింబమియ్యదె. ఇఁక స్వప్నవృత్తాంతము పూర్తిగ వివరించెద. నీ యందు ప్రాదుర్భవించిన వృక్షము నీ వంశమును సూచించును. ఆవృక్షమువలెనే నీవంశము ప్రవర్ధిల్లును: నీ వంశజులు మూఁడుఖండములను స్వాధీనపఱచికొని పరిపాలింతురు. నీవు పేర్కొన్న మహాపర్వతములన్నవో, మీ వంశ సామ్రాజ్యమునకాధారభూతములగు కహోరములు. నైలు మొదలగు మహానదులు వాని చుట్టు ప్రవహించును. నీవంశముతోఁ బాటు పవిత్ర మహమ్మదీయమతమును విజృంభించును. అఖలదేశములందును అల్లావారి నామస్మరణము గంభీరముగ ప్రతిధ్వనించును. వివిధవిహంగముల కలకలనినదంబుఁల బోలు వివిధభాషలాడు వివిధజనానీకములను నీ వంశజులు శాసింతురు: నీవు గాంచిన యాకులఁబోలిన వాడికైదువులఁ దాల్చి, కాన్స్టాంటినోపిలు మొదలగు ప్రసిద్ధ రాజధానుల నాక్రమింపఁగలరు. ఇట్టి ఖండ ఖండాంతర మహాసామ్రాజ్యము నీ వొక్కఁడవు గడింపనేరవు. నీవు ధరింపనేరని ధగద్ధగితాంగులీయము నీ వంశజులు తాల్పఁగలరు!"

ఊస్మాను రాకొమరుని సుందరవదనము సంతసోత్సాహములచే దీపింప నిట్టులనెను.—

“మహనీయా! స్వప్నఫల మిటులుండుననియే నేనును భావించితి. కాని, ఇంతటి మహదైశ్వర్యము తలపెట్టుటకు సాహసముచాలక ముగ్ధుఁడనైతి. నేనపుడు కేవలము సామాన్యునివలె నీయాతిథ్యము గాంచితిగదా. కాని, సామాన్యరూపముననే ఈమానినీమణి హృదయము నాకర్షింపఁజాలి ధన్యుఁడనైతి. ఈకన్నియ నాయర్ధాంగియై, నాభాగ్యాధికార వైభవము పాల్గొను గాక.”

ఆమఱునాఁడే వారి వివాహము జరిగెను. ఊస్మాను రాకొమరుని స్వప్నము పూర్తిగ సిద్ధించెను.

## ౭

## గుప్తద్వారము

ఖలీలు కథ పూర్తియాయెను. వారెల్లరుఁ గడుశ్రద్ధతో నాలించిరి. గుల్నారు లూకానులును, తైరజా జూలియనులును తమ తమ రహస్య ప్రణయసంభాషణముల మఱచి, తత్కథాశ్రవణకుతూహలాధీనమనస్కులైరి. జులేఖా యన్ననో, నిశ్చలచిత్తయై, నిజమనోహరుని సుందరగంభీరాననమున దృష్టినిల్పి యాలించెను. కథానిర్వచనసమయమున తత్సందర్భానుసారముగ నాతురుష్కయువకుఁడు తన మనోహర కంఠము సవరించునపుడా మోహనాంగి ఆనందపరవశయగుచుండెను. అందు ముఖ్యముగా, రాజకుమారుఁడగు నూస్మాను, నిజనామధేయ మెఱింగించు నవసరమున, ఆ హేమగాత్రికి గలిగిన యానందమునకు మేఱలేదు. ఆమె సహజసుందరవదనము భాసుర

తరంబాయెను. ఉత్సాహాతిరేకమున నందఱు నెద్దియో యనుచుండ నా కంజాక్షి యొక్కతెయే, తత్కథాసారస్యము పూర్తిగ గ్రహించి నట్లు, మౌనము వహించి ధ్యానైకతత్పరయై యుండెను. కథ ముగిసి నంతనే, యెల్లరుఁ దమ యభినందనాలాపములతో ఖలీలుని ముంచి వైచిరి. జులేఖా మాత్రము విశాల విభ్రమేక్షణములచేతనే తన సంతసము తెలియఁబఱచెను. ఖలీలున కయ్యది పరమానందదాయకంబై యుండెను.

ఇఁక దాల్తబను పాషా యవస్థ వర్ణనాతీతము. కథారంభముననే యా ముసల్మాను ప్రభువు చేతియందలి హుక్కాగొట్టము జారి పోయెను. పాషా యా విషయ మెఱుంగక దురంతదాహార్తుని చందమున, మైమఱచి కథామృతపాన మొనరింప దొడంగెను.

పాషా పరవశాత్మకుఁ డగుటకుఁ బెక్కు కారణములు కలవు. కథలు, చిత్రకథలు, చరిత్రలు మహమ్మదీయులకు సాధారణముగా గడు ప్రీతికరములు. ఖలీలుని కథ వివిధరసపూరము. అందు వీరరస మొకటి. పాషా వీరుఁ డగుటచే, నాతని చిత్తమున నడఁగియుండిన వీరోత్సాహ ముద్రేకించి బహిర్గతమాయెను. ఖలీలు కథ ప్రణయప్రపూర్ణమగుటచే, పాషా వృద్ధుఁడయ్యు యువజనసహజసంతసోత్సాహపరవశుఁ డాయెను. మఱియు, ప్రసిద్ధమగు అటోమను సామ్రాజ్యమును శాసించు వినిర్మల యశోవిభాసురమగు ఉస్మాను రాజవంశముయొక్క తొల్లిటి వైభవచారిత్రము వ్యక్తపఱచు గాథ యగుటచేఁ గూడ నమితప్రీతికరంబుగ నుండెను. మఱియొక కారణ మెద్దియన, ఖలీలుఁ డిట్టికథ చెప్పుట కెద్దియో కారణముండవలయు నని భావించియుండుటచే, పాషా యన్యాలోచనారహితుఁడై ముగ్ధుఁ డాయెను.

పాషా యాలోచనాపరుఁడై కొంత తడవూరకుండి, తురుష్క

యువకుని వదనముపై దృష్టినిల్పి, యిట్లు పలికెను.—

"ఆర్యా! నీ కథ మిగుల నానందదాయకము. మేమెల్లరము సంతసించితిమి: కాని, నీ యభిప్రాయ మేమని గ్రహింపవలయు?"

"అభిప్రాయమా! మన దేశచరిత్ర నాకుఁ బరిచితమని మీరు గ్రహింపఁదగును. ప్రభువరా! నీవు గమనింపవలసిన విషయమియ్యది. ఇట్టి కథలు మఱి యేడారు నాకుమనోగతమ్మై యున్నవి. తత్కథామణుల ముందు నియ్యది గాజుపూసవలె నుండును."

పాషా యొకింత విసువున, "మిగుల నాలస్యమైనది, లేదేని—" అని యింకను జెప్పఁబోవు పాషాను వారించి, ఖలీలుఁ డిట్లనెను.

"రేపు సాయంకాలము కానిమ్ము. మీ కానంద మొడగూర్చుటయే నా కానందదాయకము."

పాషా నిట్టూర్పు విడిచెను.—

"ఎట్లు పోసఁగును? మఱియొకసారి మీరు నా జనానాయందుఁ బ్రవేశింపవలసివచ్చునే. కాదేని, మన మిరువురమే కూర్చుండవలయు."

"ఆర్యా! ఇంక నా ప్రభావ మేముండు? కథ రసవంతముగ నుండవలయునేని, కథకుఁ డుత్సాహపూరితుఁడై యుండవలయు. కథకున కుత్సాహ కారణములు రెండు. వాని మానసము నిశ్చలముగ, నిర్మలముగ, చింతారహితముగ నుండవలయు. రెండవది, అంగనాజన సందర్శనము. కావున, ఈ శ్రోతలెల్లరు నెల్లియు నుండవలయు."

"అసంభవము! అసాధ్యము. నాశుద్ధాంతము తరుణ యువజన విహారణస్థలమగునేని, నాప్రతిష్ఠా గౌరవములకుభంగముసంభవించును. అనూనాధికారవైభవగర్వితుండనగు నాకుఁ దలవంపు ఘటిల్లును!"

"ఇదియా కారణము! ప్రభువరా! నీ యాతిథ్యము నా కెంతయు సంతసప్రదము, కరము వాంఛనీయము. నా మిత్రులును తదభిప్రాయ

బద్ధులనియే నిబ్బరముగ నాడఁగలను. కావున, రేపటి సాయంకాలము వఱకు మమ్మిందే యుంచి వలయు రక్షకభటులఁ గాపుంచుము. మఱి యేమైన నొనరింపుము, అభ్యంతరము లేదు."

పాషా మనఃపూర్వకవిలోకంబున ఖలీలునిఁ దిలకించెను. ఆప్రభువు మానసము మగుడ గాఢానుమానబాధితమాయెను. ఆ యపూర్వ తురుష్కుని గుఱించి మఱియు నరయవలయుననియో, కథాశ్రవణోత్సాహతమకముననో పాషా యామోదించి యిట్టులనెను.—

"సమ్మతించితి. కాని, మదీయానుగ్రహము సార్థకమగునట్లు మీరు దురితంబు లాచరింపక, సరసంబుగ సంచరింతురుగాక. పట్టీ! జులేఖా! నీ వేతెంచి చాలకాలమైనదే."

ఆ కలవాణి మధురమంజుల రవంబున నిట్లు బదులాడెను.—

"మామా! ఇందు నొకటిరెండు దినము లుండవచ్చునని తండ్రి యనుజ్ఞ వడసియే యరుదెంచితి. కావున నా చెలుల కభ్యంతరము లేనిచో—"

జులేఖా వాక్యము పూరింపకుండగనె, తైరజా గుల్నేరు లేక కంఠమున, దప్పక అందుండవలయునని, అతులితవినయాభిమానగౌరవము లుట్టిపడ, నుద్విగ్నచిత్తలై పలికిరి. అంగీకారసూచకముగా పాషా శిరఃకంప మొనరించెను.

అంత పాషా దిగ్గున లేచి ఆ యువకులను దన వెంట రమ్మనెను. వారు తమ మనోహారిణుల కోమలకరస్పర్శన మొనరించి వెడలిరి. అంతిపురంబునకుఁ గొంత దవ్వున నున్న యొక మందిరములోనికి వారి నాతఁడు గొంపోయెను. అందు మూడు కోణములు పరస్పర సంబంధము లేక అమరియుండెను. కోణములని అంధకారబంధురములు గాక దుర్గంధపూరితకూపములు గాక, శయ్యాదిపరికరసమృద్ధములై బాగుగనే యుండెను. ఒక్కొక్కఁ డొక్కొక కోణము ప్రవే

శించెను. ఆవల భద్రముగ బీగములు వైచి, పాషా నిష్క్రమించెను.

లూకాను జూలియనులతో మన కిపుడు పనిలేదు. తురుష్కయువకుఁడు మందిరాంతర్గతుఁడై పరికింప, నయ్యది ఉపయుక్తవస్తుసంభరితమై కాన్పించెను. వివిధరుచిరాహారపదార్థము లాచెంత సిద్ధముగ నుండెను. ఒక ప్రక్క నొక చక్కని శయ్యయు నమరియుండెను. భుజించి చాలకాల మగుటచే ఖలీలుఁడు క్షుదార్తుఁడైయుండెను. కావున, పాషా వెడలినంతనే యాతఁ డల్పాహార మారగించి, సోఫాపైఁ గూర్చుండి, గత చర్య పరంపరం దలంచి యాలోచింపఁ దొడంగెను. ఒక యనుమాన మెద్దియో యాతని బాధింప నారంభించెను. తోడనే, యాతఁడు దిగ్గున లేచి యాగది నంతయుఁ బరిశోధింప నారంభించెను. లెక్కలేని మెత్తని దిండులతో నమరియున్న సోఫా ఆ మందిరముచుట్టు నుండెను. ద్వారమునకు గవాక్షములకు మాత్ర మెడమిచ్చి యా మృదులతల్పము చుట్టు నుండెను. నేల యంతయు విలువగల రత్నకంబళముచే నాచ్ఛాదితమైయుండెను. ధగధగలాడు కాండపటములం దనేకము లుండెను. వివిధవర్ణవిరాజితములై, యపూర్వ విచిత్రచిత్రాలంకారశోభితములై రాజిల్లు చారుతరకాచఫలకములతో నా మందిరకుడ్యములు కప్పఁబడి యుండెను. పైనుండి వ్రేలాడుచుండిన వెండిదీపముకాంతి వెదజల్లుచు నొకింత పరిమళముఁ గూడఁ బర్వజేయుచుండెను. సోపానములు తెరచియుండుటచేఁ దత్సమీప సుందరారామసంచరిత మందమారుతములు మన తురుష్క పూరుషున కుల్లాసము కల్గించుచుండెను.

ఖలీలుఁడు ధగధగలాడు తెరలను పరికించి, సడలించి, గోడలయందలి గాజుపలకలను పరిశీలింప నారంభించెను. ఆతఁడు పరీక్షాకార్యనిమగ్నుఁడై యుండ, గానరవము మెల్లగ వినవచ్చినటులాయెను. తురుష్కయువకుఁడు విస్మయాక్రాంతచిత్తుఁడై యా కుడ్య

భాగము మగుడఁ దిలకింప, నాతని సంశయము నివారిత మాయెను. ఆ ప్రక్కగదినుండియే ఆ కంఠధ్వని వెలువడుచుండెను. ఆతఁ డొకింత దూర మగునంతనే యా ధ్వని యంతరించెను. గోడ నంటి యిటు నటు దిరిగి యాలింపఁ బోయిన, వినరాకుండెను. కాని, ఒక్క గాజు పలకపై మాత్రము చెవి నిల్పినంతనే, తద్గానరవము స్పష్టతర మాయెను. గాయకుఁడు తన మిత్రుఁడగు జూలియనే యనియు ఖలీలుఁడు గ్రహింపఁజాలెను. కాని, ఆ ప్రక్కనే యున్న మఱియొక గాజుపలకపై చెవియొగ్గి చూచిన, ఆ ధ్వని కడు మందమై, యస్పష్టమాయెను. ఇతర స్థలములందు సవ్వడి యేమాత్రము లేకుండెను. ఖలీలుఁడు వితర్కించెను. ధ్వని ఆయొక్క పలకచెంతనే స్పష్టతరంబై యుండనేల? తురుష్కయువకుఁడు వయసునఁ జిన్నయయ్యు, ననుభవజ్ఞుఁడు వివేకవంతుఁడు నగుటచే, నందొక రహస్యద్వార మమరియుండునని నిశ్చయించెను. ఆ మార్గము తన మిత్రుఁ డున్న గదిలోనికిఁ గొంపోవునని యాతఁడు భావించెను. ఖలీలు పెక్కు గుప్తద్వారములఁ గాంచియుండెను. కావున నాతఁ డొకింత పరిశీలించి, సాధారణముగ నగోచరమై యుండు నొక చిన్న మరఁ గాంచి నొక్కినంతనే, యొక కవాటము కడు నిశ్శబ్దముగాఁ దెఱచికొనెను. కాని, ఖలీలు భావించినట్లు తన మిత్రుఁ డున్న మందిరము గోచరింపక, మూఁడడుగుల వెడల్పుగల వివరము దృగ్గోచర మాయెను.

ఆతని మిత్రుఁడగు జూలియను అమితోత్సాహకందళితహృదయుఁడై యొక జాతీయగీతము పాడుకొనుచుండెను. ఖలీలు విస్పష్టముగా వినఁజాలెను. కాని, తన మిత్రుఁడు నిశ్చలముగా నాలాపించుటచూడ, దనసందడి యాత డెఱుంగఁడని స్పష్టమాయెను.

ఆ బిల మంధకారమయమైయుండెను. ఖలీలుఁడు రెండునిముస

ములు తదేకధ్యానముతో వీక్షింప, కొంతదవ్వున గ్రుడ్డివెన్నెలం బోలిన వెలుఁగు కడునస్పష్టముగఁ దోఁచినటు లాయెను. తురుష్కుఁ డుండిన మందిర మెత్తుగ నుండెను. అధోముఖుఁడై యాతఁ డెంత పరికించినను, రెండుమూఁడు సోపానములుతప్ప నేమియుఁ గానరాకుండెను. తన మందిరమునందలి దీపముఁగొని పరికించుట యసాధ్యమాయెను. ఆదీపము కదలించుటకు వీలులేనివిధమున నిగళబద్ధమై యుండెను. కర్తవ్యమేమి ? చెంతనున్న కాగితము గైకొని, చుట్టగ నమర్చి, వెలిఁగించి, తత్కృతకదీపికాసాహాయ్యమున ఖలీలుఁడు వివరవిమర్శన మొనరింపఁగడంగెను. ఆ దీప మంతరించులోపున నీ విషయములు తెలియవచ్చెను. మెట్లవరుస కొంతవఱకుమాత్ర ముండెను: అనంతర మొకగోడయడ్డుగ నిల్చియుండెను: అందు ద్వారముగాని, మఱి యేమార్గముగాని, గోచరింపలేదు: దీపమును గానరాలేదు. ఆ గోడచెంత నామెట్లవరుస మఱియొకప్రక్కఁ దిరిగియుండుననియు, నచట నొకదీప ముండవలయుననియు ఖలీలు వితర్కించెను.

తురుష్కయువకుఁ డప్రతిహతధైర్యపరాక్రమసమన్వితుఁడు కౌతుకదృఢసంకల్పములుగూడఁ దళుకొత్తుటచే, నాధీరుఁడు తద్రహస్యపరిశోధనాయత్తచిత్తుఁ డాయెను. తాను నిరాయుధుఁడైనను గణింపక, తదంధకారకూపమునఁ బడెను. సోపానములసంఖ్య మిగుల నధికముగనుండెను. లెక్కించిచూడఁ దాను మందిరమూలబంధము సమీపించియుండవలయునని యాతఁడు గ్రహించెను. ఆతఁడు భావించినట్లు సరిగా కుడివైపున కా మెట్లు తిరిగెను. సుమారు పండ్రెండు గజముల దూరమున నొకయినుపదీపము వ్రేలాడుచుండెను. ఆ దీపపుఁగాంతియే గ్రుడ్డిగ్రుడ్డిగ ఖలీలునకుఁ దనమందిరమునుండి కాన్పించెను.

అట్టి వింతరహస్యమార్గమునఁ జరించుచున్నను, ఖలీలుఁ డించు

కేనియు విస్మయాకులుఁడు కాలేదు. కారణ మేమి? తురుష్కుఁడనుభవజ్ఞుఁడు: ధనాధికారసంపన్నుల గృహంబులం దట్టి నిగూఢమార్గములవశ్యముండునని యెఱుంగును. సామ్రాజ్యాధిపతియగు సలీము ధర్మబద్ధుఁడై పరిపాలన మొనరించుచుండెనని వ్రాసియుంటిమి. కాని, తత్పూర్వము ప్రజాళిశలభగణములభాతి దావానలాభీల నిరంకుశత్వము వాఁతఁబడి మ్రగ్గుచుండెను. ఏ ముహూర్తమున భయంకర యమభటులంబోలిన ఘాతుకరాజభటులు కరాళకాలపాశసన్నిభ ధనుర్జ్యాదీపితహస్తులై ప్రాణాపహరణార్థ మరుదెంతురోయని పాపాలు మంత్రులు, సామంతులు సహితము భయవిహ్వలులై యుండిరి. కావున, అట్టి ఘోరమరణమునకుఁ బాల్పడకుండ తలదాచికొనుట కట్టి యదృష్టప్రదేశములు తప్పక కావలసియుండెను. మఱియు, నాఁడు ధనరాశి భద్రపఱచుట కష్టసాధ్యముగనుండెను. అది యటుండ, రాజు ఏక్షణమున నితాంతకుపితస్వాంతుఁడై, యెవ్వని భాగ్యము దోపిడి చేయించునో, యెఱుంగ నలవికాకుండెను. కావున శ్రీమంతులు అన్యజనదుస్సాధ్యములగు రహస్యధనాగారములను నిర్మించికొనుచుండిరి. ఆకారణమున విస్మయమునకుఁ గారణము లేకపోయెను. కాని, ఒక్క విషయ మగమ్యముగనుండెను. అట్టి నిగూఢస్థలమున దీపిక వెలుంగనేల ?

ఖలీలు మెల్లగ ముందుకుసాగెను—గోడలన్నియుఁ గడుఘనముగనుండెను. నేలయంతయు శిలామయము. కాని, దీపముక్రిందమాత్రమొక చిన్నకఱ్ఱతలుపు కాన్పించెను. అది యొక మఱితలుపు కావలయును. కాని, అద్దాని నెత్తుటకొకరంధ్రముగాని, మీటగానికొక్కెముగాని లేకపోయెను. ఖలీలు ఏమియునిర్ణయింపలేకపోయెను: ఐనను, దాననెద్దియో ప్రయోజన ముండుననిమాత్రము దృఢానుమానబాధితుఁడాయెను. ధనాగారమం దమరియుండునా? అసంభవము! ఏమియుఁ

దోఁపక అతఁడు మెల్లగఁ దన్నిచూడ శబ్దమాయెను. లోన గుల్లగ నుండెనని స్పష్టమాయెను. మఱియొక తాడనమున—తీవ్రతరపాద తాడనమున తద్విష యుపరీక్ష యొనరింపవలయునని ఆయత్తపడియు, తత్సమయోద్భూతభూరిధ్వని నాలించి భటులో, పాపాత్మో, యెవరు దేఱవచ్చునని లెస్సగఁ దర్కించి, ఖలీలుఁడు విముఖుఁడాయెను.

తురుష్కుఁడు రెండడుగులు వేసి నంతనే మఱియొక మెట్లవరుస గాన్పించెను. తోడనే యాతఁ డారోహించి, తదగ్రభాగముచేరెను. ఆవరున యచట మఱియొక వంకఁ దిరిగెను. ఖలీలుఁడు వాని ననుస రించిపోయి, మఱియొక యిరుపదీపము గాంచెను. ఒక చిన్న తలుప చట నోరగఁ దెఱచి యుండుట గాంచి, తురుష్కుఁ డప్రమత్తుఁడై నిశ్శబ్దముగ నందుఁ బ్రవేశింపఁ గడంగెను. కాని, సన్నని సూకర ఘుర్ఘుర రవంబు వంటి క్రమోచ్ఛ్వాసనిశ్వాసపరంపర వినవచ్చుటచే, మన వీరు డాకస్మికముగా నట్టె నిలిచిపోయెను.

ఖలీలుఁ డొక్క నిమిషము నిదానించి పరికించెను. ఆమందిర నివాసి యెవ్వఁడైనను, గాఢనిద్రావరుఁడై యుండవలయునని గ్రహించి, యాతఁడు తొంగి చూచెను. అది యొక చిన్నగది. అవ్వలి దీపపువెలుఁగు అత్యల్పముగనున్నను, కాటుక రాసిం బోలిన అతికాయుఁ డొకఁడు ఒకచాపపైఁ బరుండియుండెనని మన వీరుఁడు గ్రహింపఁజాలెను. దైవికముగాఁ గాంతివంతమగు నొక కిరణము వాని ముఖముపై బరగుటచే, తద్వికృతాకారము నయన గోచర మాయెను. వాఁడు దుస్తుల నెల్ల ధరించియే యుండెను. భీకర కాల మేఘమున మెఱయు విద్యుల్లతవలె నాదీర్ఘకాయుని చెంగట నొక దీర్ఘకరాళకరవాలము ప్రకాశించుచుండెను. వాఁడు రక్షకభటుఁడు కావలయును. కాని, వాఁడు మైమఱచి నిద్రించుటయు, వీడరాని ఖడ్గము వీడియుండుటయుఁ గాంచి, వాఁడు సురాపాన మొనరించి

యుండునని ఖలీలుఁడు గుర్తించెను. అతఁడాభయంకరాకారుని కోణము ప్రవేశింపక, వెనుదిరిగి, మఱియొక సోపానపంక్తి నయన పథంబుఁ బడినంతనే, తదారోహణ కార్యమునకుఁ గడంగెను. కాని, యొక తలుపచట సర్దుతగులుటచే, నాతఁడు మగుడ భగ్నమనోరథుఁడాయెను. ఆద్వారబంధమున కమరియున్న గడియఁ తీసి లోనికిఁ బోవనవకాశముండినటులే యుండెను. ఒకవేళ నవ్వల బంధింపఁబడి యుండవచ్చును. కాని గడియఁ గదల్చినచో, ధ్వని కావచ్చును; నిద్రించుచున్న రక్షకుఁడు మేల్కాంచవచ్చును; తలుపు వీడునంతనే, యం దెవరైన గోచరింపవచ్చును; మఱి యేప్రమాదమైన సంభవింప వచ్చును. కావున నతిసాహస మొనరింపఁబూనుట యవివేకమని యెంచి, ఖలీలుఁడు వెనుదిరిగి తనమందిరమునకుఁ బోవ నుద్యుక్తుఁ డాయెను.

ఖలీలుఁడాసోపానపంక్తి నవరోహించి, నిద్రించు నాసీలజీమూత సన్నిభ దీర్ఘకాయునిఁ గాంచి కట్ట మఱితలుపు నతిక్రమించి, నిజ మందిరాభిముఖుఁ డాయెను. ఆకస్మికముగా నతఁడు సంభ్ర మాశ్చర్య చకితుఁ డాయెను. కారణమేమి ? దీపపుఁగాంతి యావంత యుఁ గానరాకుండెను ! అతని మందిరమున నొక దీపికయుండెగదా. తత్కాంతిలేశమైనఁ దోఁపవలయును. కాని, మన వీరుఁడు పూర్తిగ తమోసాగరనిర్మగ్నుఁడై యుండెను. గాలి కొడి తన దీపమార్పి యుం డునని సమాధానపఱచికొని యాతఁడు సోపానముల నారోహించెను. కాని, తోడనే ఖలీలుఁడు శతాధిక విస్మయాక్రాంతుఁ డాయెను. కారణమేమి ? తన మందిరకుడ్యమునం దణగియుండిన చిన్న మర తలుపు తెఱచి గదా, యాతఁడు రహస్యమార్గమున విహరించుచుం డెను. ఆవిహారప్రదేశ మిపుడు కానరాకుండెను ! కానరాకుండుటయే గాక, ఆస్థలమున బంధీకృత ద్వారబంధ మొండు నిలిచియుండెను !

తురుష్కుఁ డెంత వెదకినను, మరయెనను నాతని కరమునకు దొరక కుండెను.

తురుష్కుఁడు స్థైర్యగుణమండితుఁడు. కావున, కలవరము పడక ఆతఁడు మరల్ల ఆయంధకారమున నెమక గడంగెను. ఆకీలు అచ్చటనే యుండునని యెంచి యాతఁ డతిప్రయత్న మొనరించెను. కాని, వాని ప్రయాసము వ్యర్థమాయెను. ఒకయరగంట మీఱెను. తన మందిరము చేరు మార్గము తోఁపకుండెను. అవ్వల తన గ్రీకు మిత్రుఁడు జూలియను ఉండునని సహజముగ విశ్వసించిఁ యాతఁడు మెల్లగఁ దలుపుతట్టెను. కాని, ప్రత్యుత్తరము లేదు. ఆగ్రీకు రాగాలాపంబున నలసి నిద్రాపరవశుఁడై యుండవలయు. గట్టిగఁ దట్టుట గాని, ఎలుగెత్తి సంబోధించుట గాని యనుచితము, ప్రమాద భూయిష్ఠము..

తురుష్కుని యవస్థ నిజముగ దుస్సహాజముగనుండెను. ఆలోచనాపరుఁడై యాతఁడు పరిస్థితులఁ జర్చించుకొనఁ దొడంగెను. తన రహస్య సంచరణ మెవ్వరైన గుర్తించియుందురా? గుర్తించియే ఆ దొంగ తలుపును బంధించియుందురా? అసంభవము. ఒకవేళ, పాషాగాని, ఒక భటుఁడుగాని తన రహస్యమరసియుండురుగాక. తోడనే, వా రాతని వెన్నాడి బంధింపకుందురురా? కావున నట్టి యవకాశమున కవకాశము లేదు. ఆలోచించిచూడ, నాకస్మిక మారుతాహతి నాకవాటము బిగిసికొని యుండవలయునని తురుష్కునకు స్ఫురించెను. ఏమైననేమి, వేకువకాకుండ తన మందిరము చేరనిచో, దనరహస్యము తప్పక బయల్పడునని యాతఁడు గ్రహించెను. ధీరోదాత్తచిత్తుఁడగు నామేటిమగఁడు అనద విధమున బెగడువడి తడబడుటలేదు. కాని, తన యట్టివాఁడు మాననీయ ప్రభుమందిర రహస్యవిషయ పరీక్షా కార్యోత్సాహియై విహరించిన విషయము పాషాకు విశదమగుగదా యని

యాతఁడు చింతించెను. కాని, కర్తవ్యమేమి? కడవస్థనుండి వెలువడు నుపాయమెద్ది!

మఱలుట యసాధ్య మగునప్పుడు ముందంజవేయుటయే తరుణోపాయమని మన వీరుఁడు భావించి, వెనుదిరిగి, సోపానముల డిగ్గిఁ క్రమముగ సాగి, వజ్రపాతమునఁ దెగిన నల్లని బండఱాయివలెఁ బడి యున్న భటునిఁ గాంచి, యా చక్కి నున్న సోపానముల నారోహించి, కత్కవాట బంధనాదండము సడలించెను. తలుపు సుళువుగా విడివడెను. అట మనోహరమగు మొగమలు తెర మాత్ర మడ్డుగ నుండెను. ఖలీలుఁ డా కాండపటము నల్లనఁ బోఁ ద్రోచినంతనే, సూర్యప్రభాదీపిక దీపరాజము దృగ్గోచర మాయెను! వివిధాపూర్వ మనోహరవస్తు నికరసంభృత సుందరమందిరము తాఁ బ్రవేశించితినని యాతఁ డాకస్మికముగఁ దెలిసికొనెను! కట్టెదుట ననదృశసుంద రాంగి యగు ఇస్మిల్డా మృదుల మనోహరశయ్యాగతయై యుండెను.

అట్టి విపరీత విషమపరిస్థితియం దాకస్మికముగాఁ జిక్కువడినను, ఖలీలు స్థిరచిత్తుఁడై, కృతనిశ్చయుఁడై, తా నరుదెంచిన ద్వారము నిశ్శబ్దముగా గడియవైచి, యా మొగమలు తెరను గూడ సరిదిద్ది, పాషా భార్యచే సమీపించెను. ఆ మోహనాంగి నా యువకుఁడు నాలుగు గంటలక్రిందటనే కాంచి యుండెను. ఆమె యప్పటి రుచిరాంబరములనే ధరించి, మైమఱచి, నిద్రించుచుండెను. దళమగు రత్న కంబళముపై నిశ్శబ్దముగ నడచి, యా మందిరమున కంటియున్న రెండవమందిర మాతఁడు ప్రవేశించెను. అమీనాతో నాతఁడు ముందుగఁ జొచ్చిన గది అయ్యదె. అం దెవ్వరు లేరు. అంత నాతఁడు ద్వారము సమీపించెను. కాని, కవాటము బంధింపఁబడి యుండుటయేగాకఁ తాళము లేకపోయెను. ఇఁక ఖలీలుఁ డెటు పోఁగలడు? కాని, యాతఁడు వికలచిత్తుఁడు కాలేదు. పరిస్థితు లెటు లుండునని

యాతఁడెఱింగియే యుండెను. అనుమానమునకెడమీక సమయాను కూలముగ బ్రవర్తింపఁ గడంగుటకే, యాతఁడట్టి పరీక్షయొనరించెను.

ఖలీలుఁడు మగుడ నిస్మిల్లా సతీమణి చెంతకరుదెంచి, యా వలపుల రాణి యపూర్వ శోయగము, నయనేంద్రియము సార్థకమగునట్లు వీక్షింపఁ దొడంగెను. కామ వికారోద్భూతములగు నా మోహిని వివిధాంగకములు సుప్రదర్శితములై, మనోహరములై, దర్శనీయములై రాజిల్లుచుండెను. ఆ సుధాకరానన స్వప్నము గాంచుచుండెను. రమణీయప్రవాళ సమానసుందరాధరము మందహాస ప్రచలితమాయెను. మెఱుపువలె, దోఁచిన యా లేనగవు మెఱుపువలెనే యంతరింప, నా సుందరాధరము క్రోధ ప్రకంపితమాయెను. తోడనే, ఆ యెలనాగ ముక్తాఫలధళ ధళాయమాన దంతములు ప్రకాశింప, కమనీయ మందహాస మొనరించెను. సౌందర్యనిలయమగు నావడఁతి ముఖాంబుజము సంధ్యారుణ రాగభాసురంబై, మనోహర తరంబాయెను. అగణిత సంతోషాతిశయముచేఁ గాఁబోలు, ఆతరుణి యురువక్షోజ ముప్పొంగెను. దృశ్యమంతలో మాఱిపోయెను. ఆ సుకుమార హేమగాత్రి యొక్కసారి కంపించెను: వదనసుధాకర మండల మంతలో వికృత మేఘాచ్ఛాదితమాయెను. అనంతర మాకాంత విసురున నిజకరసంచాలన మొనరింప, నరర్ఘమణిమయవిరాజిత నిశితకరవాలము మొరసి నేలపై జాఱెను. సాయంసమయమున పాపాధరించిన కృపాణమయ్యదే. ఖలీలుఁ డాలసింపక, సంతోషభరిత స్వాంతుఁడై తదస్త్రము ధరించెను. మన వీరుఁ డెంతటి ధైర్యస్థైర్యసమన్వితుఁడైనను, నిరాయుధుఁడుగదా. అనతి దూరముననే ఘోరాకారుఁడు దీర్ఘకరవాలము దాల్చియుండెను. ఖలీలుఁ డతిసాహసకార్యభారము వహించియుండెను. ఎట్టి యపాయమైనను సంభవింపవచ్చును. మఱియు, నాతఁడిట్లు చింతించెను—

"ఇఁక భయమువలదు. ఈకాంత మేల్కాంచిన యనంతరము మదీయాభిప్రాయమునకు విరుద్ధముగా మెలంగిన మెలంగుఁగాక! ఇంతదనుక నిరాకరించితినని క్రోధఘూర్ణితయై, ప్రతిక్రియారచనసంకల్పధురీణయై యుండిననుండుఁగాక! ఆత్మసంరక్షణ మొనరించుకొనఁ జాలుదు."

తురుష్కుఁ డట్లు చింతించుచుండఁగ సిస్మిల్లానతీమణికి నిద్రాభంగమాయెను. ఆ నీలోత్పలదళవిశాలనయనలగు కనుఁగవ మెల్లఁగఁ దెఱచుచుఁ బరికింప, దా నింకను స్వప్నావస్థయం దుండినటులే తోఁచెను. అమితసంతోషవ్యాకులప్రకంపితమానసయయ్యె, కన్నెదుట నున్న మోహనమూర్తిని—ఖలీలుని—తిలకించి, ఆ మోహనాంగి ప్రబోధితాత్మయై, అనిర్వాచ్యానందకందళితయై, ఆ నవమోహనాకారుని యపూర్వసోయగముఁ గాంచి, పరవశాత్మ ఆయెను—

"మోహనాంగా! నీవే యరుదెంచితివా! అపూర్వచిత్తవిభ్రమము కాదుగదా! ఆహా! ఏమి, నీ సోయగము! ప్రసన్నసుందరాననము! నిరుపమానము! వర్ణనాతీతము! నిశ్చలానందప్రదము!—"

మోహపారవశ్యమున నా కులుకులాడి మన తురుష్కవీరుని రూపురేఖావైభవములఁ దడబడుచు నభివర్ణింపఁ దొడంగెను. ఖలీలుఁడు నిజముగఁ బ్రసన్నవదనుఁడై యుండెను. వాని సహజసుందర వదనమండలము మనోహరమందహాసవిరాజమానమై, శతాధికశోభాయమానమాయెను. తొల్లిఁటి కాఠిన్యగాంభీర్యములు వీడి, యాతఁడు కాంతాజనచిత్తాపహరణక్రియాదక్షుఁడగు మన్మథకుమార సన్నిభుండై దీపించుటచే, నా ప్రౌఢ సహజముగ దశాధిక మోహవిభ్రాంతచిత్తమాయెను.

"సరసజ్ఞా! స్వప్నమున నిన్నే కాంచుచుంటి. కనువిచ్చినంతనే, నీ దివ్యమోహనరూపమే నా నయనములకు విందొనరించెను. సుకు

మారా! నీవు నన్ను వలచితివట, నే నమితానందపరవశనైతి. పిమ్మట నీవు తిరస్కరించితివట, నేను క్రోధవివశనైతి. నీ వంత తుంటరివై పలుభాషల నన్ను దూరఁ గడంగితివట, తోడనే దుర్భరక్రోధానల తప్తహృదయనై, ప్రకంపితశరీరనై, పాషాఖడ్గము నంద చేఁజాపితి. ఎన్నఁడు మఱువని ప్రభువు నేఁడేలకో తన కృపాణము నిందు డించి పోయెనని ఎట్టులో కలయందైన నెఱింగియుంటి. తదస్త్రము నా చేతికి దొరకలేదు. నీ వంతలో సుధాకరబింబమువలె సుందరశీతల మందహాస మొనరించితివి: నేను మేల్కాంచితి. సుందరాంగా! నిన్ని పుడు ప్రత్యక్షముగఁ గాంచితి; నీ యపూర్వరూపవైభవసందర్శన జనితానందము మనసార ననుభవించుదానను; సుధారసపూరమగు నీ యధరముపై, వినిర్మలభాసురవిశాలవదనముపై, నయ్యాదె మధుర మందహాసము తాండవించుచున్నది! కలయని ఎట్లు భ్రమింపఁ గలను?"

నితాంతకామోద్రేకపూరితచిత్తయగు నా మదవతి నిజహృద యావస్థ నుద్విగ్నమంజులకంఠమున వడివడిఁ దెలుప, నా తురుష్క వంశాబ్ధిచంద్రుఁడు మందహాస మొనరించి, మధుర మురళీకంఠమున సరసముగ నిట్లు బదులాడెను.—

"మోహనాంగీ! హృదయము మానవాధీనము కాదను పాఠము నాకు నేఁ డనుభవైకవేద్యమాయెను. సుందరీ! నిక్కము దాపనేల? మదీయహృదయ మాలావణ్యవతి, జులేఖాయధీనమాయెనని భ్రమిం చితి. నిన్నుఁగాంచియు, తద్భ్రమావిభ్రమచిత్తుఁడనై, మందుఁడనై, నీమోహంపుఁ బలుకుల నాలింపక నీసమక్షమునుండి వెడలితి. శయ్యా గతుఁడనైనంతనే, భవదీయనిరుపమాన సముజ్జ్వలాకారము మదీయ హృదయపారావారముపై నుదయించి, కలంచి నన్ను వికలస్వాంతు నొనరించెను. ఇఁక జులేఖాగుఱించి తలంపనైనఁదలంపజాల. నారీమణీ!

హృదయము విచ్చి చెప్పితి. దుర్భరాందోళితమానసుఁడనై, శయ్యపై నిలువఁజాలక, భవదీయ రమణీయపాదపంకేరుహములపైఁ బ్రాలిఁ మత్కృతాపరాధము మన్నింపఁ బ్రార్థింప నేతెంచితి.”

ఆనందరుద్ధస్వరమున నా మంజుభాషిణి యిట్టు లనెను.—

“మోహనాంగా! నిక్కముగ నదృష్టవంతురాలను! నా వీనుల సుధారసధార లొలికించి, నన్ను ధన్యాత్మ నొనరించితివి! కాని, సమరకార్యాతురిని చందమున, నా పగిది దవ్వున ఖడ్గము నూఁతఁ గొని, నిలుచుండనేల?”

“వనితామణీ! ఈకృపాణము నీ హస్తచాలనమున పదభ్రంశ మొందెను. మోహనసుకుమారకోమలాంగి కరపద్మమున కియ్యది యనుచితమని యెంచి నేఁ దాల్చితి.” అట్లు పలుకుచు నా కరవాలము నొక సోఫాపై విసరి, ఆతఁడు గర్వరహితుఁడై, వినమ్రుఁడై, మోఁకరించి, ప్రేమనుయవీక్షణుండై యిట్టు లనెను.—“ఇస్మిల్లా సతీమణి నా తొంటి యపరాధము సైరించునా?”

“సైరించును! మోహనాంగా! తప్పక సైరించును!—” అట్టు లుద్విగ్న స్వరమునఁ బలుకుచు నా కులుకులాడి మోహము నడంపఁ జాలక సుందరహారి దంతవిస్ఫురితబాహువల్లరుల రయంబునఁ జాపి, నిజపీనవక్షోజము పొంగార, నా తురుష్కుని కంఠము నాలింగన మొనరించెను.

భామినీ భుజపంజరబంధితుఁడైన యా వీరుఁ డల్లన విడిపించుకొని, తదసంగత కార్యమున నా సుందరీమణి యలుక వహింపకుండ నామె ప్రక్క నాసీనుఁడై, యిట్టు లనెను.—

“కాంతామణీ! ఒక్క పలుకు గమనింపుము. ప్రసిద్ధ ‘కార్మోనియా’ ప్రభువంశసంభవుఁడ నగు నేను తదుచితముగ మెలంగి, మదీయ గౌరవౌదార్యములకు భంగము వాటిల్లకుండ సంచరించి,

భవదీయప్రేమాభిమానములకుఁ బాత్రుఁడ గాఁ గోరెద. జులేఖా మదీయహృదయాధిపత్యము వహించితినని విశ్వసించియున్నది. ఆ కన్నియ చెంతకే నేగి, పొరపడితినని తెల్లముగఁ బలుకుదునేని, నా హృదయభార మడంగును. ఈ కార్యము రేపు కావలయు. అనంతరము భవదీయ కమనీయపాదసేవాపరాయణుఁడనై, యమరసౌఖ్యపరవశుఁడనౌదు.”

ఇస్మిల్డా చిత్తము కామాయత్తమై యుండెను. తన చెంగట నున్న యానవమోహనాకారుని యపూర్వసోయగము కాంచుకొలఁది నా మత్తకాశిని చెప్పరాని యానందము ననుభవింపఁ దొడంగెను. ఖలీలుని సమాధానముచేఁ జిత్త మొకింత చివుక్కుమన్నను, బేసిసల నీనడించు కన్నుగవ మోహార్ణవమున మనోహారముగఁ బరిభ్రమింప నా వగలాడి యమితోత్సాహమున నిట్టులనెను.—

“మోహనాంగా! అట్టులే కానిమ్ము. జులేఖాతోడి సంబంధము రేపు విచ్ఛిన్నమగు గదా. అటుపై నీవు నా వాఁడవు! కాని, సుందరాంగా!—సాధ్యమగునా?—ఎద్దియో యొక నెపమున—”

“ఒకటి రెండు దినము లీ మందిరమున నుండవలయుననిగదా! తరుణీ! సందియము వలదు. ఆ భారము నాయది.”

తురుష్కుఁడా తెఱంగున నా చిత్రాంగి మనోభావము లక్షించి యమృతోపమానమగు పలుకుల నాడుటచే, నా కామిని యనిర్వాచ్యానందజలధితరంగముల నోలలాడి, మధురసరసంపుఁ బలుకుల నా తురుష్కుని నుగ్గడింప, నాతఁ డిట్టులనెను.—

“కాంతామణీ! నా హృదయ మెఱింగించితి. నీకుఁ బ్రేమాస్పదుఁడనై ధన్యుఁడనైతి. ఇఁకఁ బోవలయు. సెలవొసంగుము.”

మోహవిభ్రాంతయై యన్యవిచారమెఱుంగని ఆ మోహనాంగి యంత నాకస్మికముగ విస్మయవిస్ఫారితవదనయై తురుష్కునిఁ దిల

కించెను. ఖలీలుఁడు తన శయ్యామందిరము నెట్లు ప్రవేశించెను ?

తురుష్కుఁ డాలోచింపక, నిశ్చలస్వరంబున రయంబున నిట్టు లనెను.—"అదృష్టవశమున నా గదియందొక తాళము దొరకెను. తత్సాహాయ్యమున నిరోధించు ద్వారముల నెల్లఁ దెఱచి, నాకును నా హృదయాధిదేవతకును నడుమనుండు విఘాతములఁ గడచి, యరు దెంచితి. నీ మందిరము ప్రవేశించినంతనే, ప్రథమద్వారము భద్రముగ బంధించితి. కాని, కాని,—తాళము."

ఖలీలుఁ డిఁక మాటాడనేరక తన జేబులు తడవుచు, వ్యగ్ర మనస్కుఁడాయెను.

"ప్రియతమా! కలవరమేల? ఏమైన సందడి వినంబడెనా !"

ఇస్మిల్లా యట్లు ప్రశ్నింప, ఖలీలుఁ డిట్టులనెను.—

"కాదు, కాదు! కాని, తాళ మేమాయెనో కానరాకున్నది. ఈ తల్పముననే, ఈ దిండిల సందున నెందో యుండవలయు."

"మనోహరా! ఇందులకై చీకాకు వలదు. నా వద్ద మఱియొకటి యున్నది." ఆ మోహనాంగి కుటిలదరహాసితాననయై, మగుడ నిట్టు లనెను.—"ఈ తాళ ముండుటచేతనే, నా పరిచారిక యమీనా నిన్నిందనుక గొనిరాఁజాలెను. ప్రియతమా! దీనిం గైకొని, నీ మందిరము సురక్షితముగఁ జేరి, రేపు సాయంకాలము మగుడ మదీయ భుజవల్లికాడోలికా విహారుఁడవుగా, నరుదెమ్ము !"

అట్లు పలుకుచు నా తాళము నొసంగు కామినీమణి చారుతర కరాబ్జము నల్లన ముద్దాడి, "ప్రేయసీ! సెలవొసంగుము!" అని మధుర ముగఁ బల్కి, ఖలీలుఁడు రయమున వెడలెను. తొలుదొల్త తాను ప్రవేశించిన మార్గముననే తా నమీనాతో వెనుక నరుదెంచిన మార్గముననే యాతఁడు సుఖముగాఁ దన మందిరము డాసి తలుపు తెఱచి, తాఁ బ్రవేసించినంతనే బంధించి శయ్యాగతుఁ డాయెను.

చాల రాత్రి జాగర మొనరించి కడు డస్సియుండిన నా యువకుఁడు తోడనే గాఢ నిద్రాపరుఁడాయెను.

సూర్యోదయమాయెను. మిత్రులు ముప్వురు కలిసికొనిరి. ఏ కారణముననో గాని నిశీథరహస్యవ్యాపారముల దన మిత్రులగు జూలియను లూకాసులకు ఖలీలుఁ డెఱింగింపలేదు. వివిధరుచిరాహార సమృద్ధంబును, చిత్రప్రసిద్ధగ్రంథానీకసంకీర్ణంబును, చతురచతురంగాద్యనేకవినోదవస్తునికరనిలయంబును నగు మందిరము వారి కొఱకాయత్తపఱుపఁబడి యుండెను. ఇతర ప్రదేశములందుఁ దిరుగాడుటకు మాత్రము వారికి స్వాతంత్ర్యము లేకపోయెను. మిత్రు లందే పరస్పరసంభాషణంబులఁ బ్రొద్దుపుచ్చిరి.

సాయంతన మగునంతనే పాషాభటు లరుదెంచి, ఆ ముప్వురను కాంతాజనమందిరమునకు గొంపోయిరి. సుందరప్రియాంగనావదనబింబములు గోచరించినంతనే, ఖలీలాదుల హృదయపారావారము లుప్పొంగెను. కథాశ్రవణాతురుఁడై ప్రియతమ ధూమనాళవిరాజితవదనుఁడై దాలబనుపాషా సోఫాపై నాసీనుఁడై వేచియుండెను.

గుల్నేరు ప్రక్క లూకాసు కూర్చుండెను. తెరెజా చెంగట జూలియను ఆసీనుఁ డాయెను. వీరుఁడగు ఖలీలుఁడు జులేఖా చెంత నుపవిష్టుఁ డాయెను. పాషా వారింపఁ గడంగలేదు. పాషా భార్యయగు నిస్సీలాసతీమణి సమక్షమునఁ దాఁ బలికిన పలుకులఁ బాటింపక తురుష్కవీరుఁడు ప్రణయరాగభాసురుఁడై, మందహాసవిరాజితుఁడై యెప్పటియట్టులు నిజమనోహారిణియగు జులేఖాతో సరససంభాషణము నలుపఁదొడంగెను. కాని, పాషా కథాశ్రవణాభిరతుండై నిరీక్షించుచుండుటచే, నా యువతీయువకులు పరస్పరప్రణయసంభాషణసౌఖ్యము ననుభవించుట కంతగ నవకాశము లేకపోయెను. ఖలీలుఁడంతట విస్ఫురిత నయనుఁడై, మధురగంభీరస్వనంబునఁ గథాకథనంబునకుఁ గడంగెను.

౧

## రెండవకథ

ఆటోమను వంశజుఁడగు మురాదు సార్వభౌముఁడు చతురంగబల సమేతుఁడై, సెర్వియా దేశమునందలి దక్షిణ దిగ్భాగమున దండువిడిసి యుండెను. ఇయ్యది 1389 వ సంవత్సరమునాఁటి చరిత్ర. అచ్చటి నదీప్రవాహమున కిరుకెలంకులఁ గనుచూపు ప్రదేశమున శిబిరము లమరియుండెను. గుడారము లన్నియు బాలచంద్ర ప్రభాదీపితంబులై, సేనానాయకుల నికేతనములు వివిధవర్ణ రంజితకేతనవిరాజితములై, దర్శనీయములై యుండెను. తత్సమాగతనరజంతునికరములు ధరాతలంబు కంపించునట్లు లెక్కకు మీఱియుండెను.

మురాదు సుల్తానుయొక్క శిబిరము సకలసైన్యమధ్యమున సముచితముగ నమరియుండెను. బలవంతులు, ధైర్యసమన్వితులు, రిపుజన భయంకరులు, విశ్వాసబద్ధులు నగు 'జనీజరీ' సైన్యము లాతని శిబిరముం జుట్టియుండెను. ఆ శిబిరమున కనతిదూరమున నాలుగుమూలలందును నాలుగు చిన్న గుడారము లమరియుండెను. అందొకటి, సార్వభౌమ కాంతాజననిలయము. రెండవది యువరాజునకును, మూఁడవది వాని తమ్మునకును నాల్గవది యోధాగ్రేసరుఁడగు ప్రధాన సైన్యాధిపతికిని ప్రత్యేకింపఁబడి యుండెను.

మహమ్మదీయ సైన్యములు దండువిడిసిన మఱునాఁటి ఉదయమున నొక రాయబారి యల్పపరిజనముతో నరుదెంచి, సుల్తానుంజూడఁ గోరెను. అతఁడు సెర్వియాదేశాధిపతి యంపిన దూత యగుటచే, దర్శన మొసంగుటకు మురాదు సమ్మతించెను. తన భటుల నచట నిలిపి ఆ రాయబారి మహమ్మదీయరాజ సమక్షమునకుఁ బోయెను.

రాయబారి ఇరువదిసంవత్సరముల యువకుఁడు. వాని సమున్నతా కారము, అంగసౌష్ఠవము, వదనగాంభీర్యసౌందర్యములను గాంచి, సంత సించి, రాకకుఁ గతంబెద్దియని మురాదు ప్రశ్నింప, యువకుఁడు వినయగాంభీర్యము లుట్టిపడ, నిశ్చలస్వరంబున నిట్లుపలికెను—

"రాజా! నేను సెర్వియాదేశాధిపతి యంపిన దూతను—" 'మిలోషు కబిలావు'డనువాఁడ. అమేయ బలపరాక్రమధురంధరుం డగు మారేఁడు పంచిన కార్యమెఱిఁగించెద, గమనింపుము. మత్ప్రభు ప్రతిభ యటుండ, మా ఐరోపాజాతుల సమరకౌశలము మహోత్త రము. మా ముందు మీ ప్రాచ్యసైన్యములు నిలువనేరవు. మేము జయించుట తథ్యము. ఐనను, నిర్నిమిత్తరక్తపాతము దుస్సహమగు టచే, మా భూమీధవుఁడు సంధి ప్రసంగించుటయే వాంఛనీయమని యెంచి, తత్కార్యభారము నాపై మోపెను. దాన మన రెండుదేశ ములకును చిరమైత్రి యలవడును."

మురాదు కుపితుఁడాయెను.—

"యువకుఁడా! నీ దౌత్య మతిసాహసము. సంధి నాకాంక్షించు వాఁడు మదధీనుఁడు గావలయు!"

"అతి సాహసమా! నీవు సైన్యసమేతుఁడవై మా దేశమున విడి యుటకంటెను సాహసమా?"

దూత యీ తెఱంగున వెఱ పుడిగి నిబ్బరముగఁ బలుక, నృపా లుఁడు క్రోధవివశుఁ డయ్యు నిట్టులనెను.—

"బాలుఁడవగుటచే, బ్రదికిపోతివి; లేదేని, నీతను విచటనే తెగి యుండెడిది. పొమ్ము! మురాదుపాదుషా నిగ్రహానుగ్రహసమర్థుం డని నీస్వామి కెఱింగింపుము. నిన్ననుగ్రహించితి. నీ స్వామినో, దీర్ఘనిగళ బద్ధునొనరించి, మదీయ రాజధానికి రప్పించెద. నీవు అస్మ దీయ శిబిరప్రదేశ పరిసరముల నతిక్రమించునంతనే, యుద్ధమారంభ

మాయెనని గ్రహింపుము. మార్గమధ్యమున నాసైనిక విభాగమెద్ది యైన గోచరించునేని, వారిని గూఢచారులుగఁ బరిగణించి, యెదిరించి, జయమొందుదేని, నీ కిష్టమగునట్టు లాచరింపుము. నీవే బంధితుఁడవై మగుడ నరుదేరుదువా—తారున మరణింతువు. పొమ్ము!”

యువకుఁడు క్రోధోన్మత్తుఁడై, ఉచితానుచితముల నరయఁజాలక, తీవ్రముగ నెద్దియో పలుకఁబోయెను. సేనానివానిని వారించి, తన నృపాలుని సహజ క్రూరస్వభావము నెఱింగిన వాఁడగుటచే జాలిగొని, సెర్వియాదేశపుదూతను జల్లగ నావలకుగొంపోయెను. అనలమువలెఁ గనలు నా పాశ్చాత్యయువకుఁడు క్రోధరుద్ధస్వరమున నిట్టు లనెను.

“ప్రసిద్ధ సెర్వియావంశజుని నిష్కారణముగా నవమానించిన నృపాధమునిపైఁ బగ సాధింపనేని—”

“వీరుఁడా! వీరుఁడు విక్రమించునే గాని, బీరములాడఁడు. భీకర నీలజీమూత మరణాఘాత కూలమున నుంటివని గ్రహింపఁజాలక, ఏమేమియో ప్రగల్భములాడ గడంగెదు!”

అట్లు హితోపదేశము కఱపు సైన్యాధిపుని సాహాయ్యమున సెర్వియాదేశపు రాయబారి శత్రుశిబిరప్రదేశము నిరపాయముగా నతిక్రమింపఁజాలెను. మహమ్మదీయచమూపతి వెనుకకు మఱలెను: పాశ్చాత్యయువకుఁడు నిజభటానీక పరివృతుఁడై ప్రయాణ మొనరింప సాగెను.

తమ నాయకునకు వాటిల్లిన యగౌరవము నెఱింగినవారగుటచే, మిలోషుని సైనికులు కూడ తీవ్రక్రోధకంపితగాత్రులై, ప్రతిక్రియ కావింపఁ దత్తరపడుచుండిరి. వారు సుమారు రెండు మైళ్లు వెడలినంతనే, అవ్వలితీరమున నొక యాశ్వికదళము గోచరించెను. పెన్నిధి గాంచిన పేదవలె, రాయబారి పరమానంద భరితుఁడై ఒకతఱవు తన

యశ్వమును వారించి, పరికించి, ఆలోచనోద్విగ్నుండై యిట్టులనెను— "మిత్రులారా! అయ్యవె చంద్రకేతనములు! వారు మనవైరులగు మహమ్మదీయులు కావలయు. వారి సంఖ్య శతాధికము. మనమఱువది మంది యున్నవారము. ఐననేమి? వీరుల పాలిఁటి దేవత మన భుజపరాక్రమము ప్రదర్శించి, నేను కృతసంకల్పుఁడ నగుటకు మంచి యవకాశ మొసంగెను. లెండు!రండు!"

రాయబారియగు మిలోషుఁడు తోడనే చరణాంకుశమున నశ్వమునుఁ బొడిచి, తివ్వనఁ బాఱి, నదీతోయముల నుత్తరించి, వైరిని సమీపించెను. పాశ్చాత్త్యుని యనుచరులు కూడ జయజయధ్వానము లొనరించుచు దమ నాయకుని వెంటఁబోయిరి.

ఆ మహమ్మదీయ జనసమూహము నడుమదళమగు ముసుఁగులు ధరించిన వనితలుండిరి. ఆకాంతలు మేలురకపు అరేబియాగుఱ్ఱముల నారోహించియుండిరి. అందొక మగువ వెలలేని చీనిచీనాంబరముల దాల్చియుండుటయు, ఆమె తేజి యపూర్వశోభాయమానముగ నలంకరింపఁబడి యుండుటయు, నాపడంతింబరివేష్టించియుండు స్త్రీలు సవినయముగా నుండుటయు గమనింప,నాజవ్వని కులీనకావలయునని యువకుఁడు గ్రహింపజాలెను. ఆమచ్చెకంటి వినోదార్థమరగి యుండును. పరాభవాగ్నిచే నుడుకుచుండిన రాయబారికి దయావివేకములు లేకపోయెను. సాయుధులై వడివడి నరుదెంచు నాశ్వికులను గాంచినంతనే, యా జవరాండ్రు భయాధికమునఁ గెవ్వున నఱచిరి. కాని, తురుష్కనాయకుఁడు తనసైన్యమధికముగ నుండుటచే నా కాంతలకు ధైర్యముకఱపి, వారిని నిరపాయస్థలముననిలిపి,యుద్ధసన్నద్ధుఁడాయెను.

సంగరము ప్రారంభమాయెను. పోరాటమారంభముననే దారుణముగనుండెను. మహమ్మదీయు లధికసంఖ్యాకులు; క్రైస్తవులధిక

తర సమరనిపుణులు. తురుష్క నిష్ఠుర కరవాలములు మెఱుపులవలె దీపించినను, సెర్వియను క్రైస్తవులుధరించిన తనుత్రాణముల భేదింపఁ జాలకపోయెను. మహమ్మదీయులు ప్రాణములపై నాసవీడి ప్రశంస నీయముగఁ బరాక్రమించియుఁ దెగటారిరి.

రాయబారియగు మిలోషుఁడంత విభీతతురుష్క కాంతలచెంత కేగెను.—"సుందరులారా! మీరు మాయధీనమైతిరని భీతిల్లకుఁడు. దుర్మదాంధుడగు మురాదు ఒడలెఱుంగక దర్పములాడుటచే—"

"క్రైస్తవుఁడా! మురాదు నాజనకుఁడు. ఆమహనీయుని గుఱించి నిష్ఠురములాడవలదు. దురదృష్టవశమున రాజపుత్రిక 'నీలఫరి' నీ చేఁజిక్కినది: ఉదారహృదయుఁడవై మెలంగుము."

సఖీజన పరివృతయగు కాంతామణి యట్లు స్థైర్యమంజుల విస్పష్ట స్వరంబునఁ బలికినంతనే, మిలోషుని శరీరము కంపించెను. కారణ మేమన, మురాదు రాజపుత్రిక నిరుపమాన సౌందర్యప్రతీతి దిగంత ముల పర్యంతము వ్యాపించెను. అసాధ్యమగు సౌందర్యాధి దేవత రాయబారి యధీనమాయెను! వానిచిత్తము దుర్భరాందోళమునచే ప్రయ్యలాయెను. ఆతురుష్కనృపాలకన్నియను సాదరముగా సగౌరవ ముగా విడిచి వేయవలయునని యువకుని హృదయము త్వరపడు చుండెను. కాని,తన దృఢప్రతిజ్ఞం దలంచి యట్లు లాచరించుటకు మనసొప్పకుండెను. కాన నాతఁడు పరిస్థితుల నాపడఁతికి వ్యక్తపఱ చెను.—"నిన్ను విడచుటకు నసమర్థుఁడ. సమయబద్ధుడను, రాజ భక్తుఁడను నగుటచేనిన్ను నా సైన్యాధిపతి చెంతకుఁ గొనిపోయి, విషయ మెఱిఁగించి, అతనిఁ బ్రార్థించి నీకు స్వతంత్రమొసఁగఁ జేయుదు."

"ఉదారవంతుఁడా! అభయమొసంగితివి, చాలును. పాశ్చాత్యులు

దయాసమన్వితులని యెఱుంగుదు. అచిరకాలమున మాజనకుఁ డుచిత పరిహారమొసంగి నన్ను, విడిపించునని కూడ దలంతును."

రాయబారి సముచితముగ నారాజదుహితకు ధైర్యముకలిపెను. ఆకన్నియ తన కృతజ్ఞత తెలుపుటకై, మేలిముసుంగు సడలించెను. మానిని ఒక యపరచితునకు నిజముఖాంబుజము ప్రదర్శించుటకంటె గౌరవ మింకొకటిలేదు. మురాదు పుత్రికయగు నీలఫరి యసమాన సౌందర్యవతి యని మన రాయబారి ఆలించియేయుండెను కాని, తాఁగాంచిన వదనము సహస్రాధిక సౌందర్య వైభవసముజ్జ్వలమై దీపించెను. అట్టి యసదృశరూపురేఖా విలాసముల నాతఁడెన్నడు విని కనియెఱుంగఁడు. కాననాతఁడు విస్మయవిభ్రాంతుఁడాయెను. ఆయింతి సోయగము వర్ణించుటకు జిహ్వయు, చూచుటకుఁ గన్నులును జాల కుండెను. రాయబారి మర్యాద మఱచి యామించుఁబోఁడిని అనిమిషనయనుఁడై యట్లె వీక్షింపఁ దొడంగెను. ఆ సుందరి లజ్జాభరమ్మున సిందూరరాగదీపితావనతవదన యాయెను. తన మొఱకుందనంబు నెఱింగి రాయబారియు లజ్జితుఁ డాయెను. నీలఫరి మఱల ముసుగు ధరించెను. అనంతమగు ఖాతము తన నా దివ్యసుందరవిగ్రహమునుండి విడదీసినటు లాయెను. ఆతని హృదయక్షేత్రమున మోహాంకుర మాయెను.

నీలఫరీమిలోషు లాతెఱంగున నుండిన సమయమున, క్రైస్తవ సైనికులు విగతజీవుల సొత్తు హరించుచుండిరి. అనంతరము, మహమ్మదీయరాజపుత్రికతోఁబాటు రాయబారి ప్రయాణ మాయెను. ఆ కోమలాంగికి బాధకరముగ నుండునేమో యని ఒక పల్లకి నాయత్త పఱచి, నిశాసమయమునఁ బ్రయాణము మాని, అడుగడుగునకు విశ్రమించుచు నడచుటచే, గమ్యస్థానము చేరుటకు రెండు దినము లాయెను.

అచట 'వసీనియా' దేశపురాజు విడిసియుండెను. క్రైస్తవ మహా సైన్యమునందలి యొక పెద్దభాగమున కాతఁడు నాయకుఁడై యుండెను. ఆ రాయబారి యుదంతము నాలించి, సైన్యాధిపతి యిట్లు లనెను—

"మిత్రమా! నీకు హిత మాచరించుట నా కెంతయు సంతోష కరము. కాని, నా కసాధ్యము. సంగరమున, కాయత్తమైన సకల సేనావాహినులకును సర్వసైన్యాధిపత్యము వహించిన సెర్వియా దేశాధిపతియే సమర్థుఁడు. కావున, నీవే తత్కార్యభారము వహించి, మన నాయకుని సమక్షమునకుఁ బోయి, సఫలమనోరథుఁడవై యరుదెమ్ము. అంతవఱకు నీ రాజతనయకు నెట్టి కొఱతయు రానీక కని పట్టువాఁడ, పొమ్ము!"

రాయబారియగు మిలోషుఁడమితోత్సాహోద్వేగహృదయుఁడై, మేలిముసుంగు తొలంగిన నీలఫరి దివ్యసుందరవదనాంబుజము మఱల నొకసారి తిలకించి, ఆనందపరవశుఁడై, సెలవు గైకొని, తురంగము నారోహించి, వాయువేగమునఁ బ్రయాణ మొనరింపఁ దొడంగెను.

రాయబారి నిశాసమయమున సెర్వియాదేశాధిపతి శిబిరము సమీపించెను. ఉదయ మగునంతనే, మిలోషుఁడు రాజసభాంతర్గతుఁడై, తన రాయబారము నెఱింగించెను. నృపాలుఁ డిట్లు లనెను— "తురుష్కుఁడు యుద్ధ మొనరించుటకే సిద్ధమాయెనా? కానిమ్ము. ప్రజానష్టకష్టములను సహింపఁజాలక, సంధి నపేక్షించితి. యువకుఁడా! మురాదు నిక్కముగ ధైర్యశాలియా? లేక మిథ్యాప్రగల్భుఁడా?"

"మహనీయా! మహమ్మదీయనృపాలుఁడు సింహపరాక్రముఁడు. క్రూరనిరంకుశస్వభావుఁ డగుటచే నాతని యశము కళంకితమాయెఁ గాని, నిజముగ నాతఁ డసమానుఁడు."

నృపాలుఁ డంత మిలోషుఁడు తెచ్చిన జాబుల నందికొని, ప్రత్యు

త్తరము లిఖింపఁ దన యుద్యోగిని నియోగించి, రాయబారి సభినందించి బిరుదము నొసంగి, వెడలుట కనుజ్ఞ నొసంగెను. కార్యదర్శి యొసంగిన జాబులఁ గైకొని, మిలోషుఁడు నిజస్థానమునకుఁ బ్రయాణమాయెను.

రాయబారి చిత్తము వివిధాలోచనలచే సంక్షుభిత మాయెను. ఆ జాబునందలి సమాచార మెటులుండునో, తన హృదయము నాకర్షించిన ఆ యపూర్వసుందరాంగి యవస్థ ఏమి కావలయునో, సర్వ సైన్యాధిపతి కరుణాయత్తచిత్తుఁడై యనుగ్రహించునో, మఱి యే మగునో యని పరిపరివిధముల తీవ్రతరముగఁ జింతించుచు, నిజమనో వేగమునఁ బాఱి, మిలోషుఁడు తన సైన్యాధిపతి శిబిరము చేరెను.

రాయబారి కొని తెచ్చిన జాబు సేనాని గ్రహించెను. రాయబారి చిత్తము పళ్లెరమునఁ బోసిన పాదరసమువలెఁ బరిపరిగతులఁ బరుగు లిడుచుండెను. సైన్యాధిపతి లేఖ లోలోనఁ జదివికొనెను; రాయబారి హృదయాందోళన మధికతర మాయెను. సైన్యాధిపతి వదనము వెల వెలఁ బోయెను: రాయబారి దుర్భరవిషణ్ణహృదయుఁ డాయెను. సేనాని యంతట నాజాబు నొసంగ, రాయబారి భయాక్రాంతుఁడై, కంపితకరుండై, యిట్లు చదివెను—

“ఘాతుకస్వభావుఁడగు మురాదు సంధికార్యము నిరసించెను. అట్టి వైరి కృపాపాత్రుఁడు కాఁడు. ఆతని పుత్రికయును దయార్హ కాదు. ఈ నీలఫరి మనకు జామీనుగ నుండుఁగాక. ఈ విషయ మెఱింగి, మురాదు వెనుదిరిగిన మేలు, ఈ కాంతను విడువనగును. లేదేని—మురాదు రణమునకే కడంగునేని, తదారంభముననే నీలఫరీని వధింపవలయు. తురుష్కులు దయారహితులు: అట్టివారియెడ ననుకంప యనుచితము.”

అటి భయంకరాజ్ఞ తిలకించినంతనే, మిలోషుని కండ్లు గిఱ్ఱునఁ

దిరిగెను, శరీరము కంపించెను, హృదయము విచ్ఛిన్నమాయెను. శరీర మాపాదమస్తకము చెమ్మటతో నిండిపోయెను. ఆ ముహూర్తమున నొక వార్తావహుఁడు రయమున నరుదెంచి యిట్లు విన్నవించెను—

"తురుష్కసైన్య మాకస్మికముగ మన ముంగలి సైన్యవిభాగ ముపైఁ బడి, మన సైనికుల నందఱను దెగనఱికెను. మన సైనికు లల్పసంఖ్యాకు లగుటయేగాక, యుద్ధమారంభమాయెనని యెఱుంగక ఏమరియుండుటచేఁ బ్రతీకార మొనరింపఁజాలక, ఆత్మసంరక్షణ మొన రించికొనఁ బ్రయత్నింపనైనఁ బ్రయత్నింపఁజాలక, వధింపఁబడిరి."

రాయబారి యవస్థ ఎటు లుండెను? మురాదే క్రూరుఁడై యుద్ధ మారంభించెను: ఇఁక దన సర్వసైన్యాధ్యక్షుని కఠినశాసనము చెల్ల వలయును. గత్యంతరము లేదా? శిరీషకుసుమకోమలాంగి మరణింప వలయునా? రాయబారి హృదయము భగ్గున మండిపోయెను. సైన్యాధి పతి యిట్టు లనుకొనెను—"ఉపాయాంతరము లేదు. సెర్వియా దేశా ధిపతి యాజ్ఞ అమోఘము, శిరసావహింపవలయు—"

"మరణమా! నవనీతకోమలశరీరకు నంతటి ఘోరమా! అసంభ వము! ఆర్యా! ప్రధానసేనాని నొక్కసారి ప్రార్థించిన, మన్నిం పఁడా?"

అనూన మనోవ్యథాబాధితుఁడై, మోఁకరించి విలపించు యువకుని లేవనెత్తి, వసీనియా దళవాయి యిట్టు లనెను—

"మిత్రమా! వీరపురుషున కింతటి దైన్యమా? యుద్ధసమయమున సర్వచమూనివహముల శాసించు మహారాజు నాజ్ఞ నుల్లంఘించుట సాధ్యమా?"

"అయ్యా! దయామయుండవు! రెండుదినములు గడు వొసంగుము. సెర్వియాదేశాధీశుని పాదములపైఁ బడి ప్రార్థించెదను. ఆ

ధర్మాత్ముఁడు తప్పక నీలఫరీని క్షమించును.”

“కుమారా! అసాధ్యము. నేనే ఆజ్ఞోల్లంఘన మొనరించినచో, సైనికులు పెచ్చుపెరిగి నన్ను దృణీకరింతురు. మన మెల్లరము సైనికులము. సైనికుఁడు నియమబద్ధుఁడు. వేయేల? ఇట్టి ఘోరశిక్షకుఁ బాత్రురాలగునది నా పుత్రికయే యగుగాక, ఐనను, శాసనము ననుసరించి మరణింపవలసినదే.”

ఆ సేనాని సహజముగ దయాళువగుటచే వాని నయనము లశ్రుజలపూరము లాయెను. ఇఁక రాయబారి యవస్థ వర్ణింపరాదు. ఆపన్నునివలె, ఉన్మాదునివలె నాతని మానస ముద్రేకించెను. సేనాని యేమియు నొనరింపఁజాలక, మాటాడఁజాలక, శిలాప్రతిమవలె నుండెను. నిరాశాసాగరమున మునింగియున్న రాయబారి మానససీమ నాకస్మికముగా నొక్క యూహ మెఱుపువలె మెఱయుటచే నుత్సాహదీపిత వదనముతో నాతఁ డిట్లనెను.—

“అయ్యో! ఈ యాజ్ఞాపత్రము ననుసరించియేగదా, నీవు అబలను వధింపనున్నావు! ఈ పత్రము అందలేదనుకొమ్ము—నేను పారవైచితి ననుకొమ్ము—నీ వపుడీ కాంతను సైరింతువు గదా?”

“అసంభవము! రణరంగమున కరుదెంచిన సైన్యాధిపతి యట్లు మెలంగరాదు. సైనికధర్మవిరుద్ధముగా మెలంగఁజాలను. వీరుఁడా, అవివేకము తొలంగి, ఆ కన్నియ గుఱించి తలంపకుము.”

రాయబారి శరీరమంత నొక్కసారి కంపించెను: కండ్లు నిప్పులవలె నెఱ్ఱగఁ బ్రకాశించెను. బంధీకృతపవనుఁడై, ఉప్పొంగెడు హృదయము నొక్క హస్తమున నడంచి, రెండవకరమునఁ దాఁ దెచ్చిన యాజ్ఞాపత్రమును రయమునఁ బట్టి పరపరఁ జించివైచి, ఆ సమీపమున నున్న మంటలో విసరివైచి, నిట్టూర్పు విడిచి యిట్లనెను.—ఇఁక నీలఫరీని వధించుటకు నాజ్ఞ లేదుగదా!”

వసీనియా సేనాని విస్మయాగ్రహపరవశుఁడై చయ్యనలేచి రాయబారిని దిట్టుచు, నిట్టట్టు తిరుగుచును నొక్కనిముస మాలోచించి, నయనము లెఱ్ఱవాఱ, భటుల నుద్దేశించి కఠినస్వరమున నిట్టు లాజ్ఞాపించెను.—

“ఈ దురాత్ముని బంధింపుఁడు! నా యాజ్ఞ తెలియువఱకుఁ గారయందుంచి బహుజాగరూకతతోఁ గావలియుండవలయు. ఏమఱిన మీ కంఠములు తెగిపోవును, భద్రము!”

రాయబారియే తన ఖడ్గము భటుల కొసంగి, శిరము వాల్చి మాటాడక, వారి వెంటఁబోయెను.

వసీనియా సేనాని తోడనే మిలోషుని యవిధేయత ప్రధానసైన్యాధిపతికి నివేదించెను. ప్రత్యుత్తర మరుదెంచుటకుఁ గొంతకాలమాయెను. ఈలోన రాయబారి బంధితుఁడైనసమాచారము మురాదు పుత్రికయగు నీలుఫరీకిఁ దెలియవచ్చెను. ఆ యువకుని యౌదార్యప్రవర్తనము ఆమె హృదయమున నాటుకొనెను. ఆ కాంత యవస్థ కడు నపాయకరముగ నుండెను. రాయబారి యతిసాహస మొనరించుటచే తదాజ్ఞాపత్రము రూపు చెడినను, ఏమగును? ఐనను, ఆ సుందరాంగి స్వార్థత్యాగశీలుఁడగు రాయబారికొఱకు విచారించెను. తన చిత్త మా కాంతుని యధీనమాయెనని యెఱుంగకయే, ఆహేమగాత్రి హృదయము ప్రణయప్రపూర్ణమాయెను.

చరిత్ర ప్రసిద్ధమగు ‘కసోవా’ యుద్ధమరుదెంచెను. ప్రధానసేనాని యగు సెర్వియాదేశాధిపతి, వసీనియా నాయకుఁడు మొదలగువారు పరివేష్టింప సంగరము గుఱించి చింతింపఁదొడంగెను. క్రైస్తవ సేనానులందఱు నొక్కసారి నలుదిక్కులనుండి శత్రుసైన్యముపైఁ బడి చిందరవందర యొనరించి విక్రమింపవలయునని సభాసదులు నిశ్చయించిరి. అనంతర మా మహానీయుల్లందఱు దనివితీర సురా

పాన మొనరించిరి. అది యొక వినోదమందిరమువలె రణమొనరింప నున్న వీరులందఱు మైమఱచి యాడుచు, పాడుచు, గెంతుచు, కేరుచు హాయిగ నుండిరి. ఎంత విపరీతము! ఎంత దారుణము! ఎంత యమా నుషము! ఇఁక భయంకర యుద్ధము ప్రారంభమగును: తమ వంటి మేదోమాంసవిహితులగు మానవులు లెక్కకు మీఱి కుప్పకుప్పలుగ భీకరరణరంగమున మరణింపనుండిరి! అట్టి సమయముననా, సురా పానము! ఆనందము! ఉత్సాహము!

ప్రధానసేనానియు మధుపానసౌఖ్యము పూర్తిగఁ జూరగొనియే యుండెను. అంతలో రాయబారి సంగతి తలంపునకు వచ్చుటచే నా విషయము ప్రశ్నింప, వసీనియా సేనాని యిట్టులనెను.—

"ఆర్యా! మిలోషుఁడు నిజముగ మహాపరాధ మొనరించెను. ఐనను వాని తేత్రాయము గమనింపఁ దగియున్నది. మఱియు కేవ లము ప్రేమబద్ధుఁడై ముగ్ధుఁడై మంచి చెడ్డ లరయజాలక, ఇట్టి యకా ర్యము నొనరించెను. ఆతఁడు పేరొందిన వీరుఁడు కూడ నగుటచే, మరణశిక్ష విధింపవలదని ప్రార్థింతును."

వసీనియా సేనాని యా తెఱంగున విన్నవించెను. కాని, యుద్ధ సమయమున నేరములను క్షమించినచో, నపాయము వాటిల్లును. ఆ కారణమున సర్వసైన్యాధిపతి విముఖుఁడై మగుడ విచారించి యిట్టు లనెను.—

"ఈ మిలోషు నొక యసాధ్యకార్యమునకు నియోగింతము. కృత కృత్యుఁడైన మన్నింపఁగలము. పరిచారికా! రాయబారిం గొని రమ్ము!"

తోడనే, మిలోషుఁడు సైనికజనమధ్యస్థుఁడై ప్రవేశించెను. సైన్యాధిపతి యిట్లు ప్రశ్నించెను.—

"యువకుఁడా! నీవు జీవింప నాశింతువా?"

"దేవా! ఆశింతును. నా ప్రాణమొసంగుము, ఎంతటి కఠిన సమయము విధించినను, ఒనరింపఁజాలుదు."

"ఒనరింతువా?"

"మురాదు పుత్రికయగు నీలఫరీకి మాత్ర మపకృతి సలుపఁ జాలను. మఱి యెట్టి కార్యమైనను సాధింతును."

"అట్లయిన, గమనింపుము. సూర్యోదయమగునంతనే, సంగరము ప్రారంభమగును. ఎట్టి కష్టకార్యమైనను సాధింతునని ప్రగల్భమాడితివి. సమయభంగ మగునేని నీ ప్రాణమునకు, నీలఫరీప్రాణమునకుం గూడ భంగము కలుగును సుమా!"

రాయబారి నిశ్చలచిత్తుఁడై సమ్మతించుటచే, సద్యత్నుఁ డిట్లు గంభీరముగఁ బలికెను.—

"నీ వొనరింపవలసిన కార్య మియ్యది. సాధింతువా, మిలోషుఁడు మోహవిభ్రాంతుఁడై రాజభక్తిమఱచెననెడు అపనింద తొలంగును. నిశాంతమగునంతనే, ఈసుందరవసుంధర మానవరుధిరపూరితమగును. మురాదు రణకుశలతయే మహమ్మదీయుల బలము. కావున రణమారంభమగునంతనే, నీవు రయమున మురాదును డాసి వధింపవలయు. ఆ మహమ్మదీయనృపాలుఁడు ప్రసిద్ధవీరజనమధ్యస్థుఁడై భయంకరసైనికనికరపరిరక్షితుండై యుండునైన సాధింపవలయు. నీవు వీరుఁడవు; స్థిరచిత్తుఁడవై విద్యుద్వేగమునఁ బోదువేని తదవసరజనిత విస్మయాధికమున నచటి పరిజనులు ప్రతీకార మొనరింపజాలరు; నిన్ను వారింపజాలరు. కావున ఈ కార్యము కేవల మసాధ్యము కాదు. పొమ్ము!"

ఈ నుడు లాలించినంతనే సభికులందఱు స్తంభీభూతులై పోయిరి. మిలోషుఁడు తన తోడిక్రైస్తవక్రూరకరవాలమున వధ్యుఁడగుటకు మాఱు, మహమ్మదీయ ప్రహారణమునఁ దెగటారునని వారు గ్రహిం

చిరి. రాయబారి సన్నిహితాధికారియగు వసీనియా రొయుడయుఁడు ముఖ్యముగ దుర్భరవిషాదాక్రాంత చిత్తుఁడాయెను. రాయబారియు న్ననో ! మిన్నువిఱిగి పడినట్లు నిశ్చేష్టితుఁడాయెను. మహాసముద్రము వంటి రిపుసేనానివహములఁ గడచుట యెట్లు? కడచిన, మురాదు నిలయముచుట్టు సహస్రనయనములతోఁ గావలియుండు సింహబలసమన్వితుల నెట్లు నిరసింపనగును? నిరసించిన మహమ్మదీయ భూమీాధవుని జుట్టియుండు ససహాయ వీరులేమి కావలయు? దుస్సాధ్యము ! కేవల మసాధ్యము ! మిలోషున కింక బ్రదుకుపై నాస యేల ?

సూర్యోదయావసరమాయెను. భానుబింబము సకల జననయనోత్సవముగ నుదయింపక, గాఢతరభయంకర నీలమేఘముల మఱుఁగున నుండిపోయెను. నిర్హేతుక మానవరక్తోత్పాదనము సహింపఁజాలక వసుంధరాదేవి విడుచు గాఢతర నిశ్వాసాశ్రు జలధారలోయన, ప్రచండమారుతము జెలరేఁగ, ఘనాఘనసంకుల వర్షము ధారాపాతముగఁ గురియుఁదొడంగెను. ఐనను, ఇరుతెగలవారును యుద్ధసన్నద్ధులైరి. క్రైస్తవ మహాసైన్యములను శాసించు వివిధనాయకులు తమ తమ సేనాబలంబుల సముచితముగ నిలిపిరి. కట్టెదుట మహమ్మదీయ సేనావాహిని శత్రుసైన్యమును ముంచివేయుటకు సిద్ధముగ నుండెను. ప్రధానసైన్యవిభాగములను సుల్తాను పుత్రులు శాసించుచుండిరి. ప్రధానమహమ్మదీయసేనాని యెల్లెడల సంచరించుచుండెను. మురాదు అఖిలసైన్యమధ్యస్థుఁడై, యప్రమత్తుఁడై యుండెను.

యుద్ధమారంభమాయెను. రెండు పక్షముల సైనికులును దమ తమ దైవముల దలంచి, సింహనాదము లొనరించి, మహాసంరంభముతో నొండొరులఁదాఁకిరి. అకస్మికముగ నొక క్రైస్తవయువకుఁడు అశ్వారూఢుఁడై వెలువడెను. ఆ వీరుఁడు తనతోడి సైనికుల నిట్టట్టు ద్రోఁచి నిజసైన్యవాహినీ పరిత్యక్తుఁడై, వాయువేగమనోవేగ

ములఁ బాఱి, చిచ్చరపిడుగువలె వైరిచమూనివహ పర్వతమును ఛేదించి, క్రిందుమీదు లరయక, ఇటునటు బరికింపక, నిరోధింపఁ గడంగు సైనికుల నరఁటిచెట్లవలె నుఱువుగఁ దెగనఱకి, మురాదు శిబిరము డాసెను. అమితబలవంతులగు జనీజరా సైనికులా రాజశిబిరము చుట్టును వివిధాయుధముల ధరించి కావలియుండిరి. ఆ యువకుఁడు రాయబారియగు మిలోషుఁడేయని పాఠకులు గ్రహించియే యుందురు. రాజభటులా బాలవీరుని గాంచి, మగుడ దౌత్యము నలుప నరుదెంచి యుండునని భ్రమించి, వానిని శిబిరములోనికిఁ బోనిచ్చిరి. మురాదు మహారాజు సువర్ణమణిమయ ప్రభాదీపితుండై అంగరక్షకానీకపరివేష్టితుఁడై, రాజనీతి విశారద మంత్రిజన పరివృతుండైఁ భయంకరసమర కార్యనిర్వహణదక్షుఁడై, సుస్థిరవిజయ సంపాదనాయత్తచిత్తుఁడై, సమున్నతకాంచన సింహాసనాసీనుఁడై యుండ, మన రాయబారి ఖడ్గపాణియై సుల్తానుకట్టెదుటకుఁ బోయెను. తత్పరిజనులందఱు రాజమందిరము నలంకరించు సాలభంజికల భంగి వింతగ వీక్షించుచుండ, మదకరీంద్రముపై లంఘించు సముద్యత్క్రోధ ఘూర్ణితహర్యక్షమువలె నుఱికి యొక్కపోటున రాయబారి మహామ్మదీయనృపాలునిఁ బొడిచెను. అచటి వీరులందఱు మ్రాన్పడిరి. వారు ప్రబోధితులగునంతలో మిలోషుఁడు ఏతెంచిన తీరుననే యదృశ్యుఁడాయెను!

రణరంగమునకుఁ గొంతదవ్వున మురాదు పుత్రికయగు నీలఫరి శత్రుసదనమున నిష్టసఖీజనపరివృతయైయుండెను. తన యవస్థ తలంచియు, యుద్ధపరిణామ మెటులుండునో యనియు, తన చిత్తము హరించిన ఆ యుదారపురుషుఁడు మిలోషుని గతియేమగునో యనియు నా సుందరి పరితపింపఁదొడంగెను. అట్టి సమయమున సమీపించుగుఱ్ఱపు సవ్వడి విననగుటచే, నాకాంత విస్మయాతురచిత్తయైయుండ, నశ్వము

తన గుడారముచెంతనే నిలిచెను. కనువిచ్చి పరికించునంతనే, రాయబారి మిలోషుఁడు సాక్షాత్కరించెను. ఆ లావణ్యవతి అగణితమధురమందహాసవిరాజితయై చంచల విశాలనయనవీక్షణావళిమాత్రమునఁ గుశలమడుగ, నావీరుఁడుద్విగ్నస్వరమున నిట్లులనెను—

"నీవెవ్వనిఁ గాంచుచుంటివో యెఱుంగవు; ఎఱుంగుదేని, నాయునికి సహింపఁజాలవు."

"ఆర్యా! వీరుండవు! మించి, నీ ప్రాణము నొక చీరికంగొనక నాకుఁ బ్రాణదానమొసంగిన యుదారమనస్కుఁడవు. నీకంటె నాకుఁ బ్రియుండెవఁడు?"

"నిన్ను రక్షించిన రక్షించితిఁగాక. నీ ప్రాణసముని ప్రాణము హరించితి."

తురుష్కనారీమణి భయాక్రాంతచిత్తయై విషాదభరమునఁ దన కరములు జోడించెను—"అయ్యా! సన్నిహితబాంధవునివధించితివా? లేక, నాసోదరుని—" నీలఫరి నయనములు జలపూరములాయెను. కంఠము రుద్ధమాయెను. రాయబారి యిట్లులనెను—

"కోమలీ! వీరపురుషోచితముగ ద్వంద్వయుద్ధమునఁ బొలియించితినేని, ఇంతగ విచారించువాఁడగాను. నీవును మన్నింతువు. కాని, భయంకరకాలపాశసన్నిభసమయబద్ధుఁడనై, చోరునివలె, భీరునివలె, హంతకునివలె వధించితి!"

"ఆ దురదృష్టవంతుఁ డెవ్వఁడు? సత్వరమెఱింగింపుము! అయ్యా! మాటాడవేమి?"

"నీ జనకుఁడు! సర్వక్రైస్తవ జనభయంకరుఁడగు మురాదుపాదుషా!"

పట్టుతప్పిన పసిడిబొమ్మవలె నారాజపుత్రి నేలఁగూలెను. తత్క్షణ మాహేమగాత్రి ప్రబోధితయై, యున్మాదినియై, మొలనున్న బాకును

రయమున నూడదీసి, రాయబారి హాహాకారమొనరించి నివారింపఁ గడంగుచుండగనే నిజహృదయవిచ్ఛేదన మొనరించెను. రాయబారి సహింపఁజాలక ప్రదుకుప్పై రోసి, తనువున బల్లెములు విరిగిన ఘన సూకరమువలె నత్యుగ్రుఁడై, ఉన్మాదుఁడై, వైరుల వధించి వధించి, తానును వధ్యుఁడాయెను.

మహమ్మదీయనృపాలుఁ డింకను మరణింపలేదు. ఆమహావీరుఁడు మరణశయ్యాగతుఁడయ్యు, సమరకార్యనిర్వహణము కడుప్రశంసనీయముగ నొనరించెను. క్రైస్తవులు ప్రథమమున విజృంభించియు, నోటువడిరి. తత్ప్రసిద్ధనాయకులు పట్టువడిరి. వారికి మరణశిక్ష విధించి, విజయోత్సాహియై మహాదుపాదుషా స్వర్గస్థుఁడాయెను.

మిత్రులారా! రాయబారియగు మిలోషుఁడు ధరించిన తనుత్రాణ మింకను మన ప్రదర్శనశాలయందుఁ గాన్పించును. మన దేశస్థులు వానిని భీరుఁడనియు, హంతకుఁడనియు నేవగింతురు. వాని దేశస్థులు మాత్రము మిలోషుఁడు సాటిలేని మేటి దేశభక్తుఁడనియు, మహావీరుఁడనియు నుతింతురు.

## ౯

## ఇస్మిల్లా ఖలీలు

ఖలీలుని కథ ముగిసెను. ఈరెండవగాథ దాల్టబనుపాషాకు నధికతర ప్రీతికరముగ నుండెను. ప్రణయరణాద్యనేక రసపూరితమగు నాగాథ నాప్రేమముగ్ధులగు లూకాసుగుల్నేరులకును, తైరజాజూలియనులకును అత్యంతానందము నొడగూర్చెను. జులేఖామాత్రము తైరజాగుల్నే రులవలె విస్మయానంద వ్యగ్రమనస్కకాకుండ, వెనుకటివలెనే ఆత్మ విశ్వాసవిరాజితవదనయై, నిజ విశాలతరళనయన దర్పణములనుండి

వినీలవిభ్రమ వీక్షణమాలికలు నిజ మనోకాంతుని మధురాననము నలంకరింప, నిశ్చలచిత్తయై, కథాశ్రవణమొనరించెను.

ఖలీలుకథ సంతోషకారణమగుటయే గాక, ఆందోళనమునకుఁ గూడఁ గారణమాయెను. పాషా యభిప్రాయమునకు విరుద్ధముగ ఖలీలుఁడు మఱెట్టి నెపంబున మఱియొక దినముండుండఁ గడంగునోయని ఆయువతీ యువకులు తల్లడిల్లిరి. జులేఖా మాత్రము తురుష్కుని బుద్ధివైభవము నెఱింగినదగుటచే దదనుమానము నెఱుంగక నిశ్చలముగ నుండెను. కథ ముగిసినంతనే, దాల్త్రబను పాషా నిర్వికారుఁడై గభీరాలోచనాధీన మనస్కుఁడై, మిన్నకుండెను. కథాంశములగుఱించి యా వృద్ధవీరుఁడు చింతింపఁ దొడంగెను. గర్వాతిరేకమున యుద్ధసన్నద్ధములైన క్రైస్తవానీకముల దహించివైచిన ఆమహాశూరుఁడు శిక్షించిన మేటి మహమ్మదీయవంశోద్భవుఁడనే గదాయని ఆపాషా సగర్వముగఁ దలపోసి, యిట్టులనెను.—

“ఖలీలుఁడా! నీ కథానిర్వచనము కడు ప్రశంసనీయము. తొల్లిఁటి మహమ్మదీయ విజయచరిత్ర నీకుఁ గరతలామలకము. మిత్రమా! ఒకరి నభినందించుట నా కభ్యాసము లేదు. ఐనను, నీ చాతుర్యము మాత్రము కొనియాడఁదగి యున్నది. నిరంతరకథాకథన కుశలులు సహిత మింత సరసముగఁ జెప్పఁజాలరు.”

“పాషా! నీయంతవాఁడు సంతసించుటచే, నేఁ గడు ధన్యుఁడను.”

ఖలీలుఁ డట్లు పలికి, వినయపురస్సరముగ మోము వాల్చ, పాషా యిట్టు లనెను—

“కాని, మీ రింక వెడలు—”

“పాషా! నా రెండు కథలకే మీ రింతగ మురియుచుండిరి. వీనిం దృణీకరించు కథలు పెక్కులు నా మనోగతములై యున్నవని విన్నవించువాఁడను.”

పాషా సాభిప్రాయముగా నవ్వి యిట్లు లనెను—"ఓహో! అరే బియాదేశపు కథావళి జ్ఞప్తికి వచ్చుచున్నది. నాఁటి సహర్జాదివలె నీవు మిత్రసహితముగ నిం దుండఁగోరి యిట్టి విచిత్రకథనమున కుద్యమించితివి!"

"పాషా! వివేచనాధురంధరుండవగు నీ యపారగ్రహణశక్తి నెఱింగిన పిమ్మట కాదనఁజాల. ఇట్టి స్వర్గమున నడుగిడి, మగిడి పోఁ గడంగుట మాకు నిజముగ దుస్సహము. మహనీయా! మా కుల గోత్రముల నెఱింగించితిమి: వినిర్మలప్రేమబద్ధులమనియు, విన్నవించి యుంటిమి. కావున, మా పవిత్రమనోరథ మీడేర్చి మమ్ము సార్థక జన్ముల నొనరింతువని విశ్వసింతును."

పాషా కొంతతడవు భ్రాంతియుతుఁడై మిన్నకుండి, యల్లన నిట్లు లనెను—

"ఆర్యా! నిక్కువము. కాని, మీమీ యుదంతములు నిక్కువము లని యెట్లు లరయనగును."

"పాషా! అది యెంతపని! మామా దేశములకుఁ జారుల నంపిన చో, నిజానిజములు తెలియఁగలవు. మా నుడు లణుమాత్రమైన సత్య దూరము లగునేని, మమ్ము దండింపుము. అంతదనుక మమ్ము బంధితులవోలె నిం దుండనిమ్ము."

"ఆర్యా! నా పుత్రికలు నా యధీనము గాని, జులేఖాపై నా కధికారము లేదుగదా!"

"మహనీయా! ఆ భయము నీకు వలదు. ఈ కన్నియ జనకుఁడు సుఖముగాఁ బ్రసన్నుఁడు కాఁగలఁడని విశ్వసింపుము."

"వీరుఁడా! జులేఖా జనకుఁడు, మదీయభావుకుఁడు. ఆ హత భాగ్యుఁడు మహావిపదంబుధి మునింగి యున్నవాఁడని యెఱుంగుదు గదా. ఇట్టి సంకటసమయమున నాతని మానస మెఱయు టెట్లు?"

ఖలీలుఁ డంత భావగర్భితప్రణయ ప్రపూర్ణవీక్షణము నా శోభనాంగిపైఁ బఱపి, యిట్లు బదులాడెను—

“సకల ప్రజాహృదయము సంక్షోభింపజేయు భయంకర హత్యారహస్యము నొక వారముదినములలో నరయవలయునని సలీము పాదుషా కఠినముగ శాసించెనని జులేఖా నా కెఱింగించెను. కాని, జులేఖా తలిదండ్రులు పరమాత్ముని విశ్వసించియున్నారు. ఆ దయాస్వరూపుని నిర్వ్యాజ కరుణాతిశయమున నా దారుణరహస్యము తప్పక బయల్పడును: కావున, జులేఖా జననీజనకుల కపాయము వారయనేరదు.”

దాల్తబను పాషా మగుడ నాలోచనాపరుఁడాయెను. అవకాశము చిక్కుటచేఁ బ్రణయానిలప్రచలితులగు నా యువతీయువకులు గుసగుసలాడిరి. పాషా యిట్టు లనెను—

“ఆర్యా! మహత్తరవిషయముల గుఱించి సావకాశముగా విచారింపవలయు: ముహూర్తమాత్రమున విషయనిర్ధారణ మొనరించుట నే నెఱుంగను. నీ వొసంగు నుపాయము చూచుట కెంతయు సమంజసముగ నున్నది. ఈ గ్రీకు యువకుల సమాచారము లరయుటకుఁ జారుల నంపినగాని యథాస్థితి తెలియనేరదు. చారుల నంపినచో, నే ననుమతించినట్టులే యగును. కాని, అట్టి నిశ్చితాభిప్రాయము నా కింకను ఏర్పడలేదు. ఇఁక, నీ విషయ మన్ననో! నీ ముద్రికారహస్యము తెలిసినగాని మన మేకాభిప్రాయబద్ధులము కాఁజాలము.”

“మహనీయా! తీవ్రపడి కార్యాచరణమునకుఁ గడంగ నేల? మఱి యిరువదినాలుగు గంటలు కానిమ్ము. అపుడు నీహృదయాభిప్రాయ మెఱింగింపనగును. ఆవిషయ మెటులున్నను, రేపు సాయంకాలము మాత్ర మత్యంతానందకరంబగు నొక యపూర్వకథ వినిపింతును.”

పాషా సహజముగ కఠిన గంభీరవదనుఁడయ్యు మందహాస మొనరించి, యిట్లు లనెను—

"మిత్రమా! నీ యభిప్రాయముల సాధించుటయందు నీకుఁగల నేర్పు నిరుపమానము. నీమాట త్రోసివేయఁజాలను. మఱి యిరువది నాలుగు గంటలు మీరు నాయాతిథ్యము స్వీకరింపుఁడు. బంధితుల వలెనే యుండవలయు సుడీ!"

ఖలీలు కాదనజాలక సమ్మతించెను. అనురాగకందళిత హృదయులగు గ్రీకు మిత్రులును వారి కాంతలును కరము సంతోషించి పరస్పరప్రణయ మధుర సంభాషణా సుఖోన్మీలిత హృదయులైరి. అనంతరమా యువకులు తొల్లిఁటివలె వేర్వేరు మందిరములకుఁ బరిచారకా సహితముగాఁ బోయిరి.

ఒక్క విషయము గమనింపవలయును. ఉదయ మైనంతనే ఖలీలుఁడు రహస్యద్వార మడఁగియుండిన గోడను బూర్తిగఁ బరిశీలించి, తన మిత్రుఁడగు జూలియను శయనించిన యాగారమున కమరియున్న మరతలుపు కనిపట్టఁ జాలెను.

ఐనను, ఖలీలుఁడు తనమందిరము చొచ్చినపిమ్మట తన మిత్రుని శయ్యాగారమునకుఁ బోలేదు: పోఁ బ్రయత్నింపలేదు. ఆలోచనాపరుఁడై, యాతురుష్క వీరుఁడు ఏలకో నిరీక్షించుచుండెను. అంత నెవ్వరో యామందిరకవాటము మెల్లగఁదట్టిరి. పాషాభార్య యొసంగిన తాళమాతని యధీనముననే యుండుటచే నాతఁడు రయమున బోయి తత్సాహాయ్యమున సుళువుగఁ దలుపు తెరచెను. తురుష్కుఁ డెవ్వతి కొఱకు వేచియుండెనో, ఆ పరిచారిక, నిజాధికారిణీ మానసోల్లాసిని, సంధానకర్త్రి అమీనాయే గోచరించి, యిట్లు లనెను—

"అయ్యా! ఈరేయి పాషా తనభార్య శయ్యాగారమునకు రాఁడు. అదృష్టము! మాయేలికసాని నీరాకకై మిగులఁ దత్తరపడుచున్నది.

రయమున దయచేయుము."

ఖలీలుఁడు మందహాసమొనరించి, ఒక సువర్ణటంకము నాకాంత కరంబునఁ బడవైచి, అంతటి మహోపకార మొనరించు తారవుగ త్తె మెడ దా నెంతయుఁ గృతజ్ఞుఁడై యుండినట్లు భ్రమఁగొల్పి, ఆ వృద్ధురాలి వెంటఁబోయెను.

సిరపాయముగ, నిశ్శబ్దముగ వారు క్రమముగా నిస్మిల్లాసతీమణి మందిరశ్రేణి సమీపించిరి. అయినా తన్నుమోచికముగా వెరుదిరిగెను. ఖలీలుఁడు మగుడ నా స్వర్గసన్నిభమందిరాంతర్గతుఁ డాయెను.

నిరుపమ సౌందర్య విభాసితయగు, తురుష్క ప్రభు భార్య నేటిరేయి మనోహరతర వసనధారిణి యాయెను. ప్రసిద్ధతురుష్క నారీజన సహజములగు రుచిరాంబరములు వీడి, ప్రసిద్ధప్రౌఢ పాశ్చాత్య నారీజనోచిత మేల్వలువల ధరించి యుండెను. అంగకట్టము సుందరముగ నేలపై బొరలాడు చుండెను. ఆ మనోహరదుకూలము లా మోహనాంగి సహజరూప వైభవము నధికతరముగ నతిశయింపఁ జేయుచుండెను. ఆ కోమలి కుటిలస్వర్ణ కుంతలములు ధవళధవళములగు పొంగారు భుజములపై నందమొప్పఁబడి యుండెను. నిగనిగలాడు ముంగురులు రెండు మూడు మాత్రము వైభవ నిలయములగు నా మిటారి వక్షువ చనుగుబ్బలను మనోహరముగఁ జుంబించుచుండెను. విసిలవిభ్రమ తేజఃపుంజములగు నా దొరసాని నయనములు జేసిసల నీసడించుచు, మోహార్ణవమునఁ బరిభ్రమించుచుండెను. మనోహరతరంబుగ దిండులపై సగము వ్రాలియున్న ఆ నవమోహనాంగి నారీజన విముఖుండగు నిస్సంగుడైనను గామాయత్తచిత్తు నొనరింపఁజాలి యుండెను.

తన్నుఁ డాయఁబోవు నా మోహనాకారుం దిలకించి యా మోహనాంగి యిట్టు లనెను—

సుందరాంగా! మాట తప్పక ఇం దుండ నవకాశము చిక్కించి

కొంటివి: నాచెంత కరుదెంచితివి! నా భాగ్యము!"

ఖలీలుఁడు మందహాస మొనరించి, మధురముగ నిట్టు లనెను—

"సుందరీ! ఒక్కక్షణమైన నాలసింపక, నీయాజ్ఞ నౌదల ధరించి రయంబున నేతెంచితి. కాని, నిన్న సాయంకాలమునుండి యింతదనుక పాపా ఈ క్రీడామందిరమున కరుదేరలేదుగదా."

తురుష్క యువకునిఁ దనప్రక్క నాసీను నొనరించి యాసుందరి దరహసితాననయై, "నీ వెట్లు గ్రహించితి?" వని ప్రశ్నించెను.

"గ్రహించుట కేమున్నది! పాపా యిందు విచ్చేసి యుండెనేని, తాఁ బ్రమాదవశమున మఱచిన యీ కృపాణము రయమునఁ గొని యుండడా?"

ఖలీలుఁ డట్లు పలుకుచు నాశస్త్రము చేఁబూని, అద్దానిం బరీక్షింపఁ దొడంగెను. ప్రభుభార్య యంత నిజబాహువల్లరి నల్లనఁ దన ప్రియుని కంఠమున వైచి యిట్టు లనెను—

"మనోహరా! మదీయభాగ్యవశంబున సమయబద్ధుఁడవై యరుదెంచితివి!"

"కాంతా! ఏమందును! ఎంత నిరీక్షించినను, ఎంత ప్రయత్నించినను, అవకాశము చిక్క—"

ఖలీలుఁ డట్టి దైన్యాలాపముల దైన్యముగఁ బలుకుచుండ, నా భోగవతి తదవసరజనిత నిర్వేదము ధరింపఁజాలక, ప్రకంపితగాత్రయై, ఉద్విగ్నస్వరంబున నిట్టు లనెను—

"అహా! ఆ గయ్యాళి జులేఖా యింకను నీవు తన వాఁడవేయని భావించుగా? అబ్బా! దుస్సహమే!"

"కాంతామణీ! కొంకల మాదకుము. మాటాడుట కవకాశము లేకపోయెగాని, మదీయవిరసప్రవర్తనముచే మదభిప్రాయము తెలియఁ బఱచితి"

"ఆహా! అట్లు పలుకుము! నిక్కువమేగదా? సందేహము లేదు గదా!" ఆ మోహనాంగి హృదయము ఉప్పొంగెను: సహజసుందరాననము వికాసవంతమై, దరహాసవిరాజితమై యొప్ప, మగుడ నిట్లనెను—"సుందరుఁడా! నీ యమృతంపుఁ బలుకులచే నాకు శ్రవణపర్వ మాయెను. కాని, లేనియాశ కల్పించి, నన్ను వంచింపవు గద!—"

తురుష్కుని వదన మెఱ్ఱబాఱెను. చేఁ జిక్కిన ఆ నవమోహనాంగుఁడు తన సంశయాలాపములకుఁ గినిసెనేమో యని వెఱచి, ఆ బింబాధర వినమ్రయై యిట్లనెను—

"ఖలీలుఁడా! అలుక వహింపకుము. మనోహరనిలయమగు భవదీయ సుందరాననమున క్రాగ్రహకళంక మాపాదింపఁ దగదు. సుందరాంగా! నిన్నుఁ గాంచి నే నెంత గాఢవిమోహపరవశనైతినో నీ వెఱుంగవు. నేఁ డెల్ల నిన్నే దలంచుచుంటి[illegible]యచారుతర మోహనాకారము నా హృదయఫలకమున నాటిపోయెను. ఒక్కక్షణమైన నిన్ను మఱచి యెఱుంగను. మఱవఁజాల. సుందరుఁడా! తొలుదొల్త నీ చిత్తము హరించిన యా కుసుమకోమలి జులేఖాను దలంచి మత్సరమూనుదునేని, నీ వన్యథా తలంపక మన్నింపవలయు!"

"సుందరీ! ఇంతటి దైన్యమేల? ఇంత మాత్రమున నేను వేఱువిధంబునఁ జింతింతునని భ్రమింపకుము. కాని, నా మాట గమనింపుము. జులేఖాకు నా హృదయపరివర్తనము నెఱుక పరచి తత్ప్రణయశృంఖలవిముక్తుఁడఁ గావలయునని యెంతయుఁ బ్రయత్నించితి. కాని, పాషా నా కట్టి యవకాశ మొసంగఁడాయెను. ఒక్కక్షణమైనఁ గదలక ప్రభువా కన్నియ చెంత స్థాణువు వలె నాసీనుఁడై యుండెను. ఇంత మాత్రమున మించిపోయిన దేమియులేదు. ఉపాయముచే మఱియొక దినమందు మిత్రసహితముగా

నుండుట కనుజ్ఞ వడసితి ప్రేయసీ! నీవొనరింప వలసిన కార్యమిద్దియును, రేపు సాయంకాలము సమయము కనిపట్టి మేము సభతీర్చియుండు స్థలంబున కరుదెంచి, నీ ప్రావీణ్యమున మేము మఱియొక దినమిందుం డునటు లొనరింపుము. మన యభీష్టము తప్పక సిద్ధించును."

"అసాధ్యము! నాకును నామగనిప్పరికలకును అన్యోన్య ప్రేమానురాగములు లేవు. వారు నామందిరము త్రొక్కరు. వారి మందిరమునకు నేఁ బోఁజాలను."

"ఐనను, రేపొక్కసారి మాత్రము పంతము పాటింపక, రావలయును. ప్రేయసీ! నీ వట్టి ప్రయత్నమొనరింపవేని, మేమిఁక నిందు నిలిచి యుండుట కవకాశముండదు. అయ్యది నీకు సులభసాధ్యము."

"నేనేమి చేయవలయునో నీవే ఉపదేశింపుము."

"ఎల్లి ప్రొద్దు గ్రుంకుసప్పుడు, నేను మఱియొక కథ వినిపింతును. ఒక గంటకు నాక[redacted]ను. కథముగియు సమయమున నీ వరుదెంచవలయు. కథాశ్రవణ కుతూహలమున నే నే తెంచితిననియు, కథతోడనే సమాప్తియగుటచే నుత్సాహభంగమాయెననియు, ఒక్క కథయైన నాలించుట కవకాశమొసంగవలయుననియు నీవు పాసాను అర్థింపుము. దాన మనకెంతయు శుభంబు చేకూఱు. మనోహారిణీ! ఇట్టి నిరపాయకృత్రిమవ్యాపారమునకుఁ గడంగదవా!"

"ప్రాణప్రియా! తప్పక కడంగెద! ఎట్లు కడంగకుందును!"

మోహాంధకార నిర్మగ్నమైన అన్యమెఱుంగని అనుపవతి ఆ తెఱంగున వడివడిబలుకుచు, నవిరళ మోహాతిరేకమున నాసుప్రసన్న ముకు మార సుందర తురుష్కయువకుని రయమున గాఢాలింగన మొనరించెను. ఖలీలుఁ డిట్టులనెను.—

"సుందరీ! నా కట్టి యనుమానములేదు. ఐనను, ప్రాణేశ్వరీ! నే నింకను, నీవాఁడగాను గదా. రేపు ముందుగనే, యొక చీటివ్రాసి,

సిద్ధముగ నుంచెద. సాయంకాల సమావేశావసరమున నవకాశము చిక్కినా, జాలేఖాకు నా హృదయావస్థ నెఱింగించెద. లేదేని, ఎట్టులైన నా లేఖనందిచ్చెదను. అనంతరము మనము—"

"నిరంతర భోగార్ణవతరంగ డోలికల నుయ్యాలలూగఁగలము! ప్రాణప్రియా! కొఱమాలిన ఇతర విషయములఁ దలంపక, సర్వశక్తియుతానంగదైవ చరణకమల సేవాపరాయణులమై, ధన్యులమై, సార్థక జన్ములమై హాయిగ నుందువారము!"

తదమందపారవశ్యమున నమ్మత్తకాశిని నిజ భుజపంజరబంధిత సుందరాంగుని గాఢ తరాలింగన మొనరించి, యనిర్వాచ్యానంద నిర్మగ్నయై, మేనుమఱచియుండ, అమీనా దురంతభయకంపిత వికార వదనయై వడివడినరుదెంచి, ప్రకంపితస్వరమున నిట్టులఱచెను—

"పాషా!—పాషా వచ్చుచున్నాఁడు!—మొదట మందిరద్వార తాళము తిరుగుట విని వచ్చితిని!"

తోడనే, ఇస్మిల్లాఖలీలులు దిగ్గున లేచిరి. యువకుఁడు చెంతనున్న కృపాణము తత్క్షణము ధరించెను. ఉన్మాదినివలె నమీనా యిట్టులఱచెను—"దేవీ! ఏల యీ కాలయాపనము? ఈతఁడు రయమునఁ బాఱవలయు!"

"పారిపోవలయునా! ఎటు? వలను, వీలు! ఇందెందో దాచియుంచ వలయు!" అట్లు పలుకు ప్రభుపత్ని వదనము నిరాశోద్భూతభయాధీన మాయెను.

"దేవీ! దాచుటయా! అసంభవము! ఒక్కక్షణమైనఁ దడయక, అటు పాఱవలయును!" అట్లు పలుకు దాసి వడఁకుచు, మొగములు తెరచూపెను.

"అందుఁబోవలయునా?" యని ఇస్మిల్లా విహ్వలచిత్తయై యఱచెను. భయాతిరేకమున నాసుందరాంగి హిమసన్నిభగాత్రయాయెను.

"దేవీ! దేవీ! ఇంత యవివేకమా? మఱియొక క్షణమాలసింతువేని, మనము మువ్వురము గూడ బాస్వరనదీ గర్భస్థులమగుదుము !"

ఉపాయాంతరము కానరామి, ప్రభురాణి ఇయ్యకొనెను. ఒక్క నిమిషము పాషాను వారించి యుంచుటకై అమీనా వెడలెను. ఇస్మిల్లా దారి చూవ, ఖలీలుఁ డాత్రోవంబోయెను.

## ౧౦

### సిద్ధి

ఖలీలుఁడించుకేనియుఁ జలింపక ఆగడపదాటిపోయెను. నీలజీమూత సన్నిభభయంకర దీర్ఘకాయుఁడా రహస్యమార్గమునఁ గావలియుండు నని గతనిశాసంచర[illegible] ెఱింగియు, నా ధీరస్వాంతుఁడు సరకు జేయకపోయెను. వెనుకటి రాత్రి తురుష్కుఁడు నిరాయుధుఁడగుటచే, నసహాయుఁడై యుండెను. కాని, ఈ సమయమున పాషా కృపాణము చేఁజిక్కుటచే, నాతఁడు నిర్భయముగా నుండెను.

ఖలీలుఁడు ద్వారము నతిక్రమించినంతనే, ఇస్మిల్లానతి రయమునఁ దలుపువైచెను. ఆ మార్గము తురుష్కుఁడు వెనుకటి రేయి కాంచినదె. అప్పటి యట్టులే, ఇప్పుడును దీపము గ్రుడ్డిగ్రుడ్డిగా వెలుగు చుండెను. ఖలీలుఁడు కొంతదవ్వరగినంతనే, ఎవ్వరో నడచుచుండి నట్లు అలికిడిఆయెను. మనవీరుఁడు పరికించుచుండగనే, తళతళలాడు దీర్ఘకరవాలము ధరించిన తాళవృక్షసన్నిభ భీకరమూర్తి—పాషా బానిసీఁడు కాన్పించెను. తురుష్కయువకుఁడు నిశ్చలచిత్తుఁడై రయమున వానిని డాసి, యిట్టులనెను—

"ఓయీ పరిచారకా! నే నీ స్థలమున కేతేరవలసిన పరిస్థితులు నీ

వెలిఁగియే యుండువని భావింతును."*

ఆ బానిస ఖలీలు నెన్నఁడు జూచి యెఱుఁగఁడు. కావున, నాకస్మికముగ గోచరించిన ఆ వీరుని నిరుపమాన ధైర్యగాంభీర్యములఁగాంచి విస్మయాక్రాంతుఁడగుటచేతనో, ఒకింత భయభ్రాంతుఁడగుటచేతనో ఆ బానిసీఁడు చకితుఁడై యాతనినట్టె తిలకించెను: ఆ భటునికరవాలము మెల్లగ దిగజారెను: కడువినయముగ, దైన్యముగ నేమియో సమాధానమొసంగుటకుఁ గూడ వాఁడు సంసిద్ధుఁడాయెను. అంతలో నా కాఁపరి తెలివొంది, సహజమగు మొఱకుఁదనము వహించి యిట్టులనెను—

"నేను బానిసను. అధికారుల చర్యలతో నాకుఁ బనియేమి?"

"ఇతరులకు వలెనే బానిసకు సహితము జ్ఞానముండును."

"బానిసీనికి జ్ఞానము సహజముగా నుండవచ్చును. ఐనను నిరర్థకము. ప్రాఁక నేర్చినది, మొదలు దాస్యమొనరించుటయే అభ్యాసమగుటచే వాని తెలివితేటలు క్షీణించును. స్వతంత్రముగా వినియోగించు నవకాశము లేకుండుటచే, వాని మానసము మోటుదేఱును. కాన, దాసుఁడు స్వాతంత్ర్య విరహితుఁడగుటచే, వాని జ్ఞానమును అట్టులే యుండును."

"ఓహో! మన ప్రవక్తతోడు! నీవు అపూర్వ మేధావంతునివలె ప్రసంగించుచుంటివి. నీకు భావస్వాతంత్ర్యము లేదని ఎవ్వరనఁ గలరు? ఓయీ! నీకు నాకును ఎంతటి యంతరమున్ననుఁ నా పలుకుల విశ్వసింపుము. మిత్రమా! నీతోడి పరిచయము నా కెంతయు సంతోషకరము."

వానితో నా తెఱంగున నెవ్వరు మున్నెన్నఁడు సంభాషించి యుండకపోవుటచేతనో, లేక, తురుష్కుఁడట్లు ప్రసంగించుట కెద్దియేని నిగూఢకారణముండుననియో, గాని, ఆ కృష్ణవర్ణుఁ డాయువకుని

నాశ్చర్యముగాఁ దిలకించెను. ఐనను, ఖలీలుని చిత్తము వాని కవ గతము కాలేదు. అంత, తురుష్కుఁడు మగుడనిట్టులనెను—

"నీవంటి రక్షకుఁడుండునది విపరీతస్థలము కావలయు."

అంత నారక్కసుఁడు సహజకరాళ విక్రృతవదనుఁడై, ఉపాలంభ గర్భముగా నిట్టులనెను—

"నే నిందుఁ గావలియుండుట కొక రహస్యకారణ ముండిన నుండు గాక. ఆ రహస్య మరయఁగోరు నపరిచితుఁడు విపరీతమానవుఁడు కావలయును."

"నీ స్వామియగు దార్తబను పాషాయొక్క యతిథిని, గాన, నేను కేవల మపరిచితుఁడ గానని యెఱుంగుము."

"అట్టులే కావచ్చును. నా కేమియుఁ బ్రసక్తి లేదు. నా వ్యాపార ముతో నీకును బనిలేదు. అయ్యా! మీ రీప్రదేశమునుండి యావలకుఁ బోఁ జూతురని భావింతును. కావున, మార్గము చూపెద, దయ చేయుఁడు. నీవు సద్వంశజుఁడవు, కావున, నేను ముందఱఁ బోరాదు. పిఱుంద నడచుచునే, త్రోవ చూపఁగలను, దయచేయుము."

"మిత్రమా! తొందరపలదు. కావున, మన ప్రసంగము పూర్తి కానిమ్ము. ఈ రహస్యమార్గమునఁ గావలియుంటయే నీపని కావలయు. ఇది కడు విపరీతము. కాని, నీవు గూఢనిక్షేపము కాచికొని యుందువా? లేక, నావలెనే కారణాంతరమున నిస్మిల్లాసతి మందిర మునఁ జిక్కి యావలకు వెడలఁ గోరువారిని సురక్షితముగా సాగ నంపుటకే యిం దుందువా?"

ఖలీలుఁ డట్లు ప్రశ్నించుటచే, నా సిద్దీ విస్మయ భయభ్రాంత యుతుఁడై, యాతని నట్టె తిలకించెను. తురుష్కవీరుని నిశ్చలగాం భీర్యముఁ గాంచి వాఁ డొకింత చకితుఁ డాయెను. నాలుగు నిమిషము లట్టు లూరకుండి, వాఁడిట్టు లనెను—

“ఆర్యా ! పాపా ధనరాశి సంరక్షింతుఁగాక, నే నావిషయ మెఱింగింతునా ? నిన్న నే నెఱుంగనే. ”

“మిత్రమా ! అట్టి విషయము నే నేల ప్రశ్నింతును ? మఱియు, నన్నుఁ దిలకింపుము: ధనాశాపరుఁడనై చౌర్యమునకుఁ గడంగు దౌర్భాగ్యునివలె గోచరింతునా ? ”

నీగ్రో క్రోధఘూర్ణితుఁడై యిట్టులనెను.—

“గోచరింపక పోవచ్చును. అట్లుగాక, ఇస్మిల్లా ప్రభ్వి సదుపాయ మరయుటకే యిందుంటి ననుకొనుము. ప్రభురాణి శయ్యామందిరము నుండి నీ విప్పుడే యరుదెంచితివి. అట్టి నీవు నాతో నీ విషయము నింత లాఘవముగాఁ బ్రసంగించుట యోగ్యమా ? ”

“ఓయీ ! మనము మనసు విచ్చి మాటాడు నపుడు, దోసగేమి ? అయోగ్యత లేదు, ద్రోహము లేదు. గమనింపుము ! ఈ యిస్మిల్లా ప్రభ్వి సతిజనసహజానురాగ మెఱుంగ…”

“అయ్యా ! గమనింపుము. పాపాభార్య చేయు వ్యాపారమున నప్పుడపుడు తోడ్పడుదునని కూడ ననుకొనుము. కాని, నీ వీస్థల మున నిట్లు నిలిచియుండుట క్షేమకరమా యని, ఏల విచారింపవు ? నేను జాగరూకతతో గావలి యుంటినా లేదా యని అరయుటకై, పాపా ఏక్షణమైన నరుదేఱవచ్చును !”

“ఏమీ ! రేయి యెల్ల నీవు జాగర మొనరింపవలయునా ?”

“ప్రాణములపై నాశయున్నచో, నిద్రింపరాదు.”

“అటులనా ? నే నొక్క మాటాడినఁ జాలు, నీ కంఠము పాశబద్ధ మగును. నిన్నటి రేయి నీవు నీ గదియందు నిద్రించియుంటివి !”

“అబద్ధము ! అయ్యా, వట్టి యబద్ధము ! ఇంత దారుణమా !”

నీగ్రోసేవకుఁడు దుర్భరాగ్రహపరవశుఁడై, క్రోధాతిరేకమునఁ బైకి దుముకఁజూచు మహిషమువలెఁ గాన్పించెను. ఖలీలుఁడు

సహజస్థైర్యధుర్యుఁడై యిట్లులనెను.—

"అబద్ధ మావంతయు లేదు. నీవు మధురసౌఖ్యము ననుభవించి ఒడలెఱుంగక పడియుంటివి. నీ శిరస్సు గోడచెంత నుండెను, పాదములు నీ గదివైపు నుండెను. ఖడ్గము విడి నీ ప్రక్క నుండెను. తలుపు తెఱచియే యుండెను. ఇనుపదీపపుఁ గిరణములు నీ ముఖమునఁ బడుచుండెను."

ఆ నీగ్రోవాఁడు వెఱ్ఱివానివలెఁ గొన్ని నిమిషములు మాటాడ నేరక, ఖలీలునట్టె తిలకించెను. తుదకు మానసము భయాగ్రహములచేఁ గలంగ, మేను కంపింప, వికృత స్వరమున వాఁడిట్లు ప్రశ్నించెను.—

"కాని, నీకెట్లు తెలియవచ్చెను?"

"అదంతయు నీకేల? నేనిచటకే తెంచి యుంటినని గ్రహింతువా?"

"నీవిఁక నెంత శీఘ్రముగఁ బోయిన నంత మేలు. పాపా యిటు వచ్చి చాల కాలమాయెను. ఏముహూర్తమున నరుదెంచునో యెఱుంగరాదు. వచ్చిన నిప్పుడే రావచ్చును. కావున, ఒక్కక్షణమైన నిఁక నాలసింపక వెడలుట క్షేమకరము. అయ్యా! దయచేయుఁడు; నేను వెనువెంటనే యరుదెంతును; ఒక్కనిమిషములో బైటఁ బడవచ్చును."

"మార్గదర్శకుఁడు వెనుక నుండిన ప్రయోజన మేమి? నీవు ముందు నడువుము."

నీగ్రో ప్రమాస్పడి, యమిత విస్మయానుమానమయ వీక్షణమునఁ దురుష్కవీరునిఁ దిలకించి, దియమునఁ దెలివొంది, మెల్లగ ముందుకు నడువసాగెను. ఖలీలుఁడు వాని వెనువెంటనే పోవుచుండెను. వారు ద్వారము నతిక్రమించి, రాతిమెట్లు లల్లన దిగిరి. దీపము వారి వెనుక నుండుటచే, వారి ఛాయలు గోడపైఁ బడెను. బానిసీఁడు నడచుచుండినను, ధ్యానము ఖలీలుమీఁదనే

యుండెను. అతఁడెట్లు నడచుచుండెనో పరిశీలించుటకై, వానికండ్లు తురుష్కవీరుని ఛాయమీఁదనే యుండెను. అతని కత్తి ఒర యందే యుండెను. ఖలిలుఁడు సహజస్థైర్యముతో నడచుచుండెను. వాని నిర్వికారనిర్లక్ష్యగమనభంగిఁ గాంచ, నాతఁ డెద్దియేని దురభిప్రాయ మూహించెనని గాని, అపాయ మెద్దియేని సంభవించునేమో యని వెఱచుచుండెనని గాని తోఁపకుండెను.

వారిరువురు సోపానములు డిగ్గి, ఱాతిపలకలు పఱచియున్న స్థలమున కేతెంచిరి. అందు నడుమ నొక కఱ్ఱతలుపు నేల కమరి యుండె గదా. ముందరుగుచుండిన అతికాయుఁ డా తలుపుం దన పాదమునఁ దాఁకెను. ఏ క్షణమున వాఁ డట్టు లొనరించెనో, తత్క్షణము సముద్యత్క్రోధావేశమున మహిషముపై లంఘించు సింగంబు చందమున, వనాంతరప్రదేశమున నిర్భయముగ సంచరించు మృగముపై వృక్షశాఖనుండి మెఱుపువలె వ్రాలి నిజసృథభయంకరతనూవల్లరిచే భయానకముగ బంధించు నజగరమువలె, ఖలీలుఁడు వానిపై రయమున నుఱికెను. వాని ఖడ్గము దూరమునఁ బడెను. వాఁడో! దుర్బలబాలకుని వగిది నామాయాదారు కవాటముపై విసురునఁ బడెను. నల్లని బండఱాయివోలెఁ బడియున్న యా భటుని గుండెపై బాదమూని, విద్యుద్దీపికకృపాణము రయమున నూడదీసి ఖలీలుఁడు వాని కంఠమునకుఁ జూపెను. ఆకస్మికముగ నేలఁ బడుటచేతనే, వాని మతి వికలమాయెను: చిచ్చరపిడుగుం బోలిన ఖలీలుని నిరుపమాన జవసత్త్వములచే నా నీగ్రో విగతధైర్యుఁడగుటయేగాక, భయభ్రాంతుఁడై, దుర్బలుఁడై కేవల మనాథుఁ డాయెను. ఎట్టకేలకు వాఁ డిట్టులు దైన్యముగఁ బ్రశ్నించెను—"అయ్యా! ఏమిది? నీ యభిప్రాయమేమి?

"నీ వొక విషయ మెఱింగింపవలయు—"

ఖలీలుఁ డేమియో చెప్పఁ బోవుచుండ నంతలో నాతఁ డే తెంచిన ఇస్మిల్లా మందిరద్వారము తెరచిన శబ్దము వినవచ్చెను. సిద్ది యత్యంత భయవిహ్వలుఁడై, ఉన్మాదునివలె మెల్లగ నిట్లులఱచెను.—

"పాషా యరుదెంచుచున్నాఁడు! లెమ్ము! లెమ్ము! ఆలసింప రాదు!—"

"అట్లైన, లెమ్ము! కాని, నా కపాయ మొనరింప బ్రయత్నింతువా, ఈకృపాణము నీహృదయరక్తము నాస్వాదించును! భద్రము!"

ఖలీలుఁ డట్లు పలికి మెల్లగలేచి రయమున నాలుగడుగులు వెనుకకు వైచి, సిద్దియొక్క కత్తిపై రెండు పాదములను మోపి మగుడ నిట్లులనెను.—"ఈ విషయ మొక్క మాటయైనను పాషాకుఁ దెలియరాదు, పాషా భార్యకును దెలియరాదు. ఆమె యొకవేళ ప్రశ్నించినచో, నెద్దియేని సమాధాన మొసంగుము. ఈ రహస్య మెఱింగింతువేని, నీవు నిన్న నిద్రించిన రహస్యము బయలు పరచెదను, నీవు తత్క్షణము మరణశిక్షకుఁ బాల్పడుదువు!"

పాషా యరుదెంచునను భయమున విశేషముగ నోరువిచ్చి మాటాడుట కవకాశము లేకుండినను, ఆ తెఱంగున గుసగుసలాడి ఖలీలుఁ డా సిద్దికి వెఱపుగొలిపెను. ఒక్కక్షణమాయెను: అంతలో నడుగులు భారముగఁ బడుచుండిన సవ్వడి తెలియవచ్చెను. ఖలీలుఁడు హరిణశాబకమువలె నొక్క త్రుటిలోఁ బాఱి, మలుపుతిరిగి తన మందిరమునకుఁ జూపు సోపానముల నారోహించి, గోడయందమరియుండిన రహస్యకవాటము, కీ లెఱంగిన, కతంబున సుళువుగా దెఱచి తన మందిరము చేరెను.

మందిరాంతర[illegible]తనే, యాతురుష్కవీరుఁడు తొలుదొల్త పాషా కృపాణము నెవ్వరు జూడఁజాలని స్థలంబున దాచెను. ఉదయమగు నంతనే పాషా భటులందఱు ప్రవేశింతురు:

ఆ యస్త్రము వారి కంటఁ బడునేని, అపాయము సంభవించును. కావుననే ఖలీలుఁ డట్లొనరించెను. అనంతర మావీరుఁడు గత వృత్తాంతము దలంచికొని, నిద్రాపరుఁ డాయెను.

ఉదయమున మేల్కాంచి యాతఁడిట్లు చింతించెను.—"రాత్రి పాషా యరుదెంచినంతనే సిద్దీ రహస్యభంగ మొనరించెనేని, ఇఁక నా విషయము తెలియకపోదు. కాని, వాఁడట్లొనరించి యుండఁడు; ఒనరించినచో సహజక్రోధకలుషితాంతరంగుఁడగు పాషా యింత కాలము సహించియుండునా? నన్ను భయంకర శిక్షానలదగ్ధు నొనరించుటకై రయంబున నరుదేలకుండునా? కాన, నసంభవము."

అంతలో నొకసేవకుఁ డరుదెంచి తొల్లిఁటి యాసనాగారమునకు ఖలీలునిఁ గొంపోయెను. మార్గమధ్యమునఁ జిరపరిచితయగు నమీనా పండ్ల తట్ట దాల్చి వడివడి పోవుచుండెను. సంధానకార్య ప్రవీణయగు నా వృద్ధకాంత మన తురుష్కవీరునిఁ గాంచినంతనే భ్రమాన్వడి, అడుగిడనేరక, యట్టె నిలచిపోయి, వెఱ్ఱిదానివలె నాతని వీక్షింపఁ దొడంగెను. చేతనుండిన తట్ట జారి నేలబడెను, పండ్లు మార్గమంతట దొరలెను! ఏమియు నెఱుంగని పరిచారకుఁ డిట్టులనెను—

"ఏమిది, అమీనా! ఆకస్మికముగా వ్యాధిసంభవించెనా? లేక, మహమ్మదీయధర్మము మఱచి, నిరమువంతు మఱి యేమైన పాన మొనరించితివా?"

జరఠాంగన బదులాడక, ఏమియో గొణఁగుచు, పగుగులిడిన ఫలములను జేరదీసి బుట్టయందుంచి తన దారిఁబోయెను. వృద్ధపరిచారిక యట్లు తబ్బిబ్బగుట సురాపాన మహాత్మ్యమే కావలయునని యెంచి, ఖలీలు వెంటనుండిన సేవకుఁడు పకపక నవ్వెను. తురుష్కవీరుఁడా విషయము గాంచనట్లు సహజనిశ్చలగమనమునఁ బోయి, మిత్రులగు జూలియను లూకాసులు వేచియున్న మందిరము ప్రవేశించెను. వెను

కటి దినమువలెనే నేఁడును మిత్రులు మువ్వురుం గలసి పరస్పర సంభాషణము లొనరించుచు, వినోదాదులఁ గాలవిలంబన మొనరించుచు హాయిగ నుండిరి.

సాయంకాలమగునంతనే భటులరుదేఱ, వారు మువ్వురును సర్వవస్తుసంభరితంబగు పాషాపుత్రికల మందిరమునకుఁబోయిరి. దాల్బను పాషా యొక్క మృదులతల్పమున దర్పమొప్పనాసీనుఁడై ధూమపాన సౌఖ్యమనుభవించుచుండెను. తురుష్కప్రభువు సుప్రసన్నుఁడై యుండెను. లూకాసు ఖలీలు జూలియనులు తమ తమ కాంతలచెంత నాసీనులైనను, ఆతఁడు వారింపఁ బ్రయత్నింపలేదు. తమ ప్రియసందర్శనమునకై నిరీక్షించుచుండిన ఆ పద్మముఖు లమందానంద పరవశలైరి. ప్రణయావేశమున వారు గుసగుసలాడఁ గడంగుచుండగనే, ఖలీలు నుద్దేశించి పాషాయిట్టు లనెను—

“వెనుకటి రెండు కథలను తృణీకరించు నొక యపూర్వకథ విని పింతునంటివి! కానిమ్ము.”

ఖలీలుఁడు సిద్ధముగనే యుండెను, కావున, పాషా కోరినంతనే, కథకుఁ దుపక్రమించెను.

## ౧౧

### మూడవకథ

నా కథ పదునాలుగవ శతాబ్దమునాఁటిది. బవేరియాదేశమునందలి ప్రాచ్యదిగ్భాగమున ‘సిరిబరుఁడ’ను వృద్ధకర్షకుఁడు తనకుఁగల చిన్న పొలము సేద్యమొనరించుచు జీవించుచుండెను. వానిభార్య నిండు జవ్వనమున మరణించి, కర్షకుని దుఃఖసాగరమున ముంచివైచెను.

వాని కిరువురు కుమారులు. మాతృవిహీనులగు నా బిడ్డలకుఁ దానే తల్లియు, దండ్రియునై వారి యాటపాటలకు మురియుచుఁ దన విచారమొకింత మఱచి, లేమి యెఱుంగక అతఁడు సుఖజీవనమొనరించుచుండెను.

సిరిబరుని పెద్దకుమారునిపేరు 'కరాళుఁడు.' కరాళుని సమున్నతాకారము, దృఢశరీరము, గౌరవగంభీర లక్షణయుతవదనము, మనోహర శ్యామలనయనములును ప్రశంసనీయముగ నుండెను. వ్యాయామక్రీడలందెల్లపుడు నాతఁడే ప్రప్రథమము బహూకృతిఁ గాంచుచుండెను.

రెండవకుమారుఁడగు, 'శిశుమాను' యొక్క ఆకార స్వభావములు కేవలము భిన్నముగనుండెను. వ్యాయామక్రీడలందు వాని కాసక్తి లేదు. వాని శరీరము కోమలమై, సుందరమై, చూచుట కెంతయు మనోహరముగనుండెను. శిశుమానుని నీలవిశాలనయనము లాతఁడుశాంతస్వభావుఁడని తెల్పుచుండెను. తన యన్నవలె శరీరవ్యాయామము నభిలషింపక, సమయమునగు నపుడెల్ల నాతఁడు గ్రంథపఠనమొనరించుచుండెను. సోదరుల స్వభావములు పరస్పరవిరుద్ధములయ్యు, వారెన్నఁడుఁ గలహింపక, పరస్పరానురాగబద్ధులై యుండిరి. వారి జనకుని యానందమునకు మేరలేదు.

సిరిబరుని క్షేత్రము చెంత మఱియొక భార్యారహితుఁడు వాసము చేయుచుండెను. వాని పేరు 'హరిమణుఁడు.' వాఁడును వృద్ధుఁడే. వానికి 'మరీటా' యను నొక యపూర్వ సౌందర్యవతియగు పుత్రిక కలదు. సిరిబరుఁడును హరిమణుఁడును గూడఁ గ్రైస్తవులె. హరిమణుఁడు రణకుశలుఁడగుటచే యుద్ధములందుఁ బాల్గొని వలయు ధనసంపాదన మొనరించి, అందొక పాలువెచ్చించి యొక సుక్షేత్రము వడసి, ప్రాణసమానయగు తన పుత్రిక మరీటా శైశవక్రీడా వినోద

ములం గాంచుచు, హాయిగనుండెను. ఆకన్నియ పరమపదించిన తన భార్యరూపుననే ఉండుటచే, నా వృద్ధుఁడు ప్రాణసమానముగఁ జూచి కొనుచు హాయిగనుండెను.

వృద్ధు లిద్దరు పరస్పర స్నేహబద్ధులై యుండిరి. హరిమణు పుత్రిక ఇరువదేండ్ల ప్రాయంపు పూర్ణయౌవనవతియైనను, ఇంకను వివాహము కాలేదు. హరిమణుఁడు తత్ప్రయత్న మొనరించిన ట్లైనను గానరాదు. కాని, ఆప్రదేశమునందలి జనులు మాత్రము సిరిబరుని పుత్రులలో నొకఁడాకాంతను వివాహమాడునని యనుకొనుచుండిరి. కాని, ఏ పుత్రుఁడు? మరీటా యిరువురి యెడలను సమానమగు నభిమాన ముతో, చనవుతో మెలంగుచుండెను. కరాళుఁడు వ్యాయామవిద్యా ప్రదర్శనమునం దుత్తీర్ణుఁడై బహుమానము గడించునపుడా కన్నియ మానస ముప్పొంగుచుండెను. వాని సోదరుఁడగు శిశుమాను సహజ కోమల మంజులస్వరమున నొక గ్రామ్య విషాదగీతికఁ బాడునేని, యామెముద్దుగుమ్మ యశ్రుజలదీపితయగు చుండెను. కాని, అట్టి సందిగ్ధము చిరకాలముండఁ జాలదు గదా.

ఒక సాయంకాలము సిరిబర హరిమణులు సుఖాసీనులై ప్రపంచ విషయముల గుఱించి కొంతతడవు ముచ్చటించిన పిమ్మట, హరిమణుఁ డిట్టులనెను.—

"మిత్రమా! మనము చిరకాలమునుండి యన్నదమ్ములవలె మెలంగుచుంటిమి. భగవంతుని కృపచే మన కిరువురకును లేమికి వెఱవ నవసరము లేని సంపద కలదు. ఇరువురము వృద్ధులము. తనువులు శాశ్వతములు కావు. ఏక్షణమునఁ బరమాత్ముని యాజ్ఞ అగునో యెఱుంగరాదు. కావున, మన మిఁకఁ గాలహరణ మొనరింపక వియ్యమందుట వాంఛనీయము గదా."

సిరిబరుఁడు సాభిప్రాయముగాఁ గరస్పర్శన మొనరించి, యిట్లు

బదులాడెను.—

"మిత్రమా! నీ యభిప్రాయము సమంజసము. కరాళుఁడు నీపుత్రికను ప్రేమించి యున్నవాఁడు. వయసున నొక సంవత్సర మధికుఁడు. కావున, వారు పరస్పరము తగియున్నవారు."

"నా కెంతయు సంతోషకరము. ఈ శుభకార్యము, నెల తిరిగి ఈ దిన మరుదెంచునంతనే, యగుఁగాక."

వృద్ధ మిత్రు లపరిమితానందభరితులై, తదుత్సాహమునఁ గడు పార మధురసముఁ గ్రోలి తమ యభిప్రాయము దృఢపఱచికొనిరి. ఆ విషయము జనకుఁ డెఱింగించినంతనే, మరీటా సుందరాననము లజ్జచే నెఱ్ఱవాఱెను: ఆసుందరి యప్రయత్న మందహాస విరాజితమై సాభిప్రాయముగా మిన్నకుండెను. ఆ సమాచార మెఱింగినంతనే, కరాళుఁ డానందపరవశుఁ డాయెను.

కరాళుని సోదరుఁడగు శిశుమారను కూడ మరీటాను ప్రేమించెను. కాని, పదునెనిమిదేండ్ల ప్రాయంపు బాలుఁ డగుటచే, తత్ప్రభావము నాతఁడు పూర్తిగ గుర్తింప నేరకపోయెను. కరాళ మరీటాల వివాహము నిశ్చయమాయెనని వినినంతనే, యాతఁడు ప్రబోధితుఁ డాయెను. తన హృదయావస్థ వాని కడుపు వ్యక్తమాయెను. వాని మనోవ్యథ వర్ణనాతీతముగ నుండెను. ఐనను, ఆదురదృష్టవంతుఁడు తన దుఃఖము దిగమ్రింగి, లేని ధైర్యము వహించియుండెను. కావుననే, వాని చిత్తక్షోభ మఱియు నధికముగ నుండెను.

ఆ మఱునాఁ డుదయమున నా ప్రాంతపు జమీందారుఁడు—'గిరీఫు' అను పేరు గలవాఁడు—వాహ్యాళి వెడలి, యలసి, దాహార్తుఁడై, సిరిబసుని గృహము చెంత నిలిచెను. అచట నున్న శిశుమారను వినయ గౌరవ పురస్సరముగా నామహనీయునకు సుస్వాగత మొసంగి, ప్రశస్త మధురస మొసంగి యాతని మానసమున కుల్లా

సము కొల్పెను. గిరీఫు జమీందారుఁ డాయువకుని రూపురేఖలను వినయ ప్రవర్తనమును గాంచి, సంతసించి, వాని జనకు నుద్దేశించి యిట్లులనెను. "సిరిబరా! నీయాతిథ్యము నాకెంతయుఁ బ్రీతికరము. కాని, నిన్నొక్క విషయ మడుగఁ దలంచితి. ఈబాలుఁడు శిశుమాను నాగృహమున నుండఁ దగినవాఁడు వీనిని నా ప్రధానపరిచారకునిగా గ్రహింతును. నీవడ్డు చెప్పక సమ్మతింపుము."

శిశుమాను కడుంగడు ముదమంది, వెంటనే యియ్యకొనెను. కారణమేమున, తాను ప్రేమించిన కాంత సోదరునకు భార్య కానుండెను. చిచ్చువలెనయ్యది శిశుమాను చిత్తమును దహించి వేయుచుండెను. నిజహృదయ వేదనవ్యక్తము కాకుండనుంకుట, మఱియు బాధాకరముగ నుండెను. కావున నాయుదారవంతుఁడు దుఃఖభాజన మగు నా ప్రదేశమునకు దవ్వున నుండుటయే మేలని తలంచెను. కాని, వృద్ధుఁడగు సిరిబరుఁ డన్ననో, తద్వియోగము సహింపఁ జాలక, వలదని యెంతయు బ్రతిమాలి, తుదకు సమ్మతించెను. కరాళుఁడు గూడ మొదట విముఖుఁ డయ్యు, దాన తన సోదరునకు శుభ మొదవునని యెంచి అంగీకరించెను.

శిశుమాను పరిచారకుఁడని నిరసింపక వానిని జమీందారుఁ డమిత వాత్సల్యముతోఁ నరయుచుండెను. వాఁ డొనరింపవలసిన పను లంతగ లేవు. వానికి గ్రంథపఠనాశక్తి యధికము. జమీందారుని గృహమునందుఁ బ్రశస్తమైన గ్రంథ సముదాయముండెను. కావున, పనియుండని సమయమున నాయువకుఁడు దేశచరిత్ర పుస్తకములు చదివి యుద్ధ ప్రియుఁడాయెను. మహమ్మదీయులతోఁ బోరాడ వలయునని వాఁడు తత్తరపడసాగెను. దైవికముగా నట్టి యవకాశ మచిరకాలముననే ఏతెంచెను.

శిశుమాను సేవకా వృత్తిం బొచ్చిన మూడువారములకు, రణ

దుందుభులు భయంకరముగ మ్రోగెను. అట్టోమను వంశజుఁ డగు తురుష్కసమ్రాట్టు ఉద్దండయశోమండితుండై, యఖర్వబల దర్పసమన్వితుఁడై, యఖండ వైభవ సమన్వితుఁడై, క్రైస్తవ రాజన్యులకు భయకారణుఁడునై యుండెను. ఆకారణమున నైరోపా దేశాధీశులందఱు నొక్కటియై మహమ్మదీయునిపై దండెత్త సంసిద్ధులైరి. బవేరియాదేశస్థుఁడగు గిరీఫు జమీందారుఁడు కూడఁ దన యినాము భూముల ననుభవించు పరిజనులు రణమున కాయత్తము కావలయునని ప్రకటించెను. గృహమున నొకఁడు సమరసన్నద్ధుఁడు కావలసియుండెను. సిరిబరుఁడు వృద్ధుఁ డగుటచే వాని జ్యేష్ఠ కుమారుఁడు సైనికుఁడు కావలయును. కాని, కరాళుఁడు తాను వలచిన మగువను వివాహమాడుట మాని యుద్ధమున కెట్లు పోఁగలఁడు? కాని, శిశుమాను సమరోత్సాహియై యుండుటచేఁ గరాళుని కష్టము గట్టెక్కెను. పుత్రవియోగము దుస్సహముగ నుండినను, సిరిబరుఁడు చేయునది లేక సమ్మతించి, తనయు నాశీర్వదించి యుద్ధమున కంపెను.

వివిధ క్రైస్తవ నాయకులు ముందుగ, 'వియన్నా' నగరమునఁ గూడి సంగ్రామ క్రమము గుఱించి చర్చించి, 'నిశపలాశి' అను మహమ్మదీయ నగరము ముట్టడింపవలయునని నిశ్చయించిరి. తోడనే క్రైస్తవ సైనికనికాయములు మహాసంరంభముతో వేర్వేఱు మార్గములనుండి గమ్యస్థానము చేరఁదొడంగెను. క్రమముగా నరువది వేల మహాసైన్యము కూడెను. క్రైస్తవులు బలదర్పితులై ముట్టడి ప్రారంభించిరి. నిశపలాశీ దుర్గపాలకుఁడగు 'తోఘునాబేగు' అల్పసైన్యయుతుఁ డయ్యు, మహమ్మదీయ సుల్తానగు 'బయోజీదు' తప్పక యరుదెంచునని విశ్వసించి, నిరుపమాన శౌర్యముఁ దాల్చి వైరుల నరు మాడఁగడంగెను. తమకు జయము నిశ్చయమని భావించిన క్రైస్తవ నాయకులు గర్వించి, తమ విధ్యుక్త ధర్మముఁ

దొడంగి విషయలాలసులైరి. మహమ్మదీయ దుర్గాధిపతి యగు తోఘునాబేగున కయ్యది మిగుల ననుకూలముగ నుండెను. క్రైస్తవ చమూపతులు భోగపరాయణు లగుటయే గాక, తురుష్క నృపాలుడు వట్టి పిఱికిపందయనియు, తమ ప్రతాపమెఱింగి యాతడు తన రాజధాని విడుటకున్నను సాహసింపజాలడనియు ప్రగల్భములు పలుకం జొచ్చిరి. ఒకవేళ మిన్ను విఱిగినను, తమ మహాసైన్య మొక మహానగరమువలె నిలిచి, ప్రపంచమున కపాయము వొరయకుండ తన్మహాభారము వహింపవచ్చునని వారు బీరము లాడం దొడంగిరి.

అంతలో వారి గూఢచారు లరుదెంచి తురుష్క సార్వభౌముడు మహాసైన్యసమేతుడై స్వయముగా నేతెంచుచుండెననియు, ఏడెనిమిది మైళ్ళదూరముననె కాచి యుంటిమనియు విన్నవించిరి. క్రైస్తవ సేనాని కుపితుడై అట్టి ప్రవాదములను గల్పించిన కుజనుల నురి తీయింతునని గర్జించి, నిర్భయముగా నుండెను.

క్రైస్తవు లా తెఱంగున గర్వాంధులై యుండ హైదరు సుల్తాను నిజదుర్గసంరక్షణార్థము నిజముగనే యరుదెంచెను. దుర్గమున కవ్వల నున్న మైదానమున తురుష్కసైన్యము విడిసెను. ఆ విషయము తెలియవచ్చినను క్రైస్తవుల దురహంకార మట్టులే యుండెను. ఉదయించిన భానుడు అపరమందిరమున విశ్రమింపక మున్నె తురుష్క సుల్తానుం బట్టి బంధించి రణరంగమున నీడ్చి తమ సర్వసైన్యాధ్యక్షుని శిబిరమునకుం గొంపోవలయునని పాశ్చాత్యసేనానులు సంకల్పించిరి. వారిలో ఫ్రెంచినాయకుల ఉత్సాహము మితిమీఱెను. తామొక్కరే రిపుసంహార మొనరించి, తురుష్క సుల్తానుం బట్టి యశము చూఱం గొనవలయునని తత్తరమొందిరి, అనుభవజ్ఞుడగు ప్రధానసేనాని హితోపదేశము సరకుచేయక తమ వంటి దురహం

కారస్వభావులు మఱికొందఱు భళీయన, నా వీరులు నిజసైన్యవిభాగములు వెంట జనుదేఱ, సగర్వముగ రణదుందుభులు మ్రోగించి ససంరంభముగ బయల్వెడలి, దురదృష్టవశమునఁ దమ సేనావాహినికి దవ్వననుండు తురుష్కులను గ్రూరముగఁ జక్కాడుచు బైజీదు సుల్తాను యొక్క సైన్యమును బిడుగువలెఁ దాకిరి. ఫ్రెంచివీరు లమిత బలపరాక్రమసమన్వితులు: వారటు లాకస్మికముగ నెగిరివచ్చి పైఁ బడుదురని సుల్తాను ఎఱుంగఁడు. ప్రసిద్ధ నికపలాశీయుద్ధమా తెఱంగునఁ బ్రారంభమాయెను. అమరులు సహితము నుతింపఁదగినట్లు ఫ్రెంచివీరులు విజృంభించి, తమ ప్రచండశౌర్యానలముచే విశాల రిపుజనకాంతారమును దహించివేయుచుండిరి. తురుష్కపదాతులు ఆశ్వికులు తుదకు అజేయులగు జనీజరీలు సహితము నిలువఁజాలక, పాఱిరి: పాఱక నిలిచిన సైనికులు భయంకరవైరిజనక్రూరకరవాల ఖండితశరీరులై త్రెళ్ళిరి. ఆ తెఱంగున, పదివేలమంది తురుష్కులు ఆక్రోన్నరణదేవతకాహుతియైరి. ఫ్రెంచిసైనికులు సహజముగా నమితోత్సాహితస్వాంతులై, పలాయన మొనరించు బగతుర నిర్దయులై వెన్నాడిరి.

విజయాతురులై క్రిందుమీఁదెఱుఁగక ఉన్మాదులవలెఁ బాఱు క్రైస్తవసైనికులు కొంత దవ్వరగినంతనే, ఒక చిన్న కొండవెనుక నలుబదివేల తురుష్కసైన్యము మఱియొకటి భయంకరముగ గోచరించెను! తురుష్కసార్వభౌముఁడు స్వయముగా శాసించు సేనావాహిని అయ్యది. క్రైస్తవుల యవస్థ దుర్భరమై, దుస్సహమై, కేవలము వర్ణనాతీతమై యుండెను. పోరుట యసాధ్యము: పాఱుట మఱియు నసాధ్యము. పాపము! ఆ పాశ్చాత్యసైనికులు ధైర్యముగఁ బోరాడియు, నౌకాభంగమున గభీరనీరజలరాశిం బడు ప్రయాణికులవలె, దీపమున కెగిరెడు పురుగులవలె, దావానలమున బడు మిడుతలవలె,

దారుణముగ మరణించిరి. ఒక్క క్రైస్తవ వీరుఁడును ఇరువదినలుగురు సైనికులును మాత్రము సప్రాణముగ రణభూమినుండి సుఱుకఁజాలిరి.

అతిభయంకరమగు యుద్ధసమాచారము తెలిసినంతనే, నిశపలాశి దుర్గముచుట్టు విడిసియున్న మిగిలిన క్రైస్తవసైన్యమున హాహాకారములు చెలరేగెను. వారి యహంకారము మాయమాయెను. ధైర్యమంతరించెను. చాలమంది వీరులు తమ సహజధర్మము మఱచి, తమ సహజగుణము పెల్లుబుక, ప్రాణములు తీపగుటచే, రయమునఁ బలాయన మొనరించిరి. ప్రధానసేనాని మాత్రము తన పంద్రెండువేల సైన్యముతో వీరపురుషోచితముగ నిలిచెను. కాని, ప్రయోజన మేమి? తురుష్క సార్వభౌముఁడు సంపూర్ణవిజయము కాంచెను. క్రైస్తవ సర్వసైన్యాధిపతి చేయునది లేక పలాయన మొనరింపవలసిన వాఁడాయెను. తురుష్కులు వ్యాఘ్రములవలె వారిని వెన్నాడి, పెక్కండ్రను సంహరించి, యంతకంటె నెక్కుడుమందిని బంధించిరి.

యుద్ధానంతరము బైజీదు సుల్తాను నిశపలాశీదుర్గముచెంత శిబిర మేర్పఱచికొని, రణభూమిపైఁ దిరుగుచుఁ బరికించెను. జయము చేకూఱినను, ముప్పదివేలమంది మహమ్మదీయసైనికులు జీవరహితులై ధరాతలంబున వ్రాలియుండిరి. సుల్తాను దుర్దాంతక్రోధవివశుఁడై, దారుణముగఁ గసి తీర్చికొనవలయునని ప్రతినపూనెను. ఉదయమైనంతనే, సుల్తాను క్రూరశాసనము ననుసరించి, ఘోరమగు నరవధ ప్రారంభమాయెను. యుద్ధమున మరణింపక, సమరభూమినుండి పలాయన మొనరింప నేరక పట్టువడి, శస్త్రహీనులై, అసహాయులై కేవలము జీవచ్ఛవంబుల భాతినుండిన క్రైస్తవసైనికులను మహమ్మదీయులు కఱకుగరవాలముల దెగనరకఁదొడఁగిరి. క్రైస్తవవీరులు నాయకులు జమీందారులుం గూడ నట్టులే నికృష్టముగ మరణించిరి. శిశుమాను, ప్రభువగు గిరీఫు జమీందారుఁ డట్టులే ఘోరవధ పాలాయెను.

సూర్యాస్తమయమగుసరికి పదివేలవిచ్ఛిన్నక్రైస్తవమృతకళేబరములు కడువికృతముగ వసుంధర నలంకరించెను. దాన, సుల్తాను దురాగ్రహ మొకింత యుపశమింప, మంత్రులు సైన్యాధిపతులు లోనగువారు దైన్యముగ బ్రార్థింప, నాతఁడు ప్రసన్నుఁడాయెను: భయానక నర మారణ మాగిపోయెను.

గిరీషుప్రభువుతోఁ బాటు శిశుమానుగూడ బంధితుఁడాయెను గాని, ఇరువదేండ్లప్రాయము లేని బాలు లవధ్యులనెడు ఇస్లాము మత న్యాయము ననుసరించి, వాని ప్రాణము దక్కెను. శిశుమానుతోఁ బాటు రెండువేల క్రైస్తవసైనికులు దురంతనరవధానంతరము మిగిలి యుండిరి. వారందఱు మహమ్మదీయునాయకులకు బానిసలైరి.

శిశుమాను రిపుజనభయంకరంబగు జనీజరీసైన్యమునఁ జేరవలసిన వాఁడాయెను. ఈ సందర్భమున నా ప్రసిద్ధసైన్యమెట్లు నిర్మిత మాయెనో ఎఱింగించెదను. నిష్కళంకయశోవిరాజితం బగు నట్టోమను వంశావళియందలి రెండవసుల్తాను 'ఉర్ఖాను' కాలమున నియ్యది స్థాపితమాయెను. ఒకానొక యుద్ధమునఁ బెక్కండ్రు క్రైస్తవసైనికులు పాదుషాకుఁ జిక్కిరి. బలవంతులగు సైనికులను జంపుటయు బానిసల నొనరించుటయు గూడ నవివేకమని యెంచి నాఁటి మంత్రి ఒక యపూర్వాలోచన చేసెను. క్రైస్తవసైనికులను మహమ్మదీయమతస్థుల నొనరించి, యాతఁడు తమ పటాలములలో నొక టిగఁ జేర్చెను. మేధానిధియగు నా మంత్రిపుంగవుని ఉపాయము నందొక గొప్పరహస్యము కలదు. మతభ్రష్టులకుఁ గ్రైస్తవులు మఱలఁ దావొసంగరు: తావొసంగకుండుటయే గాక, అట్టివారు కంటఁబడునంతనే విధాయకముగాఁ బట్టి వధింతురు: కావున, నట్టి సంకరమతస్థసైనికులు క్రైస్తవులతోఁ బోరాడునపుడు ప్రాణములపై నాసవీడి, చంపఁగలవారిని జంపి తమ శస్త్రములతోడనే మరణింతురు.

కాన, వారి సాహసపరాక్రమములు దశాధికముగా నుండును. మఱి యొక విశేషమేమన, వారు స్వామిద్రోహ మొనరింపఁజాలరు. అట్టి సైన్యమునే 'జనీజరీ' సైన్యమందురు. అట్టి సాహసికులఁ దలంచినంతనే క్రైస్తవులు సహజముగా భయవిహ్వలు లగుదురుగదా.

ఆ తెలుంగున శిశుమాను తన మతము వీడి శాత్రవమతస్థుఁడు కావలసివచ్చెను. సైనిక విద్యాలయములో వలయుశిక్ష వడసి వాఁడు జనీజరీ సైన్యమునఁ జేరి క్రమముగా నభివృద్ధిఁ గాంచెను. బంధుజన వియోగము, స్వమతనష్టము, దుస్సహనికృష్టపరమతావలంబనము, మించి దుర్భరరిపుసేవాబంధనములచే నా యువకుఁ డుత్సాహవిహీనుఁడై విచ్ఛిన్నహృదయుఁడై యుండుచు, తన దురవస్థం దన తండ్రి కెఱింగింపవలయునని ఎంతయో ప్రయత్నించెను. కాని, రెండేండ్లు గడచినను, అట్టి యవకాశము చిక్కలేదు: ఉత్తర మంపుటయు నసాధ్యమాయెను.

దారుణ నిశపలాశి యుద్ధసమాచారము తెలిసినంతనే, వృద్ధుఁడగు సిరిబరుఁ డమితదుఃఖ పరవశుఁ డాయెను. తనయుఁడగు శిశుమాను సమాచారము తెలియకుండుటచే వాఁడును భయంకరరణరంగముననో, లేక, తదనంతరము ఘాతుకవైరిజనకరాళకరవాలఘాతముననో, మరణించి యుండునని ఆ వృద్ధుఁడు రాలు కరగునట్లు లేడ్చెను. అన్నయగు కరాభుఁడు గూడఁ దనకై రణరంగమున కేగిన గుణవంతునిఁ దలచి తలచి తీవ్రదుఃఖానలతప్తుఁ డాయెను. ఐనను, వాఁడు భార్యాపరుఁడై, సుతలాభము గాంచి, క్రమముగా సోదరవియోగము మఱచి హాయిగ నుండెను.

రెండుసంవత్సరము లట్లు గడచినంతనే, మఱల నొక క్రైస్తవ తురుష్కసంగరము దాపరించెను. 'తమరతు' పాషాయను ప్రసిద్ధ తురుష్కవీరుఁడు నాయకత్వము వహించెను. ఆ తురుష్కసైన్యము

నందు శిశుమారును గూడ నుండెను. పదునైదువేల తురుష్క సైన్య మాకస్మికముగాఁ గ్రైస్తవదేశములపైఁ బడి దోపిడిచేయుచు, నగరములను గ్రామములను దావానలమువలె భస్మీభూత మొనరించి, స్త్రీ పురుష బాల వృద్ధజనంబులను గంటఁ బడినంతనే తెగనఱకుచుఁ బ్రయాణ మొనరింపసాగెను. క్రైస్తవాన్వయమున హాహాకారము లుదయించెను.

తురుష్కులు తొలుదొల్త బవేరియాదేశముమీఁదనే పడుటచే, నా దేశస్థులే యాత్మసంరక్షణార్థము యుద్ధసన్నద్ధులు కావలసినవారైరి. పెనుభూతమువలె నవతరించిన వైరినిఁ దాకుటకై ప్రతి క్రైస్తవపురుషుఁడును ఆయుధము ధరించెను మరీటా జనకుఁడగు హారిమణుఁడు రణించెను. కరాళుఁడును, వృద్ధుఁడయ్యు సిరిబరుఁడును గూడ నాయుధపాణులైరి. ప్రఫుల్లముఖియు, ప్రసన్నచిత్తయు సౌందర్యరాశియునగు నిజప్రియాంగనను వీడుట కరాళున కెంతయుఁ గష్టముగ నుండెను. ఐనను, దేశభక్తిపూరితుఁడగు నా యువకుఁడు పితృసహాయుఁడై రణరంగమున కేగెను.

కొన్నిదినములకు, యుద్ధము ప్రారంభమాయెను. క్రైస్తవు లారంభమున నతిప్రశంసనీయముగ విజృంభించిరి: తురుష్కులు వెనుదిరిగి, మఱియొక ప్రదేశమున నిలువవలసినవారైరి. అంత దిమరతుపాషా క్రోధోన్మత్తుఁడై, తగు ప్రతీకార మొనరించి యశోపార్జన మొనరింపవలయునని దారుణముగ సంకల్పించెను. మఱునాఁడు మగుడ సమరము ప్రారంభమాయెను. నాఁటి యవనవీరులు ప్రదర్శించిన ధైర్య పరాక్రమములు నిరుపమానములు, కేవలము వర్ణనాతీతములు. ప్రతి సైనికుఁడును మహావీరునివలెఁ బరాక్రమించి, శత్రుసంహార మొనరించెను. మహమ్మదీయులు మహావిజయముగాంచిరి. చావు తప్పిన క్రైస్తవులు పట్టువడి బంధితులైరి. ఆ తెఱంగునఁ దండ్రీకుమారులు

సిరిబరకరాళులొక జనిజరీసైన్యవిభాగనాయకునకు జిక్కిరి. సర్వసైన్యాధిపతియగు పాషా యాజ్ఞననుసరించి, చీటులువైచి క్రైస్తవదారాభాగ్యలను ముసల్మానుసైనికులు పంచికొనిరి. ఎవరివంతునకు వచ్చిన వారిని ఆ తురుష్కసైనికులు స్వహస్తములతో సాయంసమయమున వధింపవలయునని తిమురతుపాషా క్రూరముగ నాజ్ఞాపించెను. ఇట్టి దారుణము లాకాలమున సాధారణముగ జరుగుచునేయుండెను.

హాసేను అను నాయకునకు కరాళసిరిబరులు చిక్కిరి. సైనికులు వారిందోడ్కొని తమ నాయకుని గుడారమునందుఁ బ్రవేశపెట్టి తమ నెలవులకు మగిడిరి. కాని, హాసేను కరాళసిరిబరులు పరస్పరము వీక్షించినంతనే, మువ్వురును మ్రాన్పడిరి! కారణమేమి? ఆ హాసేనుఁడే తొల్లిటి శిశుమానుఁడు! మరణించెనని తలంచిన చిన్నియనుంగు తమ్ముఁడు కంటఁబడినంతనే, కరాళుఁడు విపరీతప్రమోద పరవశుఁడై చయ్యనఁబోయి, గాఢాలింగన మొనరించెను. వృద్ధజనకుఁడు మాత్రము దవ్వుననాసీనుఁడై, వివర్ణవదనుఁడై, దురంతబాధితాత్ముఁడై యశ్రుధారల విడుచుచుండెను. ఎట్టకేలకా ముదుసలి యిట్టులనెను—

“ఓరీ! నీవు నాతనయుఁడవా! కుమారా! ఎంతటి యకార్యమొనరించితివి! ప్రాణసమానమగు స్వమతము వీడి నీచమతావలంబన మొనరించితివా? హా! విధీ! మహమ్మదీయమతము! మహమ్మదీయ నామము! మహమ్మదీయవేష! మహమ్మదీయశిరోంబరము! శస్త్రము! కంఠమాల! అంగుళీయము!! ఛీ! పేర్కొనఁజాలను! నిన్ను జూడఁ జాలను!”

కరాళుఁడిట్టులనెను.— “తండ్రీ! మన శిశుమానుఁడు మరల మనకు గోచరించెను! ఇట్టి నిష్ఠురోక్తుల బాలునిఁ గారింపకుము. ఇంతకు, గుణవంతుఁడగు నీ కుమారుఁడు బుద్ధిపూర్వకముగా నిట్టి యధమకార్య మొనరించి యుండఁడు.”

"దైవమా ! ఏల యొనరింతును ? సోదరా ! నేను ద్రోహిని ! మతద్రోహిని ! దేశద్రోహిని ! ఏదైవమును జనించినదాది విశ్వసించితినో, యాపరమ పావనుని విడనాడి, యన్యదైవారాధకుఁడనై, భయంకరులునయి దయారహితులనియు దుర్యశముగాంచిన జనీజరీ సైనికులలో నొకఁడనైతి !"

"శిశుమానుఁడట్లు నిజమనోవ్యథ నెఱింగింప, సిరిబరుఁడిట్లు సక్రోధముగాఁ బలికెను.—

"ఛీ ! వినఁజాలను ! ఇట్టి పాపంపు బలుకుల వినఁజాలను ! ఓరీ ! నీవు నాతనయుఁడవుగావు !"

"తండ్రీ ! అంతటి యాగ్రహమునలదు. నా సోదరునక్కై నే నొనరించిన మహాత్యాగమిట్టిదిగావు. దానినింతటి యనర్థకము దాపరించెను."

కరాళుఁడు విస్మితుఁడై, "నాకొఱకా ?" యని ప్రశ్నింప, శిశుమానుఁడు వినయ నిశ్చల స్వరంబున నిట్టులనెను —

"ఔను. సోదరా ! నేనును నీవలెనే మరీటాను మనసారఁ బ్రాణసమానముగఁ బ్రేమించితి: ముద్దుల నాకాంతనే తలంచుచుంటిని: నిద్రయందైనను మఱవఁజాలకుంటిని. నే నాకన్నియఁ జెట్టఁబట్టఁ జాలుదునని ఆసించియుంటిని, విశ్వసించియుంటిని. అంత జనకునభిమతము పిడుగువలెఁ దెలియవచ్చెను. ఆహా ! నా యవస్థ అప్పుడెటులుండెను ? తలంచినంత మాత్రమున దేహము కంపించును, హృదయము శీర్ణమగును ! అన్నా ! నీపై నాకుఁగలప్రేమ యనంతము, నిరుపమానము. జనకునన్నో, ప్రత్యక్షదైవమునవలెఁ జూచుచుంటిని. భగ్గున మండెడు హృదయతాపము సహింపఁజాలక, మనోరథము ఘోరముగా భగ్నమగుటచే దుర్మతినై యెట్టి దురితము చేయఁ బూనెదనో యని వెఱచియు, సర్వ సౌఖ్యధామమగు గృహము వీడి,

సైన్యము నాశ్రయించితి: యుద్ధానంతరము వైరివశంవదుఁడనైతి. ఇంటికరుదేఱ నవకాశములేదు; వచ్చినను, హతభాగ్యునకు సౌఖ్యమెక్కడ? కావున, విధి విధానమనియెంచి, మహమ్మదీయుఁడ నగుట దోషమా?"

అంతవరకు నడంగియుండిన పితృవాత్సల్యమంతట పెల్లుబుక, వృద్ధుఁడగు సిరిబరుఁడు విగతధైర్యుఁడై, ఉద్విగ్నహృదయుఁడై, ఘూర్ణితమనస్కుఁడై, యమితోత్సాహరుద్ధస్వరంబున "హా! కుమారా!" యని యఱచి రయమునఁ బాఱి ప్రకంపిత భుజపంజరమున శిశుమానుని బంధించెను. కొంతతడవట్లు కడచిన పిమ్మట, కరాళుఁడు ప్రబోధితుఁడై, కంపితహృదయుఁడై, యిట్లనెను—

"తమ్ముఁడా! సాయంకాలమగునంతనే, మేమీపురము నీచేఁ దెగటార వలయు; లేదేని నీవ తెగటారవలయుఁగదా!"

"అన్నా! నేనె మరణింతుఁగాక. ఒక యుపాయము స్ఫురించినది; దాన మనము ముప్పురము సురక్షితముగా నుండనగును. నే నొక సైనికోద్యోగినగుటచే, నాయనుమతి వడయకుండ ఈ గుడారమెవ్వరు ప్రవేశింపఁజాలరు. కావున, కొన్నిదినములు మీరిందు దాగియుండ వచ్చును. సమయమరసి మిమ్ము నిరపాయముగ సాగనంపెదను."

"కుమారా! నీవును మాతో నరుదెమ్ము. నిన్నుడించి పోఁజాలము. తనయా! నీవు మఱల జన్మభూమికే తెంచి, పాపంబుఁబరమ తత్త్వజ్ఞుఁడవై మాతోఁబాటు సుఖముగ నుండుము."

జనకుఁడట్లు సాదరముగాఁ బలుక, శిశుమానుఁ డిట్లనెను.—

"హా! తండ్రీ! ఈదురదృష్టవంతున కంతటి సౌఖ్యములేదు. మోహాతిరేకమున నాయవస్థ మఱచుచుంటివి. పరిస్థితులు క్రూరముగ నాకొకపథం బేర్పఱచెను: తదుల్లంఘన మసాధ్యము, అవివేకము, అపాయకరము. తండ్రీ! నీ కుమారుఁ డేరణక్షేత్రముననో

మరణించును: ఈపాపపుఁ గళేబరమునకు సంస్కారము జరుగనేరదు: గృధ్రజంబుకములకో, క్రిమికీటకములకో ఆహారమగును గాఁబోలు: ఈ శరీర కంకాళము వర్షాతపంబులకు గుఱియై శైథిల్యము నొందుఁ గాఁబోలు: అపవిత్రమగు నా యాత్మ నితాంతబాధితమై యచ్చటనే పరిభ్రమించుఁగాఁబోలు! తండ్రీ! నీవును గరాళుఁడను నాకై దవ్వున నుండియే ప్రార్థింతురా!"

నిజహృదయ దుర్భరారాటము నా తెలుంగున వెలిబుచ్చిన శిశుమానుఁడచట నిలువక, ఆవలకు రయమునఁబాఱి, దినకరుఁడస్తమించువఱకు భయంకర మృతకళేబర విభూషితమగు రణవసుంధరం దిరుగాడి, చచ్చిన క్రైస్తవుల మస్తకములు రెండింటిని ఖండించి, కొంగున భద్రపఱచి యుల్లనఁ దన గుడారము చొచ్చెను: ప్రాంగణమున రెండు ఈఁటెలు పాతి, ఆశిరములను వానికిఁ దగిలించెను. సూర్యోదయమగునంతనే ప్రభుత్వవిచారకుఁ డరుదెంచి, సైనికులు శత్రుసంహారము ప్రభునాజ్ఞ ననుసరించి యొనరించిరో, లేదో, యని అరయుచు, శిశుమాను గుడారము ముంగలి ప్రదర్శనముగాంచి, సంతసించి, తనదారిం బోయెను. తండ్రికుమారు లమితానందపరులైరి.

కరాళసిరిబరులు హాసేను నామధేయుఁడగు శిశుమాను గుడారము చొచ్చి మూఁడునాలుగు దినములాయెను వారిని భద్రముగఁ బంపివేయుట కింకను అవకాశము చిక్కకుండెను. ఒక్కొక్కదిన ముదయించుకొలఁది, హాసేను భయమధికతరమగుచుండెను. తురుష్కసైన్యము పునఃప్రయాణ మాచరించు సహాయ మరుదెంచుచుండెను. రహస్యమిక దాఁగనేరదు. కాని, వారి యదృష్టము బాగుండుటచే, నా సంకటసమయమున సర్వసైన్యాధ్యక్షుఁడగు తిమురతుపాషా వ్యాధిగ్రస్తుఁడాయెను. ఆకారణమునఁ బ్రయాణములు నిలిచిపోయెను. హాసేను ప్రాణము కుదుటఁబడెను.

పాపా రుగ్మత యనుదిన మధికమగుచుండెను. పేరొందినవైద్య శిఖామణులు భయభక్తులతోఁ బాటువడియు, భగ్నమనోరథులై, క్రోధమూర్తియగు పాపా ఏమిచేయునో యని తలఁచి, యాకస్మికముగా మాయమైరి. వ్యాధిబాధ దుర్భరముగ నుండుటచే, నా తురుష్క-ప్రభువు క్రోధోన్మత్తుఁడై, దండతాడితభుజంగమువలె, నిశితాస్త్రపీడితవ్యాఘ్రమువలె బరిజనులు భయవిహ్వలులగునట్లు, ఘూర్ణిల్లఁ జొచ్చెను.

ఈ సమాచార మెప్పటికప్పుడు హానేనునకుఁ దెలియుచుండెను. వాని జనకుఁడగు సిరిబరుఁడు వైద్యవిద్యావిశారదుఁ డగుటచేఁ దన తనయునిఁ గాంచి యిట్టులనెను —

“కుమారా! నా ప్రజ్ఞ నీకు విదితము. ఎట్టి రోగమైనను నాకు సులభసాధ్యము. కాన, నన్ను బాపాసమక్షమునకుఁ గొంపోఁగలు దేని, కృతకృత్యుఁడనై ప్రభువు ప్రేమాభిమానములకుఁ బాత్రుఁడఁ గాఁజాలుదు. దాన, మనము బహిరంగముగ మన యిల్లు చేరఁ గలము.”

తోడనే, హానేను సంతోషపరవశుఁడై, పాపా శిబిరమునకు రయమునఁ బ్రయాణమాయెను. దారుణరోగపీడితుఁడై పడియుండిన సేనాధ్యక్షుని విలాపములు దవ్వుననుండియే దుస్సహముగ వినవచ్చుచుండెను. హానేను దనుజ్ఞవడసి, పాపా సమ్ముఖమునకేగి వినమ్రుఁడై మోఁకరించి, కంపితహృదయుఁడయ్యు ధైర్యముగ నిట్లు పలికెను.—

“మహనీయా! భవదీయపవిత్రపాదధూళి యాదల ధరించుటకునైన నక్కరకురాని యీ సేవకాధముని మనవి చిత్తగింపుఁడు! ఈ సమీపమున నొక క్రైస్తవసన్యాసి కలడు. నిస్సంగుఁడగు నా సాధుజనుఁడు రోగచికిత్సయం దసమానుఁడు. లోకవిషయములం దలంపక ఆ యనఘాత్ముఁడు నిరంతరము ధ్యానైకతత్పరుఁడై యుండును.

యినను, నిర్వ్యాజపరోపకారపరతంత్రుఁడగు సమ్మోహనీయుఁడు తప్పక విచ్చేయును. వనమూలికాప్రయోగమునం దప్పక రోగనివారణ మొనరించునని విశ్వసింతును: క్రైస్తవుఁడైనను, విశ్వసనీయుఁడని దృఢముగఁ జెప్పఁగలను."

"చూతము! ఆ కాఫరు ఫకీరు నిటుఁగొనిరమ్ము! నా తెవులు మాన్పినా, ఆ కాఫరుని బహుమానములతో ముంచివేయుదును: లేదేని, మరణించినను, వాని పనిపట్టింతును! భద్రము! పొమ్ము."

మృత్యుముఖమున నున్నను, ఆ తురుష్కవీరుని దురహంకార మొక్క తీరుననే యుండెను. తన ప్రభువట్లు పలుక, మహాప్రసాదమని పలికి మోఁకరించి, వెడలి, హసేను నామధేయుఁడగు శిశుమాను తన జనకునితో సరుదెంచి, తిమురతుపాషా శిబిరము ప్రవేశించెను. ఈలోన నా సేనాని పరితాప మధికతరముగుటచే నున్మత్త హర్యక్షము భాతి గర్జింపఁ దొడంగెను. పరిజనులు భయభ్రాంతులై యట నిలువఁజాలక పోయిరి. అపూర్వసౌందర్యవతియగు నొక బాలిక ప్రేమపూరితచిత్తయై, వ్యగ్రమనస్కయై యుపచారము లొనరించుచుండెను. తదుపచారకార్యనిమగ్నయై యుండిన ఆ మచ్చెకంటి ముఖవసనధారణము మఱచియుండెను. అట్టి సమయమున శిశుమాను కృత్రిమభిషగ్వర సహితముగా నందుఁ బ్రవేశించెను. మేలిముసుంగు తొలఁగి నీలమేఘ పరిత్యక్త సుందర సుధాకరబింబ సమాన వైభవ సముజ్వలముతో దీపించు నాకన్నియఁ గాంచినంతనే, శిశుమాను ముగ్ధుఁడాయెను. అవనతవదనయై, నిజజనకుని ముఖవిలోకన మొనరించుచు, నవ్యక్తమధురమంజుల కంఠమున ధైర్యము కఱపఁబూనిన యావాల్గంటి యిందీవర సన్నిభ విశాలనయనములు రనిమీలితములై యుండెను: మనోహరములై గులాబులవలె రాజిల్లు కెంపెదవుల నడుమ నాకుందరదన పల్వరుస విమల ముక్తాఫల సాదృశ

శోభాయమానముగ నుండెను: ఆ మోహనాంగి యంగ విస్ఫురణము పరిపూర్ణమై, సువ్యక్తమై, నిరుపమానమై, వర్ణనాతీతమై యలరారెను: ఆ కోమలాంగి ధరించిన పరాయిసుండి కోమల కాంచన పదకంజాతములు వెలువడి, నేత్రపర్వ మొనరించుచుండెను.

నాకమునుండి దిగివచ్చిన దివ్యాంగనయో యనునట్టుల నూనరూప వైభవ సముజ్జ్వలయై యొప్పు నా నారీరత్నము నొక్కనిమిషముఁ నిశ్చేష్టితుఁడై ముగ్ధుఁడై శిశుమానుఁడనిమిషనయనుఁడై కాంచఁజాలెను. అంత నాముగ్ధయు తటాలున మోమెత్తి యటుపరికించెను: ఆచంద్రముఖి శీతల వీక్షణములు శిశుమానుమీఁదనే పర్వెను: వాఁడాదివ్యసుందర విగ్రహమునే, విభ్రాంతుఁడై, కాంచుచుండెను. ఆమానవతి తోడనే సుందర సంధ్యారుణ రంజిత వదనయై, మేలిముసుంగు రయంబున ధరించెను.

శిశుమానుఁడంత నిశ్చల స్వాంతుఁడై పాపా శయ్యకడ కేగి, మహాత్ముఁడగు క్రైస్తవఫకీరును గొనివచ్చితినని దైన్యముగ విన్నవించెను. పాపా యిట్టులనెను.—

“నా చెంతకు రమ్మనుము! కుమారీ! నీవిచటనే యుండవలయు: నీవున్న, నా తాపమొకింత యుపశమించును.”

సిరిబరుఁడంత రోగినిఁజూచి, వదనముపరిశీలించి, రోగముగుర్తించి, ఏవియోకొన్ని మూలికలు కావలయునని కోరెను. పరిచారకులు తోడనేపోయి యందందుఁ దిరిగి, వలయు నోషధులఁ గొనితెచ్చిరి. సిరిబరుఁడు వానిని శుద్ధపఱచి, ప్రయోగార్హముగ నొనరించి, రోగికొసంగు కార్యమున నిమగ్నుఁడై యుండ, శిశుమానుఁడు తనచెంత నుండిన విద్యుల్లతావిగ్రహసౌందర్యవైభవము తలంచికొనుచుండెను. అతఁడొకసారి మరీటాను ప్రేమించియుండెను. కాని, తిమరతు పాపా పుత్రికా విలోకనావసర చిత్తోద్రేకము కేవలమపూర్వముగనుండెను.

మున్నెన్నఁ డెఱుంగని వికారమొందుచుయుంచి, యనలమువలెఁ బ్రజ్వరిల్లెను. విద్యుత్ప్రవాహము పరుగిడినటులు, ఒడలంతయు ప్రకంపితమాయెను. అనిర్వాచ్యమగు నొకవింత యానందము వానికనుభవైకవేద్యమాయెను. ఒక యమిత సుఖస్వప్నముఁ గాంచువానివలె శిశుమానుఁడు తన్మయుఁడై యుండ, ఈ మధురంపుఁ బలుకులు వినులంబడెను.—

"ఈ క్షైస్తవుఁ డెవ్వఁడు? విశ్వసనీయుఁ డగునా! అపాయము వారయదుగద! క్రూర విధివశమున వ్యాధిగ్రస్తుఁడైన ఈ మహానీయుఁడు సాధారణుఁడు కాఁడుసుమా!"

శిశుమానుఁ డంత ప్రబోధితుఁడై, తత్క్షణము గాంభీర్యము వహించి, పాపా పుత్రికకు తగుసమాధాన మొసరించెను. అంతనా 'వల్లకి' యొక్క నిమిస మూరకుండి యభిన వల్లకివలె నిట్లు ప్రశ్నించెను.—"నీ నామధేయ మెయ్యది?"

"నన్ను హాసేనుఁడని పిలుతురు."

శిశుమానుఁ డట్లు సవినయముగ సగౌరవముగాఁ బలుక, నాహేమవల్లకి యల్లన నిట్టులనెను.—

"ఈ పవిత్రక్రైస్తవునిఁ గొనితెచ్చి నీవు నిక్కముగ సార్థకనామముఁ డవైతివి." అంత నాముద్దియ రయమునఁ దన యంగుళీయముఁ దీసి శిశుమానునిఁ జేరఁ బిలిచి, యమిత మందస్వరమున మగుడ నిట్టులనెను.—"ఆర్యా! ఈ యుంగరము నాజనకుని కోటకుఁ దాల్పుము!"

"వరరామణీ! వలదు, వలదు. నన్ను బహూకరింతునని ప్రభువు సెలవిచ్చియే యుండెను. భవదీయజనకుఁ డప్పుడే ఈ క్రైస్తవ మహానీయుని ప్రభావముచే నొకింతబాధఁ దక్కెనని తోఁచెడిని. ఐనను, నీవొసంగు బహుమానము వలదనఁ జాలను: నీకై ఈరమణీయ భూషణము ధరించెదను."

తదవసరమున నాయువతీ యువకుల కరములు పరస్పరము చుంబించెను. శిశుమారుఁడు ప్రభుసహిత కరస్పర్శన మహాసౌఖ్యము ననుభవించి, తదమూల్య పదార్థము పరిగ్రహించెను. సిరిబరుఁ డంతట లేచి, నాలుగడుగులు వెనుకకువైచి, అమిత మందస్వరమున నిట్టు లనెను.—

"మందులు తలకెక్కినవి: పాపా గాఢనిద్రావరుఁ డాయెను: మేల్కాంచు వఱకు భంగము కలుగరాదు: నే నీచెంతనే కనిపట్టి యుందును."

వల్లకియు నచటనే యుండవలయును. ఆ యిందీవరనయనను వీడఁజాలక శిశుమారును గూడ నెద్దియో నెపము కల్పించి యచటనే యుండెను. వల్లకి కనుసన్నఁ గాంచి, మూఁగ దాసీనలు ఆ వివిధాహార సమృద్ధములగు వెండి పళ్లెరములఁ గొనితెచ్చి యొక మేజాపై నిడిరి. అతిథుల గౌరవించు నెపంబున నాప్రభుపుత్రి తన మేలి ముసుంగు సడలించి, విందారగింపవలయునని వారి నాహ్వానించెను. బల్లపై నానావిధరుచికర పదార్థము లమరియుండెను. పూజ్యుఁడగు మహామ్మదు కఠినము ఖండించిన మేలురకపు మధురసముగూడ నాయత్తమాయెను; వల్లకీ శిశుమారు లాభూలోక పియూష మాస్వాదించిరి. తురుష్కప్రభు వెటులుండెనో చూడవలయునని సిరిబరుఁడు తటాలున లేచిపోయెను. మిగిలియుండిన యువతీ యువకులు చనవుగ, బరస్పరము విలోకించుట కవకాశమాయెను. శిశుమారుఁడు ప్రణయామృతము గ్రోలిగ్రోలి పరవశాత్ముఁడై మఱలఁ గలియుదు మని నిబ్బరముగఁ బలికి వెడలెను.

సిరిబరుఁడా శిబిరముననే యుండెను. శిశుమారుఁడు మాత్రమను దినమరుదెంచుచు వల్లకీ సుందరసుధాకరబింబముఁ దిలకించుచు, సైన్యాధిపతి క్షేమమరయు నెపంబున నాకలకంఠి మంజులాలాపము

లాలించుచు వెడలుచుండెను. పదిదినములలో తిమరతురోగము కుది రెను: ఇరువదిదినములలో నాతని కారోగ్యముల వడెను: ఇఁక సిరిబరుని యవసరము తీఱిపోయెను.

పాషా యంతట శిశుమానుని రావించి ఆ వృద్ధక్రైస్తవఫకీరునిఁ దనగుడారమునకుఁ గొంపోయి ఆతని వాంఛలనెల్ల సగౌరవముగా నరయువలయునని యాజ్ఞాపించెను. పాషా నిజముగ, భీతుఁడై నను, ఒక యనుమానమును శాధించుచుండెను. కాఫరులను నమ్మరాదనియు, ఈ క్రైస్తవుఁడు నిపుణముగ వ్యాధి మఱలించినను విశ్వసింపరాదనియు, శీఘ్రముగ నరయఁజాలని విసము ప్రయోగించి, బహుమానము వడసి యాతఁడు పలాయన మొనరించునని, తాను తిరుగరోగార్తుఁడై యధిక తరబాధననుభవించి మరణింపవచ్చుననియు పాషా లోలోన నను మానించెను ఆ కారణముననే యా వృద్ధుని తనసైనికుని గుడారమున నుంచి, కొన్ని దినములు చూచి యనంతరము ఘనముగా బహూక రింపవలయునని పాషా ఆలోచనచేసెను.

పది దినములాయెను. పాషా యారోగ్యము దినదినప్రవర్ధమాన మాయెను. దాన నాప్రభువు సంతసించి, క్రైస్తవుఁడు నిజముగ, సజ్జనుఁడే యని గ్రహించి, కృతజ్ఞతాపూర్వముగా దాను మంచి పనదన మొసంగవలయునని సంకల్పించెను కాని, క్రైస్తవ ఫకీరుఁ డెంతటి మేటిసాధకుఁడైనను, వాని నరసినవాఁడు హాసేనుఁడుగదా! కాన, వాఁడును గొప్ప బహుమానము వడయువలయును. వానిగుఱించి తన మంత్రులను బ్రశ్నించినంతనే వారెల్లరు హాసేను వీరుఁడనియుఁ స్వామిభక్తి పరాయణుఁడనియు, సత్ప్రవర్తకుఁడనియు నేకగ్రీవముగా, బలికిరి. ప్రభువు సంతుష్టాంతరంగుఁడై, తన తనయను రావించి, యిట్లులనెను.

"కుమారీ! నిన్నొక కార్యార్థము చీరితి. ఎఱుంగుదుగదా, నా

తొంటి దారుణవ్యాధిబాధ! పరమేశ్వర విలాసముచే మన హాసేనుడు తగిన భిషగ్వరు డరయఁజాలెను. నేను మరల సంపూర్ణారోగ్యభాగ్యము ననుభవింపఁజాలుటకు హాసేనుఁడే కారకుఁడాయెను. హాసేను మంచి మహమ్మదీయుఁడు, వీరుఁడు, అచిరకాలమున యశోవంతుఁడు కాఁగలఁడు. పట్టీ! బహుమానపురస్సరముగా నిన్ను వానికి భార్యగా నీయఁదలంచితి."

వల్లకి యమితానంద పరవశయాయెను. ఏ సుందరాంగునిఁగాంచి మోహవిభ్రాంతచిత్తయై, తన ముద్రిక యొసంగి, కరస్పర్శనానంద మనుభవించి, తదాలోచనాధీనమానసయై యుండెనో, వానినే వివాహ మాడవలయునని పాషా యాజ్ఞాపించెను!

పాషా యంతటఁ దన పెద్ద కొజ్జాను జీరి, యిట్లు లాజ్ఞాపించెను—

"అబ్దుల్లా! అమూల్యములగు వింత వసనములఁ బట్టించికొని, పండ్రెండుగురు పరిచారకులతో నీవు హాసేను గుడారమునకుఁ బొమ్ము. అందొక వృద్ధక్రైస్తవుఁడు గూడ గోచరించును. వారిని గాంచునంతనే గౌరవపురస్సరముగా నాయిరువురకు రుచిరాంబరములఁ గప్పి, సువర్ణ మాలికలు వైచి, యంగుళీయములు తొడిగి రయంబునఁ గొనిరమ్ము! పొమ్ము!"

ఆప్రకారమబ్దుల్లా రయమునఁబోయి, ప్రభుసేవకుఁ డగుటచే నని వారితుఁడై, జంకు లేక హాసేను సముఖమునకుఁబోయెను. హాసేనుఁ డా సమయమునఁ గరాళసిరిబకులతో వినోదముగ సంభాషించుచుం డెను. పిడుగువలె నరుదెంచిన సేవకుని గాంచినంతనే, శిశుమానుఁడు భయాతిరేకమున భ్రమాస్పదుఁడాయె. అబ్దుల్లా డిల్లపడి యిట్లులనెను.—

"అయ్యా! నీ గుడారమున నొక్క క్రైస్తవుఁ డుండునని యు, వానికిఁ రుచిరాంబరాది సన్మానముల నొసంగవలయునని పాషా ఆజ్ఞా పించెను. కాని, ఈ నికటమున నిర్వురు గోచరించుచున్నారే! ఇం

దెవ్వఁడు గౌరవార్హుఁడో యెఱుంగఁజాలను. కావున, మీరుముగ్గురు పాషావారి శిబిరమునకు దయచేయుఁడు!"

వాఁడట్లు పలుకుచు హసేను నామధేయుఁడగు శిశుమానునకు సగౌరవముగాఁ దాఁదెచ్చిన రుచిరాంబరముఁ గప్పి, ఇతర బహుమానములఁ గూడ ధరింపఁజేసి, యంతివఱకుఁ గృతకృత్యుఁడాయెను. కాని, శిశుమానునకు బహుమానములేల? తన రహస్యమిఁకఁ దెలిసిపోవును. ప్రసన్నహృదయుఁడై యుండిన పాషా యిఁక క్రోధోన్మత్తుఁడగును: తండ్రికుమారులు ముగ్గురకిఁక మరణము తప్పదు! శిశుమానుహృదయము పాషాణఘటితమృణ్మయపాత్రవలె వ్రక్కలాయెను! ఐనను, కర్తవ్యమేమి! పాపమా హతభాగ్యుఁడు చేయునది లేక జీవచ్ఛవంబుగతి ప్రభుసేవకు నరుగమించెను: కరాళసిరిబరుఁలును అట్టిపోయిరి.

అబ్దుల్లా ప్రభుసముఖమున సాష్టాంగ మాచరించి, తాఁగాంచిన వైపరీత్యము నివేదించెను. ఇరువురు క్రైస్తవు లనినంతనే తురుష్క ప్రభువు విస్మయాగ్రహపరవశుఁ డాయెను. అంత నొక సభ్యుఁడులేచి యిట్లు పలికెను.—

"క్రైస్తవులా! ఎఱుంగుదు. యుద్ధమునఁ బట్టువడి, హసేనువంతునకు వచ్చినవారలే! హసేను వధింపక ఈ కాఫరులనువిడిచి యుండును."

తిమరతు పాషా క్రోధోన్మత్తుఁ డాయెను.—"అల్లా! అల్లా! ఎంత యాగడము! ఈ కాఫరు నిజముగ ఫకీరుఁడని విశ్వసించి, నాచెంతకు రానిచ్చితి. అట్లుకాదేని, మనపైఁ గత్తి దూసిన నరాధములలో నొక్కఁ డగునేని, వీనిని వీని యనుచరులను నాప్రాంగణమున నిప్పుడే ఉరి తీయింతును! అరే! హసేన్! మాటాడవేమి!"

అట్లు గర్జించుభయంకర చండశాసనుని పాదముపై వ్రాలి శిశుమానుఁడు తన యథార్థవృత్తాంతము పూర్తిగఁ జెప్పివైచెను. పాషా

దుర్వారదురాగ్రహ ప్రచలితశరీరుఁడై యిట్లు గర్జించెను.—

"ఓరీ! నరాధమా! ద్రోహము! మహాద్రోహము! చేఁజిక్కిన కైవ్రస్వకీటకములఁ జిక్కఁగఁ జెక్కుడవలయునని ఘోరసమయము గావించితి! అరే! దురాత్మా! ఎట్లు క్షమియింతును! హా!"

వృద్ధుఁడగు సిరిబరుఁడంత దుఃఖపరవశుఁడై, అమితభయాతురుఁడై, తత్సమాగతసదస్యహృదయ విదారణమగునట్లు గోలుగోలున నేడ్చెను. సభాసదుల చిత్తములీరాయెను. కఠినహృదయుఁడగు పాపాసహితమొక్కింత ప్రచలితుఁడై శిశుమానునుద్దేశించి యిట్టులనెను —

"ఓరీ! విశ్వాసఘాతుకా! నీజనకుఁడు నా ప్రాణము కాపాడెను. వాని కథయమొసంగితి. మఱియు, వానికొక కుమారుని దక్కింతును. మీ సోదరులలో నొక్కఁడు మరణింపవలయు. తన కెవ్వఁడు కావలయునో వృద్ధుఁడు తత్తణమొఱింగింపవలయును."

భాగ్యహీనుఁడగు శిశుమానుఁడంత నాదారుణ సమాచారము తన జనకున కెఱింగించెను. సిరిబరుని యవస్థ కడుదుస్సహముగ, కడు విపరీతముగ నుండెను. కుమారు లిర్వురు రెండు నయనములవలె నుండిరి. సిరిబరుఁడే నయనము కోల్పోవఁ గలఁడు? కరాళుఁడు జ్యేష్ఠుఁడు, వివాహితుఁడు, సంతానవంతుఁడు! శిశుమానుఁడన్ననో!—కనిష్ఠుఁడు చచ్చి బ్రతికినవాఁడు, పాప భూయిష్ఠమగు పరమతము మగుడ విడనాడకయే మరణింపవలయునా! వలదు! వలదు! కరాళునకై గృహలక్ష్మి మరీటా నిరీక్షించుచుండును! శిశుమానుడు మగుడఁ బవిత్రక్రైస్తవ మతస్థుఁడు గావలయు! ఆహా! కరాళుని విడనాడుట దుస్సహము! శిశుమాను నొసంగుట యసంబద్ధము!

సిరిబరుఁడమితచింతా విహ్వలచిత్తుఁడై యాతెఱంగున నున్మాదప్రాయుఁడై విలపించుచుండ, శిశుమానుఁడు ముందున కరుదెంచి యిట్టులనెను.—

"తండ్రీ! నీకింత వంతయేల? కరాళుని కొఱకై భార్యాపుత్రులు

గంపెడాసతో వేచియుందురు! వాని నొక్కని బలియిచ్చిన, స్త్రీహత్యయు శిశుహత్యయుగూడ సంభవమగును. కాన, నేనే పోయెదను!”

“తమ్ముఁడా! వలదు, వలదు! నాకై యొకసారి మహాత్యాగమొనరించితివి! చాలును మగుడ నీకాపద వొరయనిత్తునా? కరాళుఁడంతటి నీచాత్ముఁడు కాఁడని లోకమెఱుంగ వలయు. తండ్రీ! నేఁ బోయెద!”

అన్నను వారించి శిశుమానుఁ డిట్టులనెను.—

“సోదరా! నీభార్యాబిడ్డలం దలంచి నన్ను మరణింప నిమ్ము. నీ జీవితము సార్థకము; నాదో! నిరర్థకము!”

“తండ్రీ! వలదు! సమ్మతింపకుము! సోదరుఁడు మతిభ్రష్టుఁడై మరణింపరాదు. నేఁబోయెద.”

“తండ్రీ! వలదు. ఏ మతమైననేమి! నిశ్చలచిత్తుఁడనై మరణింతును!”

అంత సిరిబరుఁ డిట్టులనెను.—

“శిశుమానుఁడే మరణించుఁగాక! ఆఁ! వలదు: శిశుమానుఁడు కోమలశరీరుఁడు, వాని వినీలనయనములు కాంచినంతనే, గతించిన నా సాధ్వి స్మరణకు వచ్చును. కరాళుఁడే యేగుఁగాక — కాదు, కాదు. కరాళుఁడు ఆలుబిడ్డలు కలవాఁడే! శిశుమానుఁడు పరమతము వీడి ప్రాయశ్చిత్తపూర్వకముగాఁ గ్రైస్తవమతావలంబుఁడైనఁ గాని ఉత్తమగతులుండవే!— వాఁడు మరణించుటెట్లు?”

వృద్ధుఁడమితభయాకుల చిత్తుఁడై, దుస్సహవ్యగ్ర మనస్కుఁడై, కరాళమరణ సన్నిధాందోళిత హృదయుఁడై, కరాళశిశుమానుల గుణశీలముల వితర్కించుచు నున్మాదప్రాయుఁడై విలపించుచుండ, శిశుమానుఁడవకాశము చిక్కించుకొని పాపాను డాసి యిట్టులనెను.—

“ప్రభూ! మాతండ్రి హృదయమరసి వచ్చితి: మరణింప సంసిద్ధుఁడనై

యున్నవాఁడ: సత్వరము కృతకృత్యుఁడవు గమ్ము."

తదాస్థానసభ్యులు దుఃఖపరవశులై, విన్రమ్ములై, ముకుళిత హస్తులై, ఆదీనుని క్షమియింపవలయునని పాషాను ప్రార్థించిరి. కాని, యా మహానీయుఁడు ప్రసన్నుఁడు గాలేదు. పాషా యభిమతమెఱింగిన తలవరి భయంకరమగు వింటినారి సంధించి వధింప సంసిద్ధుఁడై యుండెను. ఆ హతభాగ్యుఁడు శిశుమానుఁడు దైన్యాశ్రులవదనుఁడై, నేలకు టురంబునఁ గరములు కీలించి, మోఁకరించి, దీనజనరక్షణ క్రియాదక్ష పవిత్రపాదపంకేరుహా స్మరణాంచితుఁడై, మృత్యుసన్ముఖుఁడాయెను. దయారహితుఁడై పాషా సన్నయొనరించెను: తలవరి కాలసర్పసన్నిభమగు వింటినారిని శిశుమానుని కంఠమునకుఁ జుట్టెను. ఒక్కక్షణకాలములోనా కాలపాశము బిగిసిపోవును: శిశుమానుఁడు విగతజీవుఁడగును. సభికులా భయానక ప్రదర్శనము చూడఁజాలక దుఃఖావనతవదనులైరి. శిశుమానుని కిఁక దిక్కెయ్యది?

అట్టి మహాసంకటముహూర్తమున, మేలిముసుంగుధరించిన యొక జవ్వని యా సభాగారమున మెఱుపువలె నుదయించి, పాషాపాదములపై రయమున వ్రాలి, "రక్షింపుము! రక్షింపుము! ఈ యువకుని రక్షింపుము! లేదేని, నన్నును వధింపుము!" అని గంభీరోద్విగ్న స్వరమునఁ బలికెను.

"వల్లకీ! ఏమి ఈ సాహసము! ఈ విశ్వాసఘాతుకుఁడు ప్రేమాస్పదుఁడా? వీఁడు తప్పక వధ్యుఁడు!"

అట్లు కఠినోక్తులాడు జనకుని వారించి, వల్లకి యిట్లనెను.—

"జనకా! నా విన్నపము మన్నింతువా, మేలు! లేదేని, నన్ను నీ క్షణమే వధింపుము! తండ్రీ! ఈ యుదారవంతుఁడొనరించిన మహోపకారమెంతలో మఱచితివి! నన్ను గుఱించి యొనరించిన సమయము నిరర్థకము కావలయునా! తండ్రీ! తీవ్రపడకుము."

సభాసదులెల్లరు ప్రభుపుత్రీధైర్యము తలంచి, మిక్కిలి సంతసించిరి. మహామ్మదీయనాయకుఁడొంతటి కఠినుఁడైనను, అగణ్యంబగు పితృవాత్సల్యము వెల్లివిరియ, అస్థిరహృదయుఁడై, నిజచరణసమాశ్రితయై యున్న హేమవల్లరి నల్లన లేవనెత్తి, యిట్లనెను.—

"కుమారీ! నీమాట కాదనఁజాలను. మదీయ సంతానమునందు నీవే రోగార్తుఁడై కుందు జనకునిఁ గనిపట్టియుంటివి. నీ నిరుపమాన వాత్సల్యము నిక్కముగఁ బ్రశంసనీయము. ఓయీ, హాసేనునామధేయా! లెమ్ము! సార్థకనాముఁడవై, చిరయశోమండితుఁడవై ప్రవర్థిల్లుము: కష్టార్జిత బహుమాన మిదికన్నియను బరిగ్రహింపుము."

ఈ శుభవర్తమానము దవ్వుననుండిన కరాళసిరిబరులకు రయమునఁ దెలియవచ్చెను: అశ్రుజలార్ద్రములై ముకుళితములై యున్న నయనములు ప్రమోదవిస్ఫారితములాయెను: జీవరహితవదనములు తోడనే నిరవధికానంద ప్రదీపితములాయెను.

ఆ సాయంకాలమే వల్లకీహాసేనుల వివాహము మహావైభవముతో జరిగెను. ఎల్లరు నానందపరవశులైరి. సిరిబరుడు సహితము కడుముదమందెను, గాని, తన చిన్ని కుమారుఁడు పరమతపంక పరిత్యక్తుఁడై, పూతక్రైస్తవమతస్థుఁడు మగుడఁగాఁజాలకపోయెగదా యనువంత యొకింత బాధించుచుండుటచే, నా ముదుసలికి సంపూర్ణానుభవము లేకపోయెను.

వివాహానంతరము కరాళసిరిబరులు పాషా మందిరమునఁ గొన్ని దినములుండి, విందులారగించి. వెలలేని కానుకలంది, యనంతరము తమ దేశమునకుఁ దిరిగిపోయిరి. శిశుమానుని వీడి యరగుట వారికిఁ గడు దుర్భరముగ నుండెను. ఎడబాటు శిశుమానునకుఁ గూడఁ గడు దుస్సహమైయుండెను.

వల్లకీ శిశుమానులు ముప్పది సంవత్సరములు సంసారమహా

సౌఖ్యము పూర్తిగ ననుభవించిరి. శిశుమానుఁడు ఘనాధికారధురంధరుండై, యమిత ధనవంతుఁడాయెను. ఐనను, సంతానవిహీనులగుటచే, వారి సౌఖ్యమొకింత కొఱంతపడెను. అనంతరము సద్గుణవల్లరియగు వల్లకి మిత్తివాతఁబడెను. శిశుమానుఁడు నిరావలంబియై యట నిలువజాలక, జన్మభూమి దర్శనోత్సాహియై తన సకలవస్తువాహనాదుల నెత్తించికొని ప్రయాణమాయెను. తత్పూర్వమే, సిరిబరుఁడు సహస్రమాసములు నిండి సమాధిఁజొచ్చెను. శిశుమానుఁడు నిజసోదర సంసారమున లీనమై, తన యవసానము నాఁటెలంగున నిష్టబంధుజన పరివృతుఁడై హాయిగ వెడలబుచ్చి కీర్తిశేషుఁడాయెను. ఆ మహానీయుఁడు నికవలాశియుద్ధము గురించియు, తదవసర ఘోరనరవధాక్రమము గుఱించియు, నిజవిషాదాజ్ఞాతవాన విచిత్రోదంతము గుఱించియుఁ జక్కని గ్రంథము రచించిపోయెను. అగాధ క్రొత్తగ నైరో పాఖండకథారంగ ప్రవేశమొనరించినపుడు క్రైస్తవజనానీకమున కమితానందమొడఁగూర్చెను.

## ౧౨

### ఖలీలుఁ జాలియనులు

ఖలీలుని కథ ముగిసెను. తొల్లింటి గాథలకంటె నియ్యది దత్తబను పాషాకు నధికతరానందము కల్గించెను. వివిధరసపూరితమగు నా గాథ శ్రవణమొనరించునపు డాయాభావములు తురష్క ప్రభువదనమున ద్యోతకమగుచుండెను. వృద్ధతురుష్కుఁడా కాలమంతయు ననిమిషనయనుఁడై, దుష్కరసంశయబాధితుఁడై యాకథకుని వదనము నటె తిలకించుచుండెను. సహజమనోహరాకారుఁడగు నా పీరుఁడు

తదవసరమున మఱియు దర్శనీయుఁడై యొప్పారెను. కోమలాంగియగు జులేఖా కుతూహలాశ్చర్యధుర్యయై యాలించెనని వేఱుగఁ జెప్పనవసరములేదు. ప్రణయముగ్ధులగులూకాసుగుల్నేరుఁలును, తైరంగా జూలియనులును గాఢోత్సాహపరవశులై కథాశ్రవణ మొనరించిరనట చర్విత చర్వణము.

కథ ముగిసినంతనే, దత్తబను పాషా సహజముగ నాలోచనాపరుఁడాయెను. చతురమతియగు ఖలీలుఁడు మఱెట్టి నెపము కల్పించి యా ప్రణయమందిర నివాసము దీర్ఘతర మొనరించునో; లేక, తను మిత్రుని యుపదేశానుసారముగాఁ దమరినందుఁడనిచ్చి, చారుల నంపి పాషా తమతమ వంశచారిత్రముల నరయఁగడంగునో, యని యా యువతీయువకులు చింతింపఁదొడంగిరి. ఆ సమయముననే ఖలీలుఁడు నిజప్రియాంగనను డాసి, మోము వాల్చి, యా హేమగాత్రి శ్రవణమున నేమియో చెప్పెను. ఆ మోహనాంగి మనోహరాననము కళావిహీనమై, చింతాక్రాంతమాయెను అది యొక క్షణికము: తదాననము తక్షణ మాశోత్సాహరంజితమై, ప్రఫుల్లమై, విభాసురమై యలరారెను. ఆ పల్లవాధర యా ముహూర్తముననే తదాసనము వీడి నిశ్శబ్దముగ మఱియొక సోఫాపైఁ గూర్చుండెను. పరస్పరప్రణయ సంభాషణానందపరవశులైన లూకాసు మొదలగు వారలావిషయము నెఱుంగరైరి. పాషా నిజమనఃప్రభవాలోచనాసాగరనిర్మగ్నుఁడై యుండెగదా.

రెండు మూడు నిమేషములట్లు గడచినంతనే, ఆ మందిరకవాటము చలించెను: ప్రభుభార్యయగు నిస్మిల్లా సతీతిలకమల్లనఁ బ్రవేశించెను. అనర్ఘరుచిరాంబరధారిణియై దీపించు నా గంధగజయాన మందిరప్రవేశ మొనరించినంతనే, మేలిముసుంగు నుండియే కలయఁ జూచెను. ఖలీలుఁడు కాంతావిరహితుఁడై యుండెను! జులేఖా

దవ్వున మఱియొక తల్పమున నుపవిష్టయై యుండెను. ప్రభువట్టి లోలోన సంతసించెను. ఆ సుందరాంగిని గ్రీకు యువకు లెన్నఁడుఁ గాంచి యెఱుంగరు. ఐనను, రూపవైభవముఁ గాంచి, ఆమె పాషా సతి కావలయునని యెంచి, జూలియను లూకాసులు సగౌరవముగా లేచి నిలుచుండిరి.

అంత నా మందయాన మానసనసరోవరవిహారణమనోహరమరాళమువలె నల్లనల్లనఁ దన మగనిడాసి, ఆ వీరుని దోర్దండమునఁ దన కోమలకరంబు స్పృశియించి, ప్రేమమయాశీతలవీక్షణంబులఁ బర్వఁ జేసి, మోహినీసహజమంజుల మోహనస్వరంబున నిట్టులనెను.—

"ప్రాణనాథా! ఈ మందిరప్రవేశ మొనరించుట కనుజ్ఞ దయ చేయుదువా!"

పాషా యానందపరవశుఁడై, తన ప్రియభార్యను సాదరముగాఁ దనప్రక్కఁ గూర్చుండ నియమించి, యిట్టులనెను.—

"తరుణీ! నీ కెల్లయెడల సుస్వాగతము! ప్రేయసీ! నీ తోడ నేను ముచ్చటించినవారు వీరలే. ఈ యువకులు మువ్వురు రెండవనాఁ రాత్రము లీమందిరమున విడిసియుండి, ఇఁక దమ తమ నెలవులకుఁ బోనున్నవారు."

యువతీయువకులు నల్వురు తోడనే ప్రచలితహృదయులై, కృపణులై, నిజహృదయాభిపూర్వకముగా ఖలీలునిఁ దిలకించిరి. కాని, ఆ తురుష్కవీరుఁడు నిశ్చలుఁడై యుండెను. జులేఖా పదభ్రంశమంది వేఱొక సోఫాపై నాసీనయై యుండుట వారప్పుడే కాంచి, తత్కారణ మరయఁజాలక విస్మితులైరి. అంతనిస్మిల్లా పాషా నుద్దేశించి, యిట్టులనెను.

"ఆర్యా! వీరిలో నొక యువకుఁడు విచిత్రమగు గాథల వినిపించి, నా కతుల సంతసము కలిగించుచుండెనని వినియుంటివి. నాథా! అతి

సదవకాశము నా కేల ఒసంగవైతివని కినిసి యరుదెంచితి సుమా!"

"ప్రేయసీ! కథంపై నీకింత యుత్సుకతయని యెఱుంగను. మఱియు, మహామ్నదీయకులాంగనవు, పూర్వాచారపరాయణవునగు నీవు పరపురుషవిహారణప్రదేశమున కేతెంచుట కరంబు దుస్సహంబని యెంచి నిన్నాహ్వానింపనైతి."

"నాథా! మగఁడుండు ప్రదేశము నాకు దుర్గమము కానేరదు. మఱియు, నీ పుత్రికలు మాతృవిహీనలు గదా. తత్సమానురాలనగు నేను తత్సమానబాధ్యత వహించి, యిట్టి రంగముల దప్పక ఉండవలయు."

"ప్రేయసీ! నీ హృదయ మిట్టులుండునని యెఱుంగనైతి. ఎఱింగినచో, నిన్నాహ్వానించియుండనా. కాని, ఈ యువకు లింక నిందుండఁజాలరు. అజ్ఞానినై ఈ సజ్జనుల నింతకాల మీ మందిరమున నిలువుటయే అయుక్తము."

"నాథా! నీప్రియభార్య విన్నపము మన్నించి, యొక వరము ప్రసాదింతువా?"

ఆవగలాడి యట్లు ప్రశ్నించుచు, ధైర్య విధ్వంసకరములగు స్త్రీజనసహజ కుటిలమందస్మితరుచి జాలముల నవిరళముగఁ బర్వజేసెను. తన్ముహూర్తమున నా కళానిధి మేలిముసుంగు ఒకింత సడలెను. తానను దినము గాంచునదయ్యు, నాకాంత యాసమయమున సహస్రాధిక వైభవ సముజ్జ్వల శోభాయమానముగ, సంపూర్ణ సుధాకరబింబసన్నిభముగ, దేదీప్యమానముగఁ గాన్పించెను. ఆవృద్ధవీరుఁ డుద్విగ్నుఁడై చకితుఁడై, ముగ్ధుఁడై, నిజమనోనిశ్చితాభిప్రాయ విరుద్ధముగ నాజగన్మోహినికి వశంవదుఁడాయెను. అంత నాకుటిలాలకమంజుల వీణారవంబున నిట్టులనెను.—

"ప్రాణనాథా! ఇతిహాసములు, చిత్రకథలు, దేశచరిత్రలు నాకుఁ

గడుంగడు నానందదాయకములు. ప్రణయవీర రసప్రధానములు, ఆనంద విషాదరస పూరితములు నగు గాథలందప్పక నాలింపవలయుంగదా. కాన, మదీయనిర్వక్రమనోరథము చెల్లింతువని విశ్వసింతును."

పాషా పత్ని యిట్లు పలికి విరమించినంతనే, పాషా యిట్లు లనెను.—

"ఖాలీలుండు కృపాయత్తచిత్తుండై శ్రమయనక మఱియొక కథ వినిపింప నిచ్ఛగించునేని, నా కభ్యంతరములేదు: మిత్రసహాయుండై, యీ రేయికూడ నిందుండి, ఉదయమగునంతనే వెడలనగును."

ఖలీలుండు తోడనే సహజ నిశ్చల స్వరంబున నిట్టులనెను —

"ఆర్యా! నీయభిప్రాయము మఱిసి మెలంగుట నాకెంతయు నానందదాయకము. కాని, ఒక్క రహస్యము గమనింపుము. ప్రభు రాణియే కుతూహలయగునప్పుడు, కాదనరాదు. ఐనను, ఒక్క రేయి రెండు కథలం జెప్ప సామర్థ్యము నాకు లేదు. పాషా! ఈకథలు పాఠమువలె ధారాపాతముగా నప్పగించునవి కావని విన్నవింతును. దినమెల్లం జింతించి చింతించి, మఱచిన విషయములను స్మరణకుం దెచ్చికొని, ఆయావిషయములను సరసముగ సూత్రపఱచి, యనంతరము మీకు వినిపింతును. ఆర్యా! కావున భవదీయాజ్ఞ నుపసంహరింతువేని, రేపు రాత్రి యొక అపూర్వగాథ రచించి చెప్పెదన. వెనుకటిదానికంటె నయ్యది అధికతర ప్రమోద దాయకమై యొప్పును."

అంతనా మోహనాంగి ఇస్మిలిడా ఒయ్యారముగ నిజభర్తృ భుజదండము స్పృశియించి మర్మభేద్యములగు సునిశిత మోహాంపుం జూడ్కులం బ్రసరించినంతనే, దత్తబను పాషాయచేతనుండై ఎట్టకేల కిట్టులనెను.—

"మిత్రులారా! ఈ మందిరమున మఱియొక దినముండి మదీయాతిథ్యము స్వీకరింపుండు. ఈ లోన ఖలీలుని ప్రశ్నము గుఱించి తెస్సుగ

విచారించుటకుఁ గూడ నవకాశమగును. అయ్యో! ఖలీలు మిత్రమా! మమ్ముల నానంద పరవశుల నొనరింపఁగల విచిత్రకథ నమకూర్చి సంసిద్ధుఁడవై యుండుము.”

దల్లబను పాషా తోడనే గమనోన్ముఖుఁడాయెను. లూకాను జూలి యనులు రెండు ప్రణయంపు మాటలఁ దమకాంతల శ్రవణమున వడి వడి పలికి, ఆతురుమ్కు ప్రభువు ననుగమించిరి. ఖలీలుఁ డన్ననో, దవ్వుననుండియే జులేఖానుగాంచి, ప్రణామ పూర్వకముగా మోము వాల్చి, తన మిత్రులవెంటఁ బోయెను. ఖలీలుని ప్రవర్తనము నిస్మ్రిలిడాసతి యనిమిషనయనయై యరయుచుండెను. ఆ నుత్రకాళిని చిత్తమనంత సంతస ప్రచలిత మాయెను.

ఖలీలుఁడు క్రమముగాఁ దన ప్రత్యేక మందిరము చేరెను. తోడనే, యాతఁడు కుడ్యాంతర రహస్యకవాటము తెఱచి, నిగూఢ మార్గాంతర గతుఁడై, జూలియను గదికంటి యుండిన మఱి తలుపు గూడ నేర్పుమెయి సడలించి, మిత్రసందర్శన మొనరించెను. ఆలోచనా పరుఁడై యుండిన జూలియను తొలుదొల్త భీతచేతస్కుఁ డయ్యు, వికసిత వదనుఁడై, “నీవెట్లు లరుదెంచితివి! నీరాకకుఁ గతంబెద్ది? ” యని ప్రశ్నించెను. ఖలీలుఁ డిట్లుఁ లనెను.

“సమాధాన మొసంగుటకిది యదనుగాదు. ఆలసించుట కవకాశము లేదు. నే నీమందిరమునఁ నుండువాఁడ: నీవు సత్వరము నామందిరము జొచ్చి, రయమున దీపమార్పి, నాశయ్యపై బ్రాలియుండుము. వృద్ధ పరిచారిక శీఘ్రముగ నీ చెంత కేతెంచును. నీవు మాటాడక, ఆలసింపక దానివెంట పొమ్ము. నేనని భ్రమించి యా పనికత్తె నిన్ను, తన దొరసాని క్రీడా మందిరమునకుఁ గొంపోవును. నిన్ను, గాంచునంతనే, పాషా పత్ని దురాగ్రహపరవశయగును. నీవేమియుఁ జలింపక, పాషా యేకారణముననో నిన్ను నామందిరమున నుంచెనని సమాధాన

మొసంగి—"

"ప్రియమిత్రమా! సుందరాంగి యగు త్రైరజాకు మదీయహృదయ మర్పించి, ఇవుడిట్టి యకార్య మొనరింతునా ?"

"వలదు. అకార్య మొనరింప వలదు. జులేఖా సుందర చరణ సేవా పరాయణుఁడనయ్యు, నే ననేక సారులు ఇస్మిలిడా సమక్షమునకుఁ బోలేదా? కాన, ననుమాన భయంబు వీడి యుండుము. ఆ మోహనాంగి యేమన్నను నదుత్తర మొసంగి, సమయానుకూలముగ మెలంగుము. నీవు మేధావంతుఁడవు: రసజ్ఞుఁడవు; తప్పక కృతకృత్యుఁడ వగుదువు.—ఇప్పుడేమియుఁ బ్రశ్నింపకుము. నీ వటులు మెలంగి దేని, ఈ ప్రణయ నిలయమున మఱియొక దినముండఁ గలము."

"మిత్రమా! నీప్రభావ మెట్టిదోగాని యమోఘము !"—

గ్రీకుయువకుఁ డట్లు సవిస్మయముగాఁ బలికి, మఱియేమియో ప్రశ్నింపనుండ, వానిని వారించి తురుష్కుఁ డిట్టులనెను.—"మిత్రుడా! అత్యాతురము వలదు. మదీయ హితవాక్యముల నేమరక, అప్రమత్తుఁ డవై ప్రవర్తింపుము. పొమ్ము"

జూలియను మిత్రవచోబద్ధుఁడై, ముగ్ధుఁడై వల్లెయని యల్లన బలుక, ఖలీలుఁడు మగుడ నిట్టు లనెను.—

"మఱియొక మాట చెప్పవలయు. పాషాభార్య సమక్షమున నీవుండునపు డేమైన విఘాతము కలుగ వచ్చును. అట్టియెడ నీవు ధైర్యము వీడక, ఆకాంత చూపు మార్గము ననుసరింపుము. మార్గ మధ్యమున మహాకాయుఁ డగు నల్లని సిద్దియొకఁడు భయంకర ఖడ్గధారియై గోచరించునేని, వాఁడు మార్గదర్శకుఁడగును. వాఁడు నీపిఱుంద రాఁగోరును: కాని, నీ వందుల కియ్యకొనక, వానినే ముందు నడపింపుము. దాన సర్వభయంబులును దొలంగును. ఆయుధ మవసరమై యుండును: నా తల్పమున నొక కృపాణమణఁగి యుండును, తీవ

స్త్రము ధరించి పొమ్ము.”

జూలియ నా ప్రకారము గోడయందుఁ జొచ్చి యంతర్హితుఁడై సాగి క్రమముగా మిత్రమందిరప్రవేశ మొనరించి, తొలుదొల్త మణిమయప్రదీపితఖడ్గరాజము భద్రపఱచికొని, దీపమార్పి, శయ్యాగతుఁడై, ఖలీలుని విచిత్రరహస్యప్రవర్తనము గుఱించి చింతింపఁ దొడంగెను. తురుష్కుని యుదంతమంతయు నిగూఢతమంబై కడు విపరీతమై యున్నను, అతఁడు వివేకవంతుఁడనియు సాటిలేని మేటి మేధావి యనియు నెఱింగి, జూలియను నిశ్చలస్వాంతుఁడై యుండెను.

అంధకారమందిరమున గ్రీకుయువకుఁడు నాలుగైదు నిమిషములు మాత్రముండెను. అంతలోఁ దాళము తిరిగెను. తలుపు తెఱచి యొక వ్యక్తి మెల్లగఁ బ్రవేశించి, గ్రీకును డాసెను. అవ్వల నొక దీపముండెను. తద్వినిర్గతకాంతి యతిమందముగ, గడు నస్పష్టముగ నుండుటచే, నొకరి మొగ మొకరికిఁ గానరాకుండెను. అంత నా వృద్ధకాంత మెల్లగ నిట్లు ప్రశ్నించెను.—“అయ్యా! ప్రణయమందిరమునకు రా, సిద్ధముగ నున్నావుగదా? లెమ్ము!” అందులకుఁ బ్రత్యుత్తరముగా జూలియను నోరు విప్పకయే యొక కాసు తీసి యామె కొసంగెను. ఆ తార్పుకత్తె సంతోషపరవశ ఆయెనని వేఱుగఁ జెప్పవలయునా? గ్రీకు యువకుఁడు తోడనే లేచి, ఆమె వెనువెంట నరిగెను. మార్గమధ్యమున నమీనా వెనుదిరిగి చూడలేదు. వారట్లు క్రమముగా ప్రభురాణి మందిరము డాసిరి. తదవసరమున జూలియును వదనము దృగ్గోచరమాయెను: జరఠాంగన యమితవిస్మయభయాకులయాయెను! అంతిదనుక ఖలీలుఁడే తన వెంట నరుదెంచెనని ఆ పరిచారిక విశ్వసించి యుండెను. నిజాధికారిణి మనోహరణక్రియాదక్షుఁడగు ఖలీలుఁ డేమాయెను? ఈ జూలియ నెటు లేతెంచెను? దొరసాని ఏమనును? ఆ కాంత హృదయ మొక్కసారి కంపిం

చెను: దురంతవిస్మయభయాతిరేకమున మతి చెడి కొన్నాన నటుపఁ బోయెను. ఐనను, వివేకవతియగుటచే నా దాసి నిగ్రహించికొని, ప్రశ్నపూర్వకవిలోకనముల నా గ్రీకుపైఁ బఱప, నాతఁడు గంభీరాననుఁడై యేమియో సమాధాన మొసంగఁబోయెను. కాని, అట్టి ప్రదేశమున నిలిచి ప్రసంగించుట ప్రమాదకరమని యెంచి, పరిచారిక ప్రభురాణి ప్రథమమందిరము ప్రవేశించెను. జూలియను గూడ బ్రవేశించెను. దాసి తోడనే తలుపువైచి ప్రశ్నింప, నా యువకుఁ డిట్టులనెను.—

"పాపా నేడేలకో నన్ను ఖలీలు మందిరమున నుండఁజేసెను. అందులకేమైనఁ గారణముండునో, లేక మఱచి యటులొనరించెనో, తెలియదు."

"కాని, నీమందిరము చీకటిగనుండ నేమి?"

"తైలము చాలియుండదు. నేను జూచుచుండగనే దీపమాఱిపోయెను."

"కావచ్చు. నీకీఖడ్గమెటులు లభించెను?"

"ఈ ఖడ్గమా! నామిత్రుని తల్పమున వ్రాలినంతనే హస్తమునకియ్యది తగిలెను: తోడనే, సంతుష్టాంతరంగుఁడనై ధరించితిని. ఈ ప్రదేశము నాకపరిచితము. సాయుధులగు సేవకులు లెక్కకు మీఱియుందురు. ఏముహూర్తమున నే ప్రమాదము వాటిల్లునో యెఱుంగరాదు. అఖిలజన భయంకరంబులగు హత్యాపరంపర గుఱించి వినియుండుటచే, మఱియు భయమంది, శస్త్రధరుఁడనై యుండుట క్షేమకరమని యెంచితిని."

జూలియను పలుకులు నిశ్చలముగ, సరళముగ, హృదయమునుండి వెలువడినట్టులే యుండుటచే, నమీనా విశ్వసింపవలసిన దాయెను. అనుమాన మొకింత కలిగినను, తోడనే యంతరించెను. కాని,

ఆకాంత యవస్థ కడు విషమముగ నుండెను. ఖలీలుని వదనసందర్శ నోత్సుకమతియై యూటలూరు తన దొరసాని సముఖమునకు గ్రీకనుఁ గొంపోవఁదగునా ? ప్రభురాణి యేమనునో ? ఖలీలుఁడు కాకున్న, మఱియొక సుందరాంగుఁడు లభించె గదా యని సంత సించునో ? లేక, ఆ తురుష్క మన్మథుఁడే గావలయునని చలము వహించి కినియునో ? ఏమియుఁదోఁపక, అమీనా తహతహలాడెను. దీర్ఘాలోచన నిరర్థకమని యెంచి ఆదాసి యిట్లు ప్రశ్నించెను.—

"అయ్యా ! నిన్నీస్థలమునకుఁ గొని వచ్చుటకుఁ గారణమెద్దియో యెఱుంగుదువా ?"

"ఎఱుంగనా ! మనోహర ప్రేమధామమునకు రమ్మని పిలిచితివి, నేను వచ్చితిని. ఏ శృంగార రసజ్ఞుఁడు రా నిరాకరించును ?"

అమీనా మగుడ విభ్రమాకుల మానస ఆయెను. అంతలోనే దృఢ సంకల్పయై యిట్టు లనెను.—"ఇక్కడనే రెండు నిమిషములు నిలిచి యుండుము—ఆ—వలదు ! పాషా యీలోపుననే రాఁగూడదా ? కాన, ఈ తెఱ మఱుంగున దాగియుండుము. ఒకవేళ పాషా యరుదెంచుగాక—మఱి యెవ్వరైన నేతెంచుగాక—నీవు కదలక మెదలక విగ్రహమువలె నుండుము."

గ్రీకు యువకుఁ డాప్రకారము దాగినంతనే అమీనా యల్లనఁ బాఱెను.

ఇస్మెలిడా సతీతిలకము తన్మందిర శ్రేణియందలి మూడవగది యందు అపూర్వరుచిరాంబరములఁ దాల్చి, శయ్యాతలంబున నొయ్యారముగ వ్రాలియుండెను. ఆ విషయ లాలస నిజమనోనయన మున ఖలీలుని మనోహరాకారముం గాంచి మురియు చుండెను. ఆ కాంత గంభీరముగ సముచితముగ నున్నను కామాయత్తయై, విరహానలతప్తయై, లోలోనఁ గ్రాగుచుండెను. ఎన్నఁడు తురుష్కుఁ

దరుదెంచునో, వాఁడే క్షణము నిజబాహుపంజర బంధితుం డగునో యని ఆవిలాసిని యువ్విళులూరుచు, నిజహృదయాంధకార విధ్వంసన క్రియాదక్షుఁ డగు శీతల తురుష్క చంద్రోదయమునకై నిరీక్షించుచుండఁ నాకస్మికముగాఁ దలుపు విచ్చెను: అమీనా ప్రవేశించెను. ప్రభుపత్ని హతాశయై ఆగ్రహాయత్త ఆయెను.

వృద్ధదాసి రయమున డాసి, జరిగిన వైపరీత్యము విశదీకరించెను. ప్రభురాణి మిక్కిలి చీకాకుపడి, బాధితాత్మయై, ఉస్సురని నిట్టూర్పు విడిచి, యిట్టు లనెను.—

"ఎంత దురదృష్టము ! అహా ! విధి నాకు కేవలము ప్రతికూలమాయెనే ! ఆ సుందరాంగుడు నాకు లభింపఁడా యేమి ? దుర్భరమే !—అమీనా ! ఆలసింపకుము ! ఈ గ్రీకును రయమున మఱలించి, నాఖలీలునిఁ గొని రావలయు—"

"దేవీ ! ఉచితా నుచితము లరయవలయు. ఇన్ని రాక పోకలొనరించుట కడు ప్రమాదకరము సుమా !—"

"భయమేల ! ఖలీలుఁడు నామనోహరుఁడు. ఆ వగకాఁడు నన్ను బిగియార నాలింగన మొనరింప దహించుకొని పోవువాఁడు—నేనా విషయ మెఱుంగుదు—కనులార గాంచితి—నాకై ఆమోహనాంగుఁడు నిజమనోహారిణి యగు జులేఖాను పరిత్యజించెను. ఓసీ ! పొమ్ము ! ఖలీలుని రయమునఁ దోడ్తెమ్ము ! "

"దేవీ ! తీవ్రపడకుము ! సావధాన చిత్తవై నా విన్నపము మన్నింపుము. ఏతెంచిన యీ గ్రీకును పంపివేయుట పాడికాదు. నీప్రతిష్ఠ భంగపడును. నీయభిమతా మీయువకుఁడు గుర్తించియే యుండును. ఇతఁడు తెలిసియో తెలియకయో ఒక్కమాట జారవిడుచునేని—"

"అబ్బా ! నిజము నిజము ! కానిమ్ము.—అమీనా ! ఈయు

వకుఁ డెవఁడంటివి ? తైగజావలచిన సుందరాంగుఁడేనా ? ”

“ అతిసుందరాంగుఁడు ! అత్యంత సుందరాంగుఁడు ! దేవీ ! ఖలీలునకుఁ దీసిపోఁడని చెప్పఁగలను. ఏమైనను—”

అమీనా ఆవాక్యమును మాటలచేఁ బూరింపక, భావగర్భితమగు నొక్క వీక్షణముచేఁ దదర్థము వ్యక్తీకరించెను. ప్రభుభార్య ఆలోచనా పరతంత్రయాయెను. ఆవన్నెలాడికిఁ దుగుష్కునిపైఁ గల ప్రేమ నిర్మలమైనది కాదు. అయ్యది కేవలము కామోద్రేకము. ఖలీలుని గాంచినంతనే ఆకామిని చిత్తముద్రేకించెను. అట్టి కామిని మఱి యొకనిఁ గాంచి మాత్రము మోహపరవశ కాకుండునా ! ఖలీలుఁ డైన నేమి ? మఱి జూలియనైన నేమి ? కానఁ నాప్రభురాణి వినిశ్చితయై, యిట్లు లనెను.—

“ అమీనా ! ఈగ్రీకు యువకునిఁ దిలకింతును. రయమునఁ బ్రవేశపెట్టుము.”

“ దేవీ ! అడుగ మఱచితిని, సిద్దినిఁ బ్రశ్నించితివా ? ”

“ ప్రశ్నించితి: ఆ సమాచారము సావకాశముగాఁ దెల్పెదను ; పొమ్ము ! ”

అమీనా యిఁక మాటాడక జూలియను దాగియున్న స్థలమున కేగి, ఆ తెర తీయఁబోయెను. ఆ సమయమున నవ్వల సవ్వడి విన వచ్చెను ! పరిచారిక నిశ్చేష్టయై యటు పరికింప, తాళము మీటిఁ విసురునఁ గవాటము పోఁద్రోసి దత్తబను పాషా ఘోరున బ్రవేశించెను ! అమీనా అమితభయాక్రాంతచిత్త యయ్యు, సంధాన కార్య ప్రవీణయగుటచే భయమున కెడమీక, గ్రీకును ముందుగనే గుప్తపఱచినందులకు లోలోనఁ దనుఁ దాఁబొగడికొనుచు, భయ భక్తియుతయై సగౌరవముగాఁ జేతులు జోడించి యుండ, పాషా యిట్లు లనెను.—

"అమీనా ! అపురూపమగు నాకైదువు దొరకెనా ? నిన్ననో, మొన్ననో నీరాణి మందిరమున మఱచి యుంటిని. ఇంతలో నేమగును ? దేవి తానెఱుంగ ననుచున్నది—"

"పాషా ! నేనెంతయో వెదకితిని: గదు లన్నియు గాంచితిని. ఐనను గానరా—"

"దాసీ ! అట్లైన, మదీయసేవకాగ్రము లెవ్వరో ఆయమూల్య ఖడ్గము తస్కరించి యుందురు."

తురుష్క ప్రభువు క్రోధఘూర్ణమాన మానసుఁడై దుర్నిరీక్షుఁడై యుండెను.

"పాషా ! అట్లులే కావలయు. ఎట్లైనను ఆజాడ కనిపట్టఁ బ్రయత్నింతును—"

"అటు లొనరింపుము. మంచి బహుమాన మొసంగెదను. అమీనా ! ఈ ప్రదేశమున నూపిరి సలుపకున్నది. గవాక్షమున కడ్డుగ నీతెరయేల ? దీనిఁ దొలంగించినచోఁ జల్లని పిల్లవాయువు లరుదేరఁగలవు."

పాషా యట్లు పలుకుచు, జాలియను దాగియుండిన పటము చెంతకుఁ బోయి, తొలంగించు నుద్దేశమున నద్దానిపైఁ జేయివైచెను. ఆహా ! ఎంత ప్రమాదకరము ! జాలియను ఏమి కావలయు ? అమీనా యేమి కావలయు ? ప్రభుపత్ని యేమి కావలయు ? కాని అమీనా సామాన్యురాలు గాదు. ఆదిట్టరి బిరానఁబోయి ప్రభు భుజము పట్టి యాతురకాతరస్వరమున నిట్లు లనెను:—

"దేవా ! వలదు, వలదు ! దేవి శీతలబాధ గనునించి విరమింపుము ! శైత్యాధిక్యమునఁ గడు గుందుచున్నది: పవనమొక్క పిసరరుదెంచినను ప్రమాదకరము !"

పాషా హస్తమట్టులే జారిపోయెను—"ఏమి! దేవి కనారోగ్యమా?

సాయంకాలమున మత్ప్రతికాసదనమునఁ గాంచియుంటిని: నా దేవి ప్రఫుల్లమై కలకలలాడుచుండెనే! అసాధారణసౌందర్యముతోఁ గూడ వదనము నలరారుచుండెనే!"

"పాషా! దేవి యెల్లప్పుడు మనోహరముగా నుండును. దేవా! తమ దర్శనార్థము మాదేవి యాతురచిత్తయై నిరీక్షించుచున్నది."

"ఇదె పోవువాఁడను. కాని, అమీనా! నా ముద్దులకైదువు కాన రాకున్నది. దురాత్ముల కెంతటి కండకావరము! ఎంతటి సాహసము! నా మందిరముననే ఇంతటి చౌర్యమా? ఉపేక్షింపఁజాలను! నా భృత్యులందఱు నవ్వల నిలిచి యుండవలయునని ఆజ్ఞాపింపుము. అచిరకాలమున వారిపని పట్టింతును! పొమ్ము! అమీనా! అటులొనరింపుము!"

ఆ ముహూర్తమునఁ దలుపు తెఱచికొని దరహాసవిరాజితవదన యగు నిస్మిలిడా తన మగని కడ కరుదెంచెను. విషయూర్తయై, తదాలోచనాసాగరతరంగడోలికావిహారిణియై యున్న ఆ కామినికి పాషా కంఠధ్వని యంతలో బిడుగువలె వినవచ్చెను. జూలియను ప్రథమమందిరముననే దాగియుండెను! అచ్చటనే పాషా యమీనాలు సంభాషించుచుండిరి! క్రూరవిధివశంబునఁ దన రహస్యము బయల్పడు నేని, అమీనా జూలియనులతోఁ బాటు తానును దుర్భరబాస్వరజల రాశి గర్భస్థ కావలయు! కాన, నా కాంత యమితభయాకుల చిత్తయై దిగ్గున బోయి, తలుపుచాటున నక్కి తరుణ తరుపత్రము వలెఁ బ్రచలించు హృదయము నొక కేలఁబట్టి ఆ ప్రసంగము నాలించెను. తన ఖడ్గము కానరామి తురుష్కప్రభువు క్రోధోన్మత్తుఁడై యుండెను. ప్రభుపత్ని హృదయావేగము ద్విగుణీకృతమాయెను. ఐనను, కుటిలస్త్రీ జనసహజధైర్యము వహించి, ఆ వనిత వేచియుండెను. అమితచతురమతియగు నమీనా ఆసన్నమహోపద్రవము నుభ

వుగాఁ దొంగిలించెను. ఇస్మిల్లా దుర్భరహృదయభార మడంగెను. తదుత్సాహపరవశయై, ప్రఫుల్ల వదనయై ఆ తరళేక్షణ తన వల్లభు నకు సుస్వాగత మొసంగెను.

## ౧౩

### ఇస్మిల్లా జాలియనులు

అమీనా యచట నొక్క నిముసమైనఁ దడయక, మనోవేగమున నావలకుఁ బోయి, ప్రభు నాజ్ఞానుసారముగాఁ బరిజనుల నందఱను జేరి, క్రోధఘూర్ణితప్రభుసముఖమున వారేమి చెప్పవలయునో పాఠము చెప్పెను. పాప మా సేవకు లేపాప మెఱుంగరుగదా. ఖడ్గము తస్కరింపఁబడుటయే గాక, అయ్యది పోయెనని యైనను వారికిఁ దెలియదు.

అమీనా తత్కార్య నిమగ్నయై యుండ ఇస్మిల్లాసతి సుప్రసన్నాననయై, మధురస్వరమున సాదరముగా నిట్లనెను.—

"నాథా! నీ వదన మేలకో వ్యాకులితమై తోఁచెడిని. నేను సహింపఁజాలను—"

"కాంతా! నీ కావంతవలదు. నా ప్రియతమ ఖడ్గము పోయెఁ గదా. దొంగను బట్టుటకై కట్టుదిట్టములు చేయుచుంటిని. కాని ప్రేయసీ! నీవు సుఖముగా లేవని వింటినే. ఏమి—

"నిజము, నాథా! నే నిందుఁ బ్రవేశించినంతనే, నాతను వొక్క సారి శైత్యాధీనమాయెను."

అమీనా కుటిలాలాపములు వినియుండుటచే, నిస్మిల్లా తదను గుణముగా వాక్రుచ్చెను. కాని, ఆమె హృదయము లోలోనఁ గడుఁ

గంపించుచునే యుండెను.

“తరుణీ! ఈ గది కడు శీతలము. నీ విందు నిలిచిన, మఱియు బాధకరముగా నుండును. కావున లోనికిఁ బోదము రమ్ము.”

నిష్కపటి యగు పాపా యట్లు పలుక నిజముగఁ జలిబాధచేఁ గుందుదానివలె నా కాంత ఉహూహూ యని వణకి, వల్లెయని తల యూపెను. ఆ వగలాడి నిజనాథభుజావలంబిత మనోహరవల్లరియై యల్లన దన శయ్యామందిరము చేరి, శయ్యపైఁ బ్రాలెను. పాపా యా తల్పముననే ఆసీనుఁడాయెను. ఆ మెఱుఁగుఁబోడి యనూన సోయగము గాంచి, యా వీరుఁడు విగతధైర్యుఁడాయెను. ఆ యిందువదన హసనాననయై, నిజమధురమంజులాలాపములచేఁ దన ప్రభు నన్యవిచారశూన్యు నొనరించెను. ఆ టక్కులాడి యొక్క క్షణము క్రిందటనే శీతలబాధ నభినయించెను. ఇప్పుడా మదవతి నిద్దంపుఁజెక్కులు మనోహరారుణకాంతిభాసురములై యుండెను. ఆ మేటి మగడు మోహాతిరేకమున మందుఁడాయెను గాని, లేదేని, తత్కౌటిల్యము గుర్తించియే యుండును. మంత్రముగ్ధుఁడువోలెఁ దన కృపాణము గుఱించియు, దురాగ్రహము గుఱించియు, అమీనాకుఁ దా నొసంగిన కఠినశాసనము గుఱించియు నా వీరుఁడు పూర్తిగ మఱచి, మోహవిభ్రాంతుఁడై నిజభామినీభుజపంజరబంధితుఁడై నిద్రాపరుఁడాయెను.

జూలియను దాగి యొక గంటయాయెను. వాని యవస్థ వర్ణనాతీతము. పాపా యా మఱుఁగు తొలగించెనేని, ఎంతయేని అపాయము ఘటిల్లి యుండెడిది. తొలుదొల్త నా గ్రీకు యువకుని తనువు తారున రెండు తునుకలై పడియుండెడిది. అయినా తదపాయము తొలగించినను, ఏమగును? ఐనను, ఎంతటి విపత్తు సంభవించినను తన్నివారణోపాయముతోడనే యుండునని హెచ్చరించిన మిత్రవచ

నములు తలంపునకు వచ్చుటచే, జూలియను నిర్భయముగ నుండెను.

ప్రభునాజ్ఞానువర్తియై అమీనా సిద్దిలసందఱను ద్వారముచెంత బారు తీయించి యుంచెను. ఆ తంత్రకర్త్రి చిత్తము కడు నల్లాడుచుండెను. మందిరమున నేమగుచుండెనో, ఆ ముదుసలి యెఱుంగదాయెను. మెల్లగ లోనికేగి పరికింపవలయునని దాసి కడు తత్తరపడుచుండెను. కాని, భయానక పాదరక్షలు దయ్యములవలె గోచరించుచుండ, నెట్లు పోఁగలదు? పాషా క్రీడామందిరాంతర్గతుఁడై యుండుసమయమున, దన్మహానీయుఁడు చీరకుండ, నేరును ప్రవేశింపరాదు. కాని, అమీనా విశేషానుభవము పొల్లుపోవునా? ప్రౌఢకాంతయగు తన దొరసాని సమయోచితముగఁ బ్రవర్తించునని గ్రహించి, దాసి భయ ముడిగి యుండెను. పాషా యింకను రాకుండెను. కావున, దన రాణి పాషాను విభ్రాంతు నొనరించి, నిద్రాపరు నొనరించుచుండెనని యెంచి అమీనా సంతసించెను.

తురుష్క ప్రభువు నిజకాంతాభుజవల్లికీ డోలికావిహారియై, తదురువక్షోజాశ్రితశిరస్కుఁడై లోక మెఱుంగక హాయిగ నిద్రించుచుండెను. తద్విషయము గుర్తించి ఇస్మిల్లా యల్లన విడిపించికొని, అనిమిషనయనయై, నిబద్ధనిశ్వాసయై, తన మగని మస్తకము మెల్ల మెల్లగ దిండులపై నిడెను. ప్రభువునకు నిద్రాభంగము కలుగలేదు. తోడనే, ఆకాంత రయమునలేచి పాదరక్షలు విడిచి, కడునిశ్శబ్దముగ నడచి, జూలియను దాగియుండిన తావునకేగి, కొండొక కవాటమున దొంగిచూచెను. వరుసగ నిలిచియున్న ప్రభుభృత్యులును అమీనాయును గోచరించిరి. అందు నిరువురు తప్ప మిగిలినవారు విశ్వసనీయులే. కాని ఆ యిరువురు మాత్రము ప్రభురాణి రహస్యకథా కలాపము నెఱుంగరు. ఆ కారణమున జూలియను నామార్గమున సాగనంపుట యసంగతము. కనకము సర్వభయనివారిణి: ఐనను, ఆ తులు

వలు తుంటరులై రహస్యభంగమొనరింపవచ్చును. ఆసేవకులను దమ తమ నెలవులకుఁ బంపివేయుటకును వీలుకాకుండెను. పాపా యే ముహూర్తమున మేల్కాంచునో యెఱుంగరాదు. ఆతని శాసన మమోఘము. ప్రభుపత్నియైన నుల్లంఘింపరాదు. ఆమహానీయుఁ డొక వేళ రేయియెల్ల నిద్రించునేని, పరిచారకులంతవఱక అట్టులు వేచి యుండవలసినదే. ఐన, జూలియను మాట యేమి కావలయు? తన మాట యేమి కావలయు?

ఏమైననుఁ గ్రీకుయువకుఁడందుఁ దడయుట కరమపాయకరము. ఎట్టులైనను, దానిం దరలింపవలయును. ఆమె రెండు నిముసములు విచారించి, సంశయవివర్జితయై, కృతనిశ్చయయై, తన కెంజెదవున వ్రేలిడి, తెర సడలించి రమ్మని సన్నయొనరించెను. నీలమేఘనిర్ముక్త సుధాకరమూర్తివలె జూలియను యొక్క మనోహరమూర్తి దృగ్గోచరమైనంతనే, ఆ మదవతి హృదయము కంపించెను. తైరజాపార్శ్వచరుఁడైనప్పుడుకంటె నీ సమయమున జూలియను ద్విగుణీకృత సౌందర్యవైభవ విభాసితుఁడై, దర్శనీయుడై యలరారుచుండెను. అట్టి సమయమునఁ దన వల్లభుఁ డరుదెంచినందులకా కామిని కడు విచారించెను. కాని, విచారమునకు గాని విలాసమునకు గాని యవకాశ మెక్కడ? పాపా యేక్షణముననైన మేల్కొనవచ్చును. కావున నొక క్షణమైనఁ దామసింపరాదు. అంతలో జూలియను హస్తమున నవరత్నఖచితకృపాణము కానవచ్చుటచే, నిస్శబ్దా తోడనే మెల్లగ నిట్టులనెను.—"ఆక్త్రైదు విటులెమ్మ! చూచితిగదా. ఇయ్యది కానరామి ఎంత గంద్రగోళమగుచుండెనో!"

"వనితామణీ! క్షమింపుము. మఱియేమికోరినను, శిరమునదాల్తుఁ గాని, దీనిమాత్రము వీడఁజాలను."

"ఏల వీడవు?"

అట్లు ప్రశ్నించి నాకాంత దుర్నిరీక్ష్యముగ నుండెను. మనోహర మధురవీక్షణ నిలయములగు నాకాంతనయనము లాకస్మికముగఁ బ్రచండానల సన్నిభములాయెను: మందహాస విరాజితమగు సుందరాననము అపూర్వభయానకమాయెను. మృదులమోహన సుందర సుకుమార కుసుమగాత్రి చూచుచుండగనే, పెనుఠక్కరియైనటులు తోఁచెను. ఐనను, జూలియను నిశ్చలస్వరమున సగౌరవముగ నిట్టులనెను.

"తరుణీ! వీడఁజాలను. ఏమందువా? అపాయసాగరమధ్యమున నిలిచి యున్నవాఁడ. సేవకులు సాయుధులై, యప్రమత్తులై, యవ్వలనే యున్నవారు. భయంకరుఁడగు నీ నాథుఁడిందే యున్నవాఁడు. రారాని స్థలంబున కెట్టులో యరుదెంచి చిక్కువడితిని: అట్టి వానికి ఖడ్గమువలదా!"

ఇస్బెల్లా క్రోధముడిగెను. ఆమె వినమ్రమయై దైన్యస్వరమున నిట్టులనెను.—"అయ్యా! నిన్ను సురక్షితముగ నీ మందిరమునకుఁ జేర్పఁగలను—ఖడ్గమిమ్ము."

"తరుణీ! నీకోరిక మన్నింపఁజాలనైతినని మిగుల విచారించువాఁడను. నాస్థలమున కేగుదనుక, ఈ యస్త్రము వీడఁజాలను. ఆనంతరము నేఁగాంచిన తావుననే భద్రపఱచువాఁడను. ఉదయమగునంతనే, నీపరిచారకులు నీ కొసంగెదరుగాక."

ఇస్బెల్లా తన విశాలనయనములను విశాలతరంబొనరించి, నిమిషముడిగి, గ్రీకుయువకునిపై సునిశిత వీక్షణజాలముల నవిరళముగఁ బరపెను. వాని మానసమున నెట్టి దురూహ యడంగియుండునో యని ఆశిలాసిని యరయఁగడంగెను. కాని, జూలియనునిశ్చల చిత్తుఁడై యచలాకృతినుండెను. ఆ యువకుఁడు నిష్కపటి యని యెంచి, ప్రభుపత్ని సంతసించి, తన వెంట రమ్మని నన్నయొనరించి

యిట్టులనెను.—

"ఇంచుకేనియుఁ జలింపవలదు! నిశ్చలగాత్రుఁడవై నావెనువెంట నరుదెమ్ము. మన యిరువురి ప్రాణములును ఒక్క శిరోజమాత్రపటుత్వము గలిగియున్నవని యెఱుంగుము. అణుమాత్ర మప్రమత్తుఁడవగుదేని, అణుమాత్రము భీతుఁడవగుదేని, మన యిరువురము విచ్ఛిన్న మస్తకులమై, భయంకర కాసారజలరాశి గర్భస్థులమగుదుమని యెఱుంగుము!"

జూలియను సముచితముగ బదులాడెను. వానిగాంభీర్యము గాంచి సంతసించి, నిజసుందర తరుణారుణ చరణపల్లవములతో రత్నకంబళములపై నల్లనడచి, తన శయ్యాగారము డాసినంతనే యట నిలువవలయునని ప్రభుపత్ని గ్రీకునకు సన్న యొనరించెను. అనంతర మామదవతి శయ్యాగతుఁడైన తన మగఁడేటులుండెనోయని అల్లనతొంగి చూచెను. ప్రభువట్లే మైమఱచి నిద్రించుచుండెను. ఆకారణమున నాకాంత వెఱపుడిగి, నిజమందిరప్రవేశ మొనరించెః గుర్తెఱిఁగి, జూలియనుఁ డనుగమించెను. వాని హస్తము తన మొలనున్న బాకుమీఁదనే యుండెను. విధివశమునఁ దుష్టప్రభువు మేల్కాంచునేని, ఆత్మసంరక్షణ మొనరించికొన వాఁడు సంసిద్ధుఁడై యుండెను. కాని, పాషా కేవలము శిలాప్రతిమవలెఁ బడియుండుటచే, వాని ప్రయత్నము వ్యర్థమాయెను. మందిరాంతము నిరపాయముగాఁ జేరి ప్రభుపత్ని యచటి మొగములు తెరసడలించి, తత్ప్రదేశమున నున్న ద్వారము తెరచి, తన యనుచరుఁడటు పోవలయునని యాతురదైన్యభావములుట్టిపడఁ బలికెను. జూలియనుఁ డటులాచరించెను.

మనకుఁ జిరపరిచితమగు లోహదీపప్రకాశిత పథమున గ్రీకుయువకుఁడు పోసాగెను. మిత్రుఁడగు ఖలీలు హెచ్చరిక నేమఱక జూలియనుఁ డప్రమత్తుఁడై హస్తము ఖడ్గముమీఁదనే యుంచి నడుచుచుం

డెను. కొంతదవ్వరగినంతనే, నీలజీమూతసన్నిభ దీర్ఘకాయుఁడు భయంకర కరవాలధారియై భయతరంబుగ గోచరించెను. ఖలీలు ముందుగనే ఎఱింగించి యుండుటచే, జూలియను చలింపక స్థిరచిత్తుఁడై యుండెను.

జూలియను గోచరించినంతనే, ఆసిద్దీ వినయగౌరవ పూర్వకముగాఁ దన ఖడ్గము తత్కోశమునందిడి, దైన్యముగ నిట్టులనెను.—

“ఆర్యా! క్షమింపుము. ప్రభునిక్షేపము నహోరాత్రములు కనిపట్టికొనియుందును: కావున నెవ్వ రరుదెంతురో, ఎట్టి యాగంతకుఁడేతెంచునో యెఱుంగఁజాలక, ఇట్టి భయంకరరూపమునఁ గావలియుందును. నిన్నుఁ గాంచినంతనే నీ రాకకుఁ గతంబెఱింగితిని. దారి చూపెదను, దయచేయుము.”

“కాని, ఈ నిగూఢప్రదేశము నాకుఁ గేవలము వింతగనున్నది. కావున, నీవు ముందు నడచిన, నే ననుగమింతును.”

అధమసేవకోచితదైన్యవదనమున సిద్దీ యిట్టులనెను—

“అధమాధముఁడను, ముందు నడవఁగలనా? మఱియు, ఈ మార్గము సుగమము; దయచేయుఁడు.”

మిత్రవచోబద్ధుఁడైన జూలియను గంభీరవదనుఁడై, కఠినస్వరమున నిట్టులనెను—

“నీవు ముందుఁ బోవలయు: ఇయ్యది నాయాజ్ఞ అని గ్రహించి నడువుము.”

“అయ్యా! ఔఁగాక. కాని, ఆయుధము ధరింపనేల? నేను ఘోర ద్రోహ మొనరింతునని భావింతువా?”

“ఒక్క క్షణముక్రిందట నీయాకృతి యెటు లుండెనో కాంచితి గదా. అట్టి బెట్టిదుల కాటపట్టగు నిట్టిస్థలమున నాయుధము తాల్ప వలదా?”

సిద్దీవదనము అపూర్వముగ మాఱిపోయెను. అది యొకక్షణికము. తదుత్తరక్షణముననే వాఁడు రయముగఁ దిరిగి మార్గదర్శకుఁ డాయెను. వారు క్రమముగా మెట్టుదిగిరి. జూలియను అనిమిష నయనుఁడై ఆ సేవకు నరయుచుండెను. కడమెట్టు చేరినంతనే, వాని హస్తము మెల్లగ ఖడ్గమునీఁదకుఁ బోవుచుండెను: గ్రీకు యువకుఁడు మఱియు నప్రమత్తుఁ డాయెను. సిద్దీ ఒక్కయడుగువైచి, తన కరవాలముఁబట్టఁబోవఁగ గ్రీకు సక్రోధముగ తద్దురాచారముం గాంచుచుండగనే, ఆమూలనుండి మఱియొకవ్యక్తి గోచరమాయెను.

ఆవ్యక్తి ఖలీలుఁడు; మిత్రసందర్శ మైనంతనే, జూలియను మానస ముప్పొంగెను. సిద్దీ యవస్థ మాత్రము కేవలము విరుద్ధముగ నుండెను. ఖలీలునిఁ గాంచినంతనే ఆ ఘోరాకారుఁడు వన్యమృగము వలె గుఱ్ఱిడెను. తురుష్కవీరుఁడు నిరాయుధుఁడు. ఐనను, ఆతనిఁ గాంచినంతనే సిద్దీ చకితుఁడాయెను. ఖలీలుఁ డంతఁ గడుగంభీరముగ వానిని డాసి యిట్టులనెను.—

"పరిచారకా! నీ ప్రవర్తనమునకు సంతసించితిని. గతనిశాసమాచారము వివేకవంతుఁడవై వెల్లడింపవైతివి. ఇప్పుడు నట్టులే మెలంగుము. నా గుఱించి యెటులాడితివో, నా మిత్రుని గుఱించియు నటులే యాడుము. తద్విరుద్ధముగ నాచరింపఁ గడంగుదేని, నీ ప్రాణము మదధీనమై యున్నదని స్మరింపుము: భద్రము!"

తా నొక యధికారివలె ఖలీలుఁడు మాటలాడెను. జనప్రదర్శిత వ్యాఘ్రమువలె సిద్దీ దుర్బలుఁడై ఘూర్ణిల్లి, యపూర్వభయ విహ్వలుఁడై, యట్టె నిలిచిపోయెను. ఖలీలుఁడు హస్తసంచలన మొనరించెను: ఆతనివెంట జూలియను పోయెను. వా రిరువురు క్రమముగా ఖలీలుమందిరము చేరిరి. "మిత్రమా! జరిగినసమాచారము సవిస్తర మెఱింగింపుము." అని ఖలీలుకోర, జూలియను స్వీయకథాకథన

మొనరించి యిట్లు ప్రశ్నించెను—

"నాకథ వింటివి. ఇఁక నీకథ వినవలయు. నీ ప్రవర్తనము అవ్యక్తముగ, నిగూఢముగ కేవల మతీతముగ నున్నది. గంభీరపీఠిక పూత్రముగ నాకరాళదీర్ఘకాయునిఁ బ్రచలింపఁ జేసితివి. మిత్రమా! నాచిత్తము భయంకరానుమానబాధిత మగుచున్నది—"

"చాలు! మిత్రమా! సమాధానముల కిది సమయముకాదు. నీ మిత్రుఁడు లూకాసున కీవిషయమంతయుఁ దెలుపవలదు. మిత్రమా! నన్ను విశ్వసించి, ఏమియుఁ బ్రశ్నింపక, ఎయ్యదియెట్లు పరిణమించునో పరికించుచుండుము. నామాట కెదురాడక మెలంగెదేని, భవదీయ హృదయాపహారిణియగు తైరజానుఁ జేపట్టఁగలవని సమయ మొనరింతును. ఆఖడ్గ మిఁక నిటు తెమ్ము. శయ్యాగతుఁడవై నీ తైరజాను సంస్మరింపుచు నిద్రింపుము."

ఎన్నెన్నియో ప్రశ్న లడుగవలయునని జూలియను చిత్త ముడికి పోవుచుండెను. ఐనను, ఖలీలుఁ డట్లు పలికినపిమ్మట మాటాడఁజాలక ఖడ్గమువీడి కరస్పర్శన మొనరించి, ఆతఁడు తన మందిరమున కేగెను.

మఱుచటి యుదయము యథాప్రకారముగ పాషా పరిచారకులేతెంచి, ఖలీలాదుల మందిరద్వారములఁ దెఱచిరి. కొంతదవ్వున అమీనా యొకమూల నక్కియుండెను. ఆమె కాన్పించినంతనే, ఖలీలుఁడు తత్కారణము సులభముగా గుర్తించెను. ఐనను, ఆ వీరుఁ డావృద్ధురాలినిఁ గాంచనట్టులే ప్రవర్తించెను. యువకులు మువ్వురును గోచరించినంతనే, ఆమె తనదారింబోయెను.

పరస్పరసహవాససౌఖ్యము ననుభవింపుచు నామిత్రులు దినమెల్ల హాయిగఁ బోనిచ్చిరి. తన రహస్యము లూకాసున కెఱింగింపక, తద్విషయమై ఖలీలునిఁ బ్రశ్నింపక, జూలియను సముచితముగ

సంచరించెను.

సాయంకాలమాయెను: పాషా ప్రభృతు లరుదెంచిరి. తా మెంతయు నాతురపడు ప్రణయమందిరమునకుఁ దోడనే మిత్రులు పోయి, ప్రియాంగనావదన సందర్శన మొనరించి ధన్యులైరి. పాషా గంభీరముగ సుఖాసీనుడై యుండెను. ఇస్మైల్లాసతి ఆ చెంతనే మేలిముసుంగు ధరించియుండెను ఆకారణమున నా పడంతి ఈ సమయమున నెట్టిభావములు కల్గియుండునో అరయుట కవకాశము లేకుండెను. లూకాసు రయమునఁబోయి తన గుల్నేరుచెంగట నుపవిష్టుఁడాయెను. తన ప్రాణకాంత చెంత జూలియను అధివసించెను. ఖలీలుఁడు దర్వాననుండియే జులేఖాను గాంచి సగౌరవముగా శిరమువాల్చి, దర్వాననే యాసీనుఁడాయెను. కథాశ్రవణోత్సాహియై దల్తబను పాషా తత్తరపడుచుండుటచే, ఖలీలుఁడు తదుద్యోగ భారము రయమున వహించెను.

## ౧౪

### నాల్గవకథ

1452 సంవత్సర మొకనాఁటి సుప్రభాతసమయమున వేఁటకై దర్ప ముగ బయల్వెడలిన యొకానొక సంఘమునుండి ఘనవేషధారుఁడగు నొక సుందరతురుష్కయువకుఁడు విడువఁడి, మృగయాపరతంత్రుఁడై, తిదుత్సాహతమకమునఁ జాల దవ్వరిగెను. ఆవీరుఁడాకస్మికముగా వెనుదిరిగినంతనే, తత్ప్రమాదము వ్యక్తమాయెను. దుర్గమారణ్యభూములఁ దాను దారి తప్పితినని యాతఁ డపుడు

గ్రహించెను. తన వార లరుదెంతురేమో యని అతఁడు కొంత తడవు నిరీక్షించెను. కాని, ఎవ్వరు రారైరి. తా నెటుఁబోవుటకును దోఁపక, ఆ వీరుఁడు వారువముదిగ్గి, వినిర్మలనదీప్రవాహముపొంత నాసీనుఁడై, గాఢదీర్ఘాలోచనాపరుఁడై, ప్రపంచము మఱచెను.

ఆలోచనాసమాధియం దాతఁడెంతకాల ముండెనో యెఱుంగ రాదు. కాని, ఆవీరుఁ డాకస్మికముగఁ ద్రుళ్ళి పరికించునంతలోనే, తన భుజములక్రిందుగ, బేరురమునకుఁ జుట్టి యొక పాశము గోచర మాయెను! ఆ క్షణముననే అయ్యది బిగియుటచే, నా యువకుఁడు పూర్తిగ నస్వతంత్రుఁ డాయెను. క్రోధవిస్మయాతిరేకమున రయమున నిటునటుఁ జూడ, మొఱకులగు ముచ్చులు మువ్వురు కాన్పించిరి. వారి భావము తోడనే గుర్తించి "మీ కేమి కావలయు" నని తురుష్కుఁడు ప్రశ్నించెను. అందొకఁ డిట్టులు బదులాడెను—

"చక్కగ నడిగితివి! మా కేమికావలయునో చెప్పెద, వినుము. మహాశయా! మొదట నీ మొలకు వ్రేలాడుసంచియందలి సువర్ణము కావలయు; రెండవది, నీవు ధరించిన యుంగరములు; మూడవది, కొన్ని దినములు నీసహవాసము: తగిన పరిహారము మాకు లభించు నంతనే మమ్మువీడవచ్చును."

ఆ మొఱకుఁ డట్లు కఱకుగఁ బలుక, యువకుఁ డిట్టులనెను—

"నా చెంతగల సువర్ణనాణెములను ఆభరణములను మీకొసం గెదను. నన్ను మాత్రము పోనిండు. మీకుఁ బరిహారధన మెంత కావలయునో, ఎన్ని వేలసువర్ణములు కావలయునో చెప్పుడు, నేఁ బోయినంతనే తప్పక మీ కంపెదను. మహమ్మదుపై, బ్రూసానగ రస్థసమాధులందు శయనించుసుల్తానులపై సమయము సేసిచెప్పెద— ధన మెవ్వని కేస్థలమున నొసంగవలయునో మీరే నిర్ణయింపుడు, అట్టులే యగు."

అంత నొకఁడొంక వికటముగ నిట్లు లనెను—

"అయ్యా! మే మొక విధమగు వర్తకులము: ఇట్టి నీటుమాటల వలనఁ బ్రయోజనములేదు. ఇట్టిది వ్యవహారధర్మము కాదు అల్లదె, వనము! మే మందు నివసింతుము. మా యొడయుఁడుకూడ నందున్నవాఁడు. సత్వరము దయచేయుము."

తురుష్కుఁ డెంతయో బ్రతిమాలెను; ఎన్నియో సమయములొనరించెను; ఎంతయో యాసపెట్టెను. కాని, ఆ దురాత్ములు పాషాణహృదయులై నిరాకరించి, తమతో రయమున రావలయునని తొందర యొనరించిరి. ఆలసించినచోఁ దన యనుచరులే తేరవచ్చునని యాసించి, తురుష్కయువకుఁ డా ముచ్చులను మఱల మఱల నర్థింపఁ దొడంగెను. ఆ రహస్యము దొంగలుకూడఁ గొంత తడవైన పిమ్మట గ్రహించి, యా వీరుని బలిమిమై తరలింప నుద్యమించిరి. అట్టియెడ హాయధ్వానినాదములు వినవచ్చెను. యువకుఁ డానందపరవశుఁడై "అల్లా! ఇఁక బ్రదికితి!" నని యఱచెను.

"లేదు! ఆ యేతెంచువారిలో నొకఁడు పురుషుఁడు: రెండవది స్త్రీ! నీ కేమియు లాభములేదు"

ఒక చోరుఁ డట్లు పలుకుచునుండ, నా యువకుఁ డెలుగెత్తి నూతనాగతుల సంబోధించెను. ఆ దుష్టులంతఁ దమ బందాను రయమునఁ గొనిపోవలయునని కడు బ్రయత్నించిరి. వీరుఁడు దుస్పృహాపాశబద్ధుఁ డయ్యు, నాత్మరక్షణార్థము పెనగులాడఁ దొడంగెను. అంతలో నా మార్గస్థులా రక్షణపరాయణులై, తత్ప్రదేశము సమీపించిరి.

కాని, ఈలోపుననే వీరున కపాయము వాటిల్లనుండెను. ఆతఁడు ముప్పురకును లోబడక నిరోధించియుండుటయు, మఱియొక వీరుఁ డరుదెంచుచుండుటయుఁ గాంచి, ఒకఁడు క్రుద్ధుఁడై, ఉన్మత్తుఁడై,

ఆ తురుష్కునిఁ దెగటార్పఁ దన కరవాలము నెత్తెను. అట్టి మహా సంకటసమయమునఁ గ్రొత్తపురుషుఁ డరుదెంచెను. ఆతఁ డేతెంచుటయు, తేజి డిగ్గుటయు, ఖడ్గధారియై యుఱికి ఆ సాహసికుని నిరాయుధు నొనరించుటయు నొక్క క్షణమున జరిగెను. అంత నా హంతకులు మువ్వురుంగలసి వైరినిఁ దాఁకిరి. నవీనుఁ డా పాపాత్ములకుఁ దావీకఁ నిజరణకౌశల్యము నత్యద్భుతముగఁ బ్రదర్శించెను. సమయమరసి, యాతని వెన్నంటివచ్చిన మచ్చెకంటి తురుష్కవీరుని పాశములు రయమున ఛేదించెను. ఆ యోధుఁడు తోడనే కృతయుద్ధుఁడై పోరాడెను. హంతకులు ధైర్యముగఁ బోరాడియు, తుదకుఁ దెగటారిరి.

తురుష్కుఁ డంతఁ దన కృతజ్ఞత వెలిబుచ్చుటకై తన రక్షకుని డాయఁబోయెను. ఆతనిప్రాయ మొక్క సంవత్సర మధికముగ నుండును గాన వాఁడును యౌవనప్రభావిభాసితుఁడే. వాని వదన సౌందర్యము వస్త్రధారణము వాగ్వైఖరియుంగాంచి, యాతఁడు గ్రీకు కానోపునని తురుష్కవీరుఁడు గ్రహించెను. ఆతఁ డున్నత వంశజుఁడు కావలయు ననియును దెలియుచుండెను. వాని నంటి యుండిన కోమలాంగియు నట్లేయుండి, నిరుపమసౌందర్యముతో నలరారుచుండెను. ఆమె ప్రాయము పదునెనిమిది వత్సరము లుండును.

తురుష్కుని యభినందనాలాపముల నాలించి గ్రీకు యువకుఁ డిట్లనెను—

"ఆర్యా! నన్నింతగఁ గొనియాడఁదగదు. నే నిట్టి సంకటమునఁ జిక్కినపుడు నీ వెట్టు లాచరింతువో, నేనును అట్టులే యొనరించితి. ఇంతకంటె విశేషములేదు. గాని, గ్రీకులు తురుష్కులు ఈ తెఱంగున మిత్రులవలెఁ గలియక, సదా రక్తరంజిత రణరంగమున మాత్రమే

కూడుట కడుసంతాపకరము సుమా."

"తప్పెవ్వరిది ! ఆటోమనులు మిగుల బలవంతులు. మీ రేఁడు తురుష్కసమ్రాట్టునకుఁ జెల్లింపవలసిన కప్పము సరిగాఁ జెల్లింపక, ఎగవేయఁ బ్రయత్నించును!"

తురుష్కయువకుఁ డట్లు సగర్వముగ వడివడిఁ బలుక, గ్రీకు ఇట్టులనెను—

"నేటి గ్రీకులు తొంటివారల ప్రసిద్ధపరాక్రమమునందు సగమైనఁ గలిగియుండిరేని, ఇంతటి దుర్దశకుఁ బాలైయుందురా? మా రాజ్యము కాస్పియనుజలవలయితమై యుండుటకు మాఱుగ, పరసియాదేశముపర్యంతము వ్యాపించియుండెడిది !

ఆ సమయమున గ్రీసుదేశమునకు 'కాన్‌స్టాంటునోపిలు' రాజధానియై యుండెనని పాఠకులు గుర్తింతురుగాక.

తురుష్కమహమ్మదీయుఁడు కఠినవీక్షణుఁడై యిట్టులనెను—

"ఓయీ ! ఎఱుంగవా? తురుష్కసార్వభౌముఁడగు రెండవ మహమ్మదు తన పతాకము కాన్‌స్టాంటునగరప్రాకారముల నలంకరించుదనుక, క్రైస్తవ'చర్చి' లన్నియు మహమ్మదీయమసీదు లగువఱకు సహింపనని పూనినప్రతిన యెఱుంగవా? గ్రీకు సార్వభౌముఁడు నిజవంశజులకంటె మిన్నయగునేని, నిజరాజధాని సంరక్షణ మొనరింపనిమ్ము, చూతము!"

గ్రీకు యువకుఁడు దేశభక్తిపూరితుఁడై, ఉత్సాహియై, ఉద్విగ్నుఁడై తదుచితస్వరమున నిట్టులనెను—

"గ్రీకుసార్వభౌముఁడగు 'కాన్‌స్టంటైను' తప్పక కృతకృత్యుఁడగును. మహమ్మదీయుఁడా ! గ్రీకుల శౌర్యము నేఁడు కానరాకున్నది, వాస్తవము. అంతమాత్రమున వారు శౌర్యహీనులని భ్రమింపవలదు. ఇప్పు డడఁగియున్నను, వైరులరుదెంచి నగరము

ముట్టడించునంతనే, ప్రాణాధిక దారాపుత్రాది బంధుజననిలయమున కపాయము ఘటిల్లనుండెనని యెఱుంగునంతనే, అఖిలక్రైస్తవాన్వయమహాదుర్గ ప్రథమప్రాకార మనఁదగు నగరరాజము శత్రుసైన్యవశమయి పోయెనని వినునంతనే, గ్రీకులశౌర్యాగ్ని ప్రజ్వరిల్లును: దైవము నిక్కముగఁ దోడగును."

"ఎంతచేటువు ! ఇఁక గ్రీకు సామ్రాజ్యమువని సరి. మీప్రవక్తలే; మీ కాలజ్ఞులే, యట్లు వాకొనుచున్నారు. ఆటోమనులు 'నరిస' ద్వారమునుండి నగరప్రవేశ మొనరింతురనియు బ్రతీతికలదు. ఎఱుంగవా!"

గ్రీకు చిన్నవోయెను. చిత్తమునఁ జెలరేగు దుశ్చింతల వారించుటకోయన, లలాటము తాఁకి తాఁకి, నిట్టూర్పువుచ్చి, ఆతఁ డెట్టకేల కిట్టులనెను—

"ఔనౌను. పూర్వ మా ద్వారము లేదు. మాచేతనే యాజ్ఞానుసారముగా నయ్యది యనాదినుండినట్టులు మగుడ నిర్మితమాయెను. కాని, గ్రీకు లిపుడు ఆటోమనులతోడి వైర ముడిగి సుఖముగ—"

"ఎంతకాలము ! మఱియొకజోస్య మెఱింగించెద. మీ రాజధానిపై నంపవాన గుఱిపించు శాత్రవున కయ్యది యధీనమగునని మీ ప్రవక్తలు చిరకాలమునుండియు వచించుచున్నవారు."

అట్టి పలుకులు గ్రీకునకు దుస్సహముగ నుండెను—"అయ్యా! వృద్ధజనప్రలాపములఁ బురస్కరించుకొని, యిట్టు లాడుట పాడి యగునా ? మహమ్మదీయుల కుత్సాహజనకములు కాని జోస్యముల నే నెఱుంగనా ? రాయబారి మిలోషుఁడు మురాదు సుల్తానును బొడిచి చంపిన ప్రసిద్ధ 'కొసావా' యుద్ధానంతరము హంగరసేనాని దుఃఖితుఁడై యొక దైవజ్ఞునిఁ జూడ, నొక్క ప్రసిద్ధనగరముం గోల్పోవువఱకు క్రైస్తవులు సదా అపజయమునే వడయుచుందు రని

వాక్రుచ్చెను. అట్టి నగరము 'బెల్గ్రేడు' కానోపు: అది కాదేని మీా మైనోపాఖండస్థరాజ్యనగరమగు 'అడ్రియానోపిలు' కానోపు. అంతటితో—

"సరికాదు. కాన్స్టాంటినోపిలే యీా నగరము!

"ఆహా! కాఁబోలు! కావచ్చు—"

"ఔను! మా మహమ్మదేమనెను? ఒకముఖమున సముద్రమును, రెండవముఖమున భూమిని దిలకించు నగరరాజము 'ఉస్మాను' వంశజుల యధీనమగునని సెలవిచ్చెను: మఱియు దన్మహానగరసంపాదనాధ్యక్షుఁడే లోకైక రాజన్యుఁడనియు, తత్సహాచరసైన్యమే ఉత్తమోత్తమమనియు గూడ సెలవిచ్చెను."

అట్టి దుస్సహంపుసంభాషణము మఱలింపనెంచి, గ్రీకు యువకుఁడిట్టులనెను—

"అయ్యా! ఇట్టి జోస్యములందలంచి, మన యవ్యాజ సహవాసము గళంకపఱుపనేల? నీవు ప్రసిద్ధమగు ఉస్మానువంశజుఁడవు, వీరుఁడవు. దైవికముగా నీ పరిచయలాభ మలవడినది. ఈ కన్నియ మదీయసోదరి. కారణాంతరమున నీ సమీపనగరమునకుఁ బోయి మగుడువారము. మా పరిజనులు కొంతదవ్వున నున్నవారు. వారతి శీఘ్రముగ రాఁగలరు. కావున, అంతదనుక దయయుంచి యిట నిలుతువేని, నా పరిచారకు లరుదెంచి గుడారములు వేయుదురు. మన మందు సస్నేహముగా నోగిర మారగింతము."

తురుష్కుఁడంత నా యువతీయువకుల లెస్సగఁ బరికించి యిట్లు ప్రశ్నించెను—

"నా కమితోపకార మొనరించుటయేగాక, విందునకుఁ గూడ నాహ్వానించు నుదారపురుషుని నామధేయ మెయ్యది?"

"అయ్యా! నాపేరు 'లూకాసు నటరాసు' ఈ కన్నియ 'ఐరిణి'

గ్రీకుసార్వభౌముని మద్ధకుఁడగు పెద్ద 'ద్యూకు' మా జనకుఁడు.

"పెద్దద్యూకు నటరాసు పరాక్రమధారేయుఁడు: ప్రబలవిరోధి. అట్టివాని సంతానముతోఁ బరిచయము కలిగినందుకు సంతోషము. నా యనుచరులు నాకై తత్తరపడుచుందురు: కాన నీ యాహ్వానము స్వీకరింపఁజాలను. అయ్యా! ఈ యుంగరము మత్కృతజ్ఞతాసూచకముగాఁ బరిగ్రహింపుము. మనము మఱలఁ గలియునపు డీచిహ్నము మన పరిచయమును స్మరణకుఁ దేఁగలదు. నా కృతజ్ఞత నపుడు మహత్తరముగఁ జూపఁగలను."

అట్లు పలికి, ప్రతివచనముల కెదురుచూడక మహమ్మదీయ యువజనుఁడు తురంగముపై లంఘించి, చరణాంకుశము గ్రుచ్చి రయమునఁ బోయెను.

ఈ ముచ్చట జరిగిన కొన్ని దినములకే, ఆటోమను సుల్తానగు రెండవమహమ్మదు గ్రీకులపై దండెత్తఁగోరి, సముచితసన్నాహము లొనరింపఁ దొడంగెను. 'అర్బను'ఁడను గ్రీకు ఒకఁడు దేశద్రోహియై సుల్తాను నాశ్రయించి, గొప్ప ఫిరంగులఁ దయారుచేయుట కొడఁబడెను. వానికి మహమ్మదు విలువగల పసదనము లొసంగి, వేయి పౌనుల భారముగల రాలను విసరు యంత్రము తయారుచేయుమని కోరెను. అంతటి మహత్తరభారము నొక మైలుదూరము విసరెడు ఫిరంగినిఁ దయారుచేసి యర్బనుఁడు ప్రభుసన్మానము, గాంచెను. మహమ్మదీయుల యుత్సాహములో డనే దశాధికమాయెను. గ్రీకు లన్ననో! తద్భయంకరవార్త నాలించి, తలంపరాని జోస్యములఁ దలంచికొని, వికలస్వాంతులు కాఁజొచ్చిరి. తత్పూర్వమే గ్రీకుల యవస్థ దుస్సహముగ నుండెను. వారి తొంటి శౌర్యప్రతాపములు స్వప్నగతము లాయెను. ఉన్నవారైనను ఏకాభిప్రాయబద్ధులై యుండక, పరస్పరమతకలహములఁ బ్రొద్దుపుచ్చుచుండిరి. గ్రీకు

రాజధానియందు ద్వివిధమతస్థు లుండిరి. వారిరువురు క్రైస్తవులే యైనను, భిన్నాభిప్రాయులై, బుద్ధిహీనులై, మహమ్మదీయు లరుదెంచు చుండి రని తెలియవచ్చినను సరకుసేయక, కాలహరణ మొనరించు చుండిరి.

1453 ఏప్రిలు ఆరవ తేది. రెండవ మహమ్మదు సుల్తాను రెండు లక్షల యేఁబదివేల సైన్యము సమకూర్చుకొని, కాన్స్టాంటు నగరము ముట్టెను. వారి ఫిరంగులు సముచితస్థలంబుల భయంకరముగ నిలిచియుండెను. సూర్యోదయ మగుచుండగనే, పెనురక్కసిం బోలిన మహమ్మదీయుల పెద్దఫిరంగి వైరిజన హృదయము పగులునట్లు అతి భయంకరముగ గర్జించెను. అదియే యుద్ధప్రారంభము. ఆ మానవ మారణమహాయంత్రము మఱియొకసారి ప్రమోఁగి, తద్విపరీతాటోపమునకుఁ దానె నిలువనేరక భగ్నమాయెను. తన్నిర్మాత యగు నర్బనుఁడు కూడఁ దద్విలయమున, నిజదేశద్రోహప్రతిఫలముగ, మరణించెను. ఐనను, మిగిలిన ఫిరంగులతోడనే మహమ్మదీయులు శిలాపాతమున విరళముగఁ గురిపింపఁదొడంగిరి. ఒక లక్షమంది మహమ్మదీయ సైనికులు విరామ మరయక సంతతధారాపాతముగ వర్షించు బాణములుకూడ గ్రీకులకుఁ గడుదుస్సహముగ నుండెను.

మహమ్మదీయులు గంటుమీఱి యహోరాత్రులు పట్టువిడక వైరులఁ గారింపఁదొడంగిరి. హతభాగ్యులగు గ్రీకులస్థితి వర్ణనాతీతముగ నుండెను. వారి సైన్య మెనుబదివేలు మాత్ర ముండెను. వారి నౌకాబలము కూడ హీనముగ లెక్కకు పదునాలుగు మాత్ర ముండెను. వారి శతఘ్నులు కూడఁ గడునీరసముగ నుండెను.

ఇట్లుండ, నాలుగువందల సంఖ్యగల తురుష్క నౌకాబలమునకును అల్పమగు గ్రీకు నౌకాబలమునకుఁ బోరాట మాయెను. ఎట్టులో గ్రీకులే విజయముఁ గాంచిరి: తురుష్క నౌకాసేనానికి శృంగభంగ

మాయెను. గ్రీకు లమితానందపరవశులై తమ భాగ్యదేవత ప్రసన్న మాయెనని స్థైర్యము వహించిరి. భూతలాధిపత్యము తమ యధీన మొనరించిన విధాత జలాధిపత్యము మాత్రము క్రైస్తవుల పాలొన రించఁ గాబోలునని తురుష్కులు భావించిరి.

కాని, గ్రీకులు సుస్థిరానంద భాగ్యము నోచికొనరైరి. మూడవ నాఁటి ఉదయమగుసరికి, దవ్వుననుండిన తురుష్కనావలు డెబ్బది యెనిమిది గ్రీకు నౌకాశ్రయమునఁ బొడసూపెను. గ్రీకుసైన్యమున హాహాకారములు చెలరేగెను. తామప్రమత్తతతో రేయింబవళ్ళు కాచికొనియుండ, తురుష్కనౌక లందే తెఱంగున బ్రవేశింపగలి గనో తెలియకుండెను. ఏనౌకయు రాకుండ దిట్టముగు నినుపగొలుసు లను వారు కట్టియుండిరి. తదభేద్యపాశము లట్టులే యుండెను. ఐన, శత్రునౌక లెట్లు రాఁ జాలెను? విచారించి చూడ, నావడవలను నేలపై నీడ్చి, నిశాసమయమున నందుఁ బ్రవేశించియుందురని గ్రీకులు గ్రహించిరి. ఆ దూరము ఐదుమైళ్ళుండును. జలగాముల నంత దవ్వు భూగాముల నొనరించుట యతి సాహసము, కడు ప్రశంసనీయము. ఆ కారణమున గ్రీకుల యవస్థ మఱియు దుర్భరమాయెను.

మహమ్మదీయ నౌకాదళమును బరిశునామప్రీతి నొనరింపవలయు నని రెండుసారులు ప్రయత్నించి, గ్రీకులు భగ్నహృదయులైరి.

ఇరువదినాల్గవ తారీకు ఉదయమాయెను. ముట్టడి శీఘ్రముగఁ దుదముట్టింపఁగోరి సుల్తానీ తెఱంగునఁ బ్రకటించెను—"సైనికులారా! వీరులారా! ఈ కార్యమున కింత కాలయాపన మొనరించుట హాస్యా స్పదము. ఇరువదితొమ్మిదవ తారీఖున మీరీ దుర్గమును భగ్నమొన రించి, మీకును నాకును యశమార్జింపుఁడు. యశమేకాదు, ధనము కూడ గడింపుఁడు! భూమియు గృహములును మదధీనములుగాని,

నగరజనుల బొత్తంతయు మీయది!"

ధనాశచే మహమ్మదీయుల ధైర్యోత్సాహములు ద్విగుణమాయెను. తద్భయంకర దివస ముదయించెను. గ్రీకుల యవస్థ దుర్భరమై దుస్సహమై, దురంతదుఃఖభాజనమై, వర్ణనాతీతమై యుండెను. గ్రీకుసార్వభౌముఁడు నిజరాజధాని సంరక్షణార్థము చేయఁగల ప్రయత్నము లొనరించెను. పాఠకజనపరిచితుఁడగు 'లూకాసు నటరాసు' అతని ఛాయవలె నగరమునం దెల్లెడల సంచరించెను. కాని, ఝంఝానిల ప్రపీడిత గభీరపారావారమువోలెఁ బఱతెంచు ప్రచండరిపు సేనావాహిని వారింప నెట్లు సాధ్యమగును? తత్సార్వభౌముఁడు పరాజయ పరాభవములు తథ్యమని గ్రహించి, ప్రాణము తృణప్రాయమని యెంచి, మధ్యందినమార్తాండునివోలె నమేయ బలపరాక్రమోజ్జ్వలుండై వెలింగి, సంగరరంగమున వీరపురుషోచితముగ నిహతుఁడై కీర్తిసాంద్రుఁడాయెను.

గ్రీకు లింకను బేలలై తమ దైవము తమ్ముఁ దద్విపదంబుధినుండి రక్షించునని ఆసించి యుండిరి. ఆ దౌర్భాగ్యు లట్లు చూచుచుండఁగనె కట్టం దెగఁగొట్టి ఘనఘూరారవంబునఁ బఱతెంచు నుత్తుంగ నదీప్రవాహమువలె మహమ్మదీయసేనావాహిని సాయంకాల మైదుగంటలగుసరికి, జోస్యులు పలికిన సరిసద్వారమునే తొలుదొల్త నిర్భిన్నమొనరించి, అనాదిమహానగరము నాక్రమించెను. గ్రీకురాజధాని యంతయు వైరిసైనికనికాయములతో నిండిపోయెను. కంటఁబడు ప్రాణిం జెక్కాడుచు మహమ్మదీయులు దీనపురజనగృహంబులు దారుణముగ దోపిడిచేయ నారంభించిరి. క్షతగాత్రవిలాపములు, మృత్యువ్యథితుల మూల్గులు, భీరుల దైన్యాలాపములు, అనాథబాలికాజనాక్రోశములు, క్రూరమహమ్మదీయ విసరవిదళిత బాలాజనకనికరదుస్సహ దుఃఖారవంబులతోడను అమ్మహానగరము ఘూర్ణిల్లఁజొచ్చెను.

ఆటోమను సామ్రాజ్యనిర్మాతయగు నాఁటి ఉస్మానుస్వప్నము నేఁడు సఫలమాయెను. రెండు నీలములనడుమ, రెండు పచ్చలనడుమ రాజిల్లు వజ్రమువలె జలధి వలయవలయిత మహీమండలాంగుళీయమునకు భూషణప్రాయమగు మహారత్నమువలె నొప్పు నగరరాజము తద్వంశాధీనమాయెను.

రెండవ మహమ్మదు సుల్తాను నిజమంత్రి సామంతాదిజనమండితుండై యానాఁడే దర్పమొప్పఁ బతిత మహానగరప్రవేశ మొనరించెను. క్రైస్తవప్రసిద్ధప్రార్థనాలయమగు 'సెంటు సోఫియా'కే సుల్తాను సూటిగఁ బోయెను. మహమ్మదీయ మతాచార్యుఁ డనుజ్ఞాతుఁడై, మతావేశపరుఁడై, అల్లావారి పవిత్రనామసంకీర్తనము గంభీరస్వరంబున నొనరించెను. దీర్ఘసహస్రసంవత్సరపర్యంతము క్రైస్తవ దైవ ధన్యవాద ముఖరితమహానగరము మహమ్మదీయ ప్రార్థనారవములచే ఘూర్ణిల్లఁజొచ్చెను. అఖండవిజయప్రదాతయగు పరమాత్ముని నా తెఱంగున నారాధించిన యనంతరము, విజయుఁడగు మహమ్మదు వేఱొక స్థలంబునఁ గొలువుండి, యుద్ధమునఁబట్టువడిన గ్రీకుప్రముఖులను నిజసముఖమునకు రప్పించెను. వారిం గాంచి, వారు మూర్ఖులై యుద్ధసన్నద్ధులగుటవలననే సంగరము దీర్ఘతరంబాయెననియు, దాన నధికరక్తపాతము సంభవమాయెననియుం బల్కి, క్రుద్ధుఁడై దూషించి, వారిని దోడనే వధింపవలయునని సుల్తాను దారుణముగ నాజ్ఞాపించెను.

ఇఁక మన నటరాసుఁ డేమాయెనో చూతము. వీరాగ్రేసరుఁడగు నా యువకుఁడును తన నృపాలునివలెఁ జేతనగు శత్రుసంహారణ మొనరించి వీరస్వర్గమునకుఁ బోవలసినదే. కాని ముందుగనే యాపురుషుఁ డాకస్మికముగా గదాతాడితశిరస్కుఁడై, విస్మృతుఁడై, నేలఁగూలెను. అట్లు మోఁదిన మహమ్మదీయుఁడు నటరాసుయొక్క వేషగాంభీర్య

ములఁ గాంచి, అతఁడు కులీనుఁడు కావలయునని యెంచి, దానఁ దన కమనీయపరిహార మలవమునని ఆసించి, చంపక, తిన్నఁబూవ శౌరాన్య గృహమున కాతనిఁ గొంపోయి, సముచితోపచారము లొనరించెను. ఆ మహమ్మదీయసైనికుఁడు జనీజరీ దళములోనివాఁడు. వాఁడు తొల్లి గ్రీకుజాతివాఁడే. నటరాను తెలిసికొందినంతనే భయకంపిత హృదయుఁడై, తన రాజధాని యవస్థ యెటులుండెనని ప్రశ్నించెను. జనీజరీ యిట్లు బదులాడెను—

"మహమ్మదు సుల్తానిపుడు సోఫియా మసీదునందు—"

"సోఫియా మసీదా!" అని నటరాను అమితభయవిస్మయాకుల చిత్తుఁడై యడిగెను. జనీజరీ యిట్లు బదులాడెను—

"ఔను. నీ వనుదినము 'కన్య' నారాధించు వైభవసమన్విత ప్రార్థనాగారము నేఁడు మహమ్మదీయుల మసీదాయెను."

"ఏమీ! సుల్తానీనగరమును వశపఱచికొనెనా?"

"మహనీయుఁడగు పాదుషా యిప్పుడు తన నవీనరాజధానియందు సుఖమై యున్నవాఁడు. అల్లా ప్రభావము!"

"ఛీ! ఓరీ, యధమాత్మా! గ్రీకువై జన్మించి, చిరకాలము క్రైస్తవదైవము సంస్తుతించిన జిహ్వతోఁ దదన్వయమున కెల్ల మేటి దుర్గమగు నిమ్మహానగరమును విధ్వంస మొనరించిన మహమ్మదీయుల మాయదైవము నెట్లు కొనియాడఁగలవు!"

"యౌవనుఁడా! ఈ పాటి యెఱుంగవా? పరిస్థితులతోఁ బాటు హృదయముగూడఁ బరివర్తించును. దానఁ దొంటిప్రవర్తనమంతయు విస్మృతంబగును."

ఆ మహనీయుఁడు "నీ మహమ్మదిపుడెందున్నవాఁడు?" అని నటరాను కుపితుఁడై నిందాగర్భిత మందహాస మొనరింప, జనీజరీ యిట్లు లనెను—

అంతలో నొక జనిజరీయుద్యోగి గ్రీకుసార్వభౌముని భిన్నమస్తకము నొకశూలాగ్రము నలంకరింపఁజేసి సభాభవనమునఁ బ్రవేశించెను. పాదుషా క్రూరమృగసహజోత్సాహవిరాజితవదనుఁడై తదుత్తమాంగముం దిలకించి, నిజమహావిజయసూచకముగా నాదారుణచిహ్నము నొక బల్లపై నుంపవలయునని ఆజ్ఞాపించి, ఆ యుద్యోగికిఁ బెక్కు సువర్ణములు బహుమానముగా నొసంగెను. ఆగ్రహాధికమున నటరాను హృదయము భగ్గున మండిపోయెను. డెందమునఁ బొంగు నాగ్రహము నడంపఁజాలక పండ్లుకొఱికి, తదావేశప్రకంపితస్వరమున నాతఁడు నిర్భయముగ నిట్టులనెను—

"విజయుఁడా! నీ విజయము నేల యిట్లు కళంకపఱచెదవు?"

"మూర్ఖయువకా! మేము సహింతుమని, కొలఁది యెఱుంగక అఱతువా?" అని సుల్తాను ప్రజ్వలితానలనయనుఁడై గర్జించి, ద్రాక్షరసపాన మొనరించెను. నటరాను మానసము దుస్సహముగ మండిపోవుచున్నను నిగ్రహించియుండ, నంతలో నాతని జనకుఁడు పుత్రికానహితుఁడై ప్రవేశించెను. పెద్ద ద్యూకును గాంచినంతనే సుల్తాను సక్రోధముగా నిట్టులనెను—

"ఇరుతెగలవారును ఇంతమంది యకారణముగాఁ దెగటారకుండ ముందుగనే నగరము మదధీన మొనరింపవైతివేమి? ఇంత జననాశనము లేకుండెడిదే!"

"అయ్యా! ఆశాప్రేరితులమై పోరాడితిమి. మాదురదృష్టవశమున నగరము నీ యధీన మాయెను.

కానిమ్ము! మీ వైపున రణమాచరించిన కులీనుల పట్టిక యొకటి నాకిమ్ము."

సుల్తాను దురభిప్రాయము గుర్తించి నటరాను సత్వర మిట్టులనెను.

"నా జనకుఁ డంతటి దురాచార మొనరించి దుర్యశము గడింప జాలఁడు."

నటరాసు మాటాడు లోపుననే సుల్తాను నయనము లాతని సోదరియగు నైరిణి నిరుపమాన సౌందర్య విరాజితమగు వదనముపై వ్రాలెను. నటరాసుఁ డట్లు తీవ్రముగఁ బలికినంతనే, మహమ్మదీయ నృపాలుఁడు కుపితుఁడై యిట్టు లనెను.—

"యువకుఁడా! మాటాడకుము! నాఁడు నీవు చేసిన యుపకారమునకుఁ బ్రత్యుపకార మొనరింపఁ గోరెను. కాని.—

"వలదు! వలదు! అపయశోభాజనమగు సన్మానము మాకు వలదు."

"కుమారా! దుర్భరపరిస్థితు లెటులొదవిన, నటు లొనంగవలయు. ఆత్మ సంరక్షణోపాయ మరయ—" అట్లు పలుకు తన జనకుని వారించి, "మన గౌరవమునకు భంగము తెచ్చుకొన మెలంగరాదు" అని నటరాసు ధైర్యముగఁ బలికెను. తత్సమాగత మహమ్మదీయ ప్రభువులందఱు నా ధైర్యశాలి నట్లె ససంభ్రమముగఁ దిలకించిరి.

సుల్తాను మగుడ యువకుని మాటాడ వలదని శాసించి, గ్రీకు వీరాగ్రేసరుల నామధేయముల నొసంగవలయునని పెద్దమ్యాకను మఱలఁ గోరెను. ఆ వృద్ధుఁడటు లొనరింపఁబోయెను. కాని, వానిని వారించి, నటరాసిట్టు లనెను—

"తండ్రీ! ఇంతటి యధమకార్య మొనరించి మన సద్వంశమును గళంక పఱుపకుము. దారుణ మరణదేవత యెట్టిభయానక రూపముననైన మనలను గబళించుఁ గాక: వైరిదుర్వార దురాగ్రహానలమునం బడి మ్రగ్గిన మ్రగ్గెదముగాక: ఐన, నేమి? తొల్లి మన వారలొనరించిన ఘనకార్యములఁ దలంచియైన దదనుగుణముగ మెలంగుము."

నటరాసు యొక్క వృథాభిమానముఁ గాంచి సుల్తాను హసనాన

నుండాయెను. కుమారుని పలుకులు వినఁజాలక, పెద్దదుర్యాకు చెవులు మూసికొనెను. తన జనకుని దైన్యావస్థఁ గాంచి దుఃఖ పరవశయై అట్టి దుస్సహ ప్రదర్శనముం గాంచుటకంటెఁ దానాక్షణము మరణించిన బాగుండునని, ఐరిణి ప్రకంపిత హృదయయై విలపించెను.

ఈ లోన, గ్రీకు ప్రముఖులు పట్టిక తయారుచేసి, వినమ్రుండై మోఁకరించి, పెద్దదుర్యాకు సుల్తానున కొసంగెను.

“ఆహా! ఇయ్యది గ్రీకు పరాభవదినము! దుర్భరము!” అని ఐరిణి పట్టఁజాలక విలపించెను. తత్కాలస్వనమంజులాలాపములు వీనులఁ బడినంతనే సుల్తాను చకితుండై, విభ్రాంతుండై యిట్టులనెను.—

“సుందరీ! దగ్గరకురమ్ము. ఏమంటివి? నీవు కోపాలాపములు సహితము గడుమధురము లగుటచే, మగుడ వినవలతు.”

సుల్తానట్లు పలికినంతనే, పటరాసు ద్విగుణీకృతవ్యథోద్దీపితుండై, నిజసోదరి మానసంరక్షణార్థము, క్షుధార్తసింగము పగిది, నుఱుకఁ బోయెను. కాని, జనీజరీలాతనిం దమదృఢతమ బాహుయుగ్మములఁ బట్టుటచే, నాయువకుఁడు భగ్నమనోరథుఁడాయెను.

అంతట సుల్తాను పెద్దదుర్యాకు నుద్దేశించి, యిట్టులనెను.—

“అయ్యా! నామాట పాటించి యీపట్టిక నొసంగితివి, సంతసము. నీ కుమారుఁడు దుడుకుఁడై, మూర్ఖుఁడై అవివేకియై యొకతెఱుంగక ప్రవర్తించినను, నిన్నుఁ దప్పక బహూకరింతును. ఈ హేమగాత్రి, ఈ విద్యుల్లత, ఈ కలభాషిణి, ఐరిణి కరుణాయత్తచిత్తయై నాయర్ధాంగియై, నాసుల్తానాయై, మదీయహృదయానందకారిణియై ప్రాగ్దేశపరిపాలనా ధురంధర పరిపాలకయై, యఖండ భోగభాగ్యవైభవ సముజ్జ్వలయై, విరాజిల్లుగాక. సుందరీ! ఇంత కాఠిన్యమేల? రమ్ము! ప్రసన్నచిత్తవై రయమున రమ్ము; మదఖండ విజయోత్సాహ మధికతర మొనరింపుము.”

"వలదు! వలదు!" అని యఱచుచు ఉన్మాదసహజ భూరిబలంబు నందును బట్టిన జెట్టుల నిట్టట్టు దొట్టతనంబున ద్రోచి, నటరాను నిజసోదరి చెంతకు శరవేగమున బోయెను. మహమ్మదీయ నృపాల క్రూరవీక్షణపాత ప్రకంపితయగు నాకోమలి యభినవ కుసుమవల్లరివలె నిజభ్రాతృ భుజాదండము నాశ్రయించెను. వృద్ధజనకుడు ముగ్ధుడై మిన్నకుండెను. అంతసుల్తాను క్రుద్ధుడై కఠినముగనిట్టులనెను.

"ఓయీ! పడుచుదనంబున నింగిత మెఱుంగని ఈ యువజనులను మందలించి, మదాజ్ఞాబద్ధుల నొనరింపుము. లేదేని, పురాతన కృతజ్ఞతానివారిత భీషణక్రోధాశనీ నిర్భిన్నుడై నీసుతుడు ప్రమగ్గగలడు!'

వృద్ధుడేమి చేయగలడు? పాపమా హతభాగ్యుడు తన సంతానము నెట్టులైన రక్షింపవలయునని దైన్యముగ బ్రార్థించెను. సుల్తాను క్రోధోద్దీపితుడై యిట్లు గర్జించెను—

"ఓయీ! యుద్ధమున బట్టువడిన మీరందఱు నాయాజ్ఞ శిరసావహింపవలయునని యెఱుంగవా? మాటాడకుము. నాయాజ్ఞ అమోఘము!"

అంతదనుక వినమ్రుడై యుండిన డూర్యాకు ధైర్యము వహించి, సుల్తానును ధిక్కరించెను. తోడనే, ఆతడు సన్నయొనరింప, భటులు రయంబున నాతండ్రి కుమారుల బలముడిపి, ఆ మందభాగ్యులు చూచుచుండగనే, గ్రీకు కన్నియను పాదుషా యాసనము చెంతకు నీడ్చికొనిపోయిరి.

"అరే! దురాత్మా! కృతఘ్నుడా! అధమాత్మా! ఇదియా నీవొనరించు ప్రత్యుపకారము!..." అట్లు నితాంత క్రోధఘూర్ణితుడై యఱచు నటరాను నోరు చీరికింగొనక, సుల్తాను ఐరిణిండాయ బోయెను. పాపమా హతభాగ్య నిజనయనదళ ప్రభవాశ్రుజల నిర్మగ్నమై, వికీర్ణ విలంబమాన శిరోజమై, క్రూర భటాకర్షణావసర

విచ్ఛిన్న కంచుకయై, రూపొందిన దీపతత్త్వముపలెఁ దోఁప, నాభయంకర మహమ్మదీయ నృపాలుఁడు కామాయత్త చిత్తుఁడై యారమణీమణి రమణీయ కుచకుంభములపై దృష్టి నిల్పి యానంద పరవశుఁడాయెను. ఆ కాముకుఁ డంత నాయనాథ బాలిక కరాబ్జము నల్లనఁబట్టి ధైర్యము కలిపి, యమూల్యాభరణాదుల నిచ్చెదనని పలికెను. ఐరిణి యేమియు మాటాడలేదు. చూచుచుండగనే, ఆమె దురంత దుఃఖ మంతరించెను: దుస్సహ విచారారుణ దీపిత వదన మాకస్మికముగా వెల్లవాఱెను; నయనముల చంచలములై, యసాధారణముగఁ బ్రకాశించెను: ఉరువక్షోజ ప్రచలనము సన్నగిల్లెను. మోహాంధుఁడగు సుల్తాను అన్యవిచారణ మెఱుంగక, ఆ కాంత కౌనుపైఁ జేయివైచెను. అంత నామానిని విసీల వీక్షణంబుల నాతనిపైఁ బఱపి, దిగ్గునలేచి, తద్దురాత్ముని హస్తమునటు విసిరి, రయమున రెండడుగులు వెనుకకువైచి, నిజహృదయమున కంటియుండు కటారిం దటాలునఁ దీసి, మెఱుపు మెఱసిన చందమున నామెఱుఁగుఁ బోఁడి యతి సాహస మొనరించి నిజహృదయ విచ్ఛేదన మొనరించి, పట్టుతప్పిన సువర్ణ విగ్రహముపలె నేలఁ గూలి, మఱియొక క్షణమున మరణించెను!

అంతవఱకు నా సుల్తాను ఐరిణి చెయ్దముల నరయఁడాయెను. ఆ కాంత మరణించినంతనే, మహమ్మదు క్రూర శరఘాత బాధిత శార్దూలము వలె నుజ్జ్వలానలనయనుఁడై, యిట్టట్టు గలయఁ జూచి, దురంతమగు నాశాభంగమునఁ గ్రోధోన్మత్తుఁడై, తన దీర్ఘ కరవాలము నూడఁ బెఱికి, హుంకరించి, తన కట్టెదుటనున్న తండ్రి కుమారులను ఖండింపఁ బోయెను.

వజీరుఁ డంత లేచి, వీరజనవితాన, విదారణ వ్యాపార దక్షమగు ప్రసిద్ధ హస్తమున నట్టి నికృష్టకార్య మొనరింప వలదని ప్రార్థించెను. పాదుషా యంత నాచెంతనున్న మధురసముఁ గ్రోలిఁ యొకింత సేద

దేఱి, మగుడ ననుపవిష్టుండై, ఆగ్రీకుల కంఠముల నాతండే ఖండింప వలయునని వజీరు నాజ్ఞాపించెను.

తండ్రి కుమారులు తోడనే యావలకుం దలవరులచేం దరలింపం బడిరి. నిజపుత్రికా మరణము దారుణముగ దృగ్గోచర మైనంతనే, గ్రీకు సహజ ధైర్యస్థైర్య ధుర్యుడాయెను పాపమా మహానీయుండు చూచుచుండగనే లూకాసు ముందుగ వధ్యుండాయెను. ఆ ధీరస్వాంతుం డావంతయుం జలింపక, జనకునకు ధైర్యము కలిపి యసువులం బాసెను. పెద్దమ్యాకుకూడ నమేయ ధైర్యగాంభీర్యస్ఫూర్తి దీపింప భగవన్నామస్మరణ మొనరించి, మోంకరించి, భయంకర వైరికరవాలమునకు మెడ యొగ్గి ముహూర్తమాత్రమునం దనప్రియతమ సంతానముం జేరంబోయెను. ఆ ధైర్యశాలుర యుత్తమాంగములు గూడ నాక్రూర మహామ్మదీయ పాదుషా సముఖమునం బ్రదర్శింపం బడెను.

## ౧౫

### జనీజరీ విప్లవము

ఖలీలుని నాల్గవకథ కూడ దత్తబను పాషా మొదలగు వారి కమితానంద ప్రదముగనే యుండెను. కాని, తొంటియట్లు కథావిమర్శనాధీనమానసుండై కడు నుప్పొంగుటకు నా పాషా కవకాశము లేకపోయెను. ఖలీలుండు కథ ముగించిన ముహూర్తముననే, పరిచారిక యగు నమీనా మర్యాద నతిక్రమించి బిఱబిఱ లోని కరుదెంచుచు నున్మాదిని వలె "ప్రభూ! జనీజరీలు! జనీజరీలు!" అని యఱచెను.

ఆ దాసి యమిత భయాక్రాంతి యగుటం గాంచి, పాషా దిగ్గున లేచి, యిట్లు ప్రశ్నించెను—

"అమీనా! ఏమాయెను? ఆ భయంకర దళము తిరుగ బడిరా!"

"పాషా! వజీరు డొక దూతనంపెను. నీవు రాజధానికి సత్వరము రావలయునని తెలిపి, యితర ప్రముఖుల గాంచుటకై వాడు వెంటనే వెడలెను!"

పాషా యిట్లులనుకొనెను.—

"ఎంత ప్రమాదము! నాపై ప్రభుత్వమున కమిత విశ్వాసము. కాని, ఇపుడు నేనేమి చేయగలను! సైన్యాధిపతిగానే నా సహచరు డొక్కడైనను లేడుగదా!"

ఆ పలుకుల నెల్లరు నాలించిరి. తోడనే, ఖలీలు డిట్టు లనెను.—

"పాషా! నీకా వంత వలదు. నేను నీవెంట నరుదేరగలను. నా యస్త్రము నాకొసంగుము: తటియగు నపుడు మద్భుజబలము నీవ చూడగలవు!"

"పాషా! నేనును సంసిద్ధుడను. మదీయహృదయ రుధిరాస్వాదన మొనరించువఱకు నేఖడ్గమైనను నిన్ను దాకజాలదు!

"పాషా! నేనును సంసిద్ధుడను. సజీవుడనై యుండునంతకాలము నిన్ను వీడను!"

లూకాను జూలియను లాతెఱంగున బలికిరి. ఇదంతయు నొక్క త్రుటిలో జరిగెను. కాని కాంతాజనంబెటులుండెనో అరయవలయును. అతి భయంకరమగు జనీజరీవిప్లవమనినంతనే ప్రభుపత్నియగు నిస్త్రిల్లా భయవిహ్వలయై, వివర్ణవదనయై యల్లన దా గూర్చుండిన సోఫాపై వ్రాలెను. త్రైరజా గుల్నేరులు కూడ నమితభయాతురలై చంచలవీక్షణంబుల నొండొరుల దిలకింప దొడంగిరి. కన్నెమిన్న జులేఖా భీతహరిణేక్షణవలె, ఖలీలువదనము విలోకించెను. కాని ఖలీలాదుల ధైర్యగంభీరోదార ప్రవర్తనముంగాంచి, అయ్యబలామణులు భయముడిగి తమ కాంతులను లోలోన నుగ్గడించిరి.

ఇస్మిల్లానతి యట్టులే ఇంకను బడియుండెను. కారణమరయుటకై అమీనా వడివడిఁబోయెను. తన దొరసాని మేలిముసుఁగుఁదొలంగించి పరికించినంతనే, యాప్రభ్వి భయాతిరేకమున మూర్ఛిల్లెనని తెల్లమాయెను. తోడనే, పాషాపుత్రికలుగూడ సాహాయ్యమొనరింప నాపరిచారిక తన ప్రభురాణిని భద్రముగఁ దన మందిరమునకుఁ జేర్చెను.

దల్లబనుపాషా యొక్క ప్రసిద్ధవీరుఁడని చెప్పియే యుంటిమి. పాదుషాకును, మంత్రి వర్గమునకు, సైన్యమునకునుఁ గూడ నాతఁడు ప్రేమాస్పదుఁడై యుండెను. ఆ వీరుఁడు తన యెదుట ధైర్యములాను యువకులనుఁగాంచి, వారు మిథ్యాప్రగల్భులు కారని గ్రహించి యిట్టులనెను.—

"మిత్రులారా! మీ సాహాయ్యమెంతయు వాంఛనీయము. మనము సత్వరము కాన్స్టాంటునగరమునకుఁ బోవలయు. మీరు మీరాడిన చందమున మెలంగుదురేని, దల్లబనుపాషా కృతఘ్నుఁడు కాఁడని గ్రహింపఁగలరు."

జులేఖా యంతఁ దన మామను డాసి యిట్టులనెను.—

"మామా! నన్నును గొనిపొమ్ము. రక్షకభటాధికారియగు మత్ప్రియజనకునకేమి యపాయము వాటిల్లునో యని కడుభయమగుచున్నది. దురాగ్రహపరులగు జనిజరీ లాతనినే తొలుదొల్త బాధింపఁగలరు."

జులేఖా పలుకులు సమంజసముగ నుండుటచే, పాషా సమ్మతించెను. అంతలో, తైరజాగుల్శెరులు తమ తల్లిమందిరమునుండి యరుదెంచిరి. జులేఖా ప్రయాణమగు చుండెనని యెఱింగినంతనే, యట్టి క్లిష్టసమయమున విప్లవరంగమున కేగుట కడు నుపద్రవకరమని చెప్పి, పోవలదని వారు మిక్కిలి బ్రతిమాలిరి. కాని, జనకున కెట్టి యపా

యము పొడమునో యని బెగడొందు జులేఖా యట నిలుచుటకు సమ్మతింపదాయెను. లూకాసు గుల్నేరు చెంతకును, జూలియను తైరజా చెంతకునుబోయి, మధుర ప్రణయంపు పలుకులు రెండాడిరి ప్రభుపత్ని యాటంకములేని కారణమున, ఖలీలుండు నిర్భయముగాం దన మనోహారిణితో సంభాషించెను.

పాషా యంతం దనభటులం జేరి, ఆయుధజాల ఆయుధములం దెచ్చి వారికొసంగవలయునని ఆజ్ఞాపించి, ప్రయాణసన్నాహము లొనరించుటకై తన మందిరమునకుం బోయెను. ఆ విధముగ నన్యోన్యానురాగబద్ధులగు నా యువతీయువకులు మనసార ముచ్చటించి ఆశ్లేషసౌఖ్యము నొకసారి యనుభవించుట కవకాశమేర్పడెను. వియోగము దుస్సహమగుటచే తైరజాగుల్నేరు లవిరళాశ్రుజలార్ద్ర నయనలైరి. యుద్ధమగుట తథ్యము. ఆహవమున నెట్టి యపాయము వాటిల్లునో యెఱుంగరాదు. తమ ప్రియులు మగుడం దమకంటంబడుదురో, లేదో, యని వారమితముగ దుఃఖించిరి. భీతచేతస్కలగు తమప్రియ కాంతలను జేరందీసి, గ్రీకులు తమ భుజపంజరంబుల బంధించి, సముచితముగ భయముడిపిరి. అనంతరము వారవ్వలకేగి, పాషానుం గలసికొనిరి.

యువకులు మువ్వురు వెంటసరుదేఱ, జులేఖా సహితముగా దత్తజను పాషా యొక మేలురకంపు నౌక నారోహించి, వాయువేగమునం బ్రయాణమొనరింపం దొడంగెను. అపుడు గ్రీష్మకాలము, రాత్రి పదిగంటలు మాత్రమాయెను. ప్రకృతిసౌందర్యము దర్శనీయమై యుండెను. వినీలాభ్రతలంబున వజ్రపుందునుకలవలె విరాజిల్లు తారకలు విమలభాస్వర సుజలరాశియందు మనోహరతరంబుగ బ్రతిబింబించుచుండెను. దవ్వుననుండిన రాజధానియందలి సమున్నత సౌధములు, మసీదులు, గోపురములు, స్తంభములు మొదలగునవి శోభాయమాన

ముగ దృగ్గోచరమగుచుండెను.

జులేఖా మేలిముసుంగుం దాల్చియుండెను. ఖలీలుండామె ప్రక్కనే కూర్చుండి, సమయమగునప్పుడెల్ల నా కన్నియ కోమల కరాబ్జము నల్లనం బట్టి యేమియో గుసగుసలాడుచుండెను. నా కారోహణమొన రించినంతనే, లూకాసునకు గతవృత్తాంతమంతయు స్మృతిపథంబునం దోచెను. మిత్రసమేతుండై తానాప్రణయభవనముం జొచ్చుటయు, పాషా యొకస్త్రీకాగమనమునం దమరహస్యభంగమగుటయు, నిషిద్ధశుద్ధాంతప్రవేశమునకుం దానే బాధ్యుడనని పలుకుటయు, దాన బాషా క్రుద్ధుండై తన్నే దండింపంగోరుటయు, భయంకరకాలునివోలె మండిపడు పాషా తానును గుల్నేరునుం గలసి పడవెక్కి యానమొనరించుటయు మొదలగు విషయములు లూకాసు తలంపునకు వచ్చెను. అంతలో, పాషా వ్రేలున దీపించు తన యుంగరముంగాంచి, ఖలీలుండు చకితుండై ఒక్క నిమేషమాత్రమాలోచించి యల్లన యిట్టులనెను.—

“పాషా! ఆ యుంగరము నాకొసంగుటయే నీకును క్షేమకరమని భావింతును.

ఉంగరమనినంతనే పాషా మ్రాన్పడి, యనంతరము తురుష్క యువకునిపై వెఱంగుం జూడ్కులం బఱపి, ప్రథమ సందర్శనావసర జనితానుమానము మగుడ బాధింప, దుర్భరడోలాయమానమానసుండై, మందస్వరమున నిట్టులనెను.—

“ఆర్యా! ఇప్పుడైనం జెప్పరాదా? ఇట్టి ముద్రిక నీ కెట్లు లభించెను? నేనేమని గ్రహింప—”

“తొలి రేయియే చెప్పితిగదా, నా యుదంతము. అట్టులే గ్రహింపుము.”

“ఆర్యా! నీప్రవర్తనమతి విపరీతము!” అని పలుకుచు, నెద్దియో

అవిలంఘనీయ ప్రభావముగ్గుఁడైనటు లావృద్ధవీరుఁడు తనంగుళీయకము తీసి ఖలీలునకొసంగెను. యువకుఁడద్దానిని ధరింపక, తన జేబునందు భద్రపఱచెను. పాషా సంభ్రమచేతస్కుఁడై అనిమిషనయనుఁడై చూచుచుండెను.

నౌక రయమున రేవుచేరెను. పాషాగృహమునకును, జులేఖా జనకుని గృహమునకును జేరువుగనుండు స్థలంబున నానావ నిలిచెను. తోడనే వారందఱు దిగి, పట్టభంగముల నెక్కిరి. ఆప్రదేశమున విప్లవ చిహ్నము లెవ్వియుఁగానరాకుండెను. కాని, తన్నకటజనానీకము భయాతిరేకమునఁ గావలయు, తలుపులుబంధించి తమతమగృహము లందడఁగియుండిరి. అంగడులు గూడ మూయఁబడి, బాటలన్నియు జనశూన్యములై యుండెను. ఖలీలుఁడిట్లు లనెను —

"పాషా! నీవీగ్రీకువీరులతో నీగృహంబునకో, లేక, ప్రధానామాత్యుని మందిరమునకో వెడలుము. నేనీమానిని జులేఖానుఁ దన జనకుని సదనమునజేర్చి వచ్చెదను. అనంతరము మీ రాజ్ఞాపించు స్థలంబున కరుదెంతును."

"మిత్రమా! మేము ముందుగ మద్గృహంబునకేపోయి అశ్వముల నాయత్తము చేయవలయు. అనంతరము, వజీరుభవనమున కేగవలయు. నీవెచటనో సత్వరము మమ్ముఁగలియుము. ఆలసింపకుమా! ఈ రేయి ఏ క్షణమున నెట్టియాపద ఉప్పతిల్లునో యెఱుంగరాదు గదా."

ఖలీలుఁడు వల్లెయని పలికి, జులేఖాసమేతముగఁ గ్రమముగా నా కన్నియ గృహము డాసెను. తురుష్కుఁడా ద్వారము చెంతనిలిచి, నిజమనోహారిణి చెవినెద్దియోచెప్పి ఆపైఁదన ముద్రికందీసి, ఆయున్న మిన్న కోమల కరంబునకుఁదొడిగెను. ఆ చంద్రముఖి మేలిమునుఁగు ధరించి, ప్రకంపితస్వరంబునఁ దన కృతజ్ఞత వెలిబుచ్చెను. ఆయుదార

వీరుని ప్రవర్తనము, విపరీతసుహిమాన్విత ముద్రికాప్రధానమును ఆ లజ్జావతిని విపులానంద బాష్పబిందు సందోహమున ముంచివైచెను. ఖలీలుఁడా శుభాంగి కెంపెదవుల నొక్కసారిముద్దాడి, ధైర్యమూన వలయునని హెచ్చరించి, రయమున వెడలెను. తురుష్కుఁడు పాషా మందిరమునకుఁబోలేదు: వజీరు భవనమునకును బోలేదు. ఎటు పోయెనో తెలియదు.

మన మిఁక దల్తబను పాషా సమాచారమరయువలయును. నిర్మానుష్యవీధులంబడి సాగిసాగి, గ్రీకులతోఁబాటా ప్రభువు నిజగృహప్రవేశమొనరించెను. ఇలుసేరినంతనే, తనభటులంజీరి ఆయుధపాణులై గృహరక్షణమొనరింప సప్రమత్తులై యుండవలయునని ప్రభువాజ్ఞాపించెను. సేవకులు తత్పూర్వమే శస్త్రధరులై యుండిరి. అంతలో బరిచారకులు గుఱ్ఱములు సిద్ధముగ నున్నవని తెలుప, నావీరపుంగవుఁడు జూలియను లూకాసులతోఁబాటు తురంగారూఢుఁడై వజీరు మందిరాభిముఖుఁడాయెను.

జనీజరీ విప్లవమన నట్టిదో యిప్పట్టున నేలరయుదము. అజేయమగు జనీజరీసైన్యము లెక్కకు నలుబదివేలుండును. వారు అతిభీకరులై పాదుషాకు విజయసంపాదన మొనరించుటయేగాక, పాదుషాకే భయకారణములుగూడనై యుండిరి. ఎద్దియోనెపమున ప్రభుత్వమును దిక్కరించుట వారికి సాధారణకృత్యమాయెను. క్రొత్తసుల్తాను సింహాసనాసీనుఁడగు సమయమునఁవారికి ధనము విశేషముగఁ బంచిపెట్టుట సాంప్రదాయమాయెను. ఆ కారణమున, వారు సహజముగ నట్టి యవకాశముల కెదురుచూచుచుండిరి. ఎదురు చూచుచుండుటయెగాక, సుల్తాను రణమున నోటువడినను, ప్రభుత్వనిర్వాహణమునసందసమర్థుఁడైనను, వయోవృద్ధుడైనను గూడ వారు రయమునఁ దిరుగఁబడుచుండిరి. అట్టివాఁడు రాజ్యార్హుఁడు కాఁడను నెపమున వానిని

రాజ్యచ్యుతు నొనరించి, మఱియొకనిం బ్రతిష్ఠింపవలయునని మొఱకుఁదనము వహించుచుండిరి. తన్మూలమున ధనసంపాదనము సులువుగానే వడునుగదా. సుల్తాను పుత్రులు రాజమందిరమున బంధితులువోలెఁ బడియుండురని చెప్పియుంటిమి. ఐనను, జనీజరీలెట్టులో వారలతో దాత్యము నెఱపి, ఎవ్వఁడు తమపై సవిరళ సువర్ణవృష్టి కురిపింతునని సమయమొనరించునో, వాని నా సైనికులు రాజ్యాధిపతి నొనరించుచుండిరి. వారొకవ్వుడు వజీరుఁడు ప్రజాకంటకుఁడాయెనని తిరుగఁబడుచుండిరి. అటుగాక, దేశము కెదియేని మహోపద్రవము సంభవించునేని, ఆభారము సుల్తానుమీఁదనే వైచియుంగూడ విప్లవమొనరించుచుండిరి. జనీజరీసైనికులీ తెఱంగునధనాశాపరులై, స్వార్థపరులై దుష్టస్వభావులై, తమ ప్రభుత్వమునకే అత్యంత భయకారణులునైయుండిరి.

జనీజరీసైనికులు నివసించు శ్రేణులొక ప్రత్యేకవిశాలస్థలమున నమరియుండెను. సైనికజన విహారణస్థలములగు మైదానములు గూడ నచటనేయుండెను. ఆ చుట్టును నొక పెద్ద ప్రాకారమమరియుండెను. వారి తిరుగఁబాటు సూచించు సంజ్ఞ ఎద్దియన, తిండితిను సానికలను తెడ్డులను తమ కిటికీలనుండి ఆవలకు వారందఱుంగలసియొక్క-ముహూర్తముననే పాఱవేతురు. అట్టి ప్రదర్శనము గోచరించునంతనే, నగరజనులందఱు తద్భయంకరభావము గ్రహించి, భయవిహ్వలు లాయెదరు. సాధారణముగా వారి యధికారులు సహితము వారికెదురాడ నేరక, విప్లవమునఁ బాల్గొందురు. ప్రభుత్వముతో బొందుపొసగునపుడు తమ నాయకుల కేయపాయము రారాదని వారు విధింతురు: కావున, తదుద్యోగులు నిశ్చయముగా విప్లవమునకుఁ దోడగుదురు. జనీజరీమహాసైన్యమునకుఁ బ్రధానసేనానియగు 'ఆగా' సహితము సర్వసాధారణముగా వారి యుద్యమమామోదించును.

జనీజరీలు సాధారణముగ సాయంకాలమగునంతనే తమ తమ దారుసానికులఁ బాఱవైతురు. అంతమాత్రముననఁ దోడనే అత్యాచారములొనరింపరు. రేయి మెల్ల మధుపానాద్యనేక వ్యసనములందు నిమగ్నులై, ప్రభుత్వాధికారులు లోఁబడి తమ యభిప్రాయముల నామోదింతురేమోయని సూర్యోదయమగువఱకు వేచియుందురు. అటుగాక రాజ్యాధికారులు ధైర్యమువహించి నిరాకరింతురేని, ఆ సైనికులు తమ యావరణము నుండి వెలువడి, ప్రభుత్వపక్షపాతులగు పాషాలయు, తదితర ప్రజాకంటకులయొక్కయు మందిరములపై దాడి వెడలుదురు. వారి మనోరథ సంప్రాప్తమాలస్యమగు కొలంది, వారి దురాచారములుగూడ నధికతరమగును. ఒక్కొకప్పుడు సుల్తానుయొక్క పటాలములు వారిని శిక్షించుటకు మాఱుగ నుపేక్షించును. దాన జనీజరీలు మఱియుఁ జెలరేగుదురు. అటుగాక, సుల్తాను సైనికులు స్వామిభక్తిపరాయణులై విద్రోహుల నెదిరింపఁ బూనుదురేని, రాజ నగరమంతయు నొక భయానకరణరంగముగఁ బరిణమించును.

కావున, నీ సమయమున జనీజరీలు విప్లవధ్వజమెత్తినంతనే, ఎట్టి దారుణములాచరింతురో యను దుర్భరభయాతిరేకమున బురజనులు తమతమ కులాయముల డాగిరి. సంపన్నగృహస్థులు తమ ధనకనకాభరణాదులను దిట్టమగు నేలమాన్యములందు భద్రపఱచిరి. తమ గృహములందు ముఱికులు చొరకుండ, దమ ద్వారములను ఘనమగు నయోదండములచేఁ బరిరక్షించుకొనఁ దొడంగిరి. గృహములందుండు ఖడ్గాది సమరసాధనముల నవసరార్థ ముపయోగించుటకై పదునుచేయ నారభించిరి. ఉన్నవారు తమ తుపాకులను గూడ నాయత్తపఱచికొనియుండిరి.

ఖలీలుఁడింకను రాకుండుటకుఁ గతంబెద్దియని విచారించుచు, గ్రీకుయువజనమధ్యస్థుఁడై నిశ్శబ్దనిర్జన వీధులంబడి, దత్తబనుపాషా

క్రమముగా వజీరుభవనము సమీపించెను. ద్వారము మూయఁబడి యున్నను, పాషా నామధేయమాలించినంతనే, ద్వారపాలకుఁడు రయమున దలుపు తెఱచి, యాతనినే గాక, లూకాసు జూలియనులను గూడ లోనికిఁబోనిచ్చెను.

గ్రీకు యువకులు మొదటిమందిరముననే నిలువవలసినవారైరి. అట్టివారలనేకు లందుండిరి. దల్లబను సూటిగా నాలోచనాగారములోనికిఁ బోయెను. రాజ్యభారధురంధరులగు నధికారులు సుమారేఁబదిమంది యందుండిరి. వజీరుఁ డుందగ్రాసనము నలంకరించియుండెను. దల్లబను పాషా యరుదెంచినంతనే యందొకఁడు పరిస్థితులను సంగ్రహముగ విశదపఱచెను. తాము కోరు షరతులను జనీజరీలు లిఖించి తమద్వారముచెంత ప్రదర్శించి యుంచిరి. అవి యేమన, సలీముసుల్తాను నిజసింహాసన పరిత్యాగ మొనరింపవలయును; జ్యేష్ఠ కుమారుఁడగు 'ముస్తఫా' రాజ్యాధిపతి కావలయును, వజీరును ఉద్యోగమునుండితొలగింపవలయును; ప్రధానన్యాయాధిపతియగు కదీస్కారుని—జులేఖా జనకుని—బహిరంగముగా వధింపవలయును.

క్రూరస్వభావులగు జనీజరీలొక విచిత్ర మొనరించిరి. మహానగరమునుఁ గలవరపఱచుచుండిన దారుణదుర్మరణముల నెపంబున వారు విప్లవ మొనరించిరి. దానఁ బురజనులు తమ యుద్యమము నామోదించుటయే గాక, సుల్తాను సైనికు లెదురు తిరుగరనియు వారాసించిరి. కావున వారి ప్రవర్తనము తదనుగుణముగ నుండుటకై, నగరరక్షణ భారమువహించి, దారుణహత్యాపరంపర లాచరించుఘాతకులఁ బట్టఁజాలని కదీస్కారుని వధింపవలయునని పట్టుపట్టిరి.

దల్లబనుపాషా ఆయానసమాచారముల నాలించిన యనంతర మొక వృద్ధ రాజనీతిజ్ఞుఁడు లేచి యిట్టులనెను.—

"అయ్యా! నగరరక్షణభారధురంధరుండగు కదీస్కారుడు—

హసేను—భయంకర హత్యారహస్య మీవలకునగయుండాయెను. నగర ముడిగిపోవుచున్నది. కదీస్కారుండు సదుద్యోగభారము వహించి మనందగదు. ఈతండు మరణింపవలయునని గదా, జనీజరీలు విప్లవ మొనరించిరి. మన మియ్యెడందు మేమి, మన సైనికులు మనకు లోంబడియుందురు. అనంతరము మనము వారి నుచితవిధమున శిక్షింపవచ్చును. కావున, కదీస్కారుండగు హసేను జనీజరీల హస్తగత మొనరించుట సమంజసమని భావింతును."

అంత దల్తబనుపాషా రోషకషాయితాత్ముండై తన బావయగు హసేను మరణింపరాదని ధైర్యముగం బలుక, తొంటి వృద్ధమంత్రి యిట్టులనెను.—

"మిత్రమా! ఈసమయమున రోసమసమంజసము. ఇట్టి సమయమున నాసోదరుండు వధ్యుండు కాకున్నను, వెనుకీయను."

పాషా యంత శ్రద్ధానాత్మ్యానుద్దేశించి యిట్టులనెను.—

"మంత్రిపుంగవా! హసేను కదీస్కారునకు సుల్తాను ఎనిమిదిదినములు మాత్రము గడువొసంగెను. నేటికి నాలుగుదినములు మాత్రమాయెను. కావున, నాండవధ్యుండని మనవిచేయువాండను. మఱియొకటి ఈనగరమునందును, పరిసరములందును, సుల్తానుసైన్యములు సుమారేబది వేలుండును. ఈ సైన్యములు మదధీనములై పెక్కువిజయములంగాంచెను: కాన, నేను సైన్యాధిపత్యము వహించి—"

వజీరుండాతని వారించి యిట్టులనెను.—

"ధీరోత్తమా! నీ పరాక్రమ మువక్రము. నీకార్యోత్సాహము నిరుపమానము. నీదుస్వామిభక్తి సిక్కముగ నాదభిప్రాయము: నీకు వర్తమానమంపిన యనంతరము పరిస్థితులు మాఱెను. వివిధసైన్యాధిపతులు తమతమ సైనికులు జనీజరీలపై నభిమాన మూనినవారలని తెలియంబఱచిరి. మిత్రమా! నగరమంతయు నేకకంఠమున కదీ

స్కారుని మరణమాకాంక్షించుచున్నారు. కాన, నాతని మరణము ధ్రువము."

అంత మఱియొక రాజనీతివిశారదుండు లేచి యిట్లనెను.—

"మంత్రివరా! లెస్సగా సెలవిచ్చితివి. ఈ కదీస్కారుఁడు తప్పక వధ్యుఁడు అనంతర మీమహనీయుఁడు దల్బనుపాషా సుల్తానుసైన్యములకు నాయకత్వము వహించి విప్లవకారుల హతమార్చుఁగాక. కాని ఒక్క విషయము గమనింపవలయును. హసేనును జనీజరీల కొసంగ రాదు. ఒసంగుదుమేని, మనము భీరులమని యెంచి ఆ చెనటలు మఱియు జెలరేగుదురు. కావున సుల్తానువారి తలారియే కదీస్కారుని బహిరంగముగా వధింపవలయు: దాన, ప్రజాగ్రహముపశమించును: జనీజరీల బలము నీరసించును. ఇట్టి మహాసంకటసమయమున దల్బను పాషా యుదారమనస్కుఁడై, స్వామిభక్తిపరాయణుఁడై, దేశహిత కార్యపరతంత్రుఁడై బంధుత్వమును కెడమీక, సమ్మతింపవలయునని మనవి చేయువాఁడను."

ఆ నుడులు కడుసమంజసముగ నుండుటచే, దల్బనుపాషా బాంధవ్యమును బోద్రోచి, తన భావుకుని మరణము నామోదించెను. సభ యంతటితో ముగిసెను.

ఉన్నతప్రభుత్వోద్యోగులు మొదలగు ప్రముఖులను వధించుటకొక ప్రత్యేకాధికారి యుండెను. వానిని సాధారణముగా 'బాశ్చి' యని పిలుతురు. తదధికారిని జేరి, హసేనుకదీస్కారుని గృహంబునకు రయంబునఁ బోయి ఆతని, తత్క్షణము వధించిరావలయునని వజీరుఁ డాజ్ఞాపించెను. తోడనే, ఆప్రభుమారకుఁ డిరువురు సహకారులఁ దోడుకొని, యమునివలె నగరరక్షకుని గృహమునకతిరయమునఁ బోయెను.

దురదృష్టవంతుఁడగు హసేనుకదీస్కారుఁడు, ప్రాణాపహరణక్రియాదక్షచాపధరుండై యభినవ దండధరునివలె 'బాశ్చి' గోచరించినం

తనే సముద్యోగ్రథహార్యక్షు దర్శనహారిణమువలె భయవిహ్వలుఁడాయెను. బాష్ఛ యిట్టులనెను.—

"అయ్యా! న్యాయకార్యభారధురంధరుఁడనై నేనే తేరవలసినవాఁడనైతినని మిక్కిలి వగఁచువాఁడను: నేను కేవలము రాజసేవకుఁడగదా."

"అయ్యా! విధి నిర్ణయము! ఎవ్వఁడెదురాడఁగలఁడు? నీపైఁగినియను. కాని, లోనికేగి మత్ప్రియభార్యాపుత్రికలను గడసారికాంచి, యూఱడించి, యరుదెంతును."

"అయ్యా! క్షమింపుము. నిన్నొక్కక్షణమైన వీడరాదని యాజ్ఞ కావున, నీ బంధుగులఁజూడ గోరెదేని, వారి నిచటకు రప్పింపుము."

"దైవమా! నా పుత్రిక నాల్గుదినములు దూరమునసుండి, ఇప్పుడే యరుదెంచెనని వింటి. వివిధకార్యములలో రేయింబవళ్లు నిమగ్నుఁడనై యింతవఱకుఁ గాంచుట కవకాశములేక పోయెనే. హా! పుత్రీ! పత్నీ! ఈ దుర్వార్త ఏమని వినిపింతును? ఎట్లు భరింపఁగలరు?"

హాసేనుఁ డట్లు విలపించి, యనంతర మొక సేవకునిఁజీరి, వానిచేఁ దన భార్యాపుత్రికలను రావించెను. ఏమియు నెఱుంగని జులేఖా రయమున బాఱి పరమానందభరితస్వాంతయై నిరవధికప్రేమావేశమునఁ దన జనకుని గాఢాలింగన మొనరించెను. కదీస్కారునిపత్ని మాత్రము మూర్తీభవించిన మరణ మనఁదగు బాశ్చాను గాంచినంతనే, అమితభయాతిరేకమున కెవ్వున నఱచెను. అంత జులేఖా చటుక్కున వెనుదిరిగి చూచి భయవిస్మయపారవశ్యమునఁ బట్టుతొట్రుపడి, అంగి, యట్టె నిలచిపోయెను.

"వలదు! వలదు! అయ్యా! నా మగని చెంతకు రావలదు! ఒక్క దినము గడు వేసంగుము—ఒకగంటయైనఁ జాలును! పాదుషా వారి పవిత్రపాదములపైఁబడి—"

అట్లు గోలుగోలున నేడ్చు తన ప్రియాంగనను వారించి కదీ స్కారుఁ డిట్టు లనెను—

"ప్రేయసీ! ఏల ఈ వ్యర్థవిలాపము? రాజశాసన మమోఘము. విధివిధాన మనుల్లంఘనీయము. కాంతా! నేను మరణింపక తప్పదు."

ములుకులబోలు తుదిపలుకులు వీనులఁ బడినంతనే గర్జిల్లి, క్రోధవిస్ఫారితనయనయై చుఱచుఱ చూచి, ప్రచలితతీవ్రస్వరమున జులేఖా యిట్టులనెను—

"మరణమా! తండ్రీ! ఏమంటివి! ఓయీ, బాశ్చీ! నీకీ యధికార మెవ రొసంగిరి!"

"సర్వాధికారము వహించియున్న మహనీయుఁడు వజీరు నన్నీ కార్యమునకు నియోగించెను."

"కుమారీ? ఎందులకీ వృధాభాషణము? నా కాల మాసన్న మాయెను. అనవసర కాలయాపనము కేవలము బాధాకరము, వేఱు ప్రయోజనములేదు. ఆస వీడుము, ధైర్య మూనుము, నేఁ బోయెద, నీ జనయిత్రి నూఱడింపుము."

అట్లు మరణోన్ముఖుఁడై, తదవసరోద్భూతనిరాశావేశ సంకలిత నిశ్చలచిత్తుఁడై పలుకు హసేను నభినందించుచు బాశ్చీ యిట్లు పలికెను—

"ఆర్యా! నీధైర్య మెంతయుఁ బ్రశంసనీయము. నీవిఁక మరణింప సంసిద్ధుఁడవుగమ్ము."

అట్లు పలికి, అనేక కంఠవిలుంఠనాసమర్థమగు ఘోరతరచాపమును బాశ్చీ సారించెను.

"హా! ప్రేయసీ! మత్ప్రియపుత్రీ! నన్నుఁ గడసారి యాలింగన మొనరింపుఁడు. ఇదె పోయెద, సెలవిండు; దయామయుఁడగు పరమాత్ముఁడు మీకు హితమాచరించుఁగాత!"

కదీస్కారుఁ డట్లు పలికినంతనే, ప్రకంపితశరీరయయ్యు జులేఖా ధైర్యధుర్యయై, తదవసరోద్రేకపూరితచిత్తయై విస్ఫారితారుణనేత్రయై దీపించి, ధైర్యాతురసంభరితస్వరంబున నిట్టులనెను.—

"జనకా! ఒక్క క్షణ మాగుము. ఓయీ! కార్యశూరుఁడా! చూడు మీ యంగుళీయము! ఈ యపూర్వలాంఛన మపూర్వ మహిమోపేత మగునేని, తక్షణ మావలకుఁ బొమ్ము!"

ఆ కాంత ఖలీలుఁ డొసంగిన యుంగరము ప్రదర్శించెను. రాజభటుఁ డద్దానిం గాంచి, దగ్గఱకుం బోయి పరిశీలించి, యందలి గోళమును తదితరాపూర్వసంజ్ఞలను గాంచి భయసంభ్రమాకులుండై, జులేఖాను వెఱఁగుఁదనంబునం దిలకించుచు నట్టె నిలిచిపోయెను. అంత నా కన్నియ ఇట్టులనెను—

"వెడలుము! నీ వికఁ దడయనవసరము లేదని గ్రహింతువు గదా."

ఆ భయంకర ప్రభుత్వాధికారి తోడనే సవినయముగ సలాములాచరించి, యనుచర సమేతుఁడై నిష్క్రమించెను. జులేఖా యమందానందకందళితగాత్రయై రయంబున విస్మయానందపరవశులగు నిజజననీజనకులను గాఢాలింగన మొనరించెను!

# ౧౬

## మూడు చువ్వలు

కదీస్కారుని గృహమునకు శాస్త్రీపోయిన సమయముననే, ఖలీలుఁడు జనీజరీల తావునకుఁబోయి, అచటి ప్రధానద్వారము తట్టెను. ఆద్వారముచెంతనే, ఆసైనికులు కోరు షరతులు ప్రదర్శింపఁబడియుండెను. అద్దానిం గాంచినంతనే, తురుష్కయువకుఁడు క్రోధవివశుఁడై, శతధాభిన్న మొనరింపఁబోయెను. కాని, అట్టి ప్రవర్తనము అనుచితమని యెంచి చూచుచుండగనే, సింహద్వారముననుండు చిన్న తలుపు తెఱచి, తద్ద్వారపాలకుఁడు ఖలీలునిఁ గాంచి, "నీవెవ్వఁడవు? ఎందుల కరుదెంచితివి?" అని ప్రశ్నించెను. ఖలీలు డిట్టులనెను.—

"మీ సర్వసైన్యాధిపతియగు ఆగాతో మాటాడవలయు. నన్ను సత్వరము కొని పొమ్ము."

"ఇం దెవ్వరు ప్రవేశింపరాదు. జనీజరీలు తమ సానికలను విసరివైచిరని యెఱుంగవా?"

"నగరమంతయు నెఱుంగును. కాలయాపన మొనరింపక, నాకు దారి యొసంగుము: లేదేని, నిన్నుఁ బరిమార్చియే పోయెదను."

అట్లు పలుకుచు ఖలీలుఁడు వండువెన్నెలయందుఁ దళతళ మెఱయు కరవాలము రయమున నూడదీసెను. ద్వారపాలకుఁడు సహజముగ ధైర్యవంతుఁడు, అమితబలశాలి: దీర్ఘకరవాలమునేగాక, భయంకరమగు తుపాకిం గూడ ధరించియుండెను. కావున, ఒక్కయువకుని బెదరింపులకు వాఁడు చలింప నవసరములేదు. ఐనను ఖలీలుని అపూర్వగాంభీర్యము భటుని వినమ్రు నొనరించెను. వాఁ

డంతట చకితుఁడై, ముగ్ధుఁడై, వినయవిధేయుఁడై, సగౌరవముగా నిట్టులనెను.—

"ఆర్యా! అల్లదే దీపరాజము దేదీప్యమానముగ వెలుఁగు చున్నది. అయ్యదె ఆగారము. ఇటు పొమ్ము."

ఖలీలుఁడంత మందహాస మొనరించి, బరువైన బంగారు సంచి వానికి బహుమాన మొసంగి, లోనికిఁ బ్రవేశించి, వాఁడు చూపిన మార్గము ననుసరించెను. ఆగారమందిరము చెంత నొక భటుఁడు వివిధాయుధధారియై కావలియుండెను. కాని, ఎద్దియేని అత్యవసర కార్యము లేక ఆతఁడు ప్రథమద్వారము నతిక్రమించి రాఁజాలఁడని యెంచి, వాఁడు వారింప కూరకుండెను. ఆ కారణమున ఖలీలుఁడు సులువుగాఁ దన్మందిరాంతర్గతుఁడాయెను. అనంతర మాతఁడు విశాల సోపాన పరంపరనారోహించి, మేడమీఁదకుఁ బోయెను. అచట మఱి యిరువురు దౌవారికు లాతనిఁ గాంచియు, సురాపానము తల కెక్కుటచే, మూఁగవాండ్రవలె మిన్నకుండిరి. ఖలీలుఁడే వారినిఁ బ్రశ్నింప, ఆగారముండిన మందిరము వారు చూపించిరి.

ఖలీలుఁ డొక విశాలమందిరము ప్రవేశించెను. ఆసభాభవన మునం దున్నతాసనమున సర్వజన భయంకరుండగు జనీజరీ సర్వ సైన్యాధీశుఁడు దర్పమొప్ప నాసీనుఁడై యుండెను ఆతఁడు వీరజనో చిత వస్త్రధారణ మొనరించి, శిరమున నొక టోపీ మాత్రము తాల్చియుండెను. ఆయుష్షీషము మనోహర లాంగూల విరాజితంబై, సువర్ణ బాలచంద్ర లాంఛన దీపితంబై యుండెను. తల్లాంఛనంబున నొక మనోహర సువర్ణ దర్వి వెలుఁగుచుండెను. ఆగా ఏఁబదియేండ్ల ప్రాయము వాఁడు; సమున్నతాకారుఁడు, దృఢగాత్రుఁడు, గంభీర వదనుఁడు కూడనై యుండెను. జనీజరీ సైన్యము నందలి వివిధసైని కోద్యోగు లిరువదిమంది చుట్టును సోఫాలపైఁ గూర్చుండిరి. వా

రందఱి చేతులందును ధూమనాళము లిమిడియుండెను. అందఱి మొదుటను మేజాలపై కాఫీ మధ్యతు మొదలగు మనోహర పానీయములు గూడ నమరి యుండెను.

అపరిచితుఁ డగు ఖలీలునిఁ గాంచినంతనే, తత్సభాసను లందఱు విస్మయపరులైరి. ఐనను, ఆయువకునియనూన గాంభీర్యౌదార్యగర్భిత సమున్నత మనోహరాకారముఁ గాంచి చకితులై, కుపిత స్వాంతులు గాక, వారట్లె వీక్షించుచుండ, ఖలీలుఁడు తానరుదెంచిన తలుపు మగుడవైచి, వారి మధ్య కేగుచు, నావిప్లవ కారుల ధైర్యమెంతటిదో, వారి హృదయమెట్టిదో యరయుట కోయన, నా యా నాయకుల నొక్కసారి కలయంజూచెను. ఆ దళ వాయులట్టులే విభ్రమ విస్ఫారితనయనులై పరికించుచుండ, ఖలీలుఁడు ఆగాను సమీపించి, నిశ్చలగంభీరస్వరమున నిట్లు ప్రశ్నించెను.

"జనీజరీ విప్లవమునకు నీవు నాయకత్వము వహించితివట నిక్కమా!"

"ఇట్లు ప్రశ్నించుటకు నీవెవ్వడవో, నీకుఁ గల యధికార మెద్దియో ఎఱింగింతువేని, సమాధాన మొసంగఁబడును."

ఖలీలుఁ డంత గర్వగాంభీర్య విస్ఫురిత వీక్షణంబు ఱఅపి "నీప్రశ్నల కుత్తర మొసంగ "నని విస్పష్టముగఁ దెలిపెను.

"కాని, నీవెవ్వఁడవో, నీ కాకేఁ గత మెద్దియో యరయకుండ నిన్ను మారహస్య సమావేశమున కెట్లు రానిత్తుము!"

"మీప్రశ్నలను సరకు చేయను. నాయాశయ మెట్టిదైనను, తప్పక కొనసాగును. మీ హృదయములు నాకుఁ గరతలామలకములని యెఱుంగుఁడు. ఈ విప్లవమునకు మీరు కారకులు కారు. ఇతరులు రగుల జేసిన ఈదుష్టవిప్లవమునకు మీరు బలవంతముచే నాయకత్వము వహించితిరి. ఇంతకంటె యవివేకముండునా! బలవంతులు

ధైర్యవంతులు, ప్రభుభక్తి పరాయణులును అగు మీవంటి ప్రముఖులు యుక్తాయుక్తముల నరయక, తీవ్రపాటున నమిత ప్రజా నష్టకరం బగు నిట్టి నికృష్టకార్య మొనరింపఁ గడంగుట కంటె, హీనత్వ మిం కొకటి యుండునా?"

జనీజరీ నాయకుల హృదయ మర్మమరసి ఖలీలుఁడు సముచిత తీవ్రోపన్యాస మొనరించుటచే, వా రెల్లరు నిస్తేజులై, నిర్వీకారులై, ఆలోచనాపరులై ఖలీలుఁ డెవ్వఁడో, వాఁడేల రావలయునో యను విషయములు పూర్తిగ మఱచిపోయిరి. తన వచన ప్రభావము గుర్తించి, యాతఁడు మగుడ నిట్టులనెను.—

"సర్వసైన్యాధిపా! నీవొక మేటి మగండవని పేరుగాంచితివి. నిన్నెల్లి మార్గమధ్యమునఁ గాంచు నపుడు, "అతి భయంకరులగు నలుబదివేల మంది జనీజరీలకీ మహానీయుఁ డరిగాపు, కాని, నాయకుఁడు కాఁడు," అని పల్కుదునేని, నీ వాక్షణము నన్ను వధింతువు. కాని, యదార్థ మట్టులే యున్నది! మృగప్రాయులగు సైనికాధములు తలంచునపుడెల్ల నాసికలఁ బాఱవైచి విప్లవ మొనరింపఁ గోరుదురేని, నీవు నాయకత్వము వహించుట పాడియగునా? ఇయ్యది ధీరజన లక్షణమా? మహానాయకు డొనరింపవలసిన కార్యమా? మూర్ఖులగు దుష్టభటానీకములకు దాసానుదాసుఁడవై, అంధుని చందమున బాదుషాపై విప్లవధ్వజమెత్తుట ప్రశంసనీయమా? ఆగా! నీ వుదారహృదయుఁడవని యెఱుంగుదు. దుర్వారధీరోదాత్తుండవని యెఱుంగుదు: నిరుపమానతురుష్కసామ్రాజ్యమున కాధారభూతుండవనియు నెఱుంగుదు. అట్టివాఁడవు ఒక్కనిమేషమాత్ర మేకాకివై విచారింతు వేని, ఈ కార్యము నిక్కముగ నసంబద్ధమనియు వర్జనీయమనియు నీవే గుర్తింపఁగలవు. ఈనా పలుకులన్నియు నినుఁబోలు నీవీర వర్యులకుఁగూడ సమన్వయించునని వేఱుగఁ జెప్పుట అనవసరము."

జనీజరీనాయకు లందఱు స్తంభీభూతులై పోయిరి. ఖలీలుని గాంభీర్యము నిరుపమానముగ నుండెను. కనుధారాళముగఁ దోఁచిన యాతని పలుకులు వారి హృదయమున నాటికొనెను. తనవంటి యుదారమానసులతోడనే మాటాడినటు లా వీరుఁడు నటించెను. ఖలీలుని వీక్షణము లొకింత నిరసనముతోఁ గూడ మెళగించి వారి వదనములపైఁ బడుచుండుటచే, సేనానులమానన మొకింత చుఱుక్కు మన, మఱుగుపడిన పౌరుషము రేకెత్తెను. తాము నిక్కముగఁ దమ స్వాతంత్ర్యముం గోల్పోయి, సైన్యమునకు నాయకులై యుంట మాని, దాసులమైతిమని గ్రహించిరి. ఆగా యింకను మౌనముద్ర దాల్చియుండ, తత్సమాన సైన్యాధిపతి యొకఁడు వివేకవంతునివలె నిట్టులనెను.—

"ఈ యువకుని పలుకులు నిక్కముగఁ దోఁచుచున్నవి!"

"ఈ వీరుని పలుకు లసమంజసములు కావు!"

"నిరుపమాన వివేకనిధియగు మన ప్రవర్తగుణ మొకింత ఈ యపరచితున కలవడినటు లున్నది."

మఱి యిరువురు సేనాను లట్లు వలుక, ఆగా ఇట్టు లనెను—

"ఈ యువకుని వాక్కులు సత్యసమన్వితములై యున్నను, కొంత వెగటుగఁ బలికెను. ఐనను, ఈ పురుషుని గౌరవోదార గంభీరప్రవర్తనముం దలంచి, ఉపేక్షింతము. కాని ఈ మహానగరమును దారుణముగ సంక్షోభింపఁజేయు భయంకరహత్యాపరంపరగుఱించి ఈతఁ డేమనును?"

ఖలీలుఁ డిట్టులనెను—

"అయ్యవి తప్పక గర్హితములే. కాని, నలుబది వేల మహాసైన్యమును శాసించు మహావీరుఁడవు, నీ వేమి చేయఁజాలితి వని, నేను ప్రశ్నింపవలయును."

"హంతకుల నరయుట మాపనికాదు."

"సుల్తాను వారి పనియును గాదు: ఐనను, మీ రా మహాపురుషుని పదభ్రష్టు నొనరించెదరే!"

"రాజు సర్వాధికారి; కావున, బాధ్యుఁడు."

"ఇది నీసిద్ధాంతమగునేని, వ్యక్తిగత ప్రభుత్వము సున్నయగును: లేదేని, పరమాత్మునివలెనే, సుల్తానుకూడ సుస్థిరసర్వశక్తి సమన్వితుఁడు గావలయు!"

ఖలీలుని యుక్తియుక్తవచన ప్రాగల్భ్యమును గాంచి, సభాసదు లెల్లరు ససంభ్రములై, యాతనిఁ గొనియాడిరి. ఆ వింతయువకుఁడు మగుడ నిట్టులనెను——

"ఆగా! నీవనుభవజ్ఞుఁడవు, వివేకవంతుఁడవు, ధర్మపదైక వర్తనుఁడవు. నిన్నను నీ జనీజరీసైనికులను హత్యలకై దూరుట ఎంత సమంజసముగ నుండునో, సుల్తాను వారిని దూషించుటయు నంత సమంజసముగనే యుండునని వ్యక్తమగును. నీ వొనరింపవలసిన కార్యములు కొన్నికలవు; అట్టులే పాదుషావారు చేయఁగల కార్యములును గొన్ని కలవు. కావున, ఇట్టి విపరీతఘోరకృత్యములు జరుగునేని, తచ్ఛాఖాధికారులే బాధ్యులగుదురు."

"అయ్యా! పాదుషావారు బాధ్యులుకారని తప్పక అంగీకరింతును. నా యభిప్రాయము నట్టులే యున్నది."

"ఆ కారణముచేతనే వజీరుఁడుకూడ బాధ్యుఁడు గాఁడని చెప్పవలయు. ఆతనిఁ దొలగించుట యసంగతము."

"ఔను! కాని, కదీస్కారునిగుఱి యేమందువు!"

"ఆతఁడును బాధ్యుఁడు కాఁడనియే చెప్పఁగలను. తద్రహస్యవిచ్ఛేదనాకార్యపరతంత్రు లందఱు చేయఁజాలని కార్య మాతఁడు మాత్రము చేయఁగలఁడా? ఐనను, రక్షకభటాధీశుఁ డగుటచే,

నాతఁడే బాధ్యుఁడని యనుకొందము. కాని, మన మొక్క విషయము మఱువరాదు. సుల్తాను వా రాతని కెనిమిది దినములు గడు వొసంగెగదా. ఇయ్యది నాల్గవదినము. ఇంకను నాలుగు దినములున్నవి. కదీస్ఖానుఁడు మిగుల పరిశ్రమ యొనరించెను: తప్పక కృతకృత్యుఁడగుననియే విశ్వసింతును. అంతేగాక, మీరు తీవ్రపడి ఆ సమర్థకర్మకరుని ఖండింతురేని, వాని ప్రయత్న మంతయు నిరర్థక మగును. దాన, మన నగరమున కెంతయేని చేటుమూడును. కావున, నేఁ గోరున దేమన, మన కదీస్ఖానుఁడు పూనిన కార్యము పూర్తి యగువఱకు మననిండు. మీ మీ సైనికులు యథాప్రకారము తమ తమ కార్యము లొనరింపవలయునని మీరు శాసింపుఁడు. మీ కట్టి సమర్థత కలదు: ధైర్యవంతులరై యాచరింపుఁడు. నాలుగు దినములు కడచి ఐదవ దివస ముదయించుసరికే దారుణరహస్య కథాకలాపము బట్టబయ లగునని విశ్వసింపుఁడు.”

సరససంభాషణాపారీణుఁడగు ఖలీలుఁ డట్లు విస్పష్టగంభీరస్వరంబునఁ బలికినంతనే, సభాసదు లెల్లరుఁ దమ ప్రవర్తన మసంబద్ధముగ నుండెనని గ్రహించి, ఉపన్యాసకు నగ్గడించి, ఆగా సహితము విప్లవము నంతరింపఁజేయవలయుననియే వాంఛించెను. కాని, సైనికులు తిరుగఁబడుటకుఁ గారణము ధనతృష్ణతప్ప మఱియొకటి కాదు. వారు నిరూపించు కారణములు కేవలము నెపములు. కావున, నాయకు లెంత యోచించినను, ధన మలవడినఁగాని, సైనికులు లోఁబడరు. వా రా కారణమున దురంతచింతాక్రాంతచిత్తులై డిల్లపడియుండ, ఖలీలుఁడు త దభిప్రాయము గుర్తించి, శతాధిక గర్వసంభరితగాంభీర్యము వహించి, త దుచితస్వరంబున నిట్లనెను—

“ఆర్యులారా! మీరును మీ సైనికులును గూడ హితవచనముల నిరసించి మెలంగుదురేని, త ద్భయంకరఫల మెఱింగించెద

గమనింపుఁడు. అప్పుఁడైన మీ మూర్ఖ్యము తప్పక పటాపంచలగును. సలీముసుల్తాను మిక్కిలి యుదారవంతుఁడు; ఐనను, తనకట్టి యుపాయము వారయకుండ, సముచితసన్నాహము లాచరింపఁజాలని యసమర్థుఁడని భ్రమింపకుఁడు. ప్రసిద్ధయశోభాసురుండగు రెండవ మహమ్మదు సుల్తాను తొల్లి ఈ నగరముపై దండెత్తినపుడు నాఁటి పురజనులగు పాశ్చాత్యులు తమ తమ ధనకనకాదులను భద్రపఱచికొనుటకై సొరంగములఁ ద్రవ్వుకొనిరని వినియుంటిరిగదా. నాఁడు రాజభవనమునుండి భూగర్భమున నొక యపూర్వదీర్ఘరహస్యమార్గము కలదనియు, అయ్యది 'బ్లచరినీసు' ద్వారమునకుఁ జేర్చుననియుఁ బ్రతీతికలదుగదా. అయ్యలారా? ఏల కంపించెదరు! ఆ ద్వార మెద్దియో యెఱుంగుదురా? సర్వజనవంద్యుఁడగు సుల్తానుపై ధ్వజ మెత్తసాహసించిన మీరును మీ సైనికులును అభూతగర్వాతిరేకమున విడిసియున్న ఈ స్థలంబంతయు నా సొరంగముమీఁదనే యమరియున్నదని ఇప్పుఁడైన నెఱుంగుఁడు! ఆ రహస్య భూరంధ్రమంతయు భయంకరమగు ఫిరంగిమందుతో నిండియున్నది. పాదుషావారు దయామయులు: వివేకవంతులు: సహనశీలురు: కావున నిందనుక సహించియున్నవారు. అనలప్రభావ మెఱుంగక అందుఱుకఁ జూచు శలభగణంబువలె, మీరింకను జలము వహింతురేని, మీరందఱు నిమేషమాత్రమున భగ్గునమండి భస్మీభూతులై పోదురు!"

సగర్వముగ, ధారాళముగ, గంభీరముగ, నిశ్చలముగ నట్లు ఖలీలుఁడు పలికినంతనే, జనీజరీనాయకు లందఱు లోలోనఁ దల్లడిల్లి డిందుపడి మిన్నకుండ, నెట్టకేలకు వారినాయకుఁడగు నాగా భ్రాంతి తొఱంగి యిట్లు ప్రశ్నించెను—

"అయ్యా! నీ వెవ్వఁడవు? ఇట్టి రహస్యవిషయములు నీ కెట్లు తెలియవచ్చెను?"

"అయ్యా! నీ కగ్రమున నొక్క పలు కాడెద: దాన, నాకొలఁది నీ వరయఁగలవు."

ఖలీలుఁ డట్లు పలుకుచు నా ప్రధానసేనాని శ్రవణపుటంబున నేమియో పలికెను. అట్టు లొనరించు ఖలీలుఁడు నిజాధరమున వ్రేలిడి, తోడనే యాగాను వీడి సహజ నిర్లక్ష్యసరణి నల్లన మందిర మధ్యప్రదేశమునకుఁ బోయి యచ్చట గంభీరముగ నిలుచుండెను.

ఖలీలుఁ డేమనెనో గాని, ఆగా తోడనే కంపితహృదయుఁడై, అనిమిషనయనుఁడై, ఉద్విగ్నస్వరంబున నిట్టు లనెను.—

"ఆర్యా! ఖలీలు మహాశయా! జనీజరీలను శాంతపఱచు భారము నాయది. ఎట్టులో, నాధనమంతయుఁ బంచియైనను, విప్లవము లేకుండ నొనరింతును. అయ్యా! నీవు వెడలుము. నీ వేగిన యొక గంటలోపున మూఁడు చువ్వలు చయ్యన మింట కెగయును. దానవిప్లవ మంతరించెనని గ్రహింపుము."

"సైన్యాధీశా! సంతసించితిని. బెదరించి లంచ మొసంగుట నేనెఱుంగను. నీప్రవర్తనమునకు మెచ్చి నేనొసంగు వసదనము వరి గ్రహింపుము." అని పలుకుచు ఖలీలుఁడు ఆరంగుళముల పరిమితి గల చిన్న రత్నమంజూషము జేబునుండి తీసి తెఱచినంతనే, తన్మందిరమును దీపించు దీపరాజ విసర్గతా విరళకిరణజాలములయందు మెఱపుల చందమున మెఱుఁగొందు నపూర్వ నవరత్నములు సేనానుల నయనములు చెదరునట్లు గోచరించెను. ఆగా ఉత్సాహవిశాలాయతవదనుఁడై, తదమూల్యపారితోషికము నందికొనెను. ఖలీలుఁ డంత గౌరవపురస్సరముగా శిరము వాల్చి తన దారినిఁ బోయెను.

కదీస్ఖానుని వధించుటకు బాళ్ళి ఏగిన సమయముననే, ఖలీలుఁడు జనీజరీ నాయకులతో సంప్రతించెను. అనంతరము, ఇతర రాజనీతిజ్ఞులు కూడ నియ్యకొన వజీరు దత్తబనుపాషాను సుల్తాను

సైన్యములకు నధినాయకు నొనరించి, విప్లవ దావానలము నార్పు భార మాతనిపైఁ బెట్టెను. ఇతర ప్రముఖుల కుచితకార్యముల నియోగించి, ఆయాసమాచారముల సుల్తానునకు లిఖించి పంపి, వజీరుఁడు సభ ముగించెను.

సుల్తాను సైన్యము లేఁబదివేలున్నను, ప్రస్తుతము పదివేలసైన్యము మాత్రము పాషా యధీన మాయెను. గ్రీకుయువకులు జూలియను లూకాసులు పాషా వెనువెంటనే యుండిరి. ఖలీలుఁ డేమాయెనో, ఆవీరుఁ డింకను రాకుండుటకుఁ గతం బేదియో యని చింతించుచు వారు పోసాగిరి. ఖలీలునకై నిలుచుట కవకాశము లేదు.

సుల్తానుకుఁ జెందియుండిన పదివేల యాశ్వికదళ మొక ప్రత్యేక స్థలమున విడిసియుండెను. తత్సైన్యాధిపతులు జనీజరీలతోఁ గలియుటకు మానుటకును నిర్ణయించికొనఁజాలక, ఔదాసీన్యము వహించి తటస్థముగ నూరకుండిరి. దల్తబను పాషా సూటిగా వారిచెంతకే పోయెను. యోధజనప్రియుండగు నా మహాపురుషుని గాంచి, మంత్రివర్గము తలం పెఱింగినంతనే ఆశ్వికసైన్యాధిపతు లెల్లరు నాతని నాయకత్వ మామోదించిరి. కాని, సైనికులు కూడ నామోదించిన గాని ప్రయోజనము లేదు. వారిలోఁ జాలమంది వీరులు దారుణ రహస్యవధకుఁ బాల్పడిరి. కావున, వారు కూడ నగరరక్షకునిపై క్రోధమూని, వాఁడు తప్పక మరణింపవలయునని కృతనిశ్చయులై యుండిరి. కదీస్కారుని వధించుటకై బాళ్చి వెడలిన సంగతి మాత్రము పాషా యెఱుంగును: అనంతర సమాచార మాతఁ డెఱుంగఁడు. కావున నా పాషా ఆశ్వికుల తలం పెఱింగినంతనే, ప్రజాకంటకుండగు కదీస్కారుఁ డీసరికి నిక్కముగ మరణించి యుండునని నిబ్బరముగఁ బలికెను. సైనికు లెల్లరు సంతసించిరి. కాని, ఆ నాయకులలో నెల్లఁ బెద్దయగు దళవాయి పాషాను సమీపించి రహస్యముగ నిట్టులనెను—

"మిత్రమా! ఒక్క విషయ మరయఁ గోరెదను. కదీస్ఖానుని యుదంతము నిజమగునా? లేక సైనికులను లోఁబఱచికొను నెపమున నిట్లు పలికితివా? ప్రధానామాత్యుఁ డెట్టులైనను వానిని రక్షింపఁ బ్రయత్నించునని యనుమానింతును."

"మిత్రమా! అనుమానము వలదు. మేము చూచుచుండగనే, రాజోద్యోగియగు బాష్చి కదీస్ఖానుని వధించుటకై పోయెను. వధానంతరము వాని మస్తకము సులేమాను మసీదుచెంతఁ బ్రదర్శిత మగును."

"అట్లు లగునేని, మేలు: మా సైనికు లెల్లరు నీవు శాసించు తెఱంగునఁ బ్రవర్తింతురు. అన్యథా యగునేని, ఈ సైన్యమంతయు మనలను నిరాకరించి, విప్లవకారులతోఁ గలసిపోవును. అంతటితో సరికాదు. మన ప్రాణములకే యపాయము సంభవింపవచ్చును. అందు, నీపై మఱియుఁ గినిసియుందురు."

"మిత్రమా! సందేహ మేమియు లేదు. కదీస్ఖానుని వధింప వలయునను నాజ్ఞ వీనులార వింటిని: తత్కార్యభారకుఁడు బాష్చి యందులకై ప్రయాణమగుట కన్నులారఁ గాంచితిని. కావుననే, ఇంత నిబ్బరముగాఁ జెప్పుచుంటిని. నగరరక్షకుఁడు మదీయభావుకుఁడు; ఐనను, ప్రజాక్షేమము, రాజ్యక్షేమమును గోరువాఁడ నగుటచే, నేనును ఆమోదించితిని. మిత్రమా! తాళుము. సైనికుల సందేహము నేనే మాన్పెదను."

పాషా యట్లు పలికి, సైనికశ్రేణుల డాసి, ఎలుగెత్తి, సగర్వముగ నిట్లు లుపన్యసించెను—

"సైనికులారా! కదీస్ఖానుఁడు మరణించెనని యెఱుంగుఁడు. మన మీఁద జనీజరీస్కంధావారము సమీపింపవలయు. ప్రసిద్ధమగు

సులేమాను మసీ దామార్గముననే యున్నది. నగరరక్షకుని భిన్న శిరం బచట మీరలే చూడఁగలరు. అట్లు కాదేని, నా వాక్కులు సత్యదూరము లగునేని, తత్పరిహారపూర్వకముగా నా తల మీ కొసంగెద!"

తదుపన్యాస మారుతాహతి సైనికసందోహమానస మేఘములు పటాపంచ లాయెను. తదవసరోత్సాహసూచకముగా, వా రెల్లరు జయజయధ్వానము లొనరించిరి.

ఈ తెఱంగున సుమారు ఇరువదివేల సైన్యము దల్లబనుపాషా యధీన మాయెను. దుర్జయాశ్వికదళమేగాక, ఫిరంగిదళముకూడఁ దన యధీనమున నుండుటచే, పాషా తనకు భయంబులేదని విశ్వసించి యుండెను. దవ్వుదవ్వుల నుండు సుల్తానుగారి యితర సైన్యము లే తేరువఱకు వేచియుండక, జనీజరీలు నగరముపైఁబడి ఘోరము లాచరింపఁగడంగువఱకు నుపేక్షింపక, తోడనే పోయి జనీజరీదుర్గమును శతఘ్నిబలంబున నిర్భిన్న మొనరించి, పరాక్రమవంతులగు నాశ్వికుల నందుఁ జొరఁబెట్టి, విప్లవకారులు తక్షణము సవినయముగాఁ దమ తమ పట్టులవీడి ఆయుధవిసర్జన మొనరింపరేని, ఆ దురాత్ముల హతమార్పవలయునని దల్లబనుపాషా నిశ్చయించెను.

రేయి ఒంటిగంటాయెను. భీకరమహాసేనాముఖంబున దల్లబను పాషా గ్రీకుయువజన మధ్యస్థుఁడై, ఇతరాంగరక్షకజనపరివృతుండై యమితోత్సాహ దీపితాననుఁడై దర్ప ముప్ప బయల్వెడలెను. భయంకరములగు ముప్పది ఫిరంగులు ధనంధనరవంబు లొనరించుచు నడచెను. ఆ వెనుక నాశ్వికదళము ధమధమధ్వానము లొనరింపఁ దొడంగెను. కాల్బల మా వెనుక దడ దడ నడుగులు వైచుచు బోయెను. ప్రజాసంకీర్ణమగు మహానగర మచిరకాలమున దారుణ రణరంగముగఁ బరిణమింపనుండెగదా యని సహజదుర్భర భయాతి

లేకమున గృహస్థు లెల్లరుఁ దమ తమ గృహంబుల నణగియుండిరి. కొందఱు ధైర్యవంతులు మాత్రము సాహసించి తమ సోరణగండ్లు తెఱచి య మ్మహాసైన్య సంరంభము భయసంభ్రమాకులంబున దిలకించిరి.

గమనత్వరితమున దల్లబనుపాషా యొకింత ముందుగ సులేమాను మసీదు సమీపించెను. తన బావయగు కదీస్కారుఁడు వధ్యుఁడాయెగదా యను విచార మొకవంకఁ జిత్తమును విహ్వాలింప, సైనికుల యనుమాన ముడిగి తన ప్రతిన నిలుచుగదా యను దృఢతమ విశ్వాస మొకవంక నొకింత యుత్సాహ మొసంగ, దల్లబనుపాషా మోము త్తి తిలకించెను. నిర్మలాభ్రతలంబున సుధాకరుఁ డుజ్జ్వలుండై వెలుంగుచుండెను: ప్రకృతి యంతయు మనోహరమై ప్రస్ఫుటమై శోభాయమానముగ నుండెను: కదీస్కారుని మస్తకము మాత్రము కానరాకుండెను. వంకరటింకరిగిన మసీదుగోడ అడ్డియుండుననని తలంచి, తద్భాగమును రయముగఁ జుట్టెను. ఐనను, కదీస్కారుని శిరము దృగ్గోచరము కాదాయెను. అంతలో లూకాను ప్రభువు చెంతకుఁ బోయెను. తోడనే, పాషా యిట్టులనెను—

“మిత్రమా! ఈ ప్రదేశముననే కదీస్కారుని మొండితల శూలాగ్రము నలంకరించియుండవలయు: నాదృష్టి హ్రస్వ మగుటచేఁ గాఁబోలు, నాకది తోఁపకున్నది: యువకుఁడవు, నీవు చూడుము.”

లూకాను చుట్టుం దిలకించితనకయ్యది కానరాదని బదులాడెను. అంతలో నరుదెంచిన జూలియను గూడఁ గలయఁజూచి అట్టులే యనెను. పాషా క్రుద్ధుఁడై, తీవ్రస్వరంబున నిట్టులనెను—

“ఏమంటిరి? నావలె మీకును దృష్టిమాంద్యమా! కదీస్కారుని శిర మిచట లేకున్న మఱేమి కావలయు? ఆ దురదృష్టవంతుని యుత్తమాంగ మిచట గోచరింపరాదనియే వాంఛింతును. కానిఁ విధి

విధానము!"

"ప్రభూ! వినను, నగర రక్షకుని తలయే గాదుఁ మఱే తలయు నిం దెచ్చటను కానరాదు."

జూలియను లూకాను లట్లు పలుక, పాషా మఱియొకసారి చుట్టుం బరికించి, తచ్ఛిరంబు కానరామి, తేజిపై జీవరహితశిలా విగ్రహమువలె నాసీనుడై యుండ, నాశ్వికదళాధిపతి రయమున నరుదెంచి, "ఆర్యా! నగర రక్షకుని శిర మెక్కడ? ఎక్కడ?" యని వడివడి ప్రశ్నించెను.

కాని దురంత విస్మయాతిరేకమున, నితాంత దిగ్భ్రమముకతంబున, పాషా నిరుత్తరుఁ డాయెను. వికలమైన ఆవీరుని చిత్తమున నొక్క నగర రక్షక శిరంబు గాక, వేయి మస్తకంబులు ప్రత్యక్షమాయెను. సులేమాను పరిసరప్రాంత భూమియంతయుఁ దన్మానసిక వికారోద్భూత విచ్ఛిన్న శిరసహస్రములతోఁ నిండిపోయెను. ఆధీర వరుఁడు విగతధైర్యుఁడై, ఆధీర స్వాంతుఁడు వికల స్వాంతుఁడై, మందునిచందంబున నిందందు వెఱంగుఁ దనంబునఁ గాంచుచు ప్రతివచన మాడకుండుటచేఁ సేనాని తీవ్రముగ మగుడ నిట్లు ప్రశ్నించెను.—

"అయ్యా! మాటలాడవేమి? కదీస్కారుని శిరమెక్కడ? సత్వరము చూపుము!"

"శిరమా! ఏమి! పదివేల మొండి తల లీసీమ యంతటను దోఁచుచుండఁ నొక్క శిరము చూపమందు రేల?"

నిజ యవస్థానుగుణముగా నసంబద్ధముక దత్తబను పాషా యట్లు పలుక, మంచి చెడ్డ లరయ కాతఁ డకారణముగఁ దన్నుఁ గేలి సేయుచుండెనని యెంచి, ఆశ్విక సైన్యాధిపతి క్రుద్ధస్వరంబున నిట్టులనెను.—

"అపహాసమున కిది సమయము గాదు. తరుణ మెఱింగి ప్రవ

ర్తింపవలయు. దీని నెంతయుపద్రవముప్పతిల్లునో గమనింపుము. ఇట్టి యాటలు సాగవని నేను మొదుగనే చెప్పియుంటిని. ఈసేనా వాహిని కదీస్కారుని మస్తకముఁ గాంచినఁ గాని సంతసింపదు!"

అంతలో మఱికొందఱు నేనానులు వారిని సమీపించిరి. పాషా యొక మహాసీయుని వోలెఁ బ్రవర్తించి తమ్ము మోసగించెనని యను మానించి వారు క్రోధారుణిత నేత్రులైరి. పాషా ప్రక్క నేయున్న లూకాసు జూలియనులు పరిస్థితులు విషమించెనని గ్రహించి, విషయ మెటులున్నను అపహసించుట మాని కర్తవ్య మూహింపవలయునని బ్రతిమాలిరి. పాషా యంతఁ దెలివొంది, సహస్మయముగా నిట్టు లనెను.—

"మిత్రులారా! మిమ్ము మోసగించుటలేదు. నేనుండగనే, కదీ స్కారుని వధింపవలయునని వజీ రాజ్ఞాపించెను: తత్కార్యభారము వహించి, నేఁ జూచుచుండగనే బాల్చి పోయెను. ప్రమాణ మొన రించి చెప్పగలను—"

"అయ్యా! ప్రమాణములతోఁ బనిలేదు. సైనికు లప్పుడే ఘోషింపుచున్నారు! ఏమందువు? అల్లదె యాలింపుము! కదీస్కారుని శిరస్సు కావలయునట; లేదేని నీ శిరంబుఁ గొందురట!"

సేనావాహిని నిజముగ కలంగఁ జొచ్చెను. మహాసముద్రమధ్య మున నవ్యక్తముగ బయలుదేఱి, తద్భవశరంగములు తీరంబుదెస బాఱుకొలంది నధికతరంబై, తద్భంగానీకములు గట్టున కెగసి విఱుగు నవసరమున నధికతమంబై, భయంకరమేఘగర్జితారవసదృ శంబై యొప్పు ధ్వానమువలె నా మహాసైన్యమునందు తొలుదొల్త నవ్యక్తకలవర ముదయించి, విజృంభించి హాహాకారములు చెలరేగ, "కదీస్కారుని శిరము! లేదేని, దల్తబను పాషా శిరము!" అను భయంకరనినాద మొక్కపెట్టున ఘోరతరంబుగ వెలువడెను.

దల్తుబను పాషా యవస్థ కడు దుర్భరముగ, కడు నపాయకరముగ నుండెను: ప్రచండఝంఝామారుతోద్ధూత సముత్తుంగ తరంగపరంపరావ్యాప్లవంబువలె నుండెను: ఆశ్వికదళంబులు క్రమముగా నరుదెంచి యాతనిం జుట్టిరి.

ఏమియుఁ దోపక, "మీరే కదీస్కారుని గృహమున కేగి, మీరకసి తీర వాని నేల వధింపరాదు?" అని సైనికుల నాతఁడు ప్రశ్నింపఁ బోయెను. కాని, దల్తుబను పాషా సహజోదారస్వభావుఁ డగుటచే, నట్టి దురూహ యాత్మముననే యంతరించెను. అంత నాధీరోదాత్తచిత్తుఁ డతిసాహస మొనరించి విస్పష్టముగ నిట్టు లనెను—

"సైనికులారా! కదీస్కారుని మస్తకము కానరాదేని, నా తల యొసంగెదనని యంటిఁగదా. కావున నా కంఠము ఖండించి, శాంతింపుఁడు."

"వలదు! వలదు! నాకంఠమునఁ బ్రాణముండ, నట్లు కాఁజాలదు!" అని, యఱచుచు గ్రీకుయువకుఁడు లూకాసు త దవసరోద్భూతధైర్యక్రోధావేశమున విద్యుత్ప్రభావిభాసిత దీర్ఘకరవాలము కేలునం బూని పాషా కడ్డుగ నిలిచెను. రెండవ గ్రీకు జూలియనుకూడ నిరుపమానసాహసోద్దీపితుఁడై, అట్టులే యొనరించెను. వారి యద్భుతప్రవర్తనము పాషాకే విస్మయము కల్గించెను.

ఆశ్వికు లందఱు [illegible]ద్రాంతక్రోధఘూర్ణితులైరి. పెద్ద యుద్యోగు లందఱు నొకరినేర మింకొకరు కప్పివేయుటకుఁ బ్రయత్నింతురని వారెఱుంగుదురు. కదీస్కారుఁడు దగ్గరచుట్టముగూడ నగుటచే, దల్తుబనుపాషా తప్పక వంచించెనని వారపుడు గ్రహించిరి. వజీరు పాషా లిర్వు రేకమై, తమ కండ్లయందు దుమ్ముకొట్టి, కార్యసాధన మొనరింపఁ జూచిరని వారు సహజముగా నిశ్చయించిరి. కాని, ఎంతటి విశ్వాసము లేకున్న, దల్తుబనుపాషా యంత నిబ్బరముగా

బలుకును, అంతటి యుపాయకరకృత్యమునకుఁ గడంగును, అని వారు వివేకింపరైరి. చిత్తముద్రేకించెను: వివేక మంతరించెను: దారుణ ప్రతిక్రియాచరణమే యిఁక మిగిలెను. "వంచకునిఁ బరిమార్పుఁడు! గ్రీకులనుగూడ మట్టుఁడు!

అట్టి భయంకరరవంబు లవిరళముగ నా సజీవపారావారమునుండి వెలువడెను. అందరికంటె దవ్వుననున్న రౌతులు తమకృపాణములు సారించి, గ్రీకులను పాషాను బట్టునెపంబున వడివడిఁ బోసాగిరి. ఆ దురదృష్టవంతున కిఁక దిక్కెయ్యది?

అట్టి సమయమున నెవ్వఁడో యొకరౌతు వాయువేగమున, నారంగ స్థలమునకే యరుదెంచుచుండెను. సైనికులు క్రోధోన్మత్తులై, సాయుధులై, పాషామీఁద కే తేరుసమయముననే, యా రౌతు "నిలుఁడు! నిలుఁడు!" అని ఉచ్చైశ్వరంబున నఱచుచు, తళతళ మెఱయు సునిశితకరవాలముల నొక చీరికిం గొనక, వ్యాఘ్రముల భాతి ఘూర్ణిల్లు సైనికులకును తద్భోజ్యపదార్థములకును మధ్యగాఁ బోయి నిజక్రోధవిశాలనయనములు నిప్పులు కుఱియ, నీవింత యేమి యని తీవ్రస్వరంబునఁ బ్రశ్నించెను.

ఆ పురుషుఁడు ఖలీలుఁడే!

" ఈ వింత యేమందువా? మేము ఘోరముగ మోసపోతిమి. వంచకులనుఁ జక్కాడవలయు. అనంతరము, జనీజరీలకుఁ దోడగుదుము."

పాషాను జుట్టిన సైనికు లా తెఱంగున నాగ్రహావేశమునఁ బలుక, ఖలీలుఁ డిట్టు లనెను—

" చాలును! జనీజరీలు విప్లవ మడిగిరి! మీవలెనే వారును రాజభక్తియుతులై యున్నవారు!"

"ఓహో! మఱియొక మోసమా? చాలు? ఈ యాట లిఁక

సాగనేరవు!"

సైనికు లట్లు లఱువ, ఖలీలుఁడు విస్పష్టగంభీరస్వరమున నిట్లు లనెను—

"నేను యథార్థ మాడితి. జనీజరీలు ప్రభుకృవిధేయులై రి. ఇంకను అనుమాన ముండునేని, నింగినంటు నా చువ్వలం జూడుఁడు!"

## ౧౭

### పునః ప్రయాణము

ఖలీలుఁ డట్లు లనుచుండగనే చువ్వలు చుఱచుఱ మిన్నంటెను. అయ్యది జనీజరీ విప్లవ విరామచిహ్నమని యెల్ల రెఱుంగుదురు. ఒక యరమైలు దూరముననే వెలువడిన తదపూర్వాంబరదీపికలచే నా ప్రదేశమంతయుఁ గడుశోభాయమానముగ విరాజిల్లెను. విప్లవ మంతరించె నని స్పష్ట మాయెను.

సైనికుల విస్మయము వర్ణనాతీతముగ నుండెను. ఒక్క క్షణ మాలస్యమాయె గాని, పాషా ఈపాటికి ఖండితశరీరుఁడు కావలసినదే: జనీజరీలు విప్లవమునఁ బాల్గొనవలసినదే. ఇంతలో ఖలీలుఁ డరు దెంచుటయు, విప్లవాంతకచిహ్నము లతిసింతగ వెలుంగుటయు సంభవమాయెను. అంతయు నింద్రజాలమువలె నుండెను. సైనికులు విపరీతవిస్మయచేతస్కులై, మూఢాత్ములై, చేష్టలుడిగి చూచుచుండ తదవస్థ గుర్తించిన ఖలీలుఁ డిట్లు లనెను.—

"ఇట్టి యుత్కృష్ట కార్యభారము వహించి తత్సమాచార మెఱిం గింప నరుదెంచిన నేను ఒక సామాన్యదూతను. నేఁ జెప్పున దింకనుం గలదు. సుల్తానువారియందు భక్తిగలిగి మీరు వ్యక్తపఱచిన కార్య

దీక్ష యూరకపోదు. మీ మీ నిలయంబుల కరుగునంతనే, మీ రమూల్య బహుమానముల వడయఁగలరు. మీ రాజభక్తి యొకింత దుడుకుఁదనంబున నొకింత విరసంబైనను, కరుణాసముద్రుఁడగు పాదుషా సైరించి మిమ్ము బహూకరించును.”

“కదీస్కారుని గుఱించి యేమందువు ?”

“కదీస్కారుఁడు వధార్హుఁడుకాఁడు. తన విధ్యుక్తధర్మమునాతడు నెరవేర్చుచున్నవాఁడు. మఱి నాలుగుదినములుకడచునంతనే, మీరే యాతని నగ్గడింతురు. మీ రిఁక మీ తావులకుఁ బొండు. విప్లవాంతము మీ కెఱింగింపమని నన్నుఁ బంచినమహనీయుఁడే మీకు బహుమానములు చిక్కుననియు గూడ నాతోఁ జెప్పెను. ఆలసింపక పొండు!”

మొండితనంబున నలుగు రైదుగురు మాత్రము కదీస్కారుని మస్తకము కావలయునని యఱచిరి. కాని ఖలీలుని సంతోష సందేశ మాలించిన తదనంతసైనికనికాయ మమందానందాతిరేకమున ఘూర్ణిల్లెను. జనీజరీలు విప్లవ ముడిగిరి: తమకు సంభావన ముట్టును: ఇఁక, కదీస్కారునితోఁ బనియేమి ?

తోడనే, ఖలీలు జూలియను లూకాసులును తక్కుంగల పరిజనులును వెంట నరుదేర, పాషా ప్రాణాపాయకరంబైన యా ప్రదేశము నుండి రయంబునఁ బ్రయాణమాయెను. కొంత దవ్వరిగినయనంతర మాతఁ డిట్టు లనెను—

“ఖలీలు మిత్రమా! నీ కతంబున నా ప్రాణము దక్కెను: కృతజ్ఞతాపూర్వకముగా వందనము లాచరింతును. కాని, నీ చర్య కేవల మగమ్యముగ నున్నది!”

ఖలీలుఁడు వినమ్రుఁడై మిన్నకుండెను. పాషా యాతనిపైఁ దొంటియట్లు అపూర్వగౌరవానుమానపూరిత వీక్షణములఁ బఱపి,

యిట్లు ప్రశ్నించెను—

"మదీయ స్వాలుఁ డెట్లు జీవించియున్నవాఁడో ముందుగ నెఱింగింపుము."

"కదీస్కారుని వధించుటకు బాశ్శీకి ధైర్యము చాలకపోవలయు!"

"జనీజరీ విప్లవము ?"

"చిన్నకథ కల్పించితిని. ఆగా చెంతకుఁ బోయి, వారి తావంతయు భూగర్భమున ఫిరంగిమందుచే నింపఁబడి యున్నదనియు, నొక్క యగ్నికణముచే నా మహాసైన్యమంతయు భస్మీభూతమై పోవుననియు చెప్పితిని. ఆగా నన్ను విశ్వసించి విప్లవ మంతరింపఁ జేసెను."

"నీ వభూతపురుషుఁడవు!"

"ఆర్యా! గోడలకుఁ జెవులుండును. తన యవివేకము ఆగాకుఁ దెలియరాదు."

"ఔనౌను. కాని, కదీస్కారుని మీరే యుగ్గడింతు రంటివే! అది యేమి?"

"అది యొక మిథ్య. అట్టు లనకున్న, సాగదు. కాని, నాలుగు దినములు వ్యవధి చిక్కెఁగదా. కదీస్కారుని యవస్థ నిక్కముగఁ గడు నపాయకరముగా నున్నను, కేవల మాశారహితమైయున్నను, అదృష్టము కలసిరాకూడదా? అసాధ్య కార్యము లొకప్పుడు సాధ్యము లగును. ఒప్పులకుప్ప యగు జులేఖాను దలంచియైనను, ఆపాటి యసత్య మాడవలదా?"

"నిజము. కాని, సైనికులకు బహుమానములు లభించునంటివే! అది యెట్లు?"

"దాని కేమున్నది! సహజోదారస్వాంతుఁడగు సుల్తాను తనయభిమాన సైనికులకు ధన మొసంగకుండునా! ఆ విషయము నే నెంత

నిబ్బరముగఁ బలికినను, దొనఁగులేదు."

"ఆహా! నీ విజ్ఞాన మఖండము, సుస్థిరము, కేవలము నిరుప మానము. ఈ రేయి మొదటినుండియు నెంతలేసి కార్యము లొనరించితివి! నా వంటి వ్యక్తులకేగాక, సుల్తానువారికిఁ గూడ నమిత సాహాయ్య మొనరించితివే!"—అంతలోఁ దొంటి యనుమానము మానసమున దీపించుటచే, నాతనిపై భావగర్భితవీక్షణముఁ బరపి, దలబనుపాషా మగుడ నిట్టు లనెను—"సుల్తానువారికిఁ గూడ నమిత సాహాయ్య మొనరించితివే! ఇంతటి కార్యశూరుఁడు ఎంతటి మహా సన్మానమునకైన—"

"అట్టి సన్మానము నీ వశమున నున్నది."

"సత్వరము చెప్పుము! ఏమది?"

"మఱేమియులేదు. చారుల నంపి మా యుదంతముల నరయుటకు నీ వొకవిధముగ నొడంబడితివి. నీ వటు లొనరించువఱకు నీ యారామ మందిరముననే మే ముండ—"

"మీ రవశ్యము రావలయు! నీవు కోరునపుడు, నేఁ గాదందునా? ధైర్యశాలులగు నీ గ్రీకులుగూడఁ గీర్తనీయులు. కాని, నేను ముందుగ వజీరుభవనమునకుఁ బోయి—"

"వజీరున కీ విషయములు తప్పక తెలియును. నే నరుదేరునపుడు, వజీరు సపరివారముగాఁ బాదుషావారి నగరునకు బ్రయాణము సల్పుట కాంచియుంటిని. కావున, నీవు నిశ్చలస్వాంతముతో నీ యారామ గృహంబునకుఁ బోవచ్చును. ఉదయమగునంతనే, వజీరు భటుఁ డరుదెంచి నిన్నెంతయు నభినందించును."

యుక్తియుక్తములగు నా పలుకుల కెదు రాడఁజాలక, పాషా ఇయ్యకొనెను. కాని, తాను తన నగరమందిరమునకు మాత్రము ముందుగఁ బోవలయునని యాతఁడు పలుక, ఖలీలుఁ డిట్టులనెను—

"ఆర్యా! అట్టులే కానిమ్ము. నా గ్రీకుమిత్రులు గూడ నీ వెంటనే యరుదెంతురు. నేను ఈలోన నాకీ యశ్వము నొసంగిన మిత్రున కీ వాహనము నొసంగి, మన నౌక నిలిచియున్న తావున మిమ్ము రయంబునఁ గలసికొందును."

అంత గ్రీకులు కూడ సముచితభాషణములం దమ కృతజ్ఞత వెలిబుచ్చిరి. అనంతరము వా రొకవంకను, ఖలీలుఁ డింకొకవంకను బోయిరి.

ఖలీలుఁడు కొంత దూరమేగి, ఒక చిన్న సందు తిరిగి తేజిడిగ్గెను. అచట నొక గుఱ్ఱపువాఁడు వేచియుండెను. ఖలీలుఁ డిట్టు లనెను.—
"సదకా! మాటాడకుము. నేఁ బంపిన పన లొనరించితివా?"

"చిత్తము!" అధికాలాప మా వీరునకు నసహ్యమని యెఱింగిన వాఁడగుటచే, వాఁడట్టు లేకవచనమాత్ర సమాధాన మొసఁగెను. ఖలీలుఁ డిట్టులనెను.—

"నేఁ జెప్పిన చొప్పున నీవును తదితరులును గూడ నేఁ దెలిపిన స్థలంబున కంటియుందురు గదా? నిరంతరము ప్రమత్తతతో నిగూఢము గావలియుందురు గదా?"

"చిత్తము!"

"నేను సన్నయొనరించు నంతనే, మీరు కావింపవలసిన కార్యక్రమము మీకు తెన్నుగఁ దెలియునుగదా?"

"చిత్తము!" అని పలుకుచు నా సేవకుఁడు రెండు మూఁడంగుళముల చిన్నడబ్బి యొకటి ఖలీలున కొసంగెను. ఆ వీరుఁడు సంతసించి, వానికి సెలవొసంగి, తాను వేఱొక మార్గమున కదీస్కారుని గృహంబుడాసి, అచటి సేవకు నొకని జీరి, లాంఛనసముద్రితంబగు నొక కమ్మ నొసంగి, తోడనే వెనుదిరిగి నదీ ఘట్టమునకు రయంబునఁ బోయెను. తదుత్తర నిమేషముననే, గ్రీకు యువజన మధ్యస్థుఁడై పాషా

గూడ నరుదెంచెను. ఆక్షణంబ వారందరు నాకాయాధులై, మనో హర జలవిహార సౌఖ్యమనుభవించిరి. పాషా యిట్టు లనెను.—

"ఖలీలుఁడా? ఈ రేయి ఎంతటివైపరీత్యములు సంభవించెను? నీ వెంత సాహసోదారముగఁ బ్రవర్తించితివి! నీ యద్భుత—"

"పాషా! గతవృత్తాంత మింకఁ దలంపవలదు. మన కష్టములు గట్టెక్కెనుగదా. అమితశాంతసౌఖ్యాలవాలమగు భవదీయారామ సౌధము మాత్రము నీకు స్మరణీయము."

"నా మందిర మనునంత నే జ్ఞప్తికివచ్చెను. మీరు మగుడ నా యతి థులగుచున్నవారు. మీ నిరుపమాన ప్రవర్తనముఁగాంచి, మీ ప్రణయ మనోరథముల నిరాకరింపఁజాల. ఖలీలుఁడా! నీ వ్యవహారము నా యధీనము కా—"

"ఔను. జులేఖా తలిదండ్రుల యనుమతి వడయవలయును."

"కావునఁ నే నీ గ్రీకువీరుల గుఱించియే చింతింపవలయు. మీ వంశ గౌరవభాగ్యములను నే నింక ననుమానించుట యసంబద్ధము, అవివేకము, ఐనను, మనము లోకాతీతులముకాము. కావున ఖలీ లుఁడా! భవదీయోపదేశానుసారముగ మదీయ భటుల నంపువాఁ డను. లూకాను జూలియనులారా! ఇచ్చటి మీమీ యుదంతముల లిఖించి, జననీజనకుల యనుజ్ఞ కోరుఁడు. సేవకులు రేపే గెదరు."

గ్రీకు యువకు లమితానందపరవశులైరి. తలిదండ్రులు తప్పక ఆమోదింతురు. డెందమునఁబొంగు సంతసమును వారు సముచితముగ వ్యక్తపఱచిరి. ఇట్టి శుభపరిణామమునకు ఖలీలుఁడే ప్రధానకారణ మగుటచే నాతని వారెంతయు నుగ్గడించిరి."

"కాని, అంతవఱకు లోకమర్యాద—అట్లు చెప్పఁబోవు పాషాను ఖలీలుఁ డిట్టులనెను—"

"నతిక్రమింపవలదు. మమ్మిప్పటియట్లు ప్రత్యేక మందిరము

లందే యుండనిమ్ము. పాషా! నీగౌరవమున కేకొంతయు రానీక మెలంగుదుమని యెంచుకుము."

"ఆహా! ఏమి నీబుద్ధివైభవము! మీవంటి యుదారపురుషులు నాయతిథులగుట నాకెంతయునానందదాయకము. ఖలీలుఁడా! నీకథ లెంత రసపూరితములు! వినుకొలఁది వినవలయునని యే యుత్సాహము పొడముచున్నది. నాయర్ధాంగి యమితాతురముతో నీకథకై నిరీక్షించుచుండును."

"ఆర్యా! నాశక్తికొలది మీకానంద మొదఁగూర్పఁ బ్రయత్నింతును."

పాషా సాభిప్రాయముగా నవ్వి యిట్టులనెను.—

"కాని జులేఖా లేని కారణమున, నీ భావౌన్నత్యము డింధు వడునేమో సుమా!"

"ఆర్యా! ఆ కన్నియ భవదీయ దర్శనార్థము రేపరు దెంచునని విశ్వసింతును."

భయంకర విప్లవము కడు సుఖముగా నంతరించుటచేఁ బాషా మానసము పరమానంద సంభరితమై యుండెను. తురుమ్కప్రభు నా కారణమున హాహాహా యని నవ్వి యిట్టు లనెను.—

"ఈచతురజ్ఞుఁడు వివిధ దుస్సాధ్యకార్య నిమగ్నుఁడై యుండెనని భ్రమించితిని; కాని, తన ప్రేమనిధానమగు కన్నియను మఱవలేదే! ఈ చోద్యమాలించునంతనే, నా యిస్మిలిడా తప్పక స్మేరాసన—"

"వలదుఁ వలదు. స్త్రీజాతికెల్ల నలంకార ప్రాయమగు నా మహా మానిని, నేను జులేఖా సందర్శనార్థమే యరుదెంచితినని యాలించు నేని, అట్టి యనుమాన మైనను స్ఫురించునేనిఁ సహింపఁ జాలదు. నా హృదయము నీవు లెస్సగ గ్రహించితివి: కాదనఁజాలను, కాని, ఇస్మిలిడా సతీమణి మాత్ర మెఱుంగరాదు."

ఖలీలు: మిత్రమా! నీ పలుకులన్నియు వివేక పుంజములు. ఔను. సుప్రసిద్ధ వీరులు సుప్రసిద్ధ సుల్తానులు నగు ఉస్మాను, మురాదు, బైజీదు, రెండవ మహమ్మదు మొదలగు వారల గుఱించి యింత ధారాళముగా నవిరళముగా ప్రసంగించు వైజ్ఞానికుఁడు వేఱువిధముగ నెట్లు మాటాడును? కోమలాంగియగు నా కాంత కేవలము రూపొందిన కోమలత్వమే యనఁదగును, సుగుణమని చెప్పనొప్పును, సౌశీల్యమని నుతింపవలయును. నా హృదయారామమునందలి మనోహరమగు గులాబిగదా, నా మనోహారిణి!”

ప్రభురాణి శీలము సమగ్రమెఱింగిన ఖలీలుఁడును గ్రీకులును తదసంబద్ధాలాపముల కెంతయు లోలోన నవ్వికొనిరి. జూలియను ఖలీలులు ఆ మానవతి శయ్యామందిరము కాంచియుండిరిగదా. లూకాను అంతటి భాగ్యము నోచికొనకపోయినను, ఆ క్రీడామందిరమున కాతఁడే ప్రప్రథమ మాహూయమానుఁడాయెననియు, అట్టి మహాసమయమున పాషా పాదరక్షలవలన విఘాతము ఘటిల్లెననియు నరసియే యుంటిమి.

నౌక యంతలోఁ గయ్యిచొచ్చెను. వారందఱు నేలకు డిగ్గి క్రమముగా మందిరాంతర్గతులైరి. ఎప్పటియట్టులు యువకులు మువ్వురు తమ తమ గదులలోనికిఁ బోయిరి. కడు నలసియుండిన ఖలీలుఁడు మఱి యే విచిత్రకార్యమున కుద్యమింపక, శీఘ్రముగా శయ్యాగతుఁడై నిజహృదయాపహారిణి జులేఖాను దలంచుచు నిద్రాపరుఁడాయెను.

భయంకర జనీజరీ విప్లవ మంతరించెననియు, తమ ప్రియులు మగుడ నరుదెంచిరనియు నెఱింగి, తైరజాగుల్మేరు లమందానందము నందిరి. పాషా నూటిగాఁ దన కాంశసదనమునకే పోయెను. తురుష్కప్రభువు కేవలము మిథ్యాప్రగల్భుఁడు కాకున్నను, ఖలీలుని

ప్రాముఖ్యత సాధ్యమగునట్లు మఱుగుపఱచి, తన ధైర్యస్థైర్యములకు వెఱచియే జనీజరీలు గతాహంకారులై లోఁబడిరని తన భార్య విశ్వసించువిధంబున నాతఁడు తత్కథాక్రమ మెఱింగించెను. అంత నా కాంత జులేఖాగతిఁ దెలిసి ప్రశ్నింప, దా నా కన్నియను జనకుని గృహంబునకుఁ జేర్చితినని యు, అనంతరవృత్తాంత మేమియుఁ దెలియదనియు పాషా పలికెను. దాన జులేఖా ఖలీలుల ప్రణయ మంతరించెనని విశ్వసించి, ఆ నవమోహనాకారుఁడు మగుడఁ దన మందిరమున కేతెంచి నందుల కా కామిని యనిర్వచనీయానందము ననుభవించెను. తురుష్క యువకుని రాకకుఁ దగు కారణము పాషా చెప్పఁడాయెను: కాన, దన సౌందర్యమే యూ మోహనాంగు నాకర్షించెనని, ఆ కులుకులాడి మఱి మఱియు సంతసించెను.

మఱునాఁడు మధ్యాహ్నసమయమున వజీరుయొక్క సేవకుఁడరుదెంచి, యమూల్యములగు పెక్కు బహుమానములును ఒక జాబును గొనితెచ్చెను. రాజధాని మహావిపత్సాగరమున మునింగియుండిన సమయమున దత్తబనుపాషా యొనరించిన గొప్పసేవ నుగ్గడించుచు వజీరుఁ డాలేఖ లిఖించి యంపెను. పాషా సహజముగా సంతోషపరవశుఁడై తత్సేవకున కుచితపసనము లొసంగి యంపెను.

జూలియను లూకాసులు తమ ప్రణయోదంతములను వ్రాసి పాషా సేవకుల కొసంగిరి. ఆసేవకులు తోడనే ప్రభునాజ్ఞ ననుసరించి ప్రయాణమైరి.

ఆ సమయముననే, కదీస్కారుని తనయ జులేఖా యరుదెంచెను. సాదకునిఁ బొమ్మని రయమున కదీస్కారుని గృహము డాసి, అచ్చటి సేవకునకు ఖలీలుఁ డొసంగిన జాబునం దుండిన సమాచారమియ్యాదె!

## ౧౮

### గులాబీపండుగ

దివాసమయమునఁ బాషా పుత్రికలును జులేఖాయును పరస్పర సంభాషణా పరతంత్రలై, హాయిగ నుండిరి. ఇస్మైలిడా నిజమనోభవాలోచనానిమగ్నయై యుండెను. యువకులు చతురంగాదివినోదములఁ బ్రొద్దు పుచ్చుచుండిరి. దత్తబను పాషా యొకానొక కార్యము తలపెట్టి రాజధానియందలి తన మందిరమునకుఁ దత్కార్యార్థము సేవకు నంపెను. తత్పరిణామము శీఘ్రముగ వ్యక్తమాయెను.

మధ్యాహ్నము తిరిగినంతనే, రాజధానినుండి పెక్కండ్రు కర్మకరు లరుదెంచిరి. అనంతారామప్రదేశమునందు వారు చిన్న చిన్న మందిరములు నెలకొల్ప నారంభించిరి. కొందఱు చక్కని గుడారములు నిర్మింపఁ దొడంగిరి. మఱికొందఱా యారామపథంబుల కిరుకెలంకుల సముచితస్థలంబుల నాసనములఁ బఱుపఁ గడంగిరి. వనపాలకులు కొందఱు [illegible] పెరిగిన వృక్షశాఖలను రమ్యాకారములుగను, చక్కని చాందనీలగను వంచికట్టిరి. లెక్కకు మీఱిన గులాబిచెట్లను వివిధప్రదేశములఁ బహుతెఱంగులనిల్పి, నా ప్రదేశమును గడు మనోహరముగ నొనరించిరి. తద్దారామవాటిక లన్నియు బల్లలు కుర్చీలు సోఫాలు మొదలగు వస్తుచయంబులతో నిండి, చూడ వేడుకగా నుండెను.

ఆ మందిర కాంతాజనంబులు వినయ ముద్రితో మెలంగు చున్నను, సందడి దండిగనుండుటచేఁ దమ కవాటపత్రములఁ దెఱచి పరికింపఁ దొడంగిరి. తద్బహుళ ప్రయత్నములఁ గాంచి యచిరకాలమునఁ బెక్కండ్రు అతిథులు రావలయునని హైరబాగుల్నేరులు గ్రహిం

చిరి. కాని, యట్టి ఉత్సవావసరమునఁ దమకు బంధవిమోచన మగునా, తాముగూడ హాయిగఁ దిరుగఁగలమా యని ఆసుందరీమణులు సంశయబాధితాత్మురాలై యుండిరి. ఇస్మైలిడా మనోభావ మన్యథా పరుగిడుచుండెను. తన నాథుఁడు తనకుఁ దెలుపకుండ నట్టి ప్రయత్నములేల ఒనరింపవలయునని ఆమె యాగ్రహాయత్తచిత్తయాయెను. కాని, వివిధకార్య రచనాపరాయణుఁడై యుండిన పాషా కానరాకుండుటచే, దనయుత్కట వెలిబుచ్చుట కవకాశము లేక పోయెను. అంత నాయింతి కొండొకవిధంబునఁ జింతించెను. ఈ యుత్సవసందర్భముననే, దనచిత్తచోరుని ఖలీఫునిఁ గాంచి సరస సంభాషణ మొనరింపనగునని యెంచి, ఆ మదవతి యమందానంద మందెను.

సాయంకాల మాఱుగంటలు సమీపించునరికి, ప్రచండభానుఁడు ప్రశాంతుఁడగుచు, ప్రదేశమంతయు శీతలతరంబై యొప్ప, చల్లని పిల్లవాయువు లల్లనలేచి, బాస్ఫరజలవిహారము మనోహరతరం బొనరించెను. నౌకలు పుంఖానుపుంఖములుగఁ దోఁచి యొక్కటొక్కటి పాషా మందిర పరిసరఘట్టమున నిలువనారంభించెను. వివిధప్రాయంపుఁ గులీనులు, పురుషులు స్త్రీలునుగూడ, నాహూయమానులై యరుదెంచుచుండిరి. మేలిముసుంగులు ధరించిన యువకాంతలు వివిధ రుచిరాంబరములఁ దాల్చి యపూర్వసౌందర్యముతో నలరారుచుండిరి. సుకుమారులగు చరణంబుల సౌకర్యార్థ మచ్చటి పరుషశిలామయ సోపానములు రమణీయములగు మెత్తని మొగమలుచేఁ గప్పఁబడి యుండెను. ఆబాట కిరుకెలంకుల నపురూపములగు గులాబులు శోభాయమానముగ నలంకారపూర్వకముగ విరాజిల్లుచుండెను.

అంత కొంకింత పూర్వమే దల్లబను పాషా తన ప్రాణకాంత చెంతకుఁ బోయెను. ప్రభుపత్ని ప్రసన్నచిత్తయై, మధురమందహాసన

విరాజితాననయై తన మగనికి సుస్వాగత మొసంగెను.

“మనోహారిణీ! మన సేవకు లొనరించు మహత్తర ప్రయత్నములఁ గాంచియే యుందువు. నీ కమిత విస్మయానందంబులు కల్గింపఁ గోరి, ముందుగ వచింపనైతి. రాజధానియందుఁ జెలరేగిన భయానక విప్లవము సమసెగదా. తద్విజయోత్సాహసూచకముగా నొక యుత్సవము కల్పించితి. ప్రముఖు లందఱు నరుదెంతురు. కావున, నో సుందరాంగీ! మదీయ ప్రతిష్ఠాగౌరవములకు వన్నె తెచ్చునట్లు ఉత్తమోత్తమవసనముల దాల్చి యరుదెమ్ము.”

చతురమతియగు ప్రభుపత్ని వల్లెయన, పాషా రయమునఁ దన పుత్రికాసదనమునకుఁ బోయి యిట్టు లనెను—

“పుత్రికలారా! విప్లవము నడంచి, తదఖండవిజయమునకు సాక్షీభూతముగా గులాబీపండుగ కల్పించితి. మీమీ మనోహరాంబరములఁ దాల్చి రావలయు. మీ ముసుంగులు మాత్రము సమముగా నుండవలయునుడీ. మీ పరిచిత పురుషులందు గోచరింతురు: కాని, మీ రెఱుంగనట్టులే, మెలంగవలయు: మన గృహంబున వా రుండిన విషయ మేరికిఁ దెలియరాదు. కొందఱు కొంటెతనంబున నిట్టివిషయములనే యరయఁ బ్రయత్నింతురు. కాన, మీరు తదుచితముగ మెలంగుదురుగాక.”

అనంతరము పాషా గ్రీకులు ఖలీలుఁ డుండిన మందిరమున కేగి యిట్టు లనెను—

మన రాజధాని భయంకర జనీజరీ విప్లవమునం బడి మ్రగ్గక నిల్చియున్న కారణమున, తదుత్సాహాతిరేకమున గులాబీ యుత్సవము శోభాయమానముగఁ జేయఁ దలంచితి. పేరొందిన పౌరులందఱుం దమ మిత్రకళత్రాదులతో నరుదెంతురు. మీరును రావలయు. మీరు పోరాని బంధుగులు, అమితగౌరవార్హులు, విమల సదాచార

సంపన్నులు. మీవంటి మాననీయుల స్వేచ్ఛాప్రవర్తన మరికట్టుట నా యభిమతము కాదు. ఐనను, మీరు నా పుత్రికను జులేఖాను గాంచునపుడు, పరిచయము లేనియట్టులు సంచరింపవలయును. పరస్పర ప్రసంగావసరమున నూతనాగతులనలెనే మీరును తదుచితము గనే పలుకరించి మెలంగవలయు. ఇట్టు లాడితినని యన్యథా తలంపకుండు” యువకులు ముప్వు రందుల కియ్యకొనిరి. పాషా సంతసించి వెడలఁబోయియు, మ తెద్దియో స్ఫురింప, వెనుదిరిగి ఖలీలునిం గాంచి యిట్టు లనెను—

“మిత్రమా! ప్రసంగవశమున జనీజరీ విప్లవము గుఱించి మాటలు రావచ్చును. నీ వావిషయ మంతగ—”

“పాషా! తత్ప్రసంగము వచ్చునేని, నీ కతంబుననే ప్రచండవిప్లవ జలధరంబులు పటాపంచ లాయెనని చెప్పుదును” పాషా యహంకారముం దలంచియు, దాఁ దదనుగుణముగాఁ దాళము వైచుట యెఱింగియు ఖలీలునకు నవ్వు కల్గుచుండెను. కాని, ప్రభువు చిన్నవోవునని యెంచి యాతఁడు సహించికొని, సర్వ్వకారుఁడై యథాప్రకార మిట్టు లనెను—“పాషా! యోధాగ్రేసరుండవగు నీపేరు తలంచియేగదా, నీవు మహాబలసమేతుఁడవై యరుదెంచుచుంటివని యెఱింగియే గదా, జనీజరీలు విగతధైర్యులై భయవిహ్వలులై శస్త్రాస్త్రవిసర్జన మొనరించిరి! అట్లు కాదేని, ఆగా కేవలము నామాట పాటించియే లోఁబడునా?”

ఖలీలుని నతిపూరితాలాపములచే నా వృద్ధవీరుని మానసము పొంగెను. ఆతని సుగుణములఁ గొనియాడి, పాషా మగుడ నిట్టు లనెను—

“మీరు పంసిద్ధులరై యుండుఁడు. అతిథు లరుదెంచు సమయము ననే, మీరును రావలయు. మీరును రాజధానినుండి వచ్చిన

మిత్రులవలెనే దోఁపవలయు."

పాషా యొక్కసారి తన యారామమునం దెల్లెడలఁ దిరుగాడి, సేవకు లొనరించిన ప్రయత్నములఁ గాంచి, సంతసించి, యనంతర మాతఁడు యువకులకడ కేగి, వారిని విడిచి, రయంబునఁ దన యంతఃపురంబునకుఁ బోయెను. నిజప్రియాంగన, పుత్రికలు, భగినీ పుత్రికయు వెంట నరుదేర, యతిథులకు స్వాగత మొసంగుటకై పాషా నౌకాశ్రయస్థానమునకుఁ బోయెను. ఖలీలాదులు కొంత దవ్వునఁ దిరుగాడుచుండిరి.

ఆరుగంటలైనంతనే, సుందరోద్యానవన మంతయుఁ బ్రసిద్ధజన సంకీర్ణ మాయెను. పేరువడసిన స్త్రీపురుషులు రెండువంకలనుండి యరుదెంచిరి. అస్తంగతుఁడు కానుండిన దినకరుఁడు మనోహరాకారుఁడై వెలుఁగుచుండెను. తదవసరదృశ్య మసాధారణవైభవముతో నలరారుచుండెను. తద్విశాలారామతరంబునఁ బొడసూపిన తాత్కాలిక సుందరనిలయములు వివిధవర్ణరంజితములై, కమనీయ కనకబాలచంద్రలాంఛన విరాజితములై, ప్రశాంతభానుబింబప్రసరిత సాంద్రసువర్ణకిరణ ప్రవాహప్రభావమున మఱియు శోభాయమానముగ దీపించెను. మనోహరములగు గులాబీపుష్పములు ఒక గుడారమునుండి యింకొక గుడారమునకుఁ జక్కఁగఁ దోరణములు కట్టియుండెను. గుడారములు, దీపములు, పర్ణశాలలునుం గూడ నవిరళసూనాలంకృతములై నేత్రపర్వములై యొప్పారెను. ప్రణయప్రపూర్ణములగు నపూర్వకుసుమగుచ్ఛముల చేతనే కొన్ని స్థలంబు లలంకరింపఁబడెను. గులాబీయుత్సవము సార్థకనామమగునటులా ప్రదేశమంతయు దన్మనోహరగుళుచ్ఛములతో నిండియుండెను. పటకుటీరములందును, విహారణపథంబు లందందును అమరిన యాసనములును, వేదికలును గులాబీ సిందూరవర్ణమయమగు మొగములు తొడుగుతో మనోహర

ముగ రాజిల్లుచుండెను. ఎల్లెడల సముచితముగ నొప్పియుండిన యపూర్వపు మేజాలపై నవిరళమనోహరాపూర్వ భోజ్యపదార్థములు నిలిచియుండెను. దట్టబను పాపా మహామ్మదీయుఁడైనను, మహమ్మదువారి యాదేశముల నెల్ల నాదలఁ దాల్పఁగడంగు మూఢచాందసుఁడు కాకుండుటచే మధురసాస్వాదనాభిజ్ఞుఁడై రాఁగల యతిథిజనంబులకుఁ గూడఁ దత్పదార్థము నాయత్తపఱచి యుండెను.

ఆ దృశ్యము నిజముగ ననూనశోభాయమానముగ నుండెను. ఏతెంచిన కాంతామణులందఱు వసనాచ్ఛాదితవదనలైనను, దత్సౌందర్యవైభవంబున కావంతయుఁ గొఱంతలేకుండెను. మంజుల చిరుఘంటికారవంబులవలె వెలువడు నారీకంఠముల కలస్వనహాసములు రమణీయవల్లకాధర వినిర్గతంబులు కావలయునని తెలియుచుండెను. సుందరీజనవదన సుధాకరబింబములు వసనమేఘాక్రాంతము లైననేమి? అపూర్వరూపవైభవ మగణిత శోభాయమానముగఁ దోఁచుచుండెను. మనోహర కుసుమవల్లరీసమాన లఘుతరశరీరలును, గంధగజేంద్ర సాదృశ ఘనతరశరీరలునుగూడ వారు ధరించిన తదుచిత వస్త్రధారణముచే నధికతర దర్శనీయముగ నుండిరి. సంధ్యారాగ మధికతరంబగుచుండెను, అపూర్వ మధురసపూరిత కాచపాత్రములు వివృతములగుచుండెను, ఆరామవిహార మొనరించు మచ్చెకంటుల మేలిముసుంగులు తిన్నకట తరుశాఖల కారణంబునఁ దొలఁగ, దృగ్గోచరమగు వదనము లనూన సౌందర్యసముజ్జ్వలవైభవముతో నలరారుచుండెను. తోడునీడవలె వెన్నంటు రసికవరుల కాతెఱంగున నమితానంద మొనఁగూరుచుండెను. ఆకామినులు మగుడ వసనాచ్ఛాదితవదనలగు లోనన్నొక్క మోహనీకృణంబు విడుచుటకుఁగూడ నవకాశ మేర్పడుచుండెను.

ఒక సాంద్రతర లతానికుంజము నుండి మనోహర తూర్యారవం

బులు తదవసరమున మంజుల స్వనమున యతిథులకు సుస్వాగతమొసంగెను. తత్పునరోద్భూత శకుంత సంతాన కలకల నినాదములు కూడ సమయానుకూలముగ నుండెను. దినమణి పశ్చిమ కాసారమునఁ గ్రుంకినంతనే, వేనవేలు దీపము లొక్కసారి దేదీప్య మానముగ వెలింగెను. ఆ ప్రదేశమంతయు విపులవైభవ సముజ్జ్వలమై, దర్శనీయమై, వర్ణనాతీతమై, యొప్పారెను.

ఉత్సవారంభమునఁ బాషా వనితాజనంబు లాతని నంటియే యుండిరి. దాన వారికిఁ బ్రసిద్ధయతిథులఁ బ్రశంసించు నవకాశము చిక్కెను: దీపారాధన మైనంతనే, యా ప్రభువు తనబోలు నున్నతాధికారులు నడుమ నాసీనుఁడై, హుక్కాగొట్టము చేఁబూని ప్రసంగమునకు జొంకొనెను. ఇస్మిలిడా మొదలగు వారు తమ దారిని బోయిరి.

ఇందందుఁ దిరుగాడుచుండిన జూలియును లూకాసులు తమ ప్రాణకాంతలం గాంచి, మనసార ముచ్చటింపఁ జాలిరి. ఖలీలుఁడు నిజప్రియాంగనను డాసి యిట్టు లనెను—

“జులేఖా! మనము కలసియుండ రాదు. ప్రభుపత్ని నాకై తిరుగుచున్నది. నాయుదంతము నీ కెఱింగించియుంటి గదా. ఈ సమయమున నిట్లు మెలంగవలసి—”

“మహాశయా! ఇంత సమాధాన మేలఁ? నీ వొనరించిన మహోపకార మెన్నటికైన మఱపునకు వచ్చునా? నీ ఋణమెన్నటికైనఁ దీరునా?—”

“ప్రేయసీ! ఇట్టి వెడగుమాట లాడవలదు. నే నమితోపకార మొనరించితినేని, నీవు ప్రత్యుపకార మొనరించియే యుంటివి. భవదీయ హృదయ పెన్నిధానము నొసంగి, నన్ను ధన్యు నొసరించితివి! ఒందు నాకేమి కావలెను? ప్రాణకాంతా! మనమింక నిరవధిక సౌఖ్య

ముచూఱఁ గొందుమని విశ్వసింపుము. నీవిఁక పొమ్ము.”

ఖలీలుఁ డట్లు పలికి తత్ప్రదేశ మేకాంతముగ నుండుటచే నట్టి సదవకాశము బోనాడక, నిజమనోహారిణియగు నా పల్లవాధరి మధురాధరామృతము చవిచూచి, తన దారిం బోయెను. అలతా కుటీరమునం దవ్వలి కొనయుందే, ఇస్మిలిడా వడివడిఁ దిరుగాడుచుం డెను. ఆ హారిణేక్షణ ముఖవసన ధారిణియై యున్నను, తన్మనోహర మూర్తి పరిపూర్ణతా సౌందర్యము, గమనవైభవమును, విపరీతమగు వేగిర పాటును గాంచునంతనే, ప్రభుపత్ని కావలయునని తెలియుచుం డెను. తను గాంచవలయుననియే ఆ కామిని పరిభ్రమించుచుండెన నియు ఖలీలుఁడు గ్రహించెను. సాధ్యమగు నంతవరకుఁ దప్పించికొన వలయునని యెంచి, ఆ వీరుఁడు రయమున వేఱొక వంకఁ దిరిగెను.

ఆరామసీమ యంతయు దీపికా సహస్రంబులచేఁ బట్టపగలువలె వెలుగుచుండినను, హామా మందిరము మాత్ర మంధకారముననే యుండెను. దీపకాంతి యంతవఱకు, బోలేదు. అందుఁ మందిరవుఁ గొనయొందు మఱియు నంధకారబంధురమై యుండెను. ప్రభుపత్ని కంటఁ బడకుండఁ బాఱిన ఖలీలుఁ డావంకకే బోయెను.—

“ఈ కాంత నన్నుఁ గాంచునంతనే. తప్పక దూఱును. ఐననేమి? ఆమెను జూచుటకే ఎల్లెడల నిందనక సంచరించుచుంటినని తెల్పి, నన్నట్లు లుపేక్షించుట పాడిగాదని నేనే ముందుగ నిందింతును. అల్లా! ఇట్టి కపట ప్రవర్తనావసరము రయమునఁ దొలంగుఁ గాక!”

ఖలీలుఁడా తెఱంగున నాలోచనాధీన మానసుండై యుండ, తత్సమీపద్వార మెద్దియో మెల్లగఁ దెఱచినటులాయెను. అతఁడు ప్రబోధితుఁడై తిలకించునంతనేఁ యాసవ్వడి యంతరించెను. తోడనేఁ కుతూహలడోలాయమాన మానసుఁడై, మన వీరుఁడు శబ్దముద్భవించిన వంకకు నల్లనఁ బోయెను. అచ్చటి పచ్చిక బయలు మందిరము తట్టు

వాలి యుండెను. అట్టి వాలువలన, భూమట్టమునకు దిగువ నుండిన గదులకు వెలుగు వచ్చుట కవకాశమేర్పడెను. వల్లమున దిగుకొలది అంధకారము బంధుర తరంబాయెను. అచటనే అనతిదూరమున నెవ్వరో దీర్ఘమగువ్యక్తి తోచెను. దీర్ఘకాయము, తెల్లనిబట్టలు, ఒక విధమైన పాగాయును చూచి, వాడు చిరపరిచితుడగు సిద్దీ కావల యునని ఖలీలుడు గ్రహించెను. అట్టి సమయమున, అట్టిప్రదేశమున వానికిఁ బని యేముండును? వానిరహస్య మరయువలయునని ఖలీలుడు పొంచియుండెను.

ఖలీలుడట్లు నక్కిచూచుచుండ, సిద్దీదొంగవలె విసరునఁబోయి, అత్యంత చేరువనున్న గుడారము ప్రవేశించెను.

వాఁడందుఁ జొచ్చుటకుముందు నిమేషమాత్ర మాప్రాంగణమున నిలిచి తొంగిచూచెను. ఒక్కముహూర్తమే యందుండి, వాఁడు రయమున వెలువడెను. ఆముష్కరుఁడు తొంటితావునకు శీఘ్రతరముగ నరుదెంచుచుండుటచే, ఖలీలుఁడు మఱింత వెనుకకుఁ బోయెను.

సిద్దీ గోచరించిన తావున, సిన్ను తమ భూభాగమున, నొక దిట్టమగు తలుపుండెను. నిశ్చలాత్ముఁడగు ఖలీలుఁ డందు రయమునఁ జొరబడెను. ఆధైర్యశాలి యందు జొచ్చినంతనే, అమిత విస్మయాక్రాంతచిత్తుఁ డాయెను. నిశాసమయమునఁ దాను రహస్యవిహారణ మొనరించిన పథంబునందలి మెట్లవరుస క్రిందనున్న దారుమయగుప్త కవాటమే అయ్యదియని ఖలీలుఁడు రయమున గుర్తించెను. వీరుని సంభ్రమ మంతరించునంతలో, సిద్దీ యడుగులసవ్వడి శ్రవణగోచర మాయెను. ఆతఁడు తోడనే సిద్దీవెంచి వెడలినట్టులే యాతలుపువైచి యొకప్రక్క నక్కియుండెను. గ్రుడ్డిగ వెలుంగు నినుపదీపపుఁ గాంతిచే నానిర్మానుష్యాంధకార ప్రదేశము చూడ దుస్సహాముగా నుం

డెను. అంతలో, సిద్దీ రయమున నరుదెంచి నిజచరణబలంబునఁ దలుపు వైచెను. వానికక్షులందు రెండు సారాయి సీసాలును, వివిధ ఫలాది తినుబండారములును నుండెను. ఆపదార్థముల సంగ్రహించుటకే వాఁడటు పోయెనని వ్యక్తమాయెను. తొందరపాటున ఖలీలునిఁ గాంచఁజాలక, ఆయూసంచి తారథములను నేలనిడి, తత్కవాటము భద్రముగ బంధించుటకై తాళము తీయుచు, ఖలీలునిఁ గాంచెను.

ఖలీలుఁ డాకస్మికముగ గోచరించుటచే నా భటుఁడు విపరీతి సంభ్రమచేతస్కుఁడై యప్రయత్నముగఁ దాళము పాఱవైచి, దుర్దాంతక్రోధాతిరేకమునఁ దన దీర్ఘకరవాలము సారించెను. కాని, ఆ క్షణముననే మఱియొక కృపాణముకూడ మెఱుపువలె దీపించెను. తదస్త్రధారి ఖలీలుఁడే యని వేఱుగ జెప్పనవసరము లేదుగదా. అతఁడు నిరుపమాన గాంభీర్యముతాల్చి, విస్పష్టస్వరమునఁ గఠినముగ నిట్టులనెను—

"ఓరీ! నా మాటల కెదురాడకక, వినుము. నాయాజ్ఞ జవదాట సాహసింతువేని, నీవు మనఁజాలవు. నిన్ను ధనవంతు నొనరించుటకును, తగుదండన విధించుటకునుకూడ సమర్థుఁడనని యెఱుంగుము. నీవు తత్క్షణము—"

కృపాణధారియై, గంభీరాననుఁడై, దుర్నిరీక్షుఁడై యొప్పు ఖలీలుని జూచినంతనే, సిద్దీ చకితుఁ డాయెను. ఆ వీరుఁ డేమి యాజ్ఞాపింపఁగోరునోగాని, ఆరామమునుండి యాకస్మికముగా నాక్రందనములు వెలువడెను. ఖలీలుఁడు మాట లుడిగి వినుచుండఁ నా ధ్వని యధికతర మాయెను. హాయిగవిందు లారగింపుచు బరస్పర సంభాషణ సౌఖ్యోన్మత్తులై యుండవలసిన బంధుజనంబుల కంతలో నేమి యుపద్రవము వాటిల్లును? ఖలీలున కేమియుఁ దోపకుండెను. తన కత్యంత ప్రియతమునుగు జులేఖా కేమైన నాపద ఘటిల్లెనా

యను భయం బాతని మానసముఁ బీడించుటచే, నావీరుఁడు తన కార్యము మఱచి, సిద్ధిని మఱచి, అట్టి మహాసమయముననే ఆ యసాధ్యపురుషుని ఖండింపనైతిఁగదా యని ఆ బానిసీఁడు విచారించుచుండ, నవ్వలి కుటీకి, భయానకసాహాయ్యమున శీఘ్రతరగమనుండై యా త్రోవున జివ్వన వ్రాలెను.

కాని, భయకారణము లేకుండుటయేగాక, ఎట్టి ధీరస్వాంతునకైన నవ్వు పుట్టించు వింత యొండు సంభవించెనని తెలియవచ్చెను. విందు కడు సంతృప్తికరముగా ముగిసెను. అతిథిజను లందఱు నమితానందభరితులైరి: దాన, బాషాయును సంతోషపరవశుఁ డాయెను: తన మిత్రులను సగౌరవముగా సాగనంపుటకై ఘట్టమునకుఁ బోయెను. ఐహికవీయూషపాన మొకింత యధికతరంబగుటచేఁ గావలయు, స్థూలశరీరుఁడగు నావృద్ధవిటుఁడు చల్లని నీరమునఁ గాలిడినంతనే, కొంచె మొరిగి తజ్జలాశయమున దిగజారెను. అపాయము లేకున్నను పాషాను జుట్టియున్న నారీమణులు సహజభయాతిరేకమునఁ గెవ్వన నఱచిరి. పురుషులు కారణమరయకయే హాహా యనిరి. ఖలీలుఁ డాలించిన యాక్రందనధ్వాన మయ్యెది! పాషా భటులు రయమున నరుదెంచి, తమ ప్రభువును లేవనెత్తిరి.

అతిథు లందఱు వెడలిరి. ఇఁక దల్లబను ప్రభ్వీప్రభువులును, యువతీయువకు లార్వురును మాత్రము మిగిలియుండిరి. వారందఱు నొక సుందరపర్ణశాలయం దాసీనులైరి. పదునొకండు గంటలు మాత్రమే యగుటచే, వేళయింక నంతగ నతిక్రమింపలేదు. మనోహరశీతలవాతపోతములు మేను సోకి మానసోల్లాసము కల్గించుటచే దల్లబను పాషా యాప్రదేశము విడజాలక, మధువు నొకింత గ్రోలి, హుక్కాగొట్టము చేఁ దాల్చి, ఖలీలునిఁ దిలకించి, కథచెప్పవలయు నని కోరెను.

సంపూర్ణము